
# అంతరంగ తరంగాలు

## ఆసక్తికరమైన జీవనచిత్రాలు

### మొదటి భాగం





శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య : 30




# విషయసూచిక


1. దేవరకొండ బాలగంగాధర తిలక్ 3
2. కె.బ్రహ్మానందరావు 6
3. రావూరు వెంకట సత్యనారాయణ రావు 12
4. 'చందమామ' సుబ్రహ్మణ్యం 18
5. వేమూరి సత్యనారాయణ 23
6. కొమ్మూరి సాంబశివరావు 26
7. రామాచారి 35
8. గోపీచంద్ 44
9. ఎం.వి.వి.ఎస్. మూర్తి 47
10. రేడియో రామం 56
11. వసంతకుమారి 59
12. కొవ్వలి లక్ష్మీ నరసింహారావు 63
13. ఉషశ్రీ 70
14. కొలకలూరి ఇనాక్ 76
15. డి.కామేశ్వరి 81
16. కొడవటిగంటి కుటుంబరావు 84
17. మేడసాని మోహన్ 88
18. కరుణశ్రీ 96
19. జయదేవ్ 103
20. బాలి 111
21. ఎమ్.ఎన్.రావు 118
22. ఈశ్వర్ 129
23. కె.వి.రమణాచారి 134

# మా అన్నయ్య తిలక్
## - దేవరకొండ గంగాధర రామారావు

సాధన సాహితీ స్రవంతి, హైదరాబాద్ వారు జనవరి 2008లో ప్రచురించిన తిలక్ సాహితీ సమాలోచనమ్ విశేష సంచికనుంచీ పునర్ముద్రితం. తిలక్ గారి కుమారుడు డా.సత్యనారాయణ మూర్తి(యు.కె) గారి ప్రత్యేక అనుమతితో..



అల వైకుంఠ పురంబులో...... పర్యంక రమావినోదియై తిలక్ కవితలు రాసి ఉంటాడని చాలామంది ఊహ.

ఎప్పుడూ తెల్లని లాల్చీవేసుకుని, మల్లెపువ్వులా, నవ్వుతూ ఉండే తిలక్‌కి బాధలూ, సమస్యలూ ఉంటాయని ఊహించడం కష్టం. కాని ఆ ఊహ నిజం కాదు. తిలక్ పేరులో ఉన్న 'లక్' జీవితంలో లేదు!

1944 జూన్‌లో మా నాన్నగారు పుష్కర స్నానానికి కానూరు అగ్రహారం వెళ్ళారు. అక్కడే గుండెపోటు వచ్చి, గోదావరి ఒడ్డునే మరణించారు. అప్పటినుంచి తిలక్ ఆరోగ్యం క్షీణించింది. అతనిని ఒక రకమైన ప్రాణభయం ఆవరించింది. అతని చిన్నప్పటి నుంచి జీర్ణసంబంధమైన సమస్యతో బాధపడేవాడు. దానివలన అప్పుడప్పుడు గుండె దడ వచ్చేది. అదే ఇప్పుడూ వస్తే హార్ట్ అటాక్ అని భయం పెంచుకున్నాడు. ఈ అనవసర ఆందోళన మానసికంగా కృంగదీసింది. డాక్టర్ల చుట్టూ తిరిగి వందలకు వందలు ఖర్చుచేశారు. విశాఖపట్నం, మద్రాసులలో ఉన్న ఎక్స్‌పర్ట్ డాక్టర్లు చూసి 'నీ గుండె రాయిలా ఉందని' భరోసా ఇచ్చారు. అయినా తిలక్ ధైర్యం తెచ్చుకోలేకపోయాడు. దీనికి తోడు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి.

ఆందోళన లేని సమయంలో తిలక్ యథాప్రకారం నవ్వుతూ, ఉత్సాహంగా కబుర్లు చెపుతుండేవాడు. ఇతనికి ఏమైనా బాధ ఉందా అన్న సందేహం కలిగేంత, మామూలుగా ఉండేవాడు.

నేను తిలక్‌తో చాలా సన్నిహితంగా ఉండేవాడిని. కారణం నాకూ సాహిత్యంలో అభిలాష ఎక్కువ. తిలక్ గదిలో ఏవో పుస్తకాలూ పత్రికలూ ఉండేవి. ఇవికాక అనేక తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలుండేవి. తిలక్ చదివిన పుస్తకాలలో చాలా వరకు నేనూ చదివేవాణ్ణి, ఇద్దరం ఆయా రచయితల గురించి, పాత్రల గురించి చర్చించుకునేవాళ్ళం. తిలక్ నాకన్నా పదేళ్ళు పెద్దయినా స్నేహితుల్లాగే ఉండేవాళ్ళం. అసలు మా అన్నదమ్ములం అందరం అలాగే చనువుగా ఉండేవాళ్ళం. తిలక్‌తో, మోరల్స్, మ్యారేజి సెక్స్ విషయాలు కూడా సహజంగా చర్చించుకునేవాళ్ళం. తిలక్ ఎంతో ఇంగ్లీషు సాహిత్యం చదివాడు. విశ్వసాహిత్యాన్ని చదివినవాడు కనుకనే అతని ఆలోచనా పరిధి విశాలంగా ఉండేది.

అతడి చిన్న వయసులోనే చాలమంది కవులు వచ్చి, తిలక్‌తో సాహిత్య గోష్ఠి జరిపి వెళ్ళేవారు. అందులో కొందరు, శ్రీ కృష్ణశాస్త్రి, శ్రీ పాలగుమ్మి పద్మరాజు, శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, అడవి బాపిరాజు, తల్లావఝుల శివశంకర శాస్త్రి, ఆవంత్స సోమసుందర్

మొదలయినవారు. వీరు కాక ఏలూరిపాటి అనంత రామయ్య, లక్ష్మణదాస్ తర్వాత లక్ష్మణ యతీంద్రులు, యువకవులు ఎందరో వచ్చేవారు. నేను ఏలూరులో ఉండగా తిలక్ మా ఇంట్లో ఒక నెల రోజులున్నాడు. ఆ నెల ఇంచుమించు ప్రతిరోజు వెల్చేరు నారాయణరావుగారు తిలక్‌ని కలిసేవారు.

తిలక్ నిగర్వి, నిరాడంబరుడు. ఎవరినీ నొప్పించేవాడు కాదు. అసలు కోపం లేదు. లౌక్యం తెలియని వ్యక్తి. తిలక్ కంటే వయసులో పెద్దవాడు, లాయరు ఒకాయన తిలక్‌ని 'ఏరా తిలక్', 'ఏమోయ్ తిలక్' అని అతి చనువుగా పలకరించేవాడు ఆ వ్యక్తికి ఊళ్ళో మంచి పేరు లేదు. తిలక్‌తో ఎందులోనూ సరితూగడు. 'నువ్వు కూడా వాణ్ణి 'ఏరా' అని సంభోదించు అని తిలక్‌ని ఒత్తిడి చేసేవాణ్ణి. కాని అమాయకుడు తిలక్. ఆ పని చేయలేకపోయాడు. అంతటి మెత్తమనిషి.

తిలక్ పాండిత్యం అతని కృషి. ఎవరి దగ్గరా వ్యాకరణం నేర్చుకోలేదు. సాహిత్యంలో ఏ ప్రక్రియ ఉద్యమం కాకూడదు. ఆ భావమే తిలక్ ఇలా చెప్పాడు. "ఇజంలో ఇంప్రిజన్ అయితే ఇంగిత జ్ఞానం నశిస్తుంది"

మానవాభ్యుతికి ఆలంబనమైన ఎన్నో సిద్ధాంతాలు ఈ రోజున బీటలు వారుతున్నాయి. అవే నమ్ముకున్న దేశాలు పతనమౌతున్నాయి. ఈ విషయం తిలక్ ఆనాడే గ్రహించాడు. అందుకే తిలక్ కవి, ద్రష్ట!


తిలక్ తన కవితలో "దుఃఖాన్ని చావుని వెళ్ళిపొమ్మ"న్నాడు. కాని ఆ రెండు అతన్ని చిన్న వయసులోనే వెంటాడి, సమీపించి, కబళించాయి. అదే కవితలో 'నేను అమరుడి'ని చెప్పుకున్నాడు అని మాత్రం నిజమైంది. కవిగా తిలక్ 'అమరుడే'!

## మా నాన్నగారి జ్ఞా పకాలు

## దేవరకొండ సత్యనారాయణ మూర్తి.

**దాదాపు 40 సంవత్సరాల** తర్వాత మా నాన్నగారి గురించి వ్రాయటం ఒక కొత్త అనుభూతి. నా జ్ఞాపకశక్తికి ఒక పరీక్ష. ఎన్నెన్నో ఆలోచనలు అనుభవాలు.

మా నాన్నగారికి అత్యంత ప్రియమైన వ్యక్తి మా అమ్మగారు కీ.శే.దేవరకొండ ఇందిరాదేవి. అలాగే ముగ్గురు పిల్లలం. నేనూ మా తమ్ముడు సుబ్రహ్మణ్యం. మా చెల్లెలు చంద్రలేఖ. మా చెల్లాయి మా నాన్నగారికి ఆరోప్రాణం. నాకు గుర్తున్నంతవరకూ మా అమ్మగారి మీద కాని పిల్లల మీద కాని కోపం తెచ్చుకోవడం ఎప్పుడూ జరగలేదు. ఖాళీ దొరికినప్పుడు పిల్లలు మేం ముగ్గురం మా నాన్నగారి పక్కలో చేరి ఆయనతో కథలు చెప్పించుకోవడం గాని, కబుర్లు చెప్పడం కాని చేసేవాళ్ళం. ఆయన అనుభవాలు, చిన్నతనం గురించి చెబుతూ ఉండేవారు.



ఖాళీ దొరికినప్పుడు ఆయన ఏదో పుస్తకంగాని, పేపరు గాని చదువుతూనే ఉండేవారు. మా చిన్నతనంలో మా ఇంట దాదాపు 5లేక 6 వేల పుస్తకాలు ఉండేవి. ఆయనకి కీట్సు, షెల్లీ, బైరన్, డిలన్ థామస్, సోమర్‌సెట్ మామ్, శరత్‌బాబు, చలం టాల్‌స్టాయ్, గోర్కీల రచనలు అంటే అభిమానం. శ్రీ శ్రీ గారంటే చాలా అభిమానం. కృష్ణశాస్త్రిగారు మా నాన్నగారి ఇంటికి రావడం నాకు బాగా గుర్తు. కవులూ, సాహిత్యాభిమానులు ఆయనకి ఆప్తబంధువులు. మా ఇంటికి చాలా మంది కవులు వస్తూపోతూ ఉండేవారు. ప్రతి సాయంత్రం, మా ఇంటిప్రాంగణంలో ఆరు బయట బంధువులతో, స్నేహితులతో గంటల తరబడి చర్చించుకోవడం జరుగుతూ ఉండేది. కవి మిత్రులతో కాళోజీ నారాయణరావుగారిని 'కన్నా' అని, ఆవంత్స సోమ సుందర్‌గారిని 'తమ్ముడూ' అని సంబోధించేవారు.

ఆయనకి సాహిత్యమే కాకుండా సంగీతం అంటే కూడా ప్రాణం. ఎవరైనా చక్కగా పాడే వాళ్ళుంటే బ్రతిమాలైనా వాళ్ళ చేత పాడించుకుని ఆనందించేవారు. అటు శాస్త్రీయ సంగీతం, ఇటు లలిత సంగీతం కూడా ఆయనకు చాలా చాలా ఇష్టం. శ్రీమతి ఇంద్రగంటి జానకీబాలగారు, మా నాన్నగారికి పాటలు పాడి వినిపించడం నాకు బాగా గుర్తు. సంగీతంలాగా మా నాన్నగారికి సినిమాలంటే చాలా ఇష్టం. చాలా ఎక్కువగా సినిమాలు చూసేవారు. మల్లీశ్వరి, బంగారుపాప, ముద్దుబిడ్డ సినిమాలు ఆయనకి చాలా నచ్చిన చిత్రాలు. కొని నచ్చిన పాటలు, సన్నివేశాలు చూడటానికి మళ్ళీ మళ్ళీ ఆ సినిమాకి వెళ్ళేవారు.

ఆయనకున్న చెడు అలవాటు "నశ్యం" పీల్చడం. సిగరెట్లు, మధుపానీయాలూ ఎప్పుడూ అలవాటులేవు. ఆయనకి కుల వ్యవస్థ అంటే చాలా అయిష్టం. అది పూర్తిగా నిర్మూలమయితే కాని మనం పురోగమించం అని అంటూ ఉండేవారు. అలాగే డబ్బుని, హోదానీ చూసి తోటి మనుష్యులని గౌరవించడం చూసి ఆయన బాధపడేవారు.

రోజు రాత్రి ఒంటిగంట, రెండు గంటల వరకూ చదవడం, అప్పుడప్పుడు రాయటం ఆయన అలవాటు. రచనలన్నీ వేర్వేరు కాగితాలమీద రాసి పడేస్తే, కవిమిత్రులు వాటిని ఫెయిర్ కాపి చేసి, ప్రచురణకి పంపించడం జరిగేది. కొంతమంది ఉత్సాహవంతులైన యువతని చేకూర్చి, సుచిత్ర ప్రణయం, సాలెగూడు లాంటి నాటకాలు రాసి, వాటిని ఆంధ్ర నాటక కళాపరిషత్ పోటీలలో ప్రదర్శించడం జరిగింది. ఆచార్య తంగిరాల సుబ్బారావుగారు హీరోగా నటించారు కూడా. ఎవరైనా సంగీతం, సాహిత్యం మీద అభిమానం చూపిస్తే వారందరూ అతి తొందరలో మా నాన్నగారికి అతి సన్నిహితులైపోయేవారు.

మా చిన్నతనంలో మా నాన్నగారు “Nervousness – Palpitations” అనే అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారు. మా తాతగారు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంతో నాన్నగారికి ఈ జబ్బు పట్టుకుంది. దాదాపు పదిహేను సంవత్సరాలు ఆయన రోజులో 20 గంటలు మా ఫ్యామిలీ డాక్టర్ క్రిష్ణమాచారి గారి హాస్పిటల్‌లో కాని, ఆయన ఇంటి దగ్గర కాని ఉండేవారు. తను ఉండటానికి మా డాక్టరుగారి ఇంటి ఆవరణలో ఒక గది కూడా స్వంతంగా కట్టించుకున్నారు. ఆగర్భ శ్రీమంతుడుగా పుట్టిన మా నాన్నగారు ఈ అనారోగ్యకారణంగాను, అనుభవంలేని వ్యాపార వ్యవహారాల వల్ల - తన జబ్బు తగ్గి, మళ్ళీ కొద్ది ఉత్సాహంగా కథలూ కవితలూ రాయటం ప్రారంభించే టైముకి చాలా ఆర్థిక ఇబ్బందులకి గురయ్యారు. చివరి 3,4 సంవత్సరాలలో చాలా ఇబ్బంది పడ్డారు. కానీ అదృష్టం కొద్దీ నేను, మా తమ్ముడు మెడికల్ కాలేజీలో సీటు సంపాదించుకోవడం, ఆయనకి విపరీతమైన ధైర్యాన్ని, ఆనందాన్ని కలుగజేసాయి.

మా అమ్మ ఇందిరాదేవి గారు 24 గంటలూ, మా నాన్నగారికి తోడూ - నీడా. తన అనారోగ్యం మూలంగా మా అమ్మగారి జీవితం కూడా పాడుచేశానని మా నాన్నగారు బాధపడేవారు. ఆవిడ ప్రక్కన ఉంటే నాన్నగారికి కొండంత ధైర్యం. ఆయనకి ఆవిడంటే విపరీతమైన ప్రేమ - అమాయకురాలని జాలి.

మా చెల్లెలు చంద్రలేఖ ఆయనకి నిజంగా ఆరోప్రాణం. ఎవ్వరైనా మా చెల్లాయిని ఏమైనా అంటే ఊరుకునేవారు కాదు, అటువంటిది 1966లో మా చెల్లెలు పెళ్ళి చేసుకుని రాజస్తాన్ వెళ్ళడంతో ఆయన చాలా బెంగపెట్టుకున్నారు. కాని దురదృష్టం కొద్దీ చెల్లెలి పెళ్ళి అయిన రెండు నెలలోపుగా అకస్మాత్తుగా గుండెపోటుతో 44 సంవత్సరాలకి మరణించారు. అందరిలాగానే నేనూ ఇప్పటికీ అనుకుంటూ ఉంటాను "ఇంకా కొన్ని సంవత్సరాలు నాన్నగారు బ్రతికి ఉంటే బాగుండేది కదా" అని.

♫

# అక్షరబ్రహ్మ 'బ్రహ్మం'

ఈనాడు ఏ ప్రొఫెషనల్ తెలుగు డి.టి.పిని పరిశీలించినా కనిపించేవి 'అను ఫాంట్స్'. కొన్నివందల అందమైన ఫాంట్స్‌తో దక్షిణాది భాషలన్నింటి అక్షరాలని ప్రింటింగ్‌కి అనువుగా అందిస్తున్న 'అను ఫాంట్స్' కి ఇంతవరకూ పోటీలేదు. ఈ 'అను ఫాంట్స్' ని రూపొందించిన అక్షరశిల్పి పరిచయమే ఈ నెల 'కౌముది' ప్రత్యేకం. చదవండి..!

**తెలుగు** చలన చిత్ర పరిశ్రమలో ఎందరో హేమాహేమీల పురిటి గడ్డ పశ్చిమ గోదావరి జిల్లా. అలాంటి పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లులో 1945 సెప్టెంబర్ 23 న నా తలితండ్రులు శ్రీ కొసనా ముత్యమాచార్యులు, శ్రీమతి రాజేశ్వరి గార్ల చివరి సంతానంగా ఈ ప్రపంచంలో అడుగు పెట్టాను. ఇది నా మొదటి జన్మ.



ఎటువంటి ప్రచార మాధ్యమాలు లేని ఆ రోజుల్లోనే కోస్తా జిల్లాల్లో 'శిల్పచార్యులు'గా మా తండ్రిగారికి ఎంతో పేరు ప్రఖ్యాతలుండేవి. కాని ఆయన లౌక్యం తెలియని వ్యక్తి, అందువల్ల ఆర్థిక సమస్యలు మా ఇంట్లో చాలా సామాన్య విషయంగా ఉండేవి. 1959 లో మా తల్లిగారు స్వర్గస్తులైనారు. అప్పుడు నా వయసు పధ్నాలుగు సంవత్సరాలు. ఆ తరుణంలో మా అన్నదమ్ములం తలా ఒక దారి అయ్యాం. మా అన్నయ్య శ్రీ ఈశ్వరరావు గారు, అప్పటికే పాలిటెక్నిక్ కోర్సు కొనసాగించలేక పని వెతుక్కుంటూ మద్రాసు వెళ్ళిపోయారు. నేను మా రెండో అన్నయ్య దగ్గర బెజవాడలో ఉన్నాను. అటు పాలకొల్లులోనూ, బెజవాడలోనూ సినిమా పోస్టర్లను గమనించడం నాకు చాలా ఇష్టమైన అలవాటు. వాటిల్లో శ్రీ టి.వి.యస్. శర్మ గారి పోస్టర్లలోని అక్షరాలు, లోగోలు నన్ను చాలా ఆకర్షించేవి. ఇంటికొచ్చి కాగితాల మీద పెన్సిళ్ళతో అలాగే వ్రాయడానికి ప్రయత్నించేవాడిని.




27-2-1967 "ఈశ్వర్" ప్రారంభోత్సవంలో శ్రీ కేతా గారితో

బెజవాడలో మా ఇంటి ప్రక్కన, రంగు రంగు బల్బులతో సినిమా టైటిల్‌ను థియేటర్ డిస్‌ప్లే బోర్డులుగా తయారు చేసే అతను ఉండేవాడు. 1961లో "సత్యభామా పరిణయం" సినిమా 'రామా టాకీసు'లో విడుదల కానుంది. అక్కడ పెట్టడానికి లైట్ల డిస్‌ప్లే బోర్డు ఆర్డరు అతనికి వచ్చింది, దాని తయారీ నిమిత్తం అక్షరాలు వ్రాసే వ్యక్తి అందుబాటులో లేక నన్ను వ్రాయమని అడిగాడు, అప్పటిదాకా ప్రాక్టీసు కోసం చిన్నవి వ్రాయడం మాత్రమే వచ్చు కానీ అతనికి 4 అడుగుల ఎత్తు 24 అడుగుల పొడవులో ఆ టైటిల్ కావలసి ఉంది. ఆ సినిమా పేరు ఉన్న పేపరు కటింగ్‌ను చూస్తూ 6'X 4' సైజు ప్లైవుడ్స్ నాలుగు రోడ్డు మీద వరుసగా పేర్పించి చాక్పీసుతో స్కెచ్ గీసి ఇచ్చాను. అతను సంతృప్తి చెంది పదిహేను రూపాయలు ఇచ్చాడు, అదే నా మొదటి సంపాదన. నన్ను లెటరింగ్ ఆర్టిస్టుగా మార్చిన సంఘటన.

మా వెనుక వీధిలో "నటరాజ ఆర్ట్స్" అనే బేనర్ ఆర్ట్ కంపెనీ ఉండేది. ఆ సంస్థ అధినేత, ఆర్టిస్టు శ్రీ నటేశన్ గారు, "సత్యభామా పరిణయం" లైట్ల డిస్‌ప్లేని చూసి ఈ అక్షరాలు వ్రాసింది ఎవరు అని వాకబు చేసి, నన్ను పిలిపించారు. ఆయన్ని కలిసిన

తరువాత "డిస్‌ప్లే బోర్డుకు స్కెచ్ వ్రాసినది నువ్వేనా?" అని అడిగారు. అవునన్నాను. "చిన్న శ్యాంపిల్ చూసి పెద్దదిగా వ్రాయగలవా!" అని అడిగారు. అలాగే ప్రయత్నిస్తానన్నాను. "అయితే ఇదిగో ఈ బేనర్ మీద ఈ సైజులో ఈ టైటిల్ వ్రాయి" అన్నారు. అది శ్రీ యన్.టి.రామారావుగారు నటించిన "రక్తసంబంధం" సినిమా లోగో. శ్యాంపిల్ చూస్తూ వారు చూపిన చోట చాక్పీసుతో వ్రాసాను. అది చూసి "ఇప్పుడు ఆ స్కెచ్ మీద ఈ రంగుతో వ్రాసేయి" అన్నారు. అదీ వ్రాసాను, మొట్టమొదటిసారి 'బ్రష్' పట్టుకున్నది అదే. "ఇంకా ఇలా చాలా బేనర్లు ఉన్నాయి రోజూ వచ్చి వ్రాస్తావా?" అని అడిగారు. అలాగే అని ఒప్పుకున్నాను. అప్పుడు నా వయసు పదహారు సంవత్సరాలు. అలా ఆయన దగ్గర రెండు సంవత్సరాలు చాలా మెళకువలు నేర్చుకుంటూ పని చేశాను.


మా అన్నయ్య శ్రీ ఈశ్వర్ గారితో

అదే సమయంలో మద్రాసులో మా అన్నయ్య శ్రీ ఈశ్వర రావు గారు. ఎన్నో కష్టాలకోర్చి పని దొరకక పస్తులుంటూ, చివరకు శ్రీ కేతా సాంబమూర్తిగారి 'స్టూడియో కేతా'లో చేరి, ఛీఫ్ - ఆర్టిస్టు స్థాయికి ఎదిగారు. 'నేను కూడా వచ్చేస్తా అన్నయ్య' అంటూ ఉత్తరాలు వ్రాసేవాడిని. 'సమయం చూసుకుని గురువుగారితో మాట్లాడి నిన్ను తీసుకు వస్తా' అని బదులు వచ్చేది. బేనర్ ఆర్టిస్టుగా నా చివరి జాబ్ వర్కు, 'మూగమనసులు' సినిమా శ్రీ బాపుగారి టైటిల్ లోగో 90 అడుగుల చొప్పున మూడు బేనర్లుగా వ్రాసాను. మా అన్నయ్య పిలుపును అనుసరించి 1964 ఫిబ్రవరి 1వ తేదీన మద్రాసులో అడుగుపెట్టాను (ఆ రోజు మా ఈశ్వరన్నయ్య పుట్టినరోజు కావడం యాదృచ్ఛికం). ఇది నా పునర్జన్మ.




మద్రాసు వచ్చాక అన్నయ్యతోనే కేతాగారివద్ద ఉంటూ, పబ్లిసిటీ డిజైనింగ్‌లోని మెళుకువలు నేర్చుకోవడం మొదలు పెట్టాను. ఇంగ్లీషు మ్యాగజైన్సు చూస్తూ అందులో ఉండే అక్షరాల స్టైలుని తెలుగు అక్షరాలకు ఆపాదించడం ప్రాక్టీసు చేసేవాడిని. మా గురువుగారు శ్రీ కేతాగారు కూడా "బ్రహ్మం! బాగా వ్రాస్తున్నావు..... ఇంకా బాగా ప్రాక్టీసు చేయి" అని ప్రోత్సహించేవారు. అలా... అలా... సినిమా లోగోలు, టైటిల్ కార్డు (సినిమా టైటిల్స్) వ్రాస్తూ డిజైన్స్ చేసే స్థాయికి వచ్చాను.

1967 లో మా అన్నయ్య "ఈశ్వర్" అనే పబ్లిసిటీ డిజైనింగ్ సంస్థను టి.నగర్, శ్రీనివాసరెడ్డి స్ట్రీట్‌లో స్వతంత్రంగా స్థాపించారు. నేను కూడా ఆయనతోనే బయటకు వచ్చి, సంస్థలో కీలక వ్యక్తిగా నా సేవలందిస్తూ సుమారు 40 సంవత్సరాలలో, తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, ఒరియా, బెంగాలీ.... మొదలైన భాషల్లో దాదాపు 2500 చిత్రాలకు పైగా పని చేసాను.

అప్పట్లో పబ్లిసిటీ డిజైన్స్ చెయ్యడం ఇప్పుడు చేస్తున్నంత సులువు కాదు. సేమ్ డిజైన్స్ చెయ్యాల్సి వచ్చేవి, అంటే, పోస్టర్ ఏ సైజులో ప్రింట్ అవుతుందో ఆ సైజులోనే డిజైన్ చెయ్యాల్సి వచ్చేది. అదీకాకుండా అప్పట్లో 'టైప్ సెట్టింగ్', 'ఫోటో కాపీయింగ్' వగైరాలు లేవు. అందువల్ల ఎన్ని డిజైన్స్ ఉంటే అన్నింటి మీద అన్ని పేర్లు నేరుగా డిజైన్ మీదే వ్రాయాల్సిందే రాత్రింబవళ్ళు పని ఉండేది. సంస్థ ప్రారంభించిన పది సంవత్సరాల వరకు, మా అన్నయ్యకు నేనే సహాయకుడిని. ఆయన పెయింటింగ్  చేసి డిజైను చేసేవారు. నేను లోగో మరియు సాంకేతిక వర్గం పేర్లు వ్రాసి పూర్తి చేసేవాడిని. ఒకానొకప్పుడు మా అన్నయ్య " నా సంతకం నాకంటే మా తమ్ముడే బాగా చేస్తాడు" అనే వారు.

శ్రీ పుల్లయ్యగారు, శ్రీ డి.రామానాయుడుగారు, చందమామ.... విజయచిత్ర అధినేత శ్రీ బి.వి విశ్వనాథరెడ్డిగారు, శ్రీ కె. మురారి గారు వంటి ప్రముఖులు నా అక్షర శైలిని అభినందించి, నాతోనే వ్రాయించుకునేవారు. అది నా అదృష్టం. 1991లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యన్.టి.రామారావుగారు ప్రవేశపెట్టిన 'పిల్లలకు వీడియో పాఠాలు' అనే ప్రాజెక్టు రూపకల్పన బాధ్యతలు ప్రముఖ చిత్రకారులు, దర్శకులు, రచయితలు అయిన శ్రీ బాపు రమణ గార్లకు అప్పజెప్పారు. ఆ సమయంలో శ్రీ బాపు గారి వద్ద నుండి నాకు కబురు వచ్చింది, వెళ్ళి కలవటం ఆయన నాతో కొన్ని గుండ్రటి అక్షరాలు వ్రాయించారు. ఇది నేను ఎప్పుడూ ఎదురు చూడని, మరిచిపోలేని సంఘటన. ఎందుకంటేం నా చిన్నతనంలో నేను ఆయనకు వీరాభిమానిని. ఏ పత్రికలో అయినా ఆయన 'కార్టూను'గాని, 'సినిమా లోగో' గాని, 'సినిమా డిజైను' గాని కనబడితే భద్రంగా దాచుకునేవాడిని. వాటిని అనుకరించడానికి చాలా ప్రయత్నం చేసేవాడిని. కానీ కుదిరేవి కాదు. ఆయన స్టైల్ ఆయనదే అలాంటిది ఆయనే నాతో అక్షరాలు వ్రాయించుకోవడం నిజంగా నా పూర్వజన్మ సుకృతంగానే భావిస్తున్నాను. ఆ సందర్భంగా ఆయన స్వహస్తాలతో నాకు వ్రాసిన ఉత్తరం ఇంకా నా దగ్గర భద్రంగా దాచుకున్నాను.

తెలుగులో కంప్యూటర్ ఫాంట్స్ సరియైనవి లేవని నాకు మొదటి నుండి బాధగానే ఉండేది. ఎందుకంటే ఇంగ్లీషు మరియు ఉత్తరాది భాషల్లో ఎన్నో వెరైటీ ఫాంట్స్ ఉండేవి. కానీ, తెలుగులో టెక్స్ ఫాంట్ అనగా దినపత్రికలలో వాడే స్టైల్ తప్ప వేరే స్టైల్స్ లేవు. హెడ్డింగులకు పనికి వచ్చే ఫాంట్స్ అసలు లేవు. 1991లో శ్రీ సుంకే మురళి కృష్ణగారు తెలుగులో మంచి ఫాంట్స్ చేయాలని సంకల్పించి విశేష కృషి జరిపి "అనూ గ్రాఫిక్ సిస్టమ్స్" అనే సంస్థను స్థాపించి, చెయ్యబోయే ఫాంట్సు అందమైనవిగా చెయ్యాలనే ఉద్దేశ్యంతో మంచి లెటరింగ్ ఆర్టిస్టు కోసం వెతుకుతున్నారు. ఆ సమయంలో ప్రముఖ సినీ జర్నలిస్టు నా


శ్రీ ఈశ్వర్, అను గ్రాఫిక్స్ శ్రీ మురళీకృష్ణ మరియు ఎన్.ఎల్.పి శ్రీ వెంకటేశ్వరరావు గార్లతో

మిత్రులు అయిన శ్రీ మోహన్ కుమార్ గారి ద్వారా నన్ను సంప్రదించారు. ఆ విధంగా 'అనూ ఫాంట్స్' మురళిగారితో నా పరిచయం అయ్యింది. తెలుగులో మొదట వ్రాసిన ఫాంట్ "ప్రగతి".... దాన్ని అనుసరించి "బ్రహ్మ", "జ్యోతి" మొదలైనవి నేను వ్రాసినవే. తెలుగులో సుమారు 90 ఫాంట్స్, తమిళంలో సుమారు 280, కన్నడంలో సుమారు 68, మలయాళంలో కొన్ని ఫాంట్స్‌కు స్టైల్స్ వ్రాసి ఇచ్చాను. అవన్నీ ఇప్పుడు "అనూ ఫాంట్స్"గా బాగా ప్రాచుర్యం పొందిన విషయం మీకందరికీ తెలిసినదే


శ్రీ ఈశ్వర్, చందమామ శ్రీ విశ్వం గార్లతో

1967 నుండి 1990 దాకా సుమారు 1000 చిత్రాలకు పైగా రకరకాల లోగోలు, మోడర్న్ టైమ్స్‌లో లే - అవుట్స్ వ్రాయడం ద్వారా ఎంతో కష్టపడి సంపాదించిన అనుభవంతో ఫాంట్స్ వ్రాయగలిగాను. ఒక స్టైలు ఎన్నుకుని అచ్చుల దగ్గర నుండి హల్లులు, గుణింతాలు అన్నీ అదే స్టైలు మారకుండా వ్రాయగలుగుతానని 'అనూ ఫాంట్స్' నా మీద గురి ఏర్పడింది. టెక్నికల్ ప్రాబ్లమ్స్ దాటుకుంటూ వారికి కావాల్సిన దానికనుగుణంగా అక్షరం అందం, స్టైలు మారకుండా వ్రాసిచ్చాను. ఇలా నాలోని అక్షర కళ శాశ్వతంగా ఉండిపోయి అందరికీ ఉపయోగ పడడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఈ అవకాశం కల్పించిన 'అనూ ఫాంట్స్' మురళిగారికి నేను ఎప్పుడూ ఋణపడి ఉంటాను.

'అనూ ఫాంట్స్' మురళిగారు "బ్రహ్మం గారు! తెలుగు అక్షరం ఉన్నంత కాలం మీరు, నేనూ తెలుగువారందరికీ జ్ఞాపకం ఉంటాం" అని అంటూ ఉంటారు.

1995 నుండి మా అన్నయ్య ఆశీస్సులతో "బ్రహ్మం" అనే పేరుతో దాదాపు 25 చిత్రాలకు పబ్లిసిటీ డిజైన్స్ చేసాను. ప్రముఖ దర్శకులు, నా మిత్రులు అయిన శ్రీ విక్రమన్ గారు, నన్ను ఎంతో ప్రోత్సహించారు. తమిళంలో ఆయన దర్శకత్వం వహించిన 'పూవే ఉనక్కాగ' (శుభాకాంక్షలు), 'సూర్యవంశం', 'ఉన్నిడత్తిల్ ఎన్నైక్కొడుత్తేన్' (రాజా), 'వానత్తైపోల' (మా అన్నయ్య) మొదలయిన చిత్రాలకు గాను డిజైనింగ్ చాతో చేయించారు. ఆ చిత్రాలు చాలా పెద్ద విజయాలు సాధించాయి. సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ 'సూపర్ గుడ్ ఫిలింస్' లోగో 1989 లో వారి మొదటి చిత్రం 'పుదు వసంతం' (నవ వసంతం) సందర్భంగా శ్రీ ఆర్. బి. చౌదరి గారికి నేను వ్రాసిందే అది ఇప్పటికీ ప్రసిద్ధి చెందుతూ ఉంది. ఆ తరువాత నా కుమారుడు చిరంజీవి సురేషు బాబు, 'బ్రహ్మం గ్రాఫిక్స్' పేరుతో తమిళం, తెలుగు చిత్రాలకు కంప్యూటర్ గ్రాఫిక్ డిజైనింగ్ చేసాడు. ప్రస్తుతం తను, చెన్నైలోని ఐ.టి.సి. లిమిటెడ్, గ్రీటింగ్ కార్డ్సు డివిజన్‌లో గ్రాఫిక్ డిజైనర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.



శ్రీ యన్.టి.రామారావు గారితో

ఇక నాకుటుంబం గురించి చెప్పాలంటే నా భార్య సత్యవతితో వివాహం, 1971 లో మా అన్నయ్యగారి చేతుల మీదుగా రంగరంగ వైభవంగా జరిగింది. ఎందరో ప్రముఖులు, స్టూడియో ఓనర్లు, నిర్మాతలు, దర్శకులు, బంధుమిత్రుల సమక్షంలో అతి వైభవంగా జరిగిన ఆ వేడుక ఇప్పటికీ మరువలేను. నాకు ముగ్గురు సంతానం. మా పెద్దమ్మాయి చిరంజీవి విజయలక్ష్మిని డాక్టర్ జి.శ్రీనివాస్‌కు ఇచ్చి 1999 లో వివాహం చేసాను. వాళ్ళకు ఒక పాప, సత్యశ్రీ దుర్గ, అదే సంవత్సరం నా భార్య సత్యవతి హృద్రోగంతో స్వర్గస్తులైనారు. ఆ తరువాత 2000 లో మా చిన్నమ్మాయి హేమను కె.రామకృష్ణతోనూ, 2006 లో మా అబ్బాయి సురేష్ బాబుకు శారద శ్రీ దుర్గతోనూ మా అన్నగారు శ్రీ ఈశ్వర్ దంపతుల చేతుల మీదుగా వివాహం జరిపించారు. మా చిన్నమ్మాయికి ఇద్దరు అబ్బాయిలు అభిరామ్, అఖిల్.

ప్రస్తుతం నేను చెన్నైలోనే ఉంటున్నాను. మా అబ్బాయి నా దగ్గరే ఉంటున్నాడు. పుస్తకాలు చదవడం, పాత పాటలు వినడం, సినిమాలు చూడడం నాకు ఇష్టమైన అలవాట్లు. అప్పుడప్పుడూ అన్నయ్య దగ్గరకి వెళ్ళి పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఆనందించడం, నా కుటుంబ సభ్యులు, మనుమరాలితో హాయిగా కాలక్షేపం చేస్తూ గడపడం కూడా నాకు ఎంతో ఇష్టం.



కె.బ్రహ్మానందరావు మరియు కుటుంబ సభ్యులు

**నా తమ్ముడు బ్రహ్మం**

నా సోదరుడు బ్రహ్మం గురించి నేను చెప్పడం అంటే నా గురించి నేను చెప్పుకోవడమే. అయినా కొన్ని విషయాలు చెప్పక తప్పదు. విజయవాడలో క్లాత్ బేనర్ సెక్షన్‌లో లెటరింగ్ ఆర్టిస్టుగా పనిచేశాక 1964 లో మద్రాసు వచ్చి, నేను పని చేస్తున్న 'స్టూడియో కేతా'లో ముఖ్య లెటరింగ్ ఆర్టిస్టుగా కొనసాగాడు. అప్పుడే కావలసిన మెళుకువలన్నీ వంటపట్టించుకున్నాడు. ఆ సమయంలోనే బాపు టైప్ లెటరింగ్ వ్రాయడం ప్రారంభించి సినిమా పోస్టర్స్ మీద వివిధ రకాలైన మోడర్న్ లెటరింగ్ రాయడం ప్రారంభించాడు. అంతకు ముందు కాలంలో అందరూ పోస్టర్ల మీద పేపర్ యాడ్స్‌లోనూ వాడడం సుమారుగా ఆ కాలంలోనే ప్రారంభం అయ్యింది. 1967 లో నేను నా పేరు మీద పబ్లిసిటీ ప్రారంభించాక అక్షర బాధ్యత అంతా బ్రహ్మమే చూసుకునేవాడు. డిజైను ఎంత బాగా చేసినా, లెటర్స్ డిస్‌ప్లే, పొందిక బాగుండక పోతే ఆ డిజైను అందంగా రాదు. డిజైన్ కంపోజ్ చేయడం ఎంత ముఖ్యమో దానికి తగిన సైజులో సరియైన చోట లెటరింగ్ వ్రాయడం కూడా అంత ముఖ్యం. అప్పుడే ఆ డిజైనుకు అందం వస్తుంది. తెలుగే కాదు, తమిళ, కన్నడ, మలయాళ, ఒరియా, బెంగాలీ, హిందీ ఈ భాషలన్నీ అతి సునాయాసంగా, అందంగా, చూడ సొంపుగా వ్రాయడం బ్రహ్మం సొత్తు అయ్యింది. నాకున్న విపరీతమైన పని వత్తిడి కూడా వాణ్ణి తీర్చిదిద్దింది.

"సాక్షి" సినిమాకు పని చేస్తున్న సమయంలో శ్రీ బాపుగారు "మీ వాడు లెటరింగ్ చాలా బాగా వ్రాస్తాడండి. మీ వాడు వ్రాస్తే ఇక నేను చూడనక్కరలేదు నేను వ్రాసినట్టే ఉంటుంది." అనే వారు. ఈ రోజుకి కూడా బాపుగారు, రమణగారు ఎక్కడ కనిపించినా, నా యోగక్షేమాలతో బాటు బ్రహ్మం యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటుంటారు. అంటే వాళ్ళ మనసుల్లో అంత చోటు సంపాదించాడన్నమాట.

ఇకపోతే, సీనియర్ జర్నలిస్టు శ్రీ మోహన్ కుమార్ గారు ఎప్పుడూ "అక్షర బ్రహ్మ" అనే పిలిచేవారు. ఆయనే 'అనూ ఫాంట్స్' మురళికృష్ణ గారికి పరిచయం చేశారు. అక్షర ఒంపుసొంపులు వాడి స్వయం కృషి అయినా ఏ డిజైనుకు ఏ సైజులో లెటరింగ్ ఉండాలి? ఎక్కడ ఉండాలి? అనేది మాత్రం నా నుండి నేర్చుకున్నాడు. నా కెరీర్‌లో మొత్తం నేను చేసిన డిజైన్స్ అన్నింటికీ కావలసిన పరిమితిలో అక్షరాలు వ్రాసి వాటికి అందాన్ని తీసుకురావడానికి బ్రహ్మం కృషే కారణం. కంప్యూటర్ ప్రవేశించక ముందు ప్రతి చిన్న డిజైను మీదా చేత్తోటే లెటరింగ్ వ్రాయవలసి వచ్చేది. ఆ తరువాతి కాలంలో ఒక సారి లెటరింగ్ వ్రాసి, దాన్ని ఫోటోగ్రాఫ్ చేసి కావలసిన సైజుల్లో ప్రింట్స్ వేయించి డిజైన్స్‌లో అంటించే ప్రక్రియ ప్రారంభించాం. ఆ విధంగా మా ప్రారంభకాలం ఎంతో శ్రమతో కూడుకున్నదై ఉండేది. ఇప్పుడు కంప్యూటర్ ప్రవేశించి, డిజైన్స్ చెయ్యడం కూడా సులభమైంది. అదే సమయంలో లెటరింగ్ ఫాంట్స్ తయారు చేయాలనే ఆలోచన శ్రీ మురళి కృష్ణగారికి రావడం, ఆయన మోహన్ కుమార్ గారిని సంప్రదించటం, వారిరువురు కలిసి నా దగ్గరకు వచ్చి బ్రహ్మం చేత - ఫాంట్స్ వ్రాయిస్తే బాగుంటుందని నా సలహా అడగడం జరిగింది. ఆ విధంగా ఫాంట్స్ వ్రాయడం ప్రారంభించాడు. అనూ ఫాంట్స్‌లో ఇప్పుడున్న అన్ని భాషల ఫాంట్స్‌లలోనూ సుమారు 80 శాతం ఫాంట్స్ బ్రహ్మం వ్రాసినవే అంతే కాదు, మన తెలుగు దినపత్రికల్లోనూ, మాస పత్రికల్లోనూ 'పూనా' నుంచి వచ్చిన పాతకాలపు ఫాంట్స్‌నే వాడేవారు. అనూ ఫాంట్స్ అందుబాటులోకి వచ్చాక దాదాపు అన్ని పత్రికల్లోనూ వివిధరకాలైన అక్షరాలు ఇప్పుడు మీరు చూస్తున్నారు. ఇదంతా బ్రహ్మం కృషే. అందులో సందేహం లేదు. - **ఈశ్వర్.**

**ఆయన నిజంగా అక్షర బ్రహ్మే!**

అది 1991 సంవత్సరం. అప్పటికే కంప్యూటర్‌లు ముద్రణా రంగానికి కూడా వ్యాపించాయి. కంప్యూటర్‌లో చక్కటి తెలుగు ఫాంట్స్ చేయాలనే తపనతో రెండు మూడు సంవత్సరాలు కృషి చేసి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా రెడీ చేసుకున్నాను. అయితే ఫాంట్స్ చేయడానికి అక్షరాలు చక్కగా వ్రాసే ఆర్టిస్ట్‌ల సహకారం అవసరం. తెలుగు అక్షరాలు వ్రాసే ఆర్టిస్టుల కోసం చెన్నయ్, హైదరాబాదు, విజయవాడ నగరాల్లో లెటరింగ్ ఆర్టిస్టులను సంప్రదించి తెలుగు ఫాంట్స్ చేయడం మొదలు పెట్టాను. ఆ సమయంలోనే సీనియర్ పాత్రికేయులు మోహన్ కుమార్ గారు పబ్లిసిటీ ఆర్టిస్ట్ శ్రీ ఈశ్వర్ గారి సోదరులు బ్రహ్మం గారిని పరిచయం చేసారు. ఈశ్వర్ గారు ఉండేది టి.నగర్‌లో మా ప్రక్క వీధే కావడం విశేషం. అప్పటికే దాదాపు వివిధ భాషలలో 1000కి పైగా సినిమ్లుకు పబ్లిసిటీ డిజైన్లను, టైటిల్ కార్డులను తన అందమైన అక్షరాలతో తీర్చి దిద్దిన అపార అనుభవం బ్రహం గారికి ఉంది. తెలుగు అక్షరాల అనాటమీపై ఆయనకున్న పట్టు నిజంగా సంభ్రమాశ్చర్యాలను కలిగించేది. అంతటి అనుభవశాలి కనుకే మా అనూ తెలుగు ఫాంట్స్‌లో ఆయన సహకారంతో తీర్చిదిద్దిన ప్రగతి, బ్రహ్మ, జ్యోతి వంటి ఫాంట్స్ ఈనాటికీ హైలెట్ గా నిలుస్తున్నాయి. ఫాంట్స్‌కు పేరును సూచించమని కోరగా మొదటి ఫాంట్‌కు వారి సోదరులు శ్రీ ఈశ్వర్ గారి పేరును సూచించారు. అన్నగారిపై ఆయనకు అంతటి అభిమానం, గౌరవం. అక్షరాలను అందంగా తీర్చిదిద్దడమే కాకుండా ఎంత చిన్న సైజులో ప్రింట్ చేసినా అవి ముద్ద కాకుండా ఉండేందుకు అక్షరంలోని అన్ని భాగాలకీ ఖచ్చితమైన కొలతలతో అంచనాలు వేసుకునేవారు. ఏదైనా కొత్త స్టైల్‌లో ఒక్క పదాన్ని పేపర్ కటింగ్‌లో చూపిస్తే చాలు ఫాంట్‌కు కావాల్సిన అన్ని అక్షరాలను వ్రాసి ఇచ్చేవారు. తెలుగు అక్షరాల వరకూ నా దృష్టిలో బ్రహ్మంగారు నిజంగా అక్షర బ్రహ్మే! తెలుగు, తమిళ్, కన్నడ, మళయాళం భాషల అక్షరాలపై కూడా ఆయనకు మంచి పట్టు ఉండేది. మా అనూ ఫాంట్స్‌లోని మరికొన్ని ఫాంట్స్ రూపొందించడంలో సహకరించిన ఆర్టిస్టులు కూడా బ్రహ్మగారి వద్ద అక్షరాలను దిద్దిన ఆయన శిష్యులే కావడం విశేషం.

**- అనూ ఫాంట్స్ మురళీకృష్ణ**

*ముట్నూరి వారి 'కృష్ణాపత్రిక' దర్బారులోని ప్రముఖులలో ఒకరైన* **రావూరు వెంకట సత్యనారాయణరావు** *డైలీ కాలమిస్టుగా ప్రసిద్ధులు. 1911 లో కృష్ణాజిల్లా ముచ్చిలి గుంటలో జనించిన రావూరు 1938 లో 'కృష్ణాపత్రిక'లో చేరి 'వడగళ్ళు' అనే శీర్షిక నడిపారు. దరిమిలా 1960 ప్రాంతాల్లో ఆంధ్రప్రభ డైలీలో 'టీకా -- టిప్పణం' అనే శీర్షిక ప్రారంభించి, దానినే 'ఆషామాషీ' అనే పేరుతో వ్యవహరించారు. దాదాపు 20 సంవత్సరాలు సాగిన ఆ శీర్షిక రావూరు మార్కు సున్నితమైన హాస్యానికి పెట్టింది పేరు. 'చక్రపాణి' వంటి కొన్ని చిత్రాలకు రచన చేసిన రావూరు హాస్య ప్రచారానికి 'నవ్వండి - నవ్వించండి' అని ఒక ఉద్యమ స్థాయి ప్రయత్నం కూడా చేశారు. హాస్య రచనలో కాక ఇతర రచనలు కూడా చేసిన రావూరు 1983 జులై 1న మరణించారు. ఆయనను గుర్తు చేసుకుంటూ వారి కుమార్తె జ్ఞానప్రసూన గారు వ్రాసిన వ్యాసం తో బాటు అప్పట్లో ఆయన వ్రాసిన 'ఆషామాషీ' కాలమ్ ఒక దానిని కూడా ఈ నెల ప్రత్యేకంగా 'కౌముది' పాఠకులకి అందిస్తున్నాం.*

## నాన్నగారి జ్ఞాపకాలు

**- తటవర్తి జ్ఞాన ప్రసూన**



నాన్నగారి (రావూరు సత్యనారాయణగారు) గురించి తలచుకోగానే ఆయన సదా నిమగ్నమై ఉండే సాహితీ కార్యక్రమాలు గుర్తుకొస్తాయి. 1963 లో హైదరాబాదులో భాషా కుటీరం అని ఒక సంస్థ స్థాపించారు. మాఇంట్లోనే చిన్న సభ నిర్వహించారు. స్థానం నరసింహా రావు గారు, గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, డాక్టర్ పాటిబండ్ల మాధవ శర్మగారు, శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారిగారు, శ్రీ ఉషశ్రీగారు, ఏడిద కామేశ్వరరావు గారు ఆనాటి సభలో ఉన్నారు.

అప్పటి నుంచి నాన్నగారు భాషా కుటీరంలో సభ్యులు. సన్మానాలు, పుస్తక ఆవిష్కరణలు జరుపుతుండేవారు మధ్యాహ్నం పదకొండు గంటలకు ఊళ్ళోకి ఎవరో ప్రముఖులు వచ్చారని తెలిసేది. సాయంత్రం వారికి సన్మానం చెయ్యాలనుకొనే వారు. శాలువా, పూలదండలు, సన్మానపత్రం, చాయ్ తప్పకుండా ఉండేవి. సన్మాన పత్రం నాన్నగారే వ్రాసేవారు కనుక సరిపోయేది. ఇక శాలువాలకి, పూలదండలకి, పిలుపులకి నేను మా పెద్దబ్బాయి పరుగులెట్టేవాళ్ళము. ఆ ఏర్పాట్లకి తగ్గట్టుగా సభ బాగానే జరిగేది. సభకు వచ్చిన వారందరూ ఏదో ఒక రంగంలో నిష్ణాతులై ఉండేవాళ్ళు. దానితో సభలో లెక్కకి తక్కువ మంది ఉన్నా నిండుగా ఉండేది. వందరూపాయలలోపే సభ జరిపించేవారు. అధ్యక్షులుగా

ఉండమని, ఉపన్యాసకులుగా రమ్మని ఎవరినీ పిలవడం ఉండేదికాదు. సభకి వచ్చిన వాళ్ళే ఒకరు అధ్యక్షులు అయిపోయేవారు, ఒకరు ఉపన్యాసకులు అయిపోయేవాళ్ళు.

నాన్నగారు విజయవాడలో ఉద్యోగం చేసేప్పుడు గాంధీనగరంలో ఉండేవాళ్ళం. ఒకసారి శ్రీ భాట్టం శ్రీరామశర్మ మూర్తిగారికి నాన్నగారు సన్మాన సభ ఏర్పాటు చేశారు. అక్కడే పక్కన ఉన్న హైస్కూలు వాళ్ళుకూడా ఆయన్ని పిలిచారు. ఆయన 'ముందు అటు వెళ్ళి మీ సభకి వస్తా' అన్నారు. వేసవి కాలం పనులన్ని అయ్యాయి. జంపఖానాలు తెచ్చి వరండాలో పడేశారు. సన్మాన పత్రం నాన్న రాశారు. అమ్మని పిలిచి చదివి వినిపించాను, మంచి కాగితం మీద కాపీ చేసి పక్కన పూలు ఆకులు చిత్రించాను. ఇంకా భాట్టం వారు రావడానికి సమయం ఉంది. నాన్నగారికి మూడుపూటల స్నానం చెయ్యడం ఒక అలవాటు. అలానే ఏ పని చేయాలన్నా పావుకప్పు కాఫీ తాగి ఒక్క సిగరెట్టు కాలిస్తే గాని చేసేవారు కాదు. ఆ రోజుకూడా ఇంకా భాట్టం వారు రావడానికి సమయం ఉంది కదా అనే ధీమాతో, వరండాలో తుండు చుట్టుకుని కూర్చుని సిగిరెట్ కాలుస్తున్నారు. కారు శబ్దం వినిపించింది. మేము మేడ మీద ఉండేవాళ్ళం. ఇంటి వరండాలో నుంచుంటే మెయిన్ రోడ్డు, ఇంకా రెండు సందులు కనిపించేవి. తొంగి చూస్తే ఏముంది భాట్టం గారి కారు మా సందులోకి తిరిగింది..! 'నాన్నా! వారు వచ్చేశారు' అరిచినంత పని చేసాను నేను. నాన్న లోపలికి పరుగెట్టి పంచ, లాల్చీ ఉత్తరీయం వేసుకొచ్చారు. మేము జంపఖానా పరిచి కుర్చీ వేశాము, సుబ్బు అగరు వత్తులు వెలిగించాడు. ఆయన మెట్లెక్కి వచ్చేసరికి నాన్న ఎదురు వెళ్ళి తీసుకు వచ్చారు. అమ్మ శాలువా అవి పళ్ళెంలో పెట్టి అందించింది. కూర్చోపెట్టి ఆయనకి దండ వేసి, శాలువా కప్పి, సన్మాన పత్రం చదివారు, ఆయన పదినిమిషాలు మాట్లాడి వెళ్ళిపోయారు. వందన సమర్పణ సమయానికి కార్యదర్శిని వచ్చింది. ఒకొక్క సారి ఇలా హడావుడి గా జరిగేవి నాన్నగారి సభలు. ఇప్పుడు తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. 50 రూపాయలతో సభ అయిపోయేది.

నేను పుట్టిన ఒకటి రెండు ఏళ్ళ లోపే నాన్న కృష్ణా పత్రికలో చేరారు. అంతకు ముందు, కిరసనాయిలు అమ్మే కొట్లోనూ, కొంతకాలం కరెంటు బల్బులు అమ్మే కొట్లోనూ పని చేసేవారు.

కుటుంబపోషణకోసం ఏ పని చేసినా, ఎప్పటికైనా కృష్ణాపత్రికలో ఉద్యోగం తెచ్చుకోవాలనేది నాన్నగారి ఆశయమట! అందులో ఫుల్‌టైమ్ ఉద్యోగం రాక ముందుఅప్పుడప్పుడూ సినిమా సమీక్షలు వ్రాసేవారట. రోజూ సాయంత్రం కృష్ణా పత్రిక ఆఫీసుకు వెళ్ళివచ్చేవారట. ఆ పత్రిక స్థాపకులు ముట్నూరి కృష్ణారావు గారు తోటలో తిరుగుతుంటే ఆయన వెనకాలే నాన్నగారుకూడా వెళ్ళేవారట.

కృష్ణారావు గారిని ఎవరు తమంతట తాము పలకరించేవాళ్ళు కారు. ప్రజలకి ఆయనంటే అత్యంత గౌరవ భావం ఉండటం వల్ల ఆయన వంక చూడటానికి, పక్కన నడవటానికి భయపడేవాళ్ళు. హిమవన్నగము వంటి ఆకారము. తెల్లటి ఖద్దరు పంచె, లాల్చీ, అంచుల కండువాలు, తలపాగా ఆయన్ని ఒకసారి చూసినవాళ్ళెవరూ ఆ రూపాన్ని మర్చిపోలేరు. "నీ తలపాగా కుచ్చు ధవళించిన శీవియేశీవి అని పువ్వాడ శేషగిరి రావుగారు పద్యం వ్రాశారు. ఒకరోజు నాన్నగారు ఆఫీసుకు వెళ్ళి తోటలో ఆయన వెనకే తిరుగుతున్నారట. కొంచెం సేపు అయాక ఆయన వెనక్కి తిరిగి 'రేపటినుంచి రండి ఆఫీసుకి' అన్నారట. ఇక నాన్నగారి స్థితి " ఆజ్ మేరీ జామీపర్ నహీ హై కదం" అన్నట్లుగా అయింది. ఇంకేమీ అడగకుండా ఇంటికి పరిగెత్తుకుంటూ వచ్చేశారంట. ఆనాటి నుండి పత్రికకే అంకితం. కృష్ణా పత్రికని నాన్నగారు నెత్తిమీద పెట్టుకుని ఎంతగా ఆరాధించేరో మాకూ అంత ఆరాధన ఉండేది. బందరులో కృష్ణాపత్రిక ఆఫీసు ఒక గురుత్వాకర్షణ కేంద్రం. కవులు, గాయకులు, నటులు, చిత్రకారులు, దేశ సేవకులు, రాజకీయ నేతలు వేదాంతులు, హాస్య ప్రియులు అక్కడ సమావేశమై భావాలు పంచుకునేవారు.

శ్రీ ముట్నూరి కృష్ణారావు గారు పరమ వేదాంతులు, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్ళి వచ్చిన దేశభక్తులు, హాస్యప్రియులు, సాహితీ మూర్తులు. ఆయన నీడలో కృష్ణా పత్రిక ఘనమైన పేరు ప్రతిష్టలు సంపాదించుకొంది. నా చిన్నతనంలో బయట ప్రపంచంతో ఏమీ సంబంధం ఉండేది కాదు. కృష్ణా పత్రిక, సాహిత్యం అంతే!


రావూరు

బందరులో శుక్రవారం నాడు కొత్త సినిమాలు విడుదల చేసేవారు. మినర్వా టాకీసు, బృందావన్ హాలు, కృష్ణ కిశోర్, సరస్వతి అని కూడా ఒక హాలు వుండేదనుకుంటాను, గుర్తులేదు. మినర్వా థియేటర్ యజమానులు కృష్ణా పత్రికలో రివ్యూ వేయించుకోడానికి కొత్త సినిమా గురువారం నాడు ప్రీ రివ్యూ వేసేవారు. నాన్న గారు, మల్లినాథ సూరిగారు వెళ్ళేవారు. ముట్నూరివారు అప్పుడప్పుడూ వెళ్ళేవారు. మామూలుగా ఐతే రోజునాన్న ఆఫీసుకి నడిచివెళ్ళి నడిచి వచ్చేవారు. సినిమా ప్రివ్యూ రోజుమాత్రం ఇంటికి గుర్రపు బండి వచ్చేది. గుర్రపు బండి మీద వెళ్ళటమంటే హుందాగా అనిపించేది. నాన్నని అడగకుండానే తయారయి బండిలో ఎక్కి కూర్చునేదాన్ని. సినిమా ఏమీ తెలిసేదికాదు. గుర్రపుబండి హుషారు ఒకటి రెండోది సినిమా హాలులో విశ్రాంతప్పుడు కూల్‌డ్రింకు, ఒక కిళ్ళీ ఇచ్చేవాళ్ళు. దానికోసం వెళ్ళేదాన్ని. కిళ్ళీ బందరులో చాలా బాగుండేది. ఇప్పటికీ ఆ తీపితనం తలుచుకుంటే నాలిక మీదకి వస్తుంది. సినిమా పూర్తవగానే నాన్న, అక్కడినుంచి ఆఫీసుకి వెళ్ళి గబగబా రివ్యూ వ్రాసేవారు.

కృష్ణా పత్రిక ఆఫీసులో వెనక తోట ఉండేది. చక్కటి శిల్పాలు ఉండేవి. క్రోటన్స్, పూల మొక్కలు ఉండేవి. ఆ తోటలో తిరిగి పూలుకోసుకుని కాగితం కవరులోపెట్టుకుని వచ్చేదాన్ని. చెక్క మెట్లు వుండి డబ్బా పైన ఒక గాడి ఉండేది. అక్కడ శ్రీ తోట వెంకటేశ్వర రావు గారు చిత్రాలు గీస్తూ ఉండేవారు. అవి సంప్రదాయ సిద్ధంగా, సొగసుగా, లలితంగా ఉండేవి. ఆ మెట్ల పైన "బాతుపూల" తీగ ఉండేది. ఆ పూలు బాతుల్లా ఉండేవి. వైలెట్ రంగులో చుక్కలు ఉండి, ఆకుపచ్చ ముక్కుతో భలేగా ఉండేవి. అవి కోసుకునే దాన్ని. ఆ తీగని 40 ఏళ్ళ తరువాత కల్పన వాళ్ళింటిలో చూశాను. ఆ తీగని వదిలి రాలేకపోయాను. నాన్న రివ్యూ వ్రాయడం అయి కంపోజ్ కిచ్చాక ఇంటికి వెళ్ళేవాళ్ళం. నాకు అదొక విహార యాత్రలా అనిపించేది.

మీటర్ కాగితాలని అరిచేయి అంత వెడల్పున గోధుమ రంగు కాగితాలు జానెడు పొడవు ఉన్నవి వ్రాసుకోడానికి ఆ ఆఫీసువాళ్ళు ఇచ్చేవారు. నాన్న నిద్ర లేవగానే కాఫీ తాగి ఆ కాగితాలు అట్ట ఒళ్ళో పెట్టుకు కూర్చునేవారు. ఎప్పుడూ కాఫీ కప్పు దగ్గర ఉండేది. సిగరెట్టు, వక్కపొడి, అమృతాంజనం సీసా, అగ్గిపెట్టె చుట్టూ ఉండేవి. కాసేపు ఎడమభుజం కుడిచేత్తో వ్రాసుకుంటూ ఆలోచించేవారు. కాసేపు బనీను చేతి అంచు మునివేళ్ళతో పట్టుకు దాన్ని సాగదీస్తూ ఆలోచించేవారు.

గడ్డానికి కలం ఆనించి ఆలోచించేవారు, ఈ ముద్రలన్ని ఇప్పటికీ నాకు బాగా గుర్తు. ఆయన వ్రాస్తుంటే ఆయన ప్రక్కనే కూర్చునేదాన్ని, ఆయన ఒక కాగితం వ్రాసి నా చేతికిచ్చేవారు, చదివేదాన్ని, ఆయన వ్రాయడం పూర్తి అయేసరికి నేను చదవడం అయిపోయేది. అప్పుడు మా అమ్మని పిలిచి చదవమనేదాన్ని. మా అమ్మ "బాగేనే ఉంది." అనేది. పొడుగాటి కాగితాలు ప్రింటు చేసి ప్రూఫులు వచ్చేవి, అవి ఇంటికి దిద్దడానికి తెచ్చేవారు నాన్న, అది చదివేదాన్ని. తరువాత ఎనిమిది పుటలు ఒక ఫారంగా వచ్చేవి. అప్పుడు మళ్ళీ చదివేదాన్ని, చివరికి సంచిక వస్తే కృష్ణాపత్రిక నెలదాకా చదివేదాన్ని.

బందరు ఎవరు వచ్చినా కృష్ణాపత్రిక ఆఫీసును దర్శించకుండా వెళ్ళేవారు కాదు. నాన్నగారు వారిని ఇంటికి భోజనానికి పిలిచేవారు. పదకొండు గంటలకి ఆఫీసు కుర్రాడు వచ్చాడంటే చుట్టాలు వస్తున్నట్లే. చిన్న తాటాకు బుట్టలో లేత వంకాయలు, దోసకాయలు, బీరకాయలు, పచ్చిమిర్చి, కొత్తిమీర తాజాకూరలు ఒక చిన్ని చీటి ఉండేవి. 'ఫలానా పెద్ద మనిషి భోజనానికి వస్తున్నారు,

వారితో ఒకరిద్దరు రావచ్చు' అని నాన్న వ్రాసేవారు. తొమ్మిదేళ్ళ దాకా మా అమ్మకి సరుకులు నేనే తెచ్చిపెట్టేదాన్ని, నాన్న ఏమీ పట్టించుకునేవారు కాదు. నేను బయటికి వెళ్ళడం మానేసాక మా అమ్మ ఎవరైనా హఠాత్తుగా వస్తే చాలా కంగారు పడిపోయేది.

వచ్చిన వాళ్ళు విందు అయిపోయాక నాన్న కొత్త రచనలు వారికి చదివి వినిపించమనేవారు. నేను ఆస్థాన చదువరిని. ఒక రచనని ఎన్ని సార్లు చదవమన్నా చదివేదాన్ని. పదకొండేళ్ళు వచ్చేదాకా మా నాన్నగారి చొక్కా పట్టుకు తిరిగేదాన్ని. ఆయనకి చాలా ప్రేమ, చక్కగా వ్యక్తం చేసేవారు. మా అమ్మకి అంతకు పదిరెట్లున్నా వెలికి తీసేది కాదు.

కృష్ణా పత్రికకి బోలెడు పుస్తకాలు వచ్చేవి, అవి నాన్న తెస్తే అన్నీ చదివేదాన్ని. నవలలు, కథలు ఎన్నో. కొంచెం పెద్దయ్యాక అడవి బాపిరాజుగారి 'నారాయణరావు' నవల చదివాను. నాకు అలాటి అన్న లేడని చాటుగా వారం రోజులు ఏడిచాను, కళ్ళు వాచి, ఎర్రబడ్డాయి. ఒకరోజు నాన్న చూసి, 'ఎందుకమ్మా కళ్ళు అలా ఎర్రబడ్డాయి?' అన్నారు. నాన్న గుర్తించారని తెలియగానే భోరున ఏడిచాను, 'ఎందుకమ్మా కన్నీళ్ళు, ఏమయింది? అన్నారు. 'నాకు నారాయణరావు లాటి అన్నయ్య లేడని ఏడుపొచ్చింది' అన్నాను. 'బాగుందమ్మా! తమ్ముడైతే తెచ్చి ఇవ్వగలను కాని అన్నయ్యనెలా తెస్తాను' అని నవ్వేవారు.

మా నాన్నగారి అలవాటు పొద్దుటిపూట పూల పొట్లాము తేవడం, రాత్రి మిఠాయి తేవడం. ఆ మిఠాయి తింటే గాని నిద్ర వచ్చేదికాదు. మా నాన్నగారు ఆఫీసునుండి ఆరుగంటలకి బయలుదేరి మల్లినాథ సూరిగారిని వెంటపెట్టుకుని కాఫీ తాగడానికి వెళ్ళేవాళ్ళు. బందరులో రాబర్ట్సన్ పేట కుదురు  అని వుండేది అక్కడ మంజప్ప హోటలు, ఇడ్లీ, గారె, వడ, పెసరట్టు దోసె బ్రహ్మాండంగా చేసేవాడు. కాఫీ అంటే మంజప్ప కాఫీనే. అక్కడ కాఫీ కాస్త వాసన ఊరంతా వ్యాపించేది. ప్రతివాడిని పిల్చుకొచ్చేది. అక్కడ చర్చలు చేస్తూ ఎనిమిది గంటలకి ఇంటి ముఖం పట్టేవారు నాన్న. పక్కనున్న వాళ్ళతో కబుర్లాడుతూ రోడ్ల మీద గంటల తరబడి నిలబడేవారు. ఆయనని వాళ్ళు వదిలేవాళ్ళు కాదు. ఇంటిదాకా వచ్చి వాకిటిలో నిలబడి మళ్ళీ కబుర్లు.. తొమ్మిదయేసరికి నాకు నిద్ర వచ్చేది కానీ మిఠాయి తినకుండా ఎలా? వరండాలో నిల్చుని దగ్గినా, తుమ్మినా నాన్న వచ్చేవారు కాదు. కిందకి దిగి వెళ్ళి తెచ్చుకోవడం సభ్యత కాదుకదా? ఒకోసారి నిద్రపోయేదాన్ని. తెల్లారిలేచి నాకు మిఠాయి తేలేదని పోట్లాడేదాన్ని. నాన్న వచ్చి నిద్రలేపి తినిపించేవారు. 'నువ్వు తిన్నావమ్మా! నేనే నోట్లో పెట్టా, ఇదిగో ఈ పొట్లాం ఆకులు చూడు' అని చూపించేరు. నవ్వి ఊరుకునేదాన్ని. అలాంటి పితృ ప్రేమ దొరకడం ఎంతో దుర్లభం.

కృష్ణా పత్రికలో ఉండగా నాన్నగారు చాలా నవలలు, కథలు, వ్యాసాలు, వడగళ్ళు వ్రాసారు. కీర్తి, తలంబ్రాలు, ఏరువాక, పరితాపం అనే నాటికలు  వ్రాసారు. నాటకం రిహార్సిల్స్‌కి నాన్నగారితో పాటు వెళ్ళేదాన్ని. ఒకరోజు ఒక నటీమణి ఇంటిలో రిహార్సిల్స్‌కి వెళ్ళాను. చిన్నతనం కదా? లోపలికి తొంగి చూశా. పెరటిలో ఒకాయన చేపని రాతిమీద వేసి రుద్దుతున్నాడు. తరువాత వచ్చి హీరో డైలాగులు చెప్పాడు. ఇంటికి వస్తూ నాన్నని అడిగాను, 'నాన్నగారూ అతను హీరో కదా! అక్కడ వాళ్ళింటిలో పని ఎందుకు చేస్తున్నాడు? ' అని. 'అంతేనమ్మా! మంచి వేషం వెయ్యాలంటే ఎన్నో తిప్పలు పడాలి, ఎంత మందినో మంచి చేసుకోవాలి' అన్నారు.

నాన్నగారు సాహిత్యంలో దాదాపు అన్ని ప్రక్రియలు చేపట్టారు. ముఖ్యంగా హాస్య రచనలు కుప్పలు కుప్పలుగా వ్రాసారు నిత్యం. కాని ఆయనకి రావలసిన ప్రఖ్యాతి రాలేదు. రాలేదని ఆయన ఎప్పుడూ అనుకునేవారు కాదు. ఆయన స్థిత ప్రజ్ఞత్వమే మాకు శ్రీరామ రక్ష అయింది. తప్పటడుగుల నాడే పద్యాలు పాటలు వినిపించి, కొత్తలోకంలో నడిపించారు నాన్నగారు. ఒక కవికి బిడ్డగా పుట్టడం మహద్భాగ్యం. ఐహిక సుఖాలకు అర్రులు జాచకుండా ఉన్నదానితో సంతృప్తి చెందడం చెప్పక చెప్పారు.

***

*ఆషామాషీ కబుర్లు రావూరు (1960ప్రాంతాల్లో వచ్చిన కాలమ్ ఇది)*

## రూపాయి - పాపాయి

ధర పెరిగిన తర్వాత, డబ్బు విలువా, దానితో మనుష్యుల విలువా కూడా తగ్గింది. ఏదైనా కొనాలంటే, ఎక్కువ ధర పెట్టడమే కాదు - అమ్మే వాళ్ళ చేత అనేక మాటలు పడాల్సి వస్తోంది.

ఇదివరలో ఎవరైనా బేరానికి వస్తే "అయ్యా బాబు దయచెయ్యండి. తమరికేం కావాలి - పెద్దలు మీరు మళ్ళీ మాకొట్టుకు రావద్దా?" అంటూ ఉండేవారు. ఇప్పుడీ మాటలెక్కడా వినిపించడం లేదు. "ఏమిటయ్యా నీకేం కావాలి."

"తొందరగా ఉంటే వెళ్ళు"

"అంతకు తక్కువ రాదు. వెళ్ళు వెళ్ళు."

"ధర తగ్గించాలా! కొన్నాళ్ళు పోయిన తర్వాత రా -"

"నువ్వు రాకపోతే వందమంది వస్తారు -" ఇలాటి పదజాలం దొర్లుతోంది. సంసార భారం నెత్తిన పెట్టుకున్నందుకు, ఇవన్నీ భరించి, ఆ దుకాణదారుని సింహాసనం మీద కూర్చున్న ఒక మహారాజుగా భావించి, చేతనైతే సీసపద్యం చదివో లేకపోతే వచనంలో పొగిడో, ఆ వస్తువు చేత పట్టుకు రావడం తప్పడం లేదు.

కూరల దుకాణాల వద్దకు వెడితే - ఎంత నమ్రత ప్రకటించాలి! కూరలు ఏరుదామంటే

"అదేంపనికి రాదు. కావలిస్తే ఇంటికి పట్టుకు వెళ్ళి ఏరుకో, అక్కరలేకపోతే వెళ్ళిపో" అంటాడు దుకాణదారు.

మొన్న ఒకసారి వంకాయలు కొంటున్నాను. తూచి ఇవ్వబోతున్నాడు. 'రాళ్ళు సరిగా ఉన్నాయా?'అన్నాను. తక్కెట్లో వంకాయలు గభాలున గ్రుమ్మరించి "తనిఖీకొచ్చారా - తమరు! అసలు నీకు అమ్మను వెళ్ళు" అంటూ మొదలు పెట్టాడు. ధరను గురించి మాట్లాడకూడదు. సరిగదా - రాళ్ళ విషయం అడక్కూడదు. త్రాసులో వారుంటే అడక్కూడదు. తూకం కొంచెం నిలబెట్టమని అంతకన్నా అడక్కూడదు.

పేరుకి మాత్రం - కొందరిళ్ళలో భర్తలున్నట్టు - ఒక పళ్ళెంలో ముఖాలు మారీ, శిఖాలు చెరిగీ అలాపడి ఉంటాయి రాళ్ళు. వాటిని గురించి ఆలోచించక్కరలేదు. రెండో పళ్ళెంలో కూరల్ని కుంచెంతో కొలిచినట్లు కొలుస్తాడు గాని, తూచడం కనపడదు. వ్యక్తుల కడగళ్ళకు తోడు ఈ రాళ్ళు ఒకటి!

మా ఇంటి వద్దకు ఒక ముసలమ్మ కాయగూరలు తెచ్చేది. ఆవిడ దగ్గర ఒకరోజు ఉన్న రాళ్ళు మర్నాడు ఉండేవి కావు. ప్రతిరోజూ మారుస్తుంటే ఎక్కడ అడిగేది, ఒక రోజైతే పోట్లాడటానికి అవకాశం ఉంటుందిగాని.!

ఆ రాళ్ళు చాలా విచిత్రంగా ఉండేవి. శనివారం అన్నీ శివలింగాల రూపంలో ఉండేవి. ఆదివారం అన్నీ - త్రొక్కుడు బిళ్ళ ఆటలో పిల్లల ఆడే రాళ్ళలాగా గుండ్రంగా ఉండేవి. ఒకనాడు అన్నీ నలచదరం - ఒకరోజున మాత్రం ఒక రాతి ముక్క, ఒక ఇనుపముక్కా వేసుకుని వచ్చింది.

శివలింగాలు తెచ్చిననాడు కూరకొనుక్కుని, డబ్బులిచ్చి వాటిని కళ్ళకు అద్దుకు రావడం మా వంతు అయ్యేది. గుండ్రంగా ఉన్న రాళ్ళు తెచ్చిననాడు - ఇవ్వాళ మనపని సున్నా - అని లోలోపల పాడుకుంటూ ఇంట్లోకి పోవడం జరిగేది.

ఆవిడ దగ్గర భూగర్భ పరిశోధకులకు పనికి వచ్చే రకాలు కూడా కొన్ని ఉన్నాయేమోననిపిస్తుంది. ఏ రాతితో తూచినా ఒప్పుకోవలిసిందే! - సరిగా లేవు అంటే -

"కూర తూచి ఇస్తా.... మీ ఇష్టం వచ్చిన చోటికి పోయి తూయించుకురండి" అని సవాల్ చేసేది.

మొన్న మా మిత్రుడొకడు కూరల దుకాణానికి వెళ్ళి "ఏమిటయ్యా పొట్లకాయ నిండా ఇలా పొడలున్నాయి?" అన్నాడట "మనుష్యులకే ఉన్నాయి. పొట్లకాయకు ఉండవా? అయినా అవన్నీ దోమకాట్లు. మనం దుప్పటి కప్పుకుంటే దూరి కుడుతున్నాయి. దొడ్లలో ఉండే కాయల్ని కుట్టడం ఆశ్చర్యమేమిటి" అని దబాయించాడట వాడు.

మొన్న వేసవి కాలంలో మామిడి పండ్లు కొంటూ ఒకాయన "డజను కొన్నాగా, పదమూడో పండేది?" అన్నాడట.

"పదమూడో పండు తలపండే" నని ఆ బేరగాడు, తట్టెత్తుకుని దబదబా వెళ్ళిపోయాడట.

మొన్న ఒకావిడ బజారునుంచీ వస్తూ పోనీ పిల్లలకేమైనా కొనుక్కుపోదామని మిఠాయి దుకాణానికి వెళ్ళి "ఒక బేడ చేగోడిలియ్యినాయనా" అందట. ఆ అంగడిదారుడు బేడకయితే జీడీలు కొనుక్కోవమ్మా" అని ఇచ్చి వేశాడట.

ఎక్కడికిపోయినా అణాబేరాలు, బేడా బేరాలు ఉండటం లేదసలు. పావలా తక్కువ అయితే ఎవరూ పలకరించరు సరిగదా - పైగా విసుక్కొంటారు. వారినేదో అవమానించినట్లుగా.

మొన్న ఒక రోజున మా ఇంటికొచ్చిన బంధువుల పిల్లలు బఠానీలు అమ్మే ఆయన్ని మేడమీదికి పిలిచి - ఒక అణా మరమరాలివ్వమన్నారట.

అక్కడితో ఆయనికెక్కడలేని కోపం వచ్చింది. "అణా కోసం ఇన్ని మెట్లెక్కిస్తారా? పావలా బేరమన్నాలేదే ఎందుకు పిలవాలి?" అని పోట్లాడాడు.

"మరమరాలిక్కూడా పావలా లెక్కడ పెడతామయ్యా, పిల్లలు అణావి కొనుక్కుంటారు. అంతకంటే ఎక్కువదేనికి?" అని ఆ పిల్లల తల్లి వెళ్ళి కల్పించుకుని చెప్పింది.

"అణా బేరమని క్రిందవుండగానే చెప్పాలి - లేకపోతే దిగిరావాలి - అంతేగాని, దొరలల్లే కూర్చుని నౌకర్లును పిలిచినట్టు అణా బేరాల పరువు అలా ఉంది. వస్తువు రాకపోగా, కుస్తీలకు తయారవుతున్నారు. "

అందుకని ఏ బేరానికి వెళ్ళినా, ఎవరిని పిలిచినా భయం వేస్తోంది. ధరలు తగ్గవు, గృహస్తుల దగ్గిర డబ్బులు పెరగవు. ఈ అసందర్భ పరిస్థితుల్లో పడి, కొట్టుకు పోవలసిందే గాని, నెట్టుకు తిరిగే అవకాశం లేదు.

మొన్న ఒకరింట్లో పెళ్ళి కొడుకు యాపిల్ కావాలన్నాడట. మామగారు సణుక్కుంటూనే సైకిలిచ్చి కొడుకుని బజారు పంపాడు. అతడు తిరిగొచ్చి 'యాపిల్ రూపాయి చిన్న రకంది' అని చెప్పాడట ఆ గృహస్థు "బాబోయ్ రూపాయే" అని ఉలిక్కిపడ్డాడట.

కొనితేకపోతే అల్లుడికి కోపం వస్తోంది. ఒక రోజు కొంటే ప్రతీరోజూ అడుగుతాడేమో! ఇలా బాధపడి చివరకు - ఒకటి తెప్పించాడట.

ఆయన పెళ్ళాన్ని పాపాయి అని పిలుస్తాడు. ఆ రోజంతా పావుగంట కొకసారి పాపాయి అని ఆవిణ్ణి పిలిచి రూపాయి అంటూ కూర్చున్నాడట. ఈ పాపాయి - రూపాయి గొడవ, అల్లుడి మూడు నిద్రలయ్యే దాకా సాగుతూనే ఉంది.

# 'చందమామ'కి వెన్నెముక - సుబ్రహ్మణ్య సృష్టి
## - వసుంధర



ప్రకృతిలో అత్యంత ఆహ్లాదకరమైనది ఆకాశంలో చందమామ. అందుకే కావాలని పిల్లలు మారాం చేస్తారు. పెద్దలకూ కావాలనే ఉంటుంది - కానీ అసాధ్యమని గ్రహించి మనసులోని భావాన్ని పైకి చెప్పరు. బాలరాముడు చందమామ కావాలంటే - కౌసల్య అద్దంలో చూపించి భ్రమపెట్టింది త్రేతాయుగంలో. కలియుగంలో 1947 జులైలో - నాగిరెడ్డి, చక్రపాణి అనే ఇద్దరు కారణ జన్ములు - అన్ని వయసులవారికీ చేతిలో 'చందమామ'ని ఉంచారు. అది భ్రమ కాదు. సూర్యతేజంతో సమానమైన జ్ఞానకిరణాల్ని - సుధా చంద్రికలుగా ప్రసరించి ఆహ్లాదాన్ని కలిగించే 'చందమామ' పిల్లల పత్రిక తెలుగునాట వెలసి భర్త ఖండమంతా ఆవరించి - ఖండాంతర ఖ్యాతికి విస్తరించింది. చందమామ అనగానే గుర్తుకొచ్చే ప్రముఖులు - నాగిరెడ్డి, చక్రపాణి. చిత్ర, శంకర్. తర్వాత కొడవటిగంటి. ఆ తర్వాత విశ్వం. ఇది జగమెరిగిన నిజం. 1978 సంవత్సరాంతానికి చందమామలో మా కథల సంఖ్య యాభైకి చేరుకున్నా అప్పటికి మేమెరిగిన నిజమూ అదే

1979 మార్చి నెలలో ఒక 'అంతర్జాతీయ విజ్ఞాన సదస్సు'లో పాల్గొనడానికి అప్పటి మద్రాసుకి వెళ్ళినప్పుడు నేను పెట్టుకున్న ఇతర పనుల్లో చందమామ కార్యాలయ సందర్శనం ముఖ్యమైనది. ఆ రోజు మార్చి 23. చందమామ కార్యాలయ ముఖద్వారం వద్ద కాపలా వ్యక్తితో మాట్లాడుతుండగా - ఓ బక్కపలచని పెద్దమనిషి లోపలికెడుతూ నన్ను చూసి ఆగి విషయమేమిటని అడిగారు. 'వసుంధర'లో రాజగోపాలరావుని నేనని తెలియగానే ఆయన ముఖంలో 'చందమామ' వెలుగు. తన పేరు దాసరి సుబ్రహ్మణ్యం అని చెప్పి - ఆప్యాయంగా చేయి పట్టుకుని, ఆత్మీయంగా మాట్లాడుతూ, దారి పొడుగునా మా రచనా కౌశలాన్ని పొగుడుతూ - లోపలికి తీసుకెళ్ళి మాన్యులు కొడవటిగంటి కుటుంబరావుకి పరిచయం చేసారు. మేమభిమానించే, ఆరాధించే అసామాన్య రచయిత నా ఎదుటనే ఉన్నారని తెలియగానే కాసేపు నేనీలోకాన్ని విస్మరించాను. కుటుంబరావు నా వంక అభిమానంగా చూసి, "మీరు చాలా చిన్నవారే. మీ కథల స్థాయి, పరిణితిని బట్టి చాలా పెద్దవారనుకున్నాను" అంటూ మా 'అర్జునుడూ - అనసూయమ్మా' సాంఘిక కథని ప్రస్తావించి కాస్త ఎక్కువగానే పొగిడారు. అప్పుడు నా వయసు ముప్పై ఆరేళ్ళు. అప్పుడు కలిగిన ఆనందాశ్చర్యపరవశాల్ని తట్టుకునేందుకు నా కథల స్థాయి, పరిణితి ఉపయోగిస్తే, 'సామాన్యులు తమ గొప్పతనాన్ని పొగుడుకునేంత సులభంగా మాన్యులు ఇతరుల్ని ప్రశంసిస్తారు' అని స్ఫురించింది. నేనాయనకి ధన్యవాదాలు చెప్పి, "బాల సాహిత్యంలో 'తోకచుక్క'వంటి వజ్రతుల్యమైన రచనని అందించిన చందమామలో ఓ గులకరాయిని కావడం నా అదృష్టం" అన్నాను. అప్పుడు పేలింది బాంబు. "మిమ్మల్నిక్కడికి తీసుకొచ్చిన వారెవరో తెలుసా? తోకచుక్క సీరియల్ వ్రాసిన దాసరి సుబ్రహ్మణ్యంగారు" అన్నారు కుటుంబరావుగారు.

దిమ్మెరపోయాను. మాట వరసకైనా దారిలో తన గురించి చెప్పుకోని ఆ గుణాఢ్యుణ్ణి అబ్బురంగా చూస్తుండిపోయాను. మార్చి 23 (1979) నా జీవితంలో మరుపురాని రోజై నిలిచింది.

చందమామ ఒక విచిత్ర సంస్థ. అక్కడ వ్యక్తిత్వాలకున్న ప్రాధాన్యం వ్యక్తులకి లేదు. ప్రతిభకున్న ప్రాధాన్యం పేరుకి లేదు. చందమామలో అలరించే భాష 'చక్రపాణి'దని కుటుంబరావు అంటారు. చందమామ కథల సొగసు కుటుంబరావుదని సుబ్రహ్మణ్యం

అంటారు. చందమామ సీరియల్స్ 'సుబ్రహ్మణ్య సృష్టి' అని కుటుంబరావంటావు. వీరి సమన్వయం ఎంత గొప్పదంటే - 1980 (ఆగస్ట్ 17) లో కుటుంబరావు కన్ను మూసేక - సుబ్రహ్మణ్యం ఆయన భారాన్ని పూర్తిగా తన మీద వేసుకున్నా - చందమామ భాషలో మార్పు కనపడలేదు. చిత్రకారులకీ, ప్రధాన సంపాదకులకీ, సంపాదవర్గానికీ, రచయితలకీ ఉన్న అపూర్వ సమన్వయమే చందమామ గొప్పతనానికి ముఖ్యకారణమనవచ్చు.

శ్రీ దాసరి సుబ్రమణ్యంతో 1979 లో ప్రారంభమయిన మా పరిచయం, స్నేహంగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. మేము తరచుగా మద్రాసు వెళ్ళకపోయినా వెళ్ళినప్పుడల్లా ఆయన్ను కలవడం రివాజయింది. మిగతా సమయాల్లో దేశ కాల పరిస్థితులని సమీక్షిస్తూ, విమర్శిస్తూ ఉత్తరాలు వ్రాసేవారాయన. ప్రపంచ రీతుల పట్ల ఆయనకున్న అవగాహన ఎంత గొప్పదో ఆ ఉత్తరాలు తెలియజేసేవి. రెండవ ప్రపంచ యుద్ధంతో ప్రారంభించి నేటిదాకా వ్యవస్థలోని పరిణామాలు తెలుసుకోవడంలో మాకాయన ఉత్తరాలెంతో సహకరించేవి.

శ్రీ దాసరి క్రమశిక్షణ ఆదర్శప్రాయం. కథ అందిన వెంటనే రచయితలకి కార్డు వ్రాసి అందినట్లు తెలియబర్చడం, అలాగే రచనని తిరుగు స్టాంపులు జతపర్చనివారికి కూడా తిప్పి పంపడం, కాంప్లిమెంటరీ కాపీ, పారితోషికం వగైరాల విషయంలో తనవి కాని బాధ్యతలు కూడా స్వీకరించడం ఆయన ప్రవృత్తి. ఈ కారణం వల్ల ఎందరో రచయితలు తమ కథల్ని ముందుగా చందమామకే పంపేవారు. తనకి నచ్చిన రచన ప్రచురణకై యాజమాన్యంతో తీవ్రంగా తలపడ్డానికి వెనుకాడని ఆయన - యాజమాన్యం తగిన సాహిత్యేతర కారణాలు చెప్పినప్పుడు - అవగాహనతోనూ వర్తించేవారు. రచన బాగుందనీ, ఇతర కారణాలవల్ల ప్రచురణార్హం కాలేదనీ - ప్రత్యేకంగా ఉత్తరం వ్రాసి రచయితలు నిరుత్సాహానికి గురి కాకుండా చూసేవారు.

తానెక్కువ చదువుకోలేదనే శ్రీ దాసరి ఆంగ్ల సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసారు. 1950లలో దాసు పేరిట ఆయన వ్రాసిన క్రైం నవలలు బహుళ ప్రజాదరాణ పొందాయి. 1967 లో ప్రచురితమైన ఆయన కథల సంపుటి 'ఇంద్రాణి' మా వద్ద ఉంది. అందులో ఓ కథని మేము 'రచన' లో - సాహితీ పథ్యంగా పరిచయం చేసి ఉన్నాం.

మానవత్వానికి ప్రాధాన్యమిచ్చే శ్రీ దాసరి మార్క్సిజాన్నీ, నాస్తికవాదాన్నీ బలపర్చడం విశేషం. తన అన్న శ్రీ వేంకటేశ్వర్లు 'ఈశ్వర ప్రభు' పేరిట వెలువర్చిన 'మత గ్రంథాల మాయాబజార్', 'బుద్ధుడు చారిత్రక వ్యక్తి కాదు' అన్న పుస్తకాలనాయన మాకు కానుకగా ఇచ్చారు. నాస్తికతలో తీవ్రవాదమనిపింప జేసే ఆసక్తికరమైన ఈ పుస్తకాలని నార్ల వెంకటేశ్వరరావు, ఆవుల సాంబశివరావు వంటి ప్రముఖులు ప్రశంసించడం గమనార్హం.

అన్నగారి ప్రభావం, కుటుంబరావు సాహచర్యం - శ్రీ దాసరి వ్యక్తిత్వంపై కొంత ప్రభావం చూపినట్లే తోస్తుంది. 'చందమామ' మతాల్ని నిరసించకపోయినా, ఇజాలకి తావివ్వకపోయినా - బాల సాహిత్యానికి అత్యవసరమైన హేతువాదానికి ప్రాధాన్యమివ్వడంలో - కుటుంబరావు - సుబ్రహ్మణ్యంల జంట పాత్ర చెప్పుకోతగ్గది. అమెరికానీ, ఆస్తికతనీ గర్హించడమే హేతువాదమనే తత్వాన్ని నిరసించే మాకూ, ఆయనకీ మధ్య కొంత కాలం ఉత్తరాల చర్చ జరిగినప్పుడు - ఆయన నమ్మకం కంటే తర్కానికే ప్రాధాన్యమివ్వడం మరచిపోలేం.

శ్రీ దాసరి ఇరవై తొమ్మిదవ యేట చందమామలో ప్రవేశించారు. శుక్లపక్ష చంద్రునిలా వర్ధిల్లే ఆయన ప్రతిభని స్వంతం చేసుకోవాలని ఇతర పత్రికలు ప్రయత్నించినా - అంకిత భావంతో చందమామకే కట్టుబడిపోయారు, మధ్యలో బొమ్మరిల్లు, ప్రమోదవంటి పిల్లల పత్రికలకి కొన్ని శీర్షికలు నిర్వహించినా - ఆ పత్రికలకి తాత్కాలికంగా మార్గదర్శకం కావాలన్నదే ఆయన ఉద్దేశ్యం. అంకిత భావం విషయంలో ఆయన చందమామ సంస్థాపకుల్ని కూడా మించిపోయారని కొందరు చెప్పుకుంటారు. ఆయనలో చందమామకి సర్క్యులేషన్ తగ్గితే కలవరం. ఆర్థిక ఇబ్బందులొస్తే కలవరం. తాత్కాలికంగా పత్రిక ఆగిపోతే కలవరం. చందమామ విజయాలని తన విజయాలుగా

భావించి గర్వపడే ఆయన ఆర్థిక ప్రతిఫలం విషయంలో అల్పసంతోషి. ఎక్కువ సంవత్సరాలు చందమామకి సంపాదకుడిగా వ్యవహరించిన శ్రీవిశ్వం - ఆయన్ని గురువులా గౌరవించి, స్నేహితుడిలా ఆదరించేవారు. ఆయన ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తే కన్నబిడ్డలా మందలించడమూ కద్దు.

శ్రీ దాసరి కుటుంబ జీవితంలో ఒడిదుడుకులు చెప్పుకోతగ్గవే అనిపిస్తుంది. ఆయన పుట్టిన ఊరు పెద గాజులూరు (తెనాలి దగ్గర - చుండూరు రైల్వేస్టేషన్). ఆయనకి తన వయసు సరిగ్గా తెలియదు. తన అక్కగారి వయసుననుసరించి లెక్క కట్టి తను పుట్టింది 1922లో అని ఆయన అంచనా. 1929లో పెద్దలు అక్కడున్న కొద్ది పొలాన్నీ అమ్మి రేపల్లె సమీపంలోని కైతేపల్లి గ్రామానికి వెళ్ళారు. అక్కడా పొలాలు పండక 1932 ప్రాంతాల్లో రేపల్లె చేరారు. ఆయనకు వివాహమై ఓ కూతురు పుట్టాక - ఏకారణం వల్లనో మద్రాసులో ఒంటరి జీవితాన్నే గడిపారు. ఐతే అవసరపడినప్పుడల్లా తన ఒక్కగానొక్క కూతురుకి ఆర్థిక నైతిక సాయమందించడం ఆయన ప్రేమానురాగాలకి నిదర్శనం. ఇప్పుడు తన రెండేళ్ళ మునిమనుమరాల్ని తల్చుకుని ముత్తాత నయ్యానని మురిసిపోయే ఆయనకి చందమామ కి దూరమౌతాననే తప్ప వయసు మీదపడుతున్నందుకెప్పుడూ ఆయన భయపడలేదు.

కాశీమజిలీ కథల్లోని అద్భుత మంత్రతంత్రాలకి - హేతువాదన్ని జతపర్చడంలో శిక్షణనిచ్చే - శ్రీ దాసరి చందమామ సీరియల్స్: తోకచుక్క(1954); మకరదేవత; ముగ్గురు మాంత్రికులు; కంచుకోట; జ్వాలాద్వీపం; రాకాసిలోయ; పాతాళదుర్గం; శిధిలాలయం; రాతిరథం; యక్షపర్వతం; మాయా సరోవరం; భల్లూక మాంత్రికుడు(1978). వీటిని మేమే కాదు - అప్పటి, ఇప్పటి చందమామ పాఠకులెవ్వరూ మరువలేరు.కథల పట్ల ఆయన అంకిత భావం, సంపాదకవర్గంలో సభ్యుడిగా ఆయన పాటించే క్రమశిక్షణ అందరికీ ఆదర్శం. ఆయన స్నేహం అనుభవైకవేద్యం. ఆయన అభిమానం నిష్కల్మషం. ఆయన పరిచయం మా అదృష్టం. ప్రస్తుతం ఆయన స్థానంలో ఉన్న వారి పేరు 'బాల సుబ్రహ్మణ్యం' కావడం కాకతాళీయమనిపించదు. ఇక చందమామలో ఆయన పాత్ర ఎప్పటికీ కొనసాగుతుందనడానికి నిదర్శనమనిపిస్తుంది.

### *ఆచార్య రామవరపు గణేశ్వరరావు మాటల్లో:*

### కథల మాంత్రికుడు 'దాసరి సుబ్రహ్మణ్యం'

### (సాహిత్య ప్రస్థానం, సెప్టెంబరు 2008 నుంచి పునర్ముద్రితం)

"వ్యాఘ్రదత్తుడు మృతవీరుల సమాధిని తవ్వసాగాడు. విష వృక్షం నుంచి మూలుగులు వినిపించసాగాయి. పడగ విప్పిన పాములవలె ఉన్న ఆ చెట్టు ఆకులు బుసలు కొట్టడం ప్రారంభించాయి. ఏకాక్షి మాంత్రికుడు, తన చేతనున్న కత్తిని పైకెత్తి ఏదో మంత్రం పఠించనున్నంతలో, వ్యాఘ్రదత్తుడి నుంచి జాలిగొలిపే ఆర్తనాదం వినిపించింది. ఏకాక్షి వెనక్కు తిరిగిచూసాడు. చతుర్నేత్రుడి వేగు నరవానరం వ్యాఘ్రదత్తుణ్ణి బంధించి గిరగిర తిప్పుతున్నది. నల్లగూబ "ఏకాక్షి...ఏకాక్షి' అని అరుస్తూంది. తను శాక్తికేయుడి త్రిశూలాన్ని వెతికి పట్టుకోకముందే తన శత్రువులు అక్కడికి రావచ్చని భయం కలిగింది. ఏకాక్షి కాల భుజంగాన్ని పిలిచి నరవానరం మీదికి ఉసిగొల్పాడు. పైన కపాలం, నల్లగూబ భయంకరంగా పోరాడసాగినై"- కుతూహలం రేకెత్తిస్తోంది కదూ! ఇది చదవటానికి మొదలుపెట్టిన పాఠకుడు చివరి పేజీ అయిపోయేవరకూ వదలడు. ఒళ్ళు జలదరింపజేసే ఈ సన్నివేశం 'తోకచుక్క' అనే సీరియల్ లోనిది.

'చందమామ' తెలియనివారు, అందులో రంగుల బొమ్మల సీరియల్ చదవనివారు ఉండరు. అయితే వాటిని రాసింది దాసరి సుబ్రహ్మణ్యం అన్న విషయం అందరికీ తెలియకపోవచ్చు. నిండు 54 సంవత్సరాలు (1952 - 2006) 'చందమామ' సంపాదకవర్గ సభ్యుడిగా ఉండి, తర్వాత అనారోగ్య కారణంగా పదవీ విరమణ చేసి, ప్రస్తుతం విజయవాడలో స్థిరపడ్డారాయన.

దాసరి సుబ్రహ్మణ్యం తెనాలి సమీపంలోని పెదగాజులూరులో జన్మించారు. స్వయంకృషితో మంచి రచయిత అయ్యారు. ఆణిముత్యాలలాంటి కథలు రాశారు. 'ఇంద్రాణి','పగటి కలలు' అనే పేర్లతో వీరి కథాసంకలనాలు వచ్చాయి. వీరి ఇంకొన్ని రచనలు ఇతర కథాసంకలనాలలో చోటు చేసుకున్నాయి. మారు పేర్లతో ఎన్నో డిటెక్టివ్, మిస్టరీ కథలు, నవలలు రాశారు.

బాలల భావనాశక్తిని పెంచటంకోసం, వారికి ఉల్లాసాన్ని కలిగించటంకోసం రాశారు. అందులో కొన్ని, 'తోకచుక్క', 'మకరదేవత', 'ముగ్గురు మాంత్రికులు', 'కంచుకోట', 'జ్వాలాద్వీపం', 'రాకాసిలోయ', 'పాతాళదుర్గం', 'శిధిలాలయం', 'యక్షపర్వతం, 'రాతిరథం', 'భల్లూక మాంత్రికుడు', 'మాయా సరోవరం', వీటిలో రాక్షసులూ, భూతాలూ, యక్షులూ, నాగకన్యలూ, రెక్కల మనుషులూ, మొసలి మనుషులూ, మరుగుజ్జు దేశస్థులూ, వృశ్చిక జాతివాళ్ళూ, ఉష్ట్రయోధులూ, నరభక్షకులూ, మాంత్రికులూ, తాంత్రికులూ, ఆటవికులూ, అఘోరీలూ కాక గండభేరుండాలూ, పాలాలు దున్నే సింహాలూ, రథం నడిపే ఏనుగులూ మనకి కనిపిస్తాయి. వైవిధ్యభరితమైన పాత్రలతో పాటు, అడుగడుగునా ఉత్కంఠ కలిగించే సన్నివేశాలు, అనూహ్యమైన మలుపులూ ఉంటాయి.

చిన్నపిల్లలకోసం సాహసం, మంత్రతంత్రాలు, అద్భుతమైన సంఘటనలతో కథలు రాయాలనే ఆలోచన ఆయనలో కలిగించినవి: కథా సరిత్సాగరం, పంచతంత్రం, దశకుమార చరిత్ర, పాండురంగమహత్యం కావ్యంలోని నిగమశర్మ కథలాంటివి కొన్ని.

'పాతాళ దుర్గం'లో ఒక రాక్షసుడు రాకుమార్తెను అపహరిస్తే, ఆమెను రక్షించడానికి ఒక మాంత్రికుడు మరో రాక్షసుని సహాయం తీసుకుంటూ, "వీడి రావణుడి పాలిటి విభీషణుడివంటివాడు. వంశ ద్రోహులేకాలంలోనూ ఉంటుంటారు" అంటాడు. ఏ కథనైనా మన పురాణ గాధలు, ఇతిహాసాలలోని విషయాలతో కలిపి, అన్నీ మన భారతీయ సంస్కృతికి చెందినవనిపించేలా చేస్తారు. రాక్షసులని మనుషులు జయించడమూ, సామాన్యులలో అసాధారణ శక్తులుండడమూ - వగైరాలన్నీ అభూత కల్పనలే అయినా - అవి పిల్లలని ఉత్తేజపరుస్తాయి. లోభం, దురాశ, అసూయ, అధికార అహం, అధర్మం, ద్రోహం, కుట్ర, కృతఘ్నత శిక్షించబడటం, పిల్లలకి తృప్తినిస్తుంది.

ధైర్యసాహసాలు, సద్బుద్ధి, స్నేహపాత్రత, త్యాగం, ఔదార్యం, కార్యదీక్ష - లాంటి మేలిక భావాలు బాలలో నాటి వారికి నైతిక బలాన్ని కలిగిస్తాయి. అనూహ్యమైన మానవాతీత సంఘటనలు, మంత్రతంత్రాలు - పిల్లల కల్పనా శక్తికి పదును పెడతాయి.

ఈ కథలలో మానవాతీతమైన సంఘటనలున్నా వాటిలో అసహజ మనస్తత్వం మనకు ఎక్కడా కనిపించదు. నిజానికి దాసరి సుబ్రహ్మణ్యం రసపోషణకోసమే ఈ అసంభవాలను వాడతారు. ఎందుకంటే రసోవృత్తి సహజమనస్తత్వాన్ని పురస్కరించుకునే సాధ్యమౌతుంది కనుక. 'భల్లూక మాంత్రికుడు' కథలో - మాంత్రికుడు తలారిని భల్లూకంగా మార్చినా, వాడి ఆలోచనలు సహజంగానే ఉంటాయి. మనిషిగా పుట్టి, మనిషిగా జీవించిన తను అరణ్యాలు పట్టి ఏ తేనె పట్టో తింటూ జీవించటం కన్నా నీచం మరొకటున్నదా అని అనుకుంటాడు. "మరి నా దినభత్యం? దారులు కొట్టుతూ బతికేంత నీచుణ్ణి కాదుకదా!" అంటాడు తలారి. స్వతహాగా హాస్యప్రియులైన దాసరి ఇలాంటి పాత్రలని ప్రవేశపెడుతుంటారు.

జీవన్మరణ సమస్యతో ఒక ప్రక్క అందరూ సతమతమౌతుంటే, "మరి నా పదో పెళ్ళాం సంగతి ఏం చేస్తారు?" అని గడియ గడియకూ వారికి గుర్తు చేస్తూ తన మౌఢ్యం చూపించే పులిందుడనే ఆటవికుడిలాంటి పాత్రలను సృష్టిస్తుంటారు.

ప్రకృతి వర్ణనలూ, సౌందర్య వర్ణనలూ లేకుండా వర్ణనలో వ్యర్థపదార్థలు లేకుండా 'కీకారణ్యం', 'చిమ్మచీకటి', 'మహాకాయుడు' లాంటి మాటల్తో ఊహకు తావిచ్చేటట్లు రాయడంలో వీరికి వీరే సాటి. చిన్న పిల్లలకు అర్థమయ్యేలా తేలిగ్గా ఉంటుంది. ఒక చిన్న పేరాలో విస్తృతమైన దృశ్యాన్ని కళ్ళముందుంచగలరు దాసరి. 'ఆ కొండ మీద పెద్ద వృక్షాలు, పొదలు కిక్కిరిసి

ఉన్నవి. ఎదురుగా ఒక చిన్న జలపాతం ఉంది. అతడు  దాహం తీర్చుకునేందుకు పోగానే నీటి ధార కట్టుబడిపోయింది. నిలువెత్తు ద్వారం కనిపించింది. అదొక గుహ. లోపల అగ్నిజ్వాలలు లేస్తున్నవి'.

దాసరి వర్ణనలకు దీటుగా, ఆయన పద చిత్రాల శిల్పాన్ని స్వర్గీయ 'చిత్రా' సృష్టించేవారు. ఈ రంగుల బొమ్మల సీరియల్సు కేవలం తెలుగువారికే పరిమితమైనవి కావు. అవి భారతీయ భాషలలోకి అనువదింపబడేవి. మనదేశంలోని అన్ని ప్రాంతాల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేవి. అన్ని వయసులవాళ్ళూ చదివి ఆనందించేలా రూపొందించబడేవి.

దాసరి సుబ్రహ్మణ్యంగారి రంగుల బొమ్మల సీరియల్సుని చిన్నతనం నుంచీ చదువుతూ ఎన్నో తరాల వాళ్ళు పెద్దవాళ్ళయ్యారు. వాటి ప్రభావం వాళ్ళ మనసుల మీద ఈనాటికీ ఉంది. వీరి రచనలని 'చందమామ'లో పునర్ముద్రిస్తూ, నేటి తరం పాఠకులకి అవి తిరిగి చదివే అవకాశాన్ని కల్పిస్తున్న 'చందమామ' యాజమాన్యం వారికి కూడా మనం కృతజ్ఞులుగా ఉండాలి. ఒంటరిగా ఉండడానికిష్టపడే మనస్తత్వం ఉండడం వలన తన రచనలద్వారా బాలలకి ఎంతో అభిమానపాత్రుడైన దాసరి సుబ్రహ్మణ్యంగారికి బాల సాహిత్యరంగంలో రావలిసినంత గుర్తింపు రాలేదు.



# వేమూరి సత్యనారాయణ

– వసుంధర



ఆంధ్రప్రభ వారపత్రికలో శ్రీ శ్రీరమణ నిర్వహించిన అద్భుతమైన శీర్షిక శ్రీ ఛానెల్. ఇతరులని ప్రశంసించడమనే ముసుగులో తెలివిగా స్వోత్కర్షని ఇరికించే ప్రక్రియని ఆయన గొప్పగా విశ్లేషించారు. శ్రీ వేమూరి సత్యనారాయణ గురించి మేము చెప్పే నాలుగు మాటలూ అందుకు ఉదాహరణగా నిలిచే అవకాశముంది. కానీ తప్పదు. ఆరంభంలో మా ఎదుగుదల ఆయనతో ముడిపడి ఉంది మరి. శ్రీ రమణ దీన్ని ముందరి కాళ్ళకి బంధమంటే కూడా కాదనలేం. ఇక విషయంలోకి వస్తే –

'మృత్యుదేవత' అనే చిన్న క్రైమ్ తరహా నవల వ్రాసి 1975 లో జ్యోతి మాస పత్రికకి పంపితే – అది వేసుకుంటున్నట్లు శ్రీ వేమూరి సత్యనారాయణ నుంచి ఉత్తరం వచ్చింది. అదే మాకు తొలిసారిగా ఆయన పేరుతో పరిచయం. ఆ తరహా రచనల్ని సాంఘిక పత్రికల్లో వేసే సంప్రదాయం అప్పట్లో లేకపోవడం వల్ల మా కప్పుడు ఆశ్చర్యానందాలు కలిగిన మాట వాస్తవం. ప్రచురణ సమయానికి మేము జర్మనీలో ఉంటే ఆ చిరునామాకి ఓ కాపీ పంపడం వారి సహృదయతకి నిదర్శనం. తర్వాత ముళ్ళపూడి – మునిమాణిక్యంల మిశ్రమ ప్రభావముండి – మాదంటూ ఓ ముద్ర కూడా వేయగల 'పెళ్ళయ్యాక చూడు' అనే నవల 1976లో వ్రాసాం. అది మాకెంతో నచ్చినా అలాంటి నవలకి సంపాదకులతో పరిచయాలవసరమని మా నమ్మకం. విలక్షణమైన రచనల్ని ఆదరిస్తుందని జ్యోతికి పంపితే – వేమూరి సత్యనారాయణ ఆ రచనని ప్రచురణకి స్వీకరించడమే కాక – ఎంతగానో ప్రశంసిస్తూ ఉత్తరం వ్రాసారు. మాసపత్రిక నవలానుబంధం సైజుకి కుదించాల్సి వస్తే – పాఠకుల్ని మరిన్ని నవ్వుల జల్లులకి దూరం చేస్తున్నందుకు బాధగా ఉందన్న వారి వినయం కొత్తగా నవలా రచన ప్రారంభించిన మాకు ఆశ్చర్యమే కదా! అది మాకు వారి మలి పరిచయం. ఆ తర్వాత మేము 'పెళ్ళి చేసి చూడు' అనే కుటుంబ నవల ఒక వినూత్న ప్రయోగంగా వ్రాసి పంపామంటే అప్పటికి వేమూరి సత్యనారాయణ అభిరుచిపై కలిగిన నమ్మకమే కారణం. ఒక మధ్య తరగతి కుటుంబంలో జరిగిన పెళ్ళి వివరాలనిచ్చే ఆ కథ ఎందరో అపరిచితుల ప్రశంసలనందుకుంది. 2007 లో మా అభిమాన ఆరాధ్య రచయిత ముళ్ళమూడి వెంకటరమణ (అంతవరకూ మాతో ఎటువంటి పరిచయం లేకపోయినా) ఆ నవల చదివి చెన్నై నుంచి ఫోన్ చేసి చాలాసేపు అభినందించినప్పుడు – ప్రచురించిన సంపాదకుణ్ణే గుర్తుచేసుకున్నాం. సత్యనారాయణకా విషయం తెలిసేసరికి మేము అమెరికాలో ఉన్నాం. అప్పుడాయన తానెన్నిక చేసిన నవలకి లభించిన ప్రశంసలకి గర్వపడుతూ అమెరికాకి ఫోన్ చేసి అభినందించారు. సంపాదకుడిగా ఆయనకున్న అంకితభావానికి అంతకంటే ఉదాహరణ ఏం చెప్పగలం? జ్యోతి నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన మా 'వరాలిచ్చే దేవుళ్ళు' నవలకి సినిమా అవకాశంవస్తే తనే చొరవ తీసుకుని మాకా విషయం తెలిపి 1980లో కాబోలు మమ్మల్ని చెన్నై రప్పించారు. అదే మాకు ఆయనతో తొలి ముఖపరిచయం. ధనికొండ హనుమంతరావు తనయుడు శ్రీధర్ ప్రారంభించిన ప్రమోద అనే పిల్లల పత్రికకి సలహాదారుగా ఉంటూ – తర్వాత కొంతకాలానికి ఆ పత్రికని ఆయన తనే నిర్వహించడమూ మాకు తెలుసు. మరోసారి వేరే సినిమా పనిమీద మద్రాసు వెళ్ళినప్పుడు – ఆయన ఇంట్లో 'మంచు పల్లకి' సన్నాహాలు కుటుంబ వ్యవహారంలా నడవడం కళ్ళారా చూడ్డం మరుపురాని అనుభవం.

అప్పట్నుంచీ మేము పరస్పరం హితులం, సన్నిహితులం. ఆయన తత్వం ఎటువంటిదంటే - సినీలోకంలో ఆయన ఎన్నో విజయాలు సాధించినా ఆర్థికంగా బావుకున్నది లేదు. ఇప్పటికీ ఆయన ఆసక్తి సాహిత్యమే ఐనా - పత్రికాలోకంలో అనుకూల వాతావరణమూ లేదు. తెలుగునాట చెప్పుకోతగ్గ మంచి పత్రికలున్నప్పటికీ - ఆయన సంపాదకత్వంలో ఓ పత్రిక లేకపోవడం ఆ మేరకి మన పత్రికా రంగానికి లోటు. ఎందుకంటే ప్రాచుర్యం పొందిన జ్యోతి వంటి మాసపత్రికని ఎనిమిది సంవత్సరాల పాటు ఆ స్థాయిలో నిర్వహించడం సామాన్య విశేషం కాదు. మాకున్న పరిమిత జ్ఞానం ప్రకారం - ఆయన హయాంలో ఊపిరి పోసుకున్న వారిలో మాకు తెలిసి మేము కాక యండమూరి, మల్లాది, (మీరా) లక్ష్మి ఉన్నారు. ఒకొక్కరే నోరు విప్పితే - ఆయన గురించి మరిన్ని కుతూహల విశేషాలు తెలియగలవని నమ్మకం. ఈ అక్షర జాలం అందుకు సహకరిస్తుందని ఆశ. ఇంతకుమించి ఆయన చెప్పరని కూడా - ఆయనచేత కొంత చెప్పించే ప్రయత్నం చేసి అదాయన మాటల్లోనే ఇక్కడ అందజేస్తున్నాం.

***తన గురించి శ్రీ వేమూరి సత్యనారాయణ మాటల్లో***

బీయస్సీ చదివే (1962 -65) రోజుల్లో - నేనూ పత్రిక నడపాలన్న ఆసక్తి పుట్టింది. నేను, కంకిపాటి గంగరాజు (కవి), మండవ గోపాలకృష్ణ (సినీ నిర్మాత), వేమూరి బలరాం (స్వాతి) ఒకే ఊరికి (ఘంటసాలపాలెం) చెందిన సమకాలికులం. నేను, బలరాం, నాగేశ్వరరావు, తుమ్మల గోపాలరావు (తర్వాత కొన్నాళ్ళు ప్రభవ మాసపత్రిక నడిపారు) సమాన వాటాదారులుగా స్వాతి మాసపత్రికని 1970లో ప్రారంభించాం. మేమందరం ప్రభుత్వోద్యోగాల్లో ఉండడంవల్ల సంపాదకుడిగా మండవ గోపాలకృష్ణ పేరు వేసి, శీలా వీర్రాజుని గౌరవ సంపాదకులుగా అభ్యర్థించాం. తొలి సంచిక ముఖ చిత్రం బాపు (అదే తర్వాతనుంచి స్వాతి చిహ్నమైంది), స్వాతి మకుటాక్షరాలు చంద్ర (ఇప్పటికీ కొనసాగుతున్నాయి) సమకూర్చారు. సంపాదకవర్గంలో నాది ప్రముఖపాత్ర. పత్రికకి పేరొచ్చినా నడపడం కష్టంగా ఉండేది. ఆకారణంగా మధ్య మధ్య చిన్న చిన్న మనస్పర్థలు వచ్చి నిర్వహణలో కొంత స్థబ్ధతకి దారి తీసింది. అలా నాలుగేళ్ళు గడిచాయి. అప్పటికి బలరాంకి కొంత అనుభవమూ, నమ్మకమూ కలగలిసి, ధైర్యం చేసి మొత్తం పత్రికని తనే నడుపుతాననడమే కాక - కొంత గడువిస్తే మిగతా పెట్టుబడులు తిరిగొచ్చేస్తానన్నాడు. అలా మేము 1973లో పెద్ద మనుషుల ఒప్పందంతో ధర్మబద్ధంగా విడిపోయాం. ఇప్పుడు స్వాతి ఎదుగుదల చూస్తే - బలరాం పట్ల స్నేహభావాన్ని మించిన గౌరవభావం కలుగుతుంది.

రీడర్స్ డైజెస్ట్ పత్రికలోని 'జీవితం నుంచి నేనేం నేర్చుకున్నాను?' అన్న శీర్షిక నాకు నచ్చింది. ఆ ప్రేరణతో అదే తరహా శీర్షిక స్వాతిలో నిర్వహించాలని తెన్నేటి విశ్వనాథం, భానుమతి, ఎన్టీరామారావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులకి ఉత్తరాలు వ్రాసాను. ఒక్క నార్లనుంచి మాత్రమే ప్రతిస్పందన వచ్చింది.

నా ఆలోచనలు మేధావి వర్గం దిశలో ఎక్కువగా నడుస్తున్నాయని స్వాతి నడిపే రోజుల్లో బలరాం నన్ను హెచ్చరించాడు. సంపాదకుల్లో మూడింట రెండు ఓట్లు పడినప్పుడే కథని ఎన్నిక చేయాలని మేము నిర్ణయించాం. అలా ఒకసారి 'థాంక్యూ వెరీ మచ్' అనే కథకి నా ఒక్కడి ఓటు మాత్రమే పడడం వల్ల తిప్పి పంపాల్సివచ్చింది. ఆ కథ నాకెంతగా నచ్చిందంటే - 1973లో జ్యోతి మాసపత్రికకి సంపాదక బాధ్యతలు స్వీకరించాక - ఆ కథ కోసం అన్వేషణ ప్రారంభించాను. రచయిత్రి పేరు అపర్ణ అనీ, ఊరు గుంటూరు అనీ గుర్తు. అదే ఊరికి చెందిన ప్రతాప రవిశంకర్ అనే మరో రచయితని - ఆరా తీయమని కోరాను. ఆయన శ్రమ ఫలితంగా అపర్ణ అన్నది కలం పేరనీ, రచయిత అసలు పేరు చలపతి అని తెలిసింది. తిరిగొచ్చిన కథలు లోపభూయిష్టమని భావించే ఆ రచయిత ఆ కథ నెప్పుడో చించిపారేసాడట. నేను అడిగానని మళ్ళీ వ్రాసి పంపిన ఆ కథ - అప్పటికి బాగున్నా - పూర్వపు పస కోల్పోయిందనిపించింది. ఆ కథలో నాకు గుర్తున్న కొన్ని మంచి అంశాలని ఆయనకి గుర్తుచేసి మళ్ళీ తిరగవ్రాయించి ప్రచురించాను. పూర్వమంత కాకపోయినా ఆ కథకి ఎనభై శాతమైనా పూర్వవైభవం కలిగిందనిపించింది.

నేను జ్యోతి నిర్వహిస్తున్నప్పుడు లక్ష్మి అనే రచయిత్రి 'మీరా' అనే చాలా పెద్ద నవల పంపారు. నాకు నమ్మకమున్న వారు చదివి బాగుందంటే నేను కేవలం పదిహేను పేజీలు మాత్రం చదివి - ఈ రచయిత్రి 'మరో యద్దనపూడి' అన్న నిర్ణయానికి వచ్చాను. ప్రచురితమయ్యాక ఆ నవల ఆమెని 'మీరా లక్ష్మి'ని చేసింది. 1981 లో నేను జ్యోతిని విడిచి వచ్చినా ఆ నవల ప్రచురణ సీరియల్‌గా కొనసాగింది.

యండమూరి తొలి నవల్లో ఒకటైన 'యుగాంతం' ముందు నాకు సినాప్సిస్ గా వచ్చింది. అది బాగున్నప్పటికి మొత్తం నవల చదివాకనే ప్రచురణపై నిర్ణయం తీసుకున్నాను. మల్లాది వెంకట కృష్ణమూర్తి 'మేఘమాల' నవల చదివి ముగింపులో హీరోని చంపడం నచ్చక ఆ విషయం ఆయనకి చెప్పాను. మేమిద్దరం కలిసి మాట్లాడుకున్నాక మల్లాది నాతో ఏకీభవించి ముగింపు మార్చారు. ప్రముఖ చలనచిత్ర దర్శకుడు వంశీ కూడా జ్యోతి పత్రిక ద్వారానే నాకు పరిచయం. అతడి రచనలు చదివినప్పుడు 'మరో చలం' అనుకున్నాను.

నేను జ్యోతి పత్రికకి సినిమా కబుర్లు కూడా సేకరించేవాణ్ణి. అలా సినీ జర్నలిస్టుగా వ్యవహరిస్తుండగా - ఒక తెలుపు - నలుపు చిత్రాన్ని పొరపాటున రంగుల చిత్రంగా అభివర్ణించినందుకు సినీప్రముఖుడు విజయ బాపినీడుతో వివాదం అనతగ్గ సంవాదం ఏర్పడింది. పొరపాటునే తప్పు అభియోగాన్ని ఆమోదించని నా తత్వంతో అది చాలా దూరమే వెళ్ళినా - చివరికి మళ్ళీ మేమిద్దరం స్నేహంలో యధాస్థితికి రాగలిగాం. జ్యోతి పత్రికకి సినీ జర్నలిస్టుగా ఉండగానే - నటుడు విజయచందర్‌తో పరిచయమైంది. ఆయన తన 'కరుణామయుడు' చిత్రానికి స్పెషల్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కావాలంటే మిక్కిలినేని జగదీష్ బాబు పేరు సూచించాను. నెల గడిచినా ఆయన పత్తాలేడని నామీద నిందపడితే నేనే ఆ బాధ్యత స్వీకరించాల్సొచ్చింది. ఆ చిత్రం సాధించిన ఘనవిజయం నన్ను సినీ వ్యాసంగానికి మరింత దగ్గర చేసింది. అంతకాలం దగ్గర స్నేహితుడిగా మాత్రమే కొనసాగుతున్న తమ్మారెడ్డి భరద్వాజ కూడా అప్పుడు నాకు తన రెండు చిత్రాల పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ బాధ్యత అప్పగించాడు. తర్వాత బాపు దర్శకత్వంలో 'రాజాధిరాజు' చిత్రానికి పనిచేస్తూ రాజమండ్రిలో ఉండగా గోదావరి ఫైనాన్స్ కంపెనీ అధినేత ఎమ్మార్ ప్రసాదరావు కలిసారు.

సినీ నిర్మాత కావాలన్న ఆయన ఉత్సాహం, పెట్టుబడి - నన్ను 'గోదావరి చిత్ర' బానర్ మీద 'మంచు పల్లకి' (1982) చిత్ర నిర్మాణానికి పురికొల్పాయి. ఆరంభంలో సంప్రదించిన కొందరు ప్రముఖ దర్శకులు బిజీగా ఉండడంతో - తానింకా దర్శకత్వపు బాధ్యతలు చేపట్టడానికి మానసికంగా సిద్ధపడలేనన్న వంశీని దర్శకత్వానికి ఒప్పించాను. సినిమాటోగ్రాఫర్‌గా హరి అనుమోలుకి, నటుడిగా మల్లికార్జున రావుకీ కూడా ఇది తొలి చిత్రం. స్వాతి (క్రాంతికుమార్), లేడీస్ టైలర్ (స్రవంతి మూవీస్) చిత్రాలకి ప్రొడక్షన్ డిజైనర్‌గా చేసాక - నేను సినీరంగంలో పూర్తిగా స్థిరపడిపోయానని చెప్పాలి. ప్రస్తుతం ఆ రంగంలోనే బిజీగా ఉన్నాను.

సినీ రంగంలో రచయితలకీ దర్శకులకులాగే - పత్రికారంగంలోనూ - సంపాదకులకీ రచయితలకీ అవినాభావ సంబంధముంది. రచయితగా నేను చేసిన ప్రయత్నాల్లో ముఖ్యమైనది 1973లో 'మై డియర్ ఫూల్.' ఇది ఆంధ్రపత్రికలో యర్రంశెట్టి శాయి, డి.ప్రభాకర్, తాడిమళ్ళ రామకృష్ణ, చందు సోంబాబులతో కలిసి గొలుసు కథగా వ్రాసాను. వసుధ పత్రికలో 'పారిజాతం', జ్యోతి పత్రికలో 'నాలుగో నెల మొదలైంది', మరో పత్రికలో 'జలతారు' (సంపాదకులు - నాయని కృష్ణమూర్తి) నాకు గుర్తున్న ఇతర కథలు. చంద్ర బొమ్మకి కథవ్రాసే ప్రక్రియగా - జ్యోతి దీపావళి ప్రత్యేక సంచికకి 'ఓటమి' వ్రాసాను. సినీరంగంలో తరచుగా కథా సహకారమిస్తున్నా - పత్రికాముఖంగా బహుశా అదే నా ఆఖరి కథ .

****

**డిటెక్టివ్ యుగంధర్ సృష్టి కర్త**

**ప్రముఖ డిటెక్టివ్ నవలా రచయిత శ్రీ కొమ్మూరి సాంబశివరావు గారు**

**ప్రత్యేకరచన: కిరణ్‌ప్రభ**

మర్డర్ మిస్టరీ , క్రైమ్ ఫిక్షన్, స్పై థ్రిల్లర్..వెరసి డిటెక్టివ్ నవల..! మూడు, నాలుగు దశాబ్దాల క్రిందట తెలుగు పాఠకలోకంలో డిటెక్టివ్ నవలలు ఒక ప్రభంజనం..పెను తుఫాను..నిత్య సంచలనం. సగటు పాఠకుడి పఠనాసాక్తిని పెంచింది పోకెట్ సైజులో వెలువడిన డిటెక్టివ్ పుస్తకాలే. ఆ రోజుల్లో, ఆంధ్రప్రదేశ్‌లో మారుమూల గ్రామాల్లో సైతం బడ్డీకొట్టు ఉందంటే అందులో పోకెట్ సైజు డిటెక్టివ్‌లు వేలాడుతూ ఉండాల్సిందే. ఈ నవలా రచయితలకి ప్రత్యేకమైన క్రేజ్ ఉండేది. కొమ్మూరి సాంబశివరావు, టెంపోరావు, భయంకర్, విశ్వప్రసాద్, విశ్వమోహన్, విశ్వభరత్, గిరిజ శ్రీభగవాన్, కొప్పిశెట్టి.. ఇవన్నీ ఆ రోజుల్లో ఇంటింటా తరచూ వినిపించిన డిటెక్టివ్ నవలా రచయితల పేర్లు వీరందరిలో ప్రముఖంగా నిలిచిన రచయిత కొమ్మూరి సాంబశివరావు గారు. యాభై సంవత్సరాల క్రిందటే తెలుగు భాషలో మొట్టమొదటి హారర్ నవల 'చావు తప్పితే చాలు', మొట్టమొదటి స్పై థ్రిల్లర్ '౮౮౮' వ్రాసిన ఘనత సాంబశివరావు గారిది.

ఈయన నవలల్లోని డిటెక్టివ్ యుగంధర్, అసిస్టెంట్ రాజు.. ఆంధ్రదేశం పాఠకుల మనసుల్లో, కొన్ని దశాబ్దాలపాటు, ఆత్మీయమైన వ్యక్తులుగా వెలిగారు,.... సాధారణమైన వాక్యాలూ, సరళమైన శైలీ సాంబశివరావు గారి ప్రత్యేకత. అందుకే ఆయన రచనలు నెల నెలకీ పునర్ముద్రణకి వస్తుండేవి. (తన రచనాశైలికి కొమ్మూరి సాంబశివరావు గారే ఆదర్శం అని ప్రముఖ రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి గారు చాలా చోట్ల పేర్కొన్నారు ). ౨౦ సంవత్సరాలలో ౯౦ నవలలు వ్రాసిన కొమ్మూరి సాంబశివరావు గారు ఎక్కడా తన ఫోటో ప్రచురించుకునే వారు కాదు. ఒకే ఒక్కసారి ౧౯౮6లో, 'స్రవంతి' పత్రికలో మల్లాది గారి పట్టుదల మీద, తన ఫోటో ప్రచురణకిచ్చారు. ఆయన మరణించాకే ఆయన ఫోటోని పాఠకలోకం అందరూ చూడగలిగారు. డిటెక్టివ్ నవలా రచయితగా పేరు తెచ్చుకోవడానికి చాలా కాలం క్రిందటే అయన రెండు పత్రికలకి స్థాపకుడు గానూ, సంపాదకుడు గానూ పనిచేసారనీ, సినీ జర్నలిజం లో నిష్ణాతులనీ చాలామందికి తెలియక పోవచ్చు.

అలనాటి ప్రముఖ డిటెక్టివ్ నవలారచయిత కొమ్మూరి సాంబశివరావు గారి గురించిన ప్రత్యేక కథనం ఈ నెల 'కౌముది' ప్రత్యేకం. వారి నాన్నగారి గురించిన అనేక విశేషాల్ని వివరంగా చెప్పడమే కాక, కొన్ని అరుదైన ఫోటోలని కూడా ఇచ్చి, ఈ వ్యాసం ఇలా రూపుదిద్దికోడానికి ఎంతగానో సహకరించిన శ్రీ కొమ్మూరి వెంకట్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు అందిస్తున్నాం. – కిరణ్‌ప్రభ

**కుటుంబ నేపథ్యం:**

20 **వశతాబ్దం** మొదటి రోజులు. తెనాలిలో కొమ్మూరి వెంకట్రామయ్య గారు ప్రింటింగ్ ప్రెస్ నడుపుతుండేవారు. ప్రముఖ రచయిత గుడిపాటి వెంకట చలం, వెంకట్రామయ్య గారికి స్వయానా అన్నయ్య. (బాల్యంలోనే తాతగారు దత్తత తీసుకోవడం వల్ల చలం గారి ఇంటిపేరి గుడిపాటిగా స్థిరపడిపోయింది). వెంకట్రామయ్యగారి భార్య పద్మావతి. ఆ రోజుల్లోనే వారిది అభ్యుదయభావాలు గల కుటుంబం. పద్మావతిగారు బళ్ళారి రాఘవ బృందంతో కలిసి రంగస్థల నాటకాల్లో నటిస్తుండే వారు. ఆ రోజుల్లో కుటుంబస్త్రీలు నాటకాల్లో నటించడమంటే పెద్ద సంచలనం. వెంకట్రామయ్య, పద్మావతి గార్ల రెండవ సంతానమే కొమ్మూరి సాంబశివరావు గారు. 1926లో జన్మించారు. సాంబశివరావు గారి అక్కయ్య వరూధిని (ప్రముఖ రచయిత కొడవటిగంటి కుటుంబరావు గారి భర్య), చెల్లి ఉషారాణి (ఉషారాణి భాటియా పేరుతో చక్కటి కథలు వ్రాసారు. న్యూఢిల్లీ నేషనల్ బుక్ ట్రస్ట్‌లో తెలుగు విభాగానికి అధిపతిగా కూడా పనిచేసారు)

వెంకట్రామయ్యగారు తన ప్రెస్‌లో చలం, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి పుస్తకాలతో పాటుగా కాంగ్రెస్ సాహిత్యాన్ని కూడా ప్రచురిస్తుండేవారు. స్వాతంత్ర్యోద్యమం వేడి అందుకుంటున్న రోజుల్లో కాంగ్రెస్ సాహిత్యాన్ని ముద్రిస్తున్నారన్న నెపంతో వెంకట్రామయ్యగారి ప్రెస్‌ని మూసివేయించింది బ్రిటిష్ ప్రభుత్వం. అందువల్ల 1928-29 ప్రాంతాల్లో కుటుంబాన్ని తీసుకుని మద్రాసుకి వెళ్ళిపోయారు వెంకట్రామయ్య గారు. మద్రాసులో కొద్ది కాలం ఒక ప్రెస్‌లో పనిచేసి, తరువాత ఆయనే సొంతంగా ప్రింటింగ్ ప్రెస్ పెట్టి తెలుగు పుస్తకాలు ముద్రిస్తుండేవారు. 1930 ప్రాంతాల్లో 'తెలుగు సినిమా' అనే పత్రికని స్థాపించారు కానీ ఎక్కువకాలం నడపలేక ఆపేసారు. ఆయనకున్న సాహితీ మిత్రుల సాగత్యం వల్ల వారి ఇల్లు ఎప్పుడూ రచయితలూ, కవులూ, కళాకారులతో కళకళలాడుతుండేది. అంచేత సాంబశివరావు గారికి సహజంగా చిన్నతనం నుంచే సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగింది. తెలుగు సాహిత్యంతో పాటుగా ఇంగ్లీషు పుస్తకాలు కూడా విపరీతంగా చదివేవారు సాంబశివరావు గారు.


1960ల్లో కొమ్మూరిగారు

**తొలి రోజుల్లో..:**

తన 14 వ సంవత్సరంలో మొదటి సారిగా ఒక ప్రేమకథని వ్రాసారు సాంబశివరావు గారు. ఎస్సెస్సెల్సీ అయ్యాక ఇంక చదువు ముందుకి సాగలేదు. భవిష్యత్తులో ఆంధ్రదేశం నీరాజనాలు పట్టే రచయితగా రూపుదిద్దుకున్న సాంబశివరావు గారికి స్కూల్ ఫైనల్‌లో అతి తక్కువ మార్కులు వచ్చింది తెలుగు సబ్జెక్టులోనే..! కారణమేమిటో తెలుసా?- పరీక్షల్లో ప్రశ్నలన్నింటికీ , టెక్స్ట్ బుక్‌లో ఉండేటటువంటి గ్రాంధికంలో కాకుండా, వాడుక భాషలో సమాధానాలు వ్రాయడమే. విచిత్రమేమంటే, కొన్ని దశాబ్దాల తరువాత, ఆ వాడుకభాషలో రచనే ఆయన్ని లక్షలాదిమంది పాఠకులకి చేరువ చేసింది..!

తన 20 సంవత్సరాల వయసులోనే నార్ల వెంకటేశ్వరరావుగారి సంపాదకత్వంలో వస్తున్న ఆంధ్రప్రభలో పొలిటికల్ రిపోర్టర్‌గా మొదటి ఉద్యోగాన్ని ప్రారంభించారు (నిజానికి మొదటి ఉద్యోగం, చివరి ఉద్యోగం కూడా అదే ఆయనకి. దీని తరువాత మళ్ళీ ఎక్కడా ఉద్యోగం చెయ్యలేదు) మద్రాసు అసెంబ్లీ నుంచీ వార్తల సేకరణ ఆయన డ్యూటీ. రెండేళ్ళకి మించి ఆ వుద్యోగంలో కొనసాగలేక పోయారు.

1948 ప్రాంతాల్లో బయటికి వచ్చేసి, తండ్రి వెంకట్రామయ్యగారు గతంలో ప్రారంభించి ఆపేసిన, 'తెలుగు సినిమా' అనే పత్రికని పునః ప్రారంభించారు. తండ్రిగారు పబ్లిషర్, సాంబశివరావు గారు ఎడిటర్. అక్కినేని, ఎన్టీఆర్, ఎస్వీఆర్ లాంటి ప్రముఖుల చిత్రరంగ ప్రవేశాన్ని ప్రముఖంగా ప్రచురించిన పత్రిక 'తెలుగు సినిమా'. ఆ రోజుల్లోనే హాలీవుడ్ పత్రికల స్థాయిలో కలర్ ముఖచిత్రం,


తారల ఇంటర్వ్యూలూ, పజిల్స్, పోటీలతో ఆంధ్రదేశాన్ని అలరించింది ఈ పత్రిక. దీన్ని 'వన్ మేన్ షో' గానే నిర్వహించడం వల్ల ఆయనకి ఏ కొంచెం ఇబ్బంది వచ్చినా పత్రిక క్వాలిటీ దెబ్బతినేది. పాఠకులకి తేడా తెలిసిపోయేది. ఈ లిమిటేషన్ వల్ల నాలుగైదేళ్ళ మించి నడపలేకపోయారు ఆ పత్రికని.

దీని తరువాత, 1953-54, ప్రాంతాల్లో 'మంజూష' అనే సాహితీ పత్రికని ప్రారంభించారు సాంబశివరావు గారు. దీనిలో పెదనాన్న చలంగారు, ఆరుద్రగారు, దేవులపల్లిగారు లాంటి లబ్ధప్రతిష్ఠులు వ్రాస్తుండేవారు. కేవలం సాహిత్య ప్రధానంగా సాగిన పత్రికకూడా ఎక్కువకాలం లాభాలతో నడవలేదు. కొన్ని సంవత్సరాల నష్టం తర్వాత దాన్నీ ఆపెయ్యాల్సి వచ్చింది.

**తొలి నవల..విజయపథం..!:**

సాంబశివరావుగారికి 1954లో బళ్ళారికి చెందిన శ్యామలాదేవి గారితో వివాహం జరిగింది. వారికి ఒక అబ్బాయి.. పేరు వెంకట్. ప్రస్తుత నివాసం మద్రాసులో. Veda Corporate Advisors Pvt. Ltd అనే కంపెనీకి Founder Director గా పనిచేస్తున్నారు.


అప్పుడు.. ఏమీ చెయ్యాలా అన్న ఆలోచనవచ్చింది సాంబశివరావుగారికి. వేరే ఉద్యోగమేమీ లేదు. బ్రతుకు తెరువుకోసం ఏదో ఒక పనిచెయ్యాలి. అప్పటివరకూ ఆయనకి తెలిసింది పత్రికలూ, రచనలే. అదే స్ఫూర్తితో, 1956-57 ప్రాంతంలో, కొమ్మూరి సాంబశివరావు గారు తన మొట్టమొదటి డిటెక్టివ్ నవల రాసారు. దాని పేరు 'లక్షాధికారి హత్య '. పుస్తక ప్రచురణకోసమని 'ఆధునిక గ్రంథమాల' అనే పబ్లిషింగ్ సంస్థని కూడా మొదలుపెట్టారు. అంతకుముందు 'తెలుగు సినిమా' పత్రిక వల్ల ఏర్పడిన ఏజెంట్ల నెట్‌వర్క్‌ని ఉపయోగించుకుని తన తొలి డిటెక్టివ్ నవలని - ఆంధ్రదేశమంతా విడుదల చేసారు. అది అనూహ్యమైన విజయాన్ని సాధించి, రెండు నెలలలోనే పునర్ముద్రణ కొచ్చింది.




అక్కడి నుంచీ ఇంక సాంబశివరావు గారు డిటెక్టివ్ నవలా రచయితగా వెనుతిరిగి చూడలేదు. 1957 నుంచీ 1980 వరకూ ఆయన రచనలకి స్వర్ణయుగం. ఆయన బతికున్నంతకాలం, మరో ఉద్యోగమేమీ చెయ్యకుండా, రచయితగానే కొనసాగారు. అన్ని రకాల డిటెక్టివ్ నవలలూ కలిపి మొత్తం 90 వరకూ రాసారు.

పుస్తకం టైటిల్‌లోనే ఒక విధమైన ఉత్సుకత కలిగించేవారు ఆయన. 'పదమూడు గంటలు కొట్టిన గడియారం', 'నేను చావను', 'చావు తప్పితే చాలు','చచ్చి బ్రతికిన మనిషి' ఇలా. సాంబశివరావు గారి శైలి కూడా పాఠకుల్ని తేలిగ్గా ఆకర్షించేది. అధ్యాయాల్ని ఊపిరి బిగపట్టే సస్పెన్స్‌తో ఆపడం కూడా సాంబశివరావు గారి నవలల ప్రత్యేకత. ఒక అధ్యాయాన్ని తరువాత ఏమిటీ అన్న కుతూహలమైన సన్నివేశంతో ఆపితే, మళ్ళీ రెండు, మూడు అధ్యాయాల తర్వాత కానీ దాని కొనసాగింపు ఉండదు. ఈ సస్పెన్సే పాఠకుల్ని పుస్తకం పూర్తయేవరకూ కట్టి పడేసేది.

తనడిటెక్టివ్ నవలలకి స్ఫూర్తి నిచ్చిన ఆంగ్ల రచయిత ఎడ్గర్ వేలెస్ అని చెప్పేవారు సాంబశివరావు గారు. ఏ నవల రాసినా కథా నేపథ్యం గురించి పూర్తిస్థాయి పరిశోధన చేసి గాని కలం పట్టుకునే వారు కాదు. ఇంటర్నెట్ లాంటి సదుపాయాలు లేని ఆ రోజుల్లో అమెరికన్ ఎంబసీకి, బ్రిటిష్ లైబ్రరీకి వెళ్ళి గంటల తరబడి పుస్తకాలు చదివి విషయ సేకరణ చేసే వారు.



శ్రీ కొమ్మూరి, శ్రీమతి శ్యామలాదేవి

ప్రత్యేకతలు:

ఆయన రచనల్లో 20 వరకూ సాంఘిక నవలలు కూడా ఉన్నాయి. ఈ సాంఘికాలకి ప్రేరణ పెదనాన్న చలం గారని అంటుండేవారు. ఆ రోజుల్లోనే ఎంతో భావుకత ఉట్టిపడే టైటిల్స్ పెట్టేవారు తమ సాంఘిక నవలలకి. 'మళ్ళీ ఎప్పుడో ఎక్కడో..','నిన్నెందుకు ప్రేమించాలి?', 'ఇదంతా ఎవరి కోసం?', 'తొలిప్రేమ' వగైరా. 1960 దశకంలో ఇలాంటి పొయెటిక్ టచ్ ఉన్న పేర్లతో సాంఘికనవలలు రావడం, అందునా ఒక డిటెక్టివ్ నవలా రచయిత కలం నుంచీ, అభినందించదగ్గ విశేషమే. ఐతే డిటెక్టివ్ నవలా రచయితగా ఒక ముద్ర ఉండడం వల్ల ఆయన రాసిన సాంఘిక నవలలు పెద్దగా ప్రజాదరణ పొందలేకపోయాయి. ఒక మాదిరి సెంటర్లలో, ఆయన రాసిన డిటెక్టివ్ నవలలకి 50 కాపీలు ప్రింట్ ఆర్డర్ వస్తే, సాంఘిక నవలలకి 35 కాపీలకే ఆర్డర్ వచ్చేది. ఇలాంటి వ్యాపారాత్మకమైన కారణాల వల్ల కూడా ఆయన ఎక్కువగా సాంఘికాలు వ్రాయలేదు.

సాంబశివరావు గారి రచనల ప్రత్యేకతల గురించి ప్రస్తావన వొచ్చినపుడు ఆయన ప్రారంభించిన రోజుల్లోనే పొలిటికల్ థ్రిల్లర్స్ గురించి తప్పక వ్రాయాలి . '555' అనే నవలలో చైనా లాంటి దేశం, దలైలామా లాంటి వ్యక్తిని కిడ్నాప్ చేయడం, డిటెక్టివ్ యుగంధర్ అక్కడకి వెళ్ళి ఆయన్ని విడిపించుకురావడం లాంటి అంశాలూ.. 'నేఫాలో కెప్టెన్ నరేష్' అనే నవలలో పాకిస్థాన్‌తో ఇండియా యుద్ధం ఇలాంటి ఊహలతో నవలలు రాసారు. ఐతే ఆ రోజుల్లోని రాజకీయాల సున్నితత్వం దృష్ట్యా దేశాలూ, స్థావరాలూ..కల్పితమైన పేర్లతో ఉండేవి. (పాకిస్థాన్ అనడానికి పరిస్థాన్ అని వ్రాసేవారు). ఆయన రాసిన, తెలుగులో మొట్టమొదటి హారర్ నవల, 'చావు తప్పితే చాలు' సృష్టించిన సంచలనం ఆ రోజుల్లోని పాఠకులెవరూ ఇప్పటికీ మర్చిపోలేరు.


కొమ్మూరి సాంబశివరావు గారి చేతికి ఆరువేళ్ళుండేవి. అందువల్ల కలం పట్టుకున్నప్పుడు గట్టి పట్టు ఉండేది కాదు. తద్వారా అక్షరాలు కుదురుగా ఉండేవి కాదు. ఆయన వ్రాత ప్రతుల్ని కంపోజ్ చెయ్యడం కూడా కష్టంగా ఉండేది . అలాంటి సమయంలో టేప్ రికార్డర్‌లో రికార్డు చేస్తే దాన్ని విని ఆయన శ్రీమతి శ్యామలాదేవి గారు వ్రాతప్రతిని తయారు చేసి ప్రెస్‌కి ఇచ్చేవారు.

తన మొట్ట మొదటి నవల 'లక్షాధికారి హత్య' లో ప్రవేశ పెట్టిన డిటెక్టివ్ యుగంధర్, అసిస్టెంట్ రాజు పాత్రలనే చివరి వరకూ కొనసాగించారు. మధ్యలో ఒక నవలలో లాయర్ విశాలాక్షి పాత్రని ప్రవేశపెట్టారు కానీ ఎక్కువ నవలల్లో ఆ పాత్రని కొనసాగించలేదు. ్ రోజుల్లో మరీ అంత డేరింగ్, డాషింగ్ లేడీ పాత్రలని పాఠకులు రిసీవ్ చేసుకోలేదేమో మరి.


మొత్తం పుస్తకాలు, పునర్ముద్రణలూ కలిపితే ఆయన నవలలన్నీ దాదాపు పది లక్షల కాపీలు ముద్రించారు. ఒక డిటెక్టివ్ నవలా రచయితగా ఇదొక రికార్డు ఆయనకి. నవలలు వ్రాయడం ఒక ఎత్తు ఐతే వాటిని అందరికీ అందేలా పంపిణీ చేసే నెట్‌వర్క్‌ని నెలకొల్పడం, కొనసాగించడం మరో ఎత్తు. ఆయన జీవనాధారం ఈ నవలల్లే కాబట్టి, నవలల డిస్ట్రిబ్యూషన్‌లో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారు. అందుకు ఫలితమే ప్రతి చిన్న బడ్డీ కొట్టులోనూ ఆయన నవలలు కనిపించేవి. అయితే కొన్ని రోజుల తర్వాత పాఠకుల సంఖ్య పెరిగింది కానీ ఆర్డర్ల సంఖ్య తగ్గింది. విషయమేమిటంటే అద్దె లైబ్రరీలు (అప్పట్లో 'అణా లైబ్రరీలు' అనే వాళ్ళు) పెరిగిపోవడం. వ్యక్తిగతంగా కొనడం కంటే లైబ్రరీలో రోజుకో 'అణా' (ఆరు నయాపైసలు) ఇచ్చి అద్దెకి పుస్తకం తెచ్చుకుని చదువుకోవడం అలవాటైంది. సేల్స్ పడిపోయాయి. దీనిని కొంతవరకూ అధిగమించడానికి ఒక కొత్త టెక్నిక్ కనిపెట్టి అమలు పరిచారు సాంబశివరావు గారు. తన పోకెట్ నవలల కవర్ పేజీలని తేలిగా ఊడిపోయేగమ్ తో అతికించీ,

లోపలిబైండింగ్‌ని కూడా కాస్త వదులుగా ఉంచీ పుస్తకాలు రిలీజ్ చెయ్యడం మొదలుపెట్టారు. అందువల్ల ఒక్కో పుస్తకం నాలుగైదు సార్లకంటే ఎక్కువమందికి అద్దె కివ్వడానికి వీలయ్యేదు కాదు. అందువల్ల పూర్తిగా కాకపోయినా చాలా వరకూ సేల్స్‌ని పెంచుకోగలిగారు.

**సినీరంగంలో:**




మద్రాసులో రచయితగా ఉంటూ తెలుగు సినిమా రంగానికి దూరంగా ఉండడం అసాధ్యమే ఐనా, సాంబశివరావు గారు సినిమారంగానికి మరీ ఎక్కువగా అంకితం కాలేదు. సినీరంగ ప్రముఖులు కె.ఎస్.ప్రకాశరావు గారు, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు, ఆరుద్రగారు, శ్రీశ్రీ వీరికి చాలా దగ్గర స్నేహితులు. సాంబశివరావు గారు వ్రాసిన డిటెక్టివ్ నవలలు ఆ కాలంలోని తెలుగు సినిమా కథల ఒరవడికంటే చాలా ఎడ్వాన్స్‌డ్‌గా ఉండేవి. రామ్‌గోపాల్ వర్మ లాంటి ఆఫ్‌బీట్ దర్శకులు ఆ రోజుల్లో ఉంటే సాంబశివరావు గారి కథలకి వెండితెర రూపం త్వరగా వచ్చేదేమోకానీ, కుటుంబగాధా చిత్రాల నడుమ ఈయన కథలు ఎక్కువగా సినిమాలుగా రాలేదు. మరొక కారణం - తన నవలల్లోని కథాంశానికి ఎలాంటి మార్పులు చెయ్యడానికి ఒప్పుకునే వారు కాదు. సాంబశివరావుగారి నవల ఆధారంగా వొచ్చిన మొదటి సినిమా 'పట్టుకుంటే లక్ష' (చలం, నాగభూషణం..వగైరా పాత్రధారులు), రెండోది 'ఒక చల్లని రాత్రి'. ఇది సాంఘికం. మూడోది చిరంజీవి తొలిసారి ద్విపాత్రాభినయం చేసిన 'నకిలీ మనిషి' ( దీనికి మాతృక 'నేను చావను' నవల). తను సృష్టించిన యుగంధర్ పాత్రకి సరిగ్గా సరిపోయే పర్సనాలిటీ ఎస్వీ.రంగారావు గారిదే నని, ఏదైనా సినిమాలో డిటెక్టివ్ యుగంధర్‌గా ఎస్వీర్ గారిని చూడాలనీ అయన చిరకాల వాంఛ దురదృష్టవశాత్తూ అది తీరని కోరికగానే మిగిలిపోయింది.


1990ల్లో...

1975 ప్రాంతాల్లో సాంబశివరావు గారు తనే నిర్మాతగా తన నవల 'మళ్ళీ ఎప్పుడో ఎక్కడో..'ని తెరకెక్కించాలని సినీ నిర్మాణంలోకి దిగారు. శ్రీశ్రీ గారు పాటలు, పెండ్యాల గారు సంగీతం, జయంతి హీరోయిన్. సినిమా నిర్మాణం 90 శాతం అయింది. అనుకోని కారణల వల్ల మిగతాది పూర్తి కాలేదు. సినిమా నిర్మాణం కోసం తెచ్చిన అప్పులు, వడ్డీలు.. ఆర్థికంగా దెబ్బతిన్నారు సాంబశివరావు గారు. ఆ దెబ్బనుంచీ కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. రచయితగా ఎంత సంపాదించినా అదంతా ఈ ఒక్క సినిమా నిర్మాణం తుడిచిపెట్టేసింది. దానితో అప్పులు తీర్చడానికి రచనలు చెయ్యాల్సిన పరిస్థితి వచ్చింది. సాధారణంగా మూడ్ ఉన్నప్పుడే రచనలుచేసే అలవాటుండేది ఆయనకి. రాస్తే రెండు మూడు రోజుల్లో నవల పూర్తి చేసేసేవారు. లేకుంటే నెలల తరబడి కలం పట్టుకునే వారు కాదు అలాంటిది బలవంతంగా రచనలు చెయ్యాల్సిన పరిస్థితి.

1983-84ల్లో, పంజాబ్ టెర్రరిజమ్ కథాంశంగా వ్రాసిన 'అర్థరాత్రి పిలుపు' అనే నవలలో ఒక సంఘటన సృష్టించారు. అది 1984 జులై నెలలో అనుకుంటా 'విజయ' మాసపత్రికలో వచ్చింది. భారతదేశపు ప్రధాన మంత్రిని తన అంగరక్షకుడే చంపబోతే, డిటెక్టివ్ యుగంధర్ అడ్డుపడి రక్షిస్తాడు. ఇది వ్రాసిన మూడు - నాలుగు నెలలోనే ఇందిరాగాంధీ హత్య జరగడం కాకతాళీయం..!

**చివరి సంవత్సరాలు:**

అదే సమయంలో చిన్నప్పటినుంచీ అలవాటైన చైన్ స్మోకింగ్ కూడా ఆరోగ్యాన్ని దెబ్బతీసింది. ఊపిరి తిత్తులూ, గుండె ఈ సుదీర్ఘ ధూమపానానికి దెబ్బతిన్నాయి. తొందరగా అలసిపోయే వారు. ఆయనకి చాలా ఇష్టమైన వాకింగ్ అలవాటుని కూడా మానుకోవాల్సి వచ్చింది. ఇన్ని కారణల వల్ల 1980 తర్వాత ఎక్కువగా వ్రాయలేదు. 1983లో విజయబాపినీడు గారికి (విజయ మాసపత్రిక కోసం) 'అర్థ రాత్రి పిలుపు' అన్న నవల రాసారు. 1986లో తన చివరి నవల 'నేను నేను కాను' వ్రాసారు. తరువాత 1994 లో ఆయన చనిపోయే వరకూ మరేమీ రచనలు చేయలేదు.

1994 , మే 17న నిద్రలోనే తుది శ్వాస వదిలారు. 30 సంవత్సరాల పాటు తెలుగు వారందరికీ ఇంటింటా పేరుగా మారుమోగిన **"కొమ్మూరి సాంబశివరావు రచన.. డిటెక్టివ్ యుగంధర్ పరిశోధన "** అన్న నినాదం సరికొత్తగా రూపుదిద్దుకోవడం ఆగిపోయింది.

ఆయన జీవించినంత కాలం, ,1986లో ఒక్కసారితప్ప, తన ఫోటో ఎక్కడా ప్రచురించలేదు. ఆయన సన్నిహితులకు తప్ప కొమ్మూరి సాంబశివరావుగారు అంటే ఎలా ఉంటారో ఎవరికీ తెలీదు. ఆయన మరణించాకే ఆయన ఫోటో వార్తాపత్రికల్లో వచ్చింది.

ఆయన తీరనికోరికల్లో ఒకటి - మహాత్మా గాంధీ హత్య ఆధారంగా ఒక క్రైమ్ ఫిక్షన్ నవల వ్రాయడం. రాజకీయాలు, ఆదర్శాలు, న్యాయాన్యాయాలు జోలికి పోకుండా కేవలం హత్యకి జరిగిన కుట్రతో మొదలుపెట్టి, హంతకుడి ఉరితీత వరకూ వ్రాయలనుకున్నారు. ఇందుకోసం బోలెడంత పరిశోధన చేసి చాలా విషయాలు సేకరించారు కానీ ఆ రచన పూర్తిచేయలేకపోయారు. ఈ విషయంలో చివరి వరకూ ఆయన తపనపడుతూనే ఉండేవారు.

**జ్ఞాపకాలు:**

నాన్నగారి జ్ఞాపకాలని గుర్తు తెచ్చుకుంటూ, సాంబశివరావుగారి అబ్బాయి, వెంకట్‌గారు ఇలా అన్నారు..

"నాన్న గారు చిన్నప్పటినుంచి నాతో ఒక స్నేహితుడిలా మెలిగే వారు. వాళ్ళ నాన్నగారు ఆయనతో అలానే ఉండే వారట. మాకు వయసులో తేడా ఎక్కువగానే ఉన్నా నన్ను ఒక మిత్రుడిగా చూసేవారు. ఆయన నుంచీ నేను నేర్చుకున్నవాటిలో ముఖ్యమైన విషయాలు మూడు.

మొదటిది: విద్యార్జన, గ్రంథ పఠనానికి ఉన్న వ్యత్యాసం. క్లాసు పుస్తకాలే కాకుండా బయట మంచి పుస్తకాలు చదవడం ద్వారా మానసిక వికాసం ఉంటుందని చరణాత్మకంగా చూపించారు. ఆయన పుస్తకాలు విపరీతంగా చదివే వారు. ఆయన చనిపోవడానికి ఏడెన్మిది సంవత్సరాల ముందు నుంచీ ఏమీ రాయకపోయినా ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూనే ఉండేవారు. ఆ అలవాటు నాకు రావడమే కాక దాని వల్ల ఎంతో ఉపయోగం ఉన్నదన్న విషయం పదే పదే ఋజువౌతూ వస్తోంది.

రెండోది: కష్ట సుఖాలని సమానంగా స్వీకరించడం. ఆయన జీవితాన్ని గమనిస్తే ఒక సైన్ కర్వ్‌లా ఉంటుంది. కెరీర్ మొదలు పెట్టిన కొత్తలో 'తెలుగుసినిమా' పత్రిక నిర్వహిస్తున్నప్పుడు బాగా సంపాదించారు. కొత్త మేరిస్ మైనర్ కారు మెయిన్‌టెయిన్ చేసారు 1948 ప్రాంతాల్లోనే. మళ్ళీ 'మంజూష' పత్రిక సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మళ్ళీ డిటెక్టివ్ నవలా రచయితగా రూపుదిద్దికోగానే స్టార్డమ్‌ని అనుభవించారు. ఆంధ్రదేశమంతా ఆయన పేరు మారు మోగిపోయింది. మళ్ళీ సినిమా నిర్మాణంతో ఇబ్బందుల్లో పడ్డారు..ఈ విధంగా ఎప్పుడు కష్టలు ఎదురైనా.."ఓహో ..ఇలాంటివి లోగడ చాలా చూసాన్లే..వీటిని మాత్రం ఎదుర్కోలేనా.." అన్న ధీమాతో ఉండేవారు. ఈ స్వభావం నామీద ఎంతో ప్రభావాన్ని చూపించింది.

మూడో విషయం: ఏదైనా బిజినెస్ మొదలుపెట్టినప్పుడు 'అంతా నేనే' అనే పరిస్థితి కల్పించుకోవద్దు. ఒక వ్యక్తిగా నువ్వు చాలా

పనులు సమర్థవంతంగా చెయ్యొచ్చు, కానీ 'ఆ ఒక్కటి' అన్నది ఇబ్బందుల్లో పడితే మొత్తం బిజినెస్ ఇబ్బందుల్లో పడినట్లే అన్న విషయం గుర్తుపెట్టుకో అనే వారు. ఆయన 'తెలుగు సినిమా' పత్రికని నడిపినప్పుడు దాదాపు కవర్ పేజీ నుంచీ చివరి పేజీ వరకూ మొత్తం మేటర్ అంతా ఆయనే వ్రాసే వారు. ఆయనకి ఇబ్బందులు రాగానే పత్రికని మూసెయ్యాల్సి వచ్చింది. అలానే ఆధునిక గ్రంథమాల తరఫున కూడ కేవలం తన పుస్తకాలనే ప్రచురించారు. ఆయన వ్రాయడం ఆగిపోగానే ఆధునిక గ్రంథమాలా ఆగిపోయింది. వేరే రచయితల పుస్తకాలు కూడా ప్రచురించి ఉంటే వ్యాపారాత్మకంగా ఇంకా విజయాలు సాధించి ఉండేవారేమో. అలా చెయ్యకపోవడం పొరబాటని అంటుండేవారు. 'నువ్వు ఏ కంపెనీ మొదలుపెట్టినా నీ చుట్టూనే తిప్పుకోకుండ, దాన్ని వ్యవస్థీకృతం చెయ్యి. పదిమంది బలాన్నీ సంపాదించుకో 'అని సలహా ఇచ్చేవారు. ఇప్పటికీ మా బిజినెస్ వ్యవహారాల్లో ఈ సలహాని పాటిస్తున్నాను.

ఇన్నేళ్ళ తరువాత నాన్నగారిని ఈతరం పాఠకులకి పరిచయం చేస్తున్నందుకూ, మరోసారి ఆ జ్ఞాపకాలని మననం చేసుకునే అవకాశాన్ని కల్పించినందుకూ 'కౌముది'కి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను."

**కొమ్మూరి గారి జ్ఞాపకాలు - మల్లాది వెంకట కృష్ణమూర్తి**

కొమ్మూరి సాంబశివరావుగారు తన తొలి డిటెక్టివ్ నవల మొదలుపెట్టబోయే ముందు, అందులోని డిటెక్టివ్ పాత్రకి ఏమి పేరు పెట్టాలా అని అని ఆలోచిస్తూ ఒక రోజు పానగల్ పార్కుకి వెళ్ళారట. అక్కడ కనిపించిన మల్లాది రామకృష్ణశాస్త్రి గారిని సలహా అడిగారట. "తెలుగు వాళ్ళలో డిటెక్టివ్ వృత్తిని చేపట్టిన మొదటి వ్యక్తి పేరు యుగంధర్. మీ నవలలోని డిటెక్టివ్ పాత్రకి కూడా అదే పేరు పెట్టండి" అని చెప్పారట. ఈ విషయాన్ని ఒకసారి కొమ్మూరి సాంబశివరావు గారు, నాతో స్వయంగా చెప్పారు.

ఓసారి మద్రాసులో ఆయన్ని కలుసుకున్నప్పుడు తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నారు. ఊపిరి కూడా సరిగా అందడంలేదు. ఆరోజు ఆయన అన్నమాటలు నాకింకా గుర్తున్నాయి. 'నా అనారోగ్యం గురించి ఏమాత్రం చింతించడంలేదు. ఏదో ఒక రోజు ఇలాంటి పరిస్థితి వస్తుందని తెలుసు. ఐతేనేం..సిగరెట్లు కాల్చడం అన్న అలవాటుని పరిపూర్ణంగా అనుభవించాను. ఇదో ఇప్పుడిలా అనారోగ్యం రూపంలో దానికి ప్రతిఫలం చెల్లిస్తున్నాను. అప్పటి ఆనందమూ, ఇప్పటి అనారోగ్యమూ రెండూ నేను కోరితెచ్చుకున్నవే..! ' అన్నారు చాలా తేలిగ్గా.

ఆయన చాలా హాస్యస్ఫోరకంగా మాట్లాడేవారు. సంభాషణల్లో ఎన్నో జోక్స్ దొర్లుతుండేవి. ఈ హాస్యం రచనల్లో ప్రతిబింబించలేదేమని అడిగాను. 'ఎందుకో మరి నాకూ తెలీదు. నేను ఇంతవరకూ ఈ విషయాన్ని గమనించలేదు సుమా..' అన్నారు. ఆయన భార్య శ్యామల గారు వంటలు బాగా చేసేవారు. నేనూ, నా శ్రీమతి పద్మజ 1990 అగస్టులో వాళ్ళింటికి వెళ్ళినప్పుడు శ్యామల గారు బిస్సి బెళా బాత్ చేసిపెట్టారు. సాంబశివరావుగారు శ్యామల గారిని ఎంతగానో ప్రేమించే వారు. ఆమె మరణం ఆయన్ని బాగా కుంగతీసింది. శ్యామలగారు లేని వెలితిని ఆయన చివరిరోజుల్లో బాగా ఫీలవుతుండేవారు.

సాంబశివరావుగారి మరణవార్తని న్యూఢిల్లీ ఆకాశవాణి వార్తల్లో ప్రసారం చేసారు. అప్పటి ప్రధాన మంత్రి స్వర్గీయ పి.వి.నరసింహారావు గారు కొమ్మూరి గారికి తన సంతాపాన్ని తెలియచేసారు. పి.వి.నరసింహా రావు గారు, షావుకారు జానకి గారు, కొంగర జగ్గయ్య గారు కొమ్మూరి గారినీ, వారి నవలలనీ విపరీతంగా అభిమానించే వారు.

***

1987లో అప్పటి ఆంధ్రజ్యోతి ఎడిటర్ పురాణంగారిని, కొమ్మూరి సాంబశివరావు గారితో సాహితీ జ్ఞాపకాలని వ్రాయించమని సలహా ఇచ్చాను. ఆయన ఒప్పుకున్నారు. నేనే కొమ్మూరి గారితో కూడా మాట్లాడి ఒప్పించారు. ఐతే ఎన్నిరోజులైనా పురాణం గారి నుంచీ కొమ్మూరిగారికి అధికారకమైన సమాచారమేమీ వెళ్ళలేదు. కొన్ని సిద్ధాంతాలకి కట్టుబడే రచయిత ఐన సాంబశివరావుగారు, తనంత తాను వ్రాసి పంపడానికి అంగీకరించలేదు.

***

ఐతే ఆ వ్యాసాలకి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా నేనే కొమ్మూరిగారిని పదే పదే అడిగి ఒప్పించాను. కొద్ది వారాలు ఆ వ్యాసాలు ఆంధ్రజ్యోతిలో వచ్చాయి. సాంబశివరావు గారి అభిమానుల ఆనందానికి హద్దుల్లేవు. అయితే సాంబశివరావు గారికి కనీసం పత్రిక కాంప్లిమెంటరీ కాపీలు కూడా వెళ్ళలేదు. అభిమాన ధనుడైన సాంబశివరావుగారు చాలా బాధపడ్డారు. వ్రాయడం ఆపేసారు. పురాణం గారైనా కనీసం ఫోన్ చేసో, ఉత్తరం రాసో సాంబశివరావు గారిని ఫాలోఅప్ చెయ్యాల్సిందీ.. ఆయనా దాన్ని అక్కడే వదిలేసారు. ఆ విధంగా కొమ్మూరి సాంబశివరావు గారినుంచీ ఎన్నో విలువైన విశేషాలని తెలుసుకునే అవకాశాన్ని ఆంధ్రపాఠక లోకం కోల్పోయింది.


***

డిటెక్టివ్ పుస్తకానికి పెట్టే వెల, దాని సైజు దృష్ట్యా, పెద్ద పెద్ద నవలలు వ్రాయాలని ఉన్నప్పటికీ, కొమ్మూరి సాంబశివరావు గారు తమ రచనల్ని 144 పేజీలకే పరిమితం చేసుకోవాల్సి వచ్చేది. ఐతే నేను వారి 'ప్రాక్టికల్ జోకర్' నవలని ఈ కాలానికి తగినట్లుగా (యుగంధర్ సెల్‌ఫోన్ వాడడం.. వగైరా మార్పులతో) తిరగరాసినప్పుడు అది 240 పేజీలకి పైగా వచ్చింది. దీన్ని ఆంధ్రజ్యోతి గ్రూపు వాళ్ళు 'నవ్య' వారపత్రిక ఆరంభించినప్పుడు, దానిలో సీరియల్‌గా మొదలుపెట్టారు. పాఠకులు కూడా ఈ కొత్త ప్రయోగాన్ని బాగా రిసీవ్ చేసుకున్నారు. ఆ కోవలో మరికొన్ని వ్రాద్దామని అనుకున్నాను కానీ అప్పటి ఎడిటర్ గారి విముఖతవల్ల అవి ముందుకి సాగలేదు.

***

తెలుగుదేశం హయాంలో రాష్ట్రమంత్రిగా పనిచేసిన శ్రీపతి రాజేశ్వర్(అప్పట్లో ఎన్టీర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు) గారు కొమ్మూరి గారికి విపరీతమైన అభిమాని. మద్రాసు వెళ్ళినప్పుడు ఆయన తరచూ సాంబశివరావు గారిని కలుస్తూ ఉండేవారు. సాంబశివరావు గారు కూడా హైదరాబాదు వచ్చినప్పుడల్లా రాజేశ్వర్ గారి ఇంట్లోనే ఉండేవారు. సాంబశివరావు గారు వ్రాసిన 'లాకెట్ మర్మం' అనే నవల అంటే రాజేశ్వర్ గారికి చాలా ఇష్టం. 'ప్రాక్టికల్ జోకర్' మాదిరిగానే 'లాకెట్ మర్మం' నవలని కూడా నాతో ఆధునీకరించి వ్రాయించుకున్నారు రాజేశ్వర్ గారు. ఆయన 2005 లో మొదలుపెట్టిన 'మనదేశం' అనే మాసపత్రికలో దాన్ని సీరియల్ గా కూడా వేసారు. ఐతే ఆ పత్రిక నాలుగు సంచికల తరువాత ఆగిపోవడంతో 'లాకెట్ మర్మం' ఆధునిక వెర్షన్ అసంపూర్తిగానే మిగిలిపోయింది.

సాంబశివరావు గారు
స్వదస్తూరీతో
వ్రాసిన లేఖ
చివరిపేజీలో..



Commuri Sambasiva Rao
Author,
Journalist and Publisher

Phone: 427865

97, Habibullah Road,
Thyagarayanagar,
Madras - 600 017.

Ref.

Date 11. 9. 89

P.T.O

# లలిత సంగీత శిక్షణాలయం..ఆయనకదో యజ్ఞం..!

ఆయనో గాయకుడు, సంగీత దర్శకుడు, సంగీతం నేర్పే గురువు. లలిత సంగీతంలో తనదైన పట్టు సాధించి దాదాపు వెయ్యి ఆడియో కేసెట్ల రూపకల్పనలో పాలు పంచుకున్నారు. సినీ, టి.వి. ఎపిసోడ్స్‌కి సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. సినీ పాటల జోరుని తట్టుకుని, వివిధ వేదికలమీద లలిత సంగీత కచేరీలు చేస్తున్నారు. ఇది పెద్ద గొప్పగా అనిపించకపోవచ్చు కానీ వారంలో ఆరు రోజులు తన వృత్తితో బిజీగా వున్నా ప్రతి ఆదివారం ఆయన చేపడుతున్న ఒక కార్యక్రమం మాత్రం ఆయన్ని లలిత సంగీత రంగంలో ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెడుతుంది.

లిటిల్ మ్యుజిషియన్స్ ఎకాడెమీ పేరుతో పది సంవత్సరాల క్రిందట ఆయన మొదలుపెట్టిన 'బాలబాలికలకి ఉచిత లలిత సంగీత శిక్షణ' అన్న కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతూ ఆయన శిష్యపరంపరని కొనసాగిస్తోంది. ప్రస్తుతం వివిధ టి.వి.ఛానెళ్ళలో వస్తున్న సింగింగ్ రియాల్టీ షోస్‌లో పాల్గొనే బాల గాయనీ గాయకుల్లో 85 శాతం మంది ఈయన వద్ద శిక్షణ పొందిన వారే అంటే లలిత సంగీత రంగంలో ఆయన చేసిన, చేస్తున్న కృషి ఏమిటో తేలికగా అర్థం చేసుకోవచ్చు. జాతీయ స్థాయిలో పేరు పొందిన కారుణ్య, హేమచంద్ర లాంటి గాయకులు కూడా తొలిరోజుల్లో ఈయన వద్ద శిక్షణ పొందిన వారే.!

**ఆయనే రామాచారిగా అందరికీ పరిచయం ఉన్న కొమాండూరి రామాచారి గారు.**

***

హైదరాబాదులో ఉంటున్న వారణాసి నాగలక్ష్మి గారితో ఫోన్ లో మాట్లాడుతున్నప్పుడు మాటల మధ్యలో వాళ్ళ అమ్మాయిని టి.వి.లో పాటల పోటీల్లో చూసామని అన్నాను. ఆ సందర్భంలో తమ పాపకి లలిత సంగీతం నేర్పిన రామాచారి గారి గురించి, ఆయన చేస్తున్న ఉచిత లలిత సంగీత శిక్షణ గురించి ప్రస్తావించారు. ఆయన పిల్లలకి సంగీతం నేర్పడంలో తీసుకుంటున్న శ్రద్ధ గురించీ, ఫలితాల గురించీ తను ప్రత్యక్షంగా గమనించానని నాగలక్ష్మి గారు చెప్పారు. రామాచారి గారి పేరు వినగానే హైదరాబాదులో ఉండగా దూరదర్శన్‌లో ఆయన లలిత సంగీతం విన్న సన్నివేశాలు గుర్తొచ్చాయి. నాగలక్ష్మిగారే ఆయన ఫోన్ నంబరు ఇచ్చారు.

***

ఒకటి రెండు సార్లు పరిచయాలయ్యాక సంక్రాంతి రోజు ఇంటర్వ్యూకి టైము కుదిరింది మా ఇద్దరికీ.. దాదాపు రెండు గంటలు మాట్లాడుకున్నాం. వ్యక్తిగా, గాయకుడిగా, గురువుగా, సమాజం పట్ల బాధ్యత గల కళాకారుడిగా రామాచారి గారు చేస్తున్న సేవలూ, ఆయనకి గల భవిష్యత్ ప్రణాళికలు వివరంగా చెప్పారు.

ఎక్కడో మెదక్ దగ్గర మారు మూల పల్లెటూరిలో బాల్య జీవితాన్ని మొదలు పెట్టి, కేవలం సంగీతం నేర్చుకోవాలన్న తపనతో హైదరాబాదులో అడుగుపెట్టి ఒంటరిగా ఎన్నో ఆటుపోట్లని ఎదుర్కొని స్వయం శక్తితో ఒక్కొక్క ఇటుకే పేర్చుకుంటూ ఆయన నిర్మించుకున్న లలిత సంగీత స్వరాల పొదరింటిని 'కౌముది' పాఠకులకి పరిచయం చేయడానికి ఆనందిస్తున్నాం. **– కౌముది**

*రామాచారి గారూ.. సంక్రాంతి రోజు.. మీరు ఫేమిలీ తో గడిపే సమయాన్ని మేము డిస్టర్బ్ చేస్తున్నామేమో.!?*

లేదండీ. ఇదే మంచి రోజు. ఈ రోజు ఇలా అంతర్జాతీయంగా ఖ్యాతి పొందిన పత్రికా పాఠకులకి పరిచయం చేసే ఈ మాటలకన్నా మంచి పని ఏముంటుందండీ. !



*అందరూ సినిమా పాటల హోరులో పడి కొట్టుకుపోతుంటే మీరు మాత్రం లలిత సంగీతంలో నిమగ్నమవడానికి కారణమేమిటో చెబుతారా?*

మీ ప్రశ్నకి సూటి సమాధానంలోకి వెళ్ళబోయే ముందు చిన్న వివరణ. లలిత సంగీతంలో ఎక్కువ సమయం గడుపుతున్నా, నేను సినిమా సంగీతానికి వ్యతిరేకం కాదండీ. నిజానికి నేను కూడా కీరవాణి గారు లాంటి కొంతమంది ప్రముఖ సంగీత దర్శకులకి సహాయకుడిగా పనిచేసాను. నేను సొంతంగా 'ప్రేమలేఖ రాసా' అనే చిత్రానికి సంగీత దర్శకత్వం వహించాను కూడా. ఇంకా అనేక టి.వి.ఛానెళ్ళలోని సీరియల్స్‌కి సంగీత దర్శకత్వం వహిస్తున్నాను.

ఐతే లలిత సంగీతం విషయానికి వస్తే -

మన తెలుగు వారి సంగీత పెన్నిధి అంతా లలిత సంగీతంలోనే ఉందండీ. అలనాడు పాలగుమ్మి విశ్వనాథం, చిత్తరంజన్, మల్లిక్, ఎన్.సి.వి.జగన్నాథాచార్యులు , బాలాంత్రపు రజనీ కాంతరావు లాంటి మహా మహులు స్వరపరచిన అనేక లలిత గేయాలు వింటే ఈ లైట్ మ్యూజిక్ గొప్పతనమేమిటో తెలుస్తుంది. సినిమా బీట్ పాటలకి అలవాటు పడిన ఈ తరానికి మన లలిత సంగీతంలో ఉన్న గొప్ప తనాన్ని పరిచయం చేయడమే కాక అందులో నిష్ణాతుల్ని చేయడం కూడా నా ఆశయం. ఆ దిశగానే నా కార్యక్రమాలన్నీ సాగుతున్నాయి.

కొత్తగా గాయనీ గాయకులౌదామనుకుంటున్న బాలబాలికలు సినిమా పాటల అభ్యాసంతో మొదలు పెడుతున్నారు. ఒక పాటని పదే పదే విని, అనుకరిస్తూ పాడడం వల్ల తప్పని సరిగా ఒరిజినల్ సింగర్స్ ప్రభావం ఉంటుంది. అలా సాధన చేసిన వారు సొంతంగా పాడడం వద్దకి వచ్చేసరికి అంత పరిణితి చూపించలేక పోవచ్చు.

ఏ ప్రభావమూ లేని లలిత గీతాలని నేర్చుకోవడంతో మొదలు పెడితే తమ సొంత గొంతు, సొంత శైలీ అలవడుతాయి. తమంత తాముగా ఏ కొత్త పాటనైనా పాడే ఆత్మ విశ్వాసం వస్తుంది.

మరో కారణం - లలిత గేయాలు దాదాపు అన్నీ ఉత్తమ సాహిత్యంతో కూడుకున్నవే కాబట్టి తెలుగుభాషా మధురిమలని ఆస్వాదిస్తూ గాన ప్రపంచంలో విహరించడానికి వీలౌతుంది.

*లలిత సంగీత రంగంలో మీ కృషి గురించి చెప్పండి*

మరుగున పడిపోతున్న అలనాటి ప్రముఖులు స్వరపరచిన 'మనసాయెరా మాధవా.. నినుచూడ...','రామ చరణం...రామ చరణం..మాకు శరణం..'..లాంటి పాటలతో బాటుగా నేను సొంతంగా స్వరపరచిన లలిత గేయాలని కూడా నా వద్దకి వచ్చే పిల్లలకి

నేర్పిస్తున్నాను.

ఇంతవరకూ సంగీత దర్శకుడిగా, గాయకుడిగా, మ్యూజిక్ కండక్టర్‌గా దాదాపు 1000 ఆడియో కేసెట్స్ రూపొందించడంలో పాలు పంచుకున్నాను. ఆకాశవాణిలో గ్రేడ్ 1 కంపోజర్‌గా, బి-హై గ్రేడ్ సింగర్‌గా సర్టిఫికెట్లు తెచ్చుకున్నాను.

అలానే లలిత సంగీతాన్ని సామాజిక ప్రయోజనానికి ఉపయోగించడంలోకూడా మంచి ఫలితాలని సాధించాము. ఎప్పటికప్పుడు సమాజంలో తలెత్తుతున్న సాంఘిక సమస్యల ఆధారంగా కూడా పాటలు రాసుకుని వివిధ వేదికల మీద ప్రదర్శనలిచ్చి ప్రజలని చైతన్యం చేయడంలో మా వంతు కృషి చేస్తున్నాము.

*ఇటీవల పలు తెలుగు ఛానెళ్ళలో వస్తున్న చిన్న పిల్లల పాటల రియాలిటీ షోస్‌లోని చిచ్చర పిడుగులంతా మీ వద్ద శిక్షణ పొందిన వారే అని విన్నాము. వాళ్ళని పరిచయం చేసుకునేప్పుడు పది మందిలో దాదాపు 8 మంది వరకూ మీ వద్దనే తర్ఫీదు పొందామని అంటున్నారు. ఆ విశేషాలు చెప్పండి.*

మీరు విన్నది నిజమేనండీ. ఐతే నా వద్ద సినిమా పాటలు అభ్యాసం చేయడానికి ముందు వాళ్ళకి లలిత సంగీతంలో ప్రావీణ్యం వచ్చేలా చేస్తున్నాము. ఇందుకోసమని 1998లో లిటిల్ మ్యుజిషియన్స్ ఎకడెమీ అనే సంస్థని మొదలు పెట్టాము.

అదెలా జరిగిందంటే అప్పుడప్పుడే మద్రాసునుంచీ తెలుగు చలన చిత్ర పరిశ్రమ హైదరాబాదుకి తరలి వస్తోంది. చాలామంది సినీ సంగీత దర్శకులు గాయనీ గాయకుల్ని మద్రాసునుంచీ, ఇతర నగరాల నుంచీ తెచ్చుకునే వాళ్ళు. కోరస్ పాడడానికి కూడా వేరే చోట్ల నుంచే గాయనీ గాయకుల్ని తెచ్చుకునే వారు. 'హైదరాబాదులో శాస్త్రీయ సంగీత పాడే వాళ్ళున్నారు కానీ సినిమా పాటలకి తగినట్లుగా క్రియేటివ్ గా, ఫ్లెక్సిబుల్ గా పాడే వాళ్ళు లేరని' అంటుండేవాళ్ళు.

ఒక చిన్న విషయం గమనించాలండీ.. శాస్త్రీయ సంగీతం అనేది సంగీత భాషలో గ్రామర్ లాంటిది. మన భాషలో గ్రామర్ నేర్చుకున్నాక కవితలో, కథలో వ్రాయాలంటే కావల్సిన అధ్యయనం, అభ్యాసం వేరు. అలానే లలితగీతాలు, సినిమా పాటలు పాడాలంటే అవసరమైన అభ్యాసం వేరు. ఆ వెలితిని కొంతవరకైనా పూరించే ప్రయత్నంలోనే మా లిటిల్ మ్యుజిషియన్స్ ఎకాడెమీ స్థాపించడం జరిగింది.

గత పదేళ్ళుగా దాదాపు 500 పైగా బాల గాయనీ గాయకులు మా సంస్థలో శిక్షణ పొందారు. అందులో చాలామంది ఇప్పుడు గాయనీ గాయకులుగా పేరు తెచ్చుకుంటున్నారు.

ఈ సంస్థని మొదలు పెట్టాలని ఆలోచన వచ్చినప్పుడు నాకు మిత్రులైన సహ గాయనీ గాయకుల పిల్లలనీ, వాళ్ళకి తెలిసిన వాళ్ళ పిల్లలనీ చేర్చి మొదటి బాచ్ మొదలు పెట్టాను. శ్రీసౌమ్య అనే పాప మొదటి బాచ్‌లో ఉంది. ఆమె తాతగారు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారే (అప్పటి తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్) తమ ఇంట్లో ఒక హాల్లో క్లాసులు పెట్టుకోమని అన్నారు. ఆ విధంగా నల్లకుంటలోని జి.వి.సుబ్రహ్మణ్యం గారింట్లో మా మొదటి బాచ్ లిటిల్ మ్యుజిషియన్స్ మొదలయ్యారు. తరువాత బాచ్‌సైజు పెరిగే సరికి మరో శిష్యుడు సుమీత్ సింగ్ ఇంట్లో కారులు పెట్టే సెల్లార్‌కి మా సంస్థ కార్యకలాపాలు తరలించాము.

అదీ సరిపోని పరిస్థితి వచ్చినప్పటినుంచీ, ఆంధ్ర మహిళాసభ కాలేజిలో 300 మంది పట్టే ఆడిటోరియమ్ అద్దెకి తీసుకుని అక్కడ క్లాసులు పెడుతున్నాము.

1999 ఫిబ్రవరి 18వ తేదీన ప్రముఖ గాయకుడు ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యంగారి చేతులమీదుగా ఎల్.ఎం.ఎ రిజిస్టర్డ్ సంస్థగా అవతరించింది. అప్పటినుంచి ఇప్పటి వరకూ బాలసుబ్రహ్మణ్యం గారు మాకు గాడ్ ఫాదర్‌లా ఈ సంస్థకి సలహాలు అందిస్తున్నారు.

*మీ ఎకాడెమీలోకి విద్యార్థుల ఎంపిక ఎలా ఉంటుంది?*

మొదట్లో ఐతే తెలిసిన వాళ్ళ పిల్లలని నేనే ఆహ్వానించి మరీ శిక్షణ నిచ్చే వాడిని, ఐతే తరువాత తరువాత మౌత్ పబ్లిసిటీ ద్వారానే అందరికీ తెలిసి వాళ్ళంతట వాళ్ళే రావడం మొదలు పెట్టారు. నావద్దకి వచ్చిన వాళ్ళకి ఆడిషన్ పెడతాము. ముందుగా వాళ్ళ గాత్ర సౌలభ్యం, శృతి, లయ జ్ఞానం చూస్తాము. వాటిని బట్టి వాళ్ళు మా శిక్షణలో ముందుకి వెళ్ళగలరో లేరో నిర్ణయించి చేర్చుకోవడం జరుగుతుంది. కొంతమంది అసలు సంగీత శిక్షణ లేని వాళ్ళు వస్తుంటారు. వాళ్ళకి శాస్త్రీయ సంగీత శిక్షణ తీసుకోమని సలహా ఇస్తాము. మా వద్దకి వస్తూనే, శాస్త్రీయ సంగీత శిక్షణకి వెళుతున్న పిల్లలు కూడా చాలా మంది ఉన్నారు. మరుగుపడిన వజ్రాన్ని సాన బట్టగలము కానీ కేవలం రాయిని తీసుకుని వజ్రంగా మాత్రం మార్చలేము.

*మీ ఎకాడెమీలో శిక్షణ ఎలా వుంటుంది? ఏవరెవరు బోధిస్తారు?*

ఇందులో పిల్లలకి శిక్షణ నిచ్చేది నేను ఒక్కడినే నండీ.. ఆదివారం ఉదయం 10 నుంచీ సాయంకాలం 6 వరకూ పాటలు నేర్పిస్తాము. మా వద్దకి వచ్చిన పిల్లల్లో వాళ్ళ అనుభవాన్ని బట్టీ, గాత్ర పరిణితిని బట్టీ గ్రేడులుగా విభజించి బాచ్‌ల వారీ శిక్షణ నిస్తాను.

మా వద్ద శిక్షణ ఎలా ఉంటుందంటే- నేను ముఖ్యంగా లలిత సంగీతంతో మొదలు పెడతానని చెప్పాను కదా. స్వచ్ఛత, స్పష్టత, మైక్ ఫోకస్, వాయిస్ త్రోయింగ్, భావ ప్రకటన, బోడీ లాంగ్వేజ్, స్టేజ్ ప్రజెన్స్..ఇలాంటి వాటిమీద ఎక్కువ కేంద్రీకరిస్తాను. మారుతున్న కాలానుగుణంగా పాటలు పాడడం అంటే కేవలం గాత్రకచేరీలా ఉండడంలేదు. పబ్లిక్‌లో పైకి రావాలనుకున్న గాయనీగాయకులు ఇవన్నీ నేర్చుకోవడం తప్పని సరి. పైగా ఈ రోజుల్లో వస్తున్న టి.వి. కార్యక్రమాల్లో సింగర్ యొక్క ప్రతి కదలికనీ క్లోజప్ లో చూపిస్తున్నప్పుడు ప్రతి కదలికలోనూ ప్రొఫెషనలిజం కనిపించాలి. అందుకే గాత్రంతో బాటు ఇలాంటి లక్షణాలన్నింటిలోనూ వాళ్ళు ఆల్ రౌండర్స్ అయ్యేలా చూస్తాము.

ఒక సారి ఇలా టెక్నిక్స్ అన్నీ నేర్చుకున్న వాళ్ళు, టి.వి. షోస్ కి వెళ్ళబోయే ముందు వాళ్ళు పాడబోయే పాటలతో నా వద్దకి వస్తారు. వాటికి మెరుగులు దిద్ది, పోటీకి కావల్సిన మెళకువలు చెప్పి పంపిస్తుంటాను. మీరింతకుముందు చెప్పారే టి.వి. రియాల్టీ కార్యక్రమాల్లో చూసాననీ.. ఆ మెరికలు ఇలా తయారైన వారే.

*మీ వద్ద ఇలాంటి శిక్షణా కాలం ఎంత వుంటుంది?*

దీనికొక పరిమితి అంటూ ఉండదండీ.. వాళ్ళు తృప్తిగా పాడుతున్నాం అనుకునేంత వరకూ వస్తూనే ఉంటారు. ఐతే సాధారణంగా ఇంటర్మీడియట్ క్లాసుకి వచ్చే వరకూ మాత్రమే మా క్లాసుకి అనుమతిస్తాము.

*దీనికి ఫీజు ఎంత వుంటుంది?*

అస్సలేమీ తీసుకోమండీ. అంతా ఉచితంగానే బోధిస్తాము. కనీసం ఎలాంటి బహుమతులు కూడా తీసుకోము. ఇలాగే గత 10 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నాము. ఇక ముందుకూడా ఇలానే కొనసాగించాలని నా ఆశయం.

*కేవలం హైదరాబాదు లోని పిల్లలకే ఇది పరిమితమా లేక?*

నా వద్దకి నెల్లూరు, విశాఖపట్నం, కరీమ్‌నగర్ లాంటి దూర ప్రాంతాల నుంచి కూడా వస్తుంటారు. బస్సు చార్జీలు పెట్టుకోలేని వాళ్ళకి ఛార్జీలు కూడా మేమే భరిస్తాము.

*మీ వద్ద ఇలా శిక్షణ పొందిన పిల్లలతో మీ అనుభవాలు ఎలా వున్నాయి?*

ఓ..అద్భుతం అండీ. ఆదివారం వాళ్ళతో గడిపే ప్రతి నిమిషాన్నీ నేను మనస్ఫూర్తిగా ఆనందిస్తాను. నిజానికి ఆదివారం నాకు బయట ప్రొఫెషనల్ కార్యక్రమాలు వచ్చే రోజు. ఐనా ఈ పిల్లలకోసమని వాటిని కూడా ఒప్పుకోను. అలానే నేను ఈ లిటిల్ మ్యుజిషియన్స్ ఎకాడెమీ ప్రారంభించిన కొత్తలో 'ఆ..రామాచారి అంటే పిల్లలకి పాటలు నేర్పే వాడులే..' అని నన్నొక సంగీత దర్శకుడిగా కానీ, ప్రొఫెషనల్ సింగర్ గానీ అంతగా గుర్తించే వాళ్ళు కాదు. ఆ ఇమేజ్ నుంచీ బయట పడడానికి కొంతకాలం పట్టింది. ఏమైనా ఆరు రోజులు నా ప్రొఫెషన్ కోసం పడిన తపన కంటే ఒక్క రోజు వీళ్ళతో గడపడం నాకెంతో తృప్తినిస్తుంది.

నా వద్ద నేర్చుకున్న పిల్లలతో వివిధ వేదికలమీద ప్రదర్శనలిస్తుంటాము. నేనే వాళ్ళని వివిధ వేదికల మీద పరిచయం చేస్తుంటాను. కేవలం హైదరాబాదు సంస్థలే కాక ఢిల్లీ, ముంబాయి. చెన్నై, బెంగుళూరు లాంటి బయట నగరాల నుంచీ కూడా మా బాలగాయనీ గాయకుల కార్యక్రమాలకి ఆహ్వానాలు వస్తుంటాయి.

నావద్ద నేర్చుకున్న పాత విద్యార్థులంతా కలిసి అల్యుమినా ఆఫ్ లిటిల్ మ్యుజిషియన్స్ ఎకాడెమీ అనే పేరుతో ఒక సంస్థగా ఏర్పడి వారూ మరికొంతమందికి సహాయం చేస్తున్నారు. నా వద్ద నేర్చుకున్న పిల్లలు వచ్చి నాతో సంగీతపరమైన చర్చలు చేస్తున్నప్పుడు నేను చాలా తృప్తిగా, గర్వంగా ఫీలౌతుంటాను.

*ఈ సంగీత ప్రస్థానంలోమరపురాని సంఘటనలు ఏవైనా చెబుతారా?*

ఓ..చాలా ఉన్నాయండీ.

మా ఎకాడెమీ లో శిక్షణ ఎలా ఉంటుందంటే పిల్లలంతా హాలు బయటే చెప్పులు వదిలేసి, లోనికి వస్తారు. అందరూ కిందనే కూర్చుంటారు. వారితో పాటు వచ్చిన పేరెంట్స్ కూడ లోనికి వచ్చి వెనకాల కుర్చీల్లో కూర్చుంటారు. మేము పాటల మధ్యలో పిల్లల వ్యక్తిత్వ వికాసం గురించీ, మానవీయ విలువల గురించి కూడ చెబుతుంటాము. అవసరమైనప్పుడు ఆయా రంగంలో నిష్ణాతులని తీసుకువచ్చి పిల్లలకి చదువు విషయంలో కూడా సలహాలు ఇప్పిస్తుంటాము. అంటే మావద్ద పిల్లల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అంశాలనన్నింటినీ ఉచితంగా బోధిస్తామన్న మాట.

ఒక సారి మేము క్లాసులో చెప్పిన కుటుంబవిలులవ గురించిన విన్న ఒక పాప, వాళ్ళ అమ్మ నాన్నలతో ' నాయనమ్మను పల్లెటూరి నుంచీ తీసుకొచ్చి మనవద్దే ఉంచుకుందాం. నాకు నానమ్మ దగ్గర పడుకుని చందమామ కథలు చెప్పించుకోవాలని ఉంది...' అని చెప్పిందట. ఈ విషయాన్ని తల్లిదండ్రులే నాకు స్వయంగా చెప్పారు.

ఇంకోసారి ఒక మార్వాడీ స్కూల్లో పేరెంట్స్ మీట్ సందర్భంగా మా పిల్లలతో పాట కచేరీ పెట్టారు. అందులో ఒకపాటని హిందీలో సొంతంగా వ్రాయించి పిల్లలతో పాడించాను. అర్థం ఎలా ఉంటుందంటే - అమ్మా,నాన్నా..మీరు మేము అడిగిన వన్నీ ఇస్తున్నారు, మంచి స్కూలుకి పంపిస్తున్నారు. సాయంకాలం ఇంటికి వచ్చేసరికి తాళం మమ్మల్ని ఆహ్వానిస్తుంది. రిఫ్రిజిరేటర్ మా ఆకలి తీరుస్తుంది .టి.వి. మాకు కబుర్లు చెబుతుంది. మిమ్మల్ని చూసే లోగా నిద్ర మమ్మల్ని నిద్ర పుచ్చుతుంది. - ఇలా సాగుతుంది.

పాట పూర్తయే సరికి ఇద్దరు తల్లులు వేదిక మీదికి వచ్చి కళ్ళవెంబడి నీళ్ళు పెట్టుకుంటూ- ఇంక నుంచీ సాయంకాలం పెందలకాడే ఇంటికి వచ్చి తమ పిల్లల్ని చూసుకుంటామని అందరి సమక్షంలో ప్రకటించారు.

ఇంకోసారి మా ఎకడెమీ పిల్లలతో చెన్నైలో కార్యక్రమం చేస్తున్నప్పుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం గారు వేదిక మీదనే ఉద్వేగానికి లోనై ఆనంద బాష్పాలు కార్చారు. పది పదిహేను నిమిషాల పాటు సభంతా ఉద్విగ్నభరితమై పోయింది.

ఇంక నా శిష్యులు సాధిస్తున్న విజయాల గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు కదా..

కారుణ్య(ఇండియన్ ఐడోల్), హేమ చంద్ర(జీ-సరిగమప), ఇర్ఫాన్ ఆలీ (వాయిస్ ఆఫ్ ఇండియా), ఇంకా నేపథ్యగాయనీ గాయకులు దీపు, గీతా మాధురి, ప్రణవి, శ్రావణి, హర్షిత, నాగసాహితి..వగైరా అనేక మంది సంగీత ప్రపంచంలో పేరు తెచ్చుకుంటున్నారు.

*అసలు మీదేవూరు? మీ బాల్యం..సంగీతం పట్ల మీకు ఆసక్తి మొదలైన వైనం..వగైరా వివరాలు చెప్పండి.*

మాది మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో పెద గొట్టుముక్కల అనే అతి చిన్న పల్లెటూరు. మొత్తం కలిపి 200 ఇళ్ళుంటాయేమో. అంతా మెట్టప్రాంతం. పక్కనే అడవి.. వ్యవసాయం అంతంత మాత్రమే. చదువూ, నాగరికతా..ఇలాంటివన్నీ కొత్త మాటలే అలాంటి ప్రాంతాల్లో.

నేను 1964 జనవరి 22 న పుట్టాను. నాన్న గారి పేరి కొమాండూరి కృష్ణమాచార్యులు, అమ్మ గారి పేరు యశోదమ్మ. ఇంట్లో నేనే పెద్ద సంతానం. నా తరువాత ఒక తమ్ముడు, ఒక చెల్లి పుట్టారు.

నాన్న వూళ్ళోనే పౌరోహిత్యం చేస్తుండే వారు.

మా వూళ్ళో ఎలిమెంటరీ స్కూలు కూడా సరిగా ఉండేది కాదు. ఒకటే గది. దాన్నే స్కూలు అనే వారు. ఎక్కువమంది పిల్లలం పక్కనే ఉన్న చెట్ల కింద కూర్చునే చదువుకునే వాళ్ళం. హైస్కూలు కైతే మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న గోమారం అనే వూరికి వెళ్ళేవాళ్ళం. ముందు చెప్పినట్లేచదువుల మీద అంత అవగాహన లేక పోవడంతో హైస్కూలు వరకూ వానాకాలం చదువులే. తెలుగు మీడియమ్ లో పదో తరగతి మొదటి ప్రయత్నంలో ఫెయిల్ అయ్యాను.

చదువుల సంగతి ఇలా వుంటే చిన్నప్పటినుంచి సంగీతం, అంటే తెలీని ఆకర్షణ మొదలైంది. ఇందుకు కారణాలనేకం. నాన్నగారు పౌరోహిత్యం చేసే సమయాల్లో శ్రావ్యంగా భగవంతుడిని కీర్తిస్తూ పాటలు పాడే వారు. అతి చిన్న వయసులోనే నన్ను బాగా ఆకర్షించిన విషయం అదీ. నాన్న గారు హరి కథలు కూడా చెప్పేవారు. నేను ఆయనకి సహాయకుడిగా వేదిక ఎక్కుతుండేవాడిని. అలానే నాన్నగారు చదువుకున్న వూరైన యాదగిరి గుట్టకి సంబరాల సమయంలో వెళ్ళేవాళ్ళు. నేనూ ఆయనతో వెళ్ళి యాదగిరి సంబరాల్లో జరిగే జానపద

కార్యక్రమాలు చూసి బాగా ఆకర్షితుడ్నయ్యేవాడిని. చుట్టు పక్కల ఎక్కడ కోలాటాలూ, ఒగ్గు కథలూ జరిగినా తప్పని జరిగా హాజరయ్యే వాడిని. వాటిని చూసి వచ్చి, మా మిత్రుల వద్ద నా సొంత శైలిలో వాటిని మళ్ళీ రిపీట్ చేసేవాడిని. ఈ విధంగా చిన్నప్పటినుంచీ బహు ముఖాలుగా సంగీతం అంటే బలీయమైన ఆకర్షణ ఏర్పడింది.

*మీరు హైదరాబాదు ఎప్పుడొచ్చారు? అది ఎలా జరిగింది? మీ హైదరాబాదు తొలిరోజుల గురించి చెప్పండి.*

పదో తరగతిలో ఉండగానే మా హైస్కూలుకి హైదరాబాదునుంచి భారతి అనే మేడమ్ ఏదో ట్రైనింగ్‌కి వచ్చారు. ఆవిడ అప్పటికే హైదరాబాదులో ప్రభుత్వ సంగీత కళాశాలలో వీణ నేర్చుకుంటున్నారు. నా గొంతు వినీ, పాటల పట్ల నాకున్న ఆసక్తిని గమనించీ, హైదరాబాదు వస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది అని సలహా ఇచ్చారు.. ఐతే నేను పదో తరగతి ఫెయిలయ్యానని చెప్పాను కదా. సహజంగానే నాన్నగారు మళ్ళీ పరీక్షలమీద దృష్టి పెట్టమని చెప్పారు. ఆ సమయంలో 10 క్లాసు ఫెయిలయిన కుర్రాడు 'హైదరాబాదు వెళ్ళి సంగీతం నేర్చుకుంటాన'ంటే ఏ తండ్రి మాత్రం ఒప్పుకోగలరు. వాళ్ళ దృష్టిలో వాళ్ళు చెప్పిందే సమంజసం. కానీ సంగీతం పట్ల నాకున్న మక్కువ నన్ను ఆపలేకపోయింది. ఒక్కడినే హైదరాబాదు వొచ్చి భారతి మేడమ్ గారిని కలిసాను. ఆవిడే నన్ను గవర్నమెంట్ మ్యూజిక్ కాలేజీలో చేర్పించారు.

ఐతే నివాసం ఎలా? మా వూరి నుంచీ వచ్చి హైదరాబాదులో చదువుకుంటున్న కొంతమంది కుర్రాళ్ళు సికింద్రాబాదులో ఒక రూములో ఉంటున్నారు. నన్ను కూడా వాళ్ళతో ఉంచుకోమని అభ్యర్థించాను. నేను డబ్బులు ఇచ్చుకోలేను కాబట్టి వాళ్ళకి కావల్సిన వంట చేయడం, సరుకులు తేవడం, ఇల్లు శుభ్రం చేయడం ..వగైరా పనులన్నీ నేను చేసే ఒప్పందం మీద నన్ను ఉచితంగా ఆ రూములో ఉంచుకునేందుకు ఒప్పుకున్నారు. అందరి పరిస్థితీ అంతంత మాత్రమే కాబట్టి అన్నం మాత్రం వండేవాడిని. ఏ వంకాయో వేసుకునే వాళ్ళం. పక్కనే ఒక స్వీట్ షాపు ఉండేది. అతను వెన్న తీసి వేసాక మిగిలిన నీళ్ళ మజ్జిగ అమ్మే వాడు. 10 పైసలకి అది తెచ్చేవాడిని. అదే పంచభక్ష్య పరమాన్నం ఆ రోజుల్లో.

బస్సు ప్రయాణానికి కూడా డబ్బులు ఉండేవికాదు. ఎన్ని కిలోమీటర్లైనా నడిచే వెళ్ళే వాడిని.

అలా మ్యూజిక్ కాలేజీలో చదువుకుంటూనే 'బాలానందం' కార్యక్రమాల్లో పాల్గొనడానికి 'ఆకాశవాణి'కి వెళ్ళానొకసారి. అక్కడ పరిచయమైన జానకీరాణి అక్కయ్య గారు నన్ను శారదాశ్రీనివాసన్ గారికి పరిచయం చేసారు. ఆవిడే నన్ను ఓరుగంటి లీలావతి గారనే మ్యూజిక్ టీచర్ గారికి పరిచయం చేసారు. ఆవిడ నాకు ఉచితంగా సంగీతం నేర్పడానికి ఒప్పుకున్నారు.

ఆ విధంగా ఒక వైపు మ్యూజిక్ కాలేజీలోనూ, మరో వైపు లీలావతి గారి వద్దా సంగీతం నేర్చుకుంటూ మధ్య మధ్యలో – ఆకాశవాణిలో చిన్న చిన్న కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవాడిని. ఓరుగంటి లీలావతి గారు నన్ను సొంత కుటుంబ సభ్యుడిలా చూసుకునే వారు. వాళ్ళింటికి పాఠాలు నేర్చుకోడానికి వెళ్ళినప్పుడు భోజనం కూడ ఉచితంగా పెట్టేవారు.

అలా జరుగుతున్నప్పుడే సాయిబాబా గారనే సంగీతదర్శకుడు పరిచయమయ్యారు. ఆయన ద్వారా ఆయన ట్రూప్‌లో చేరి స్టేజ్ కార్యక్రమాలు ఇస్తుండే వాడిని. అలా కొంచెం కొంచెం ఆదాయం కూడా రావడం మొదలైంది

ఇదిలా ఉండగా..మరో వైపు నుంచీ చదువుకూడా పూర్తిచేయడం మొదలు పెట్టాను. 10వ తరగతి ప్రైవేటుగా రాసి పాసయ్యాను. మధ్యలో రెండేళ్ళు మెడ్చల్ వెళ్ళి ఇంటర్మీడియట్ చదివి మళ్ళీ హైదరాబాదు వచ్చేసి డిగ్రీ పూర్తి చేసాను. తరువాత ఉద్యోగంలో చేరాక బి.యి.డి పూర్తి చేసాను.

ఉద్యోగం అంటే మొదట్లో ఒక ఆఫీసులో బోయ్‌గా చేరాను. డిగ్రీ వచ్చాక ఒక స్కూల్లో మ్యూజిక్ అసిస్టెంట్‌గా చేరాను. తరువాత ఆల్ సెయింట్స్ హైస్కూల్లో చాలా రోజులు మ్యూజిక్ టీచర్‌గా చేసాక, రిజైన్ చేసి, ఫుల్ టైమ్ సంగీతాన్ని ప్రొఫెషన్‌గా తీసుకున్నాను.

*మీ పట్టుదలకి అభినందనలండీ..*

పట్టుదల అంటేనండీ..నేను హైదరాబాదు వచ్చిన కొత్తలో మీకు ఇంతకు ముందు చెప్పిన ఇబ్బందులకంటే కల్చరల్ షాక్ ఎక్కువ ఇబ్బంది పెట్టింది నన్ను. తెలంగాణా మారు మూల పల్లెనుంచీ వచ్చిన నాకు భాషా సంస్కారం అంతంత మాత్రమే ఉండేది. హిందీ, ఇంగ్లీషు అస్సలు రావు. ఎవరి వద్దకైనా వెళ్ళి అయిదు నిమిషాలు మాట్లాడాలంటే సిగ్గుగా అనిపించేది. అదే టైములో ఒక పక్క సంగీత సాధన, మరో వైపు చదువూ.. అలాంటప్పుడే నాకంటూ నేను ఒక ప్రణాళిక వేసుకునే వాడిని. నాలో ఉన్న లోపాలేమిటి, వాటిని అధిగమించడానికి ఎలా సాధన చెయ్యాలి అని నాకు నేనే ఒక నిశ్చయానికి వచ్చేవాడిని. విధంగా పట్టుదలతో నే నన్ను నేను సంస్కరించుకుంటూ అందరితో పరిచయాలు పెంచుకున్నాను.

ఇంకో ఛాలెంజ్ ఏమిటంటే. ఆ రోజుల్లో ఎవరూ తెలీదు నాకు (ఈ రోజుల్లో ఐతే నేను నా స్టూడెంట్స్ ని తీసుకెళ్ళి అందరికీ పరిచయం చేసి వీళ్ళకి అవకాశ మివ్వండి.. అని చెప్పగలుగుతున్నాను) నా అంతట నేనే వెళ్ళి అందరికీ పరిచయం చేసుకోవడం, వాళ్ళకి నా మీద నమ్మకం కలిగేలా చేసుకోవడం.. అదొక అనుభవం. అదృష్టవశాత్తూ అన్నీ మంచి పరిచయాలే జరిగాయి నాకు.

ఈ రోజు నేను ఉచితంగా ఇలా పిల్లలకి లలిత సంగీతం నేర్పడానికి ఒక కారణం , నా తొలిరోజుల్లో నాకు ఉచితంగా సంగీతం నేర్పిన గురువు గార్ల ప్రేరణే అని చెప్పుకోవచ్చు.

*మీ కుటుంబ సభ్యుల గురించి..*

నా శ్రీమతి పేరు సుజాత. అరోరా డిగ్రీ కాలేజీలో తెలుగు-సంస్కృతం లెక్చరర్‌గా పనిచేస్తోంది. అబ్బాయి పేరు సాకేత్ . ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. 'మా' టి.వి. లో వచ్చే 'ఐడియా సూపర్ సింగర్' కార్యక్రమానికి యాంకర్‌గా కూడా పనిచేస్తున్నాడు. అమ్మాయి సాహితి 5 వ తరగతి చదువుతోంది. పిల్లలిద్దరికీ సంగీతంలో ప్రవేశం ఉంది. బాగా పాడుతారు.

బాల్యాన్ని ఆనందంగా గడిపిన పిల్లలు భవిష్యత్తులో తమ వ్యక్తిత్వాన్ని సరైన మార్గంలో మలచుకోగలరని నా విశ్వాసం. నా చిన్నప్పుడు చదువు సంధ్యలెలా ఉన్నా చిన్నవయసులో, పల్లెటూరిలో లభించే చిన్న చిన్న ఆనందాలని పూర్తిగా అనుభవించాను. వీధుల్లో ఆడుకోవడం, చెరువుల్లో ఈత కొట్టడం వగైరా అన్నింటిలో ఉండేవాడిని. మా పిల్లలకి కూడా ఆడుకోవడానికి పూర్తి స్వేచ్ఛనిస్తాను. కేవలం చదువులకోసమని వాళ్ళు ఎదురుచూసే చిన్న చిన్న ఆనందాలని తిరస్కరించను.

*ఎక్కడో పల్లెటూరినుంచీ ఒంటరిగా నగరానికి వచ్చారు. మీకంటూ ఒక గుర్తింపును తెచ్చుకోవడమే కాక మరింతమంది శిష్యుల్ని తయారు చేస్తున్నారు, అదీ ఏమాత్రం ప్రతిఫలం ఆశించకుండా. మరి ఇక్కడి నుంచీ ఇంకా ఎక్కడి దాకా మీ స్వర ప్రస్థానం..?*

చాలా భవిష్యత్ ప్రణాళికలున్నాయండీ. ముందుగా మా సంస్థకొక సొంత భవనం కోసం చూస్తున్నాం. బాలసుబ్రహ్మణ్యంగారి సహకారంతో నిధుల సేకరణకోసం బెనిఫిట్ కార్యక్రమాలు నిర్వహించాము. ఈ ప్రణాళిక విజయవంతం కావడనికి ఇంకా నిధుల సేకరణ చేస్తున్నాము. ఎవరైనా స్వచ్ఛందంగా మా సంస్థకి సహాయం చేయాలకున్న వాళ్ళు నన్ను నేరుగా సంప్రదించవచ్చు. (ఫోన్: 91-92465 42427 Email: sriram.koushik@yahoo.com )

సొంత భవనం పని అయ్యాక, కొంతమంది అనాథ బాల బాలికల్ని దత్తత చేసుకుని వారికి చదువుతో బాటు సంగీత రంగంలో కూడా శిక్షణ నివ్వాలని మరొక ఆలోచన ఉంది. ఇప్పటికే ఒక సింగరేణి కాలరీస్ నుంచీ ఒక పేద బాలికని దత్తత తీసుకుని కొంతమంది దాతల సహకారంతో ఉచితంగా విద్యా సదుపాయాలు కల్పించాము. నేను ఉచితంగా సంగీతశిక్షణ నిస్తున్నాను.


ఇంకొక దీర్ఘకాలిక ప్రణాళిక ఏమిటంటే - యాదగరిగుట్ట లాంటి చోట వృద్ధ సంగీత కళాకారులకి ఓల్డేజ్ హోమ్ ఒకటి స్థాపించాలని ఉంది.

ఈ మూడు ప్రోజెక్టులూ విజయవంతం చేయడమే నా ముందున్న కర్తవ్యం.

నా జీవితంలో నా కృషితో పాటు నాకు ఎంతోమంది సహాయం చేసారు. అలాంటి సహాయాన్నే నేనూ మరి కొంతమందికి అందించాలనేది నా తాపత్రయం.

***మీ ఆశయాలన్నీ నెరవేరి, తెలుగు లలిత సంగీత రంగంలో మీ కృషి చిరస్థాయిగా నిలిచిపోవాలని కౌముది మనస్ఫూర్తిగా కోరుకుంటోంది. మీకూ , మీ కుటుంబసభ్యులకీ సంక్రాంతి శుభాకాంక్షలు.***

చాలా సంతోషమండీ. ఈ విధంగా ‘కౌముది‘ పాఠకులకి పరిచయం కావడం, మా కార్యక్రమాల గురించి పదిమందికీ తెలియచేసే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మీకు నా కృతజ్ఞతలు.



## నాన్నగారు.. A Humble Colossus - త్రిపురనేని సాయిచంద్

*ప్రముఖ రచయిత స్వర్గీయ త్రిపురనేని గోపీచంద్ గారి గురించి వారి అబ్బాయి సాయిచంద్ గారు వ్రాసిన వ్యాసం. 'తెలుగు పలుకు' 17 వ తానా మహాసభల జ్ఞాపిక సంచిక నుంచి పునర్ముద్రణ*



నాన్నగారి గురించి నా మొదటి జ్ఞాపకం ఆయన మరణం గురించినదే. అప్పుడు నాకు నాలుగేళ్ళు. ఓ రోజు నేను, మా చిన్నక్క మా ఇంటికి ఎదురుగా ఉన్న పార్కులో ఆడుకుంటున్నాం. మా ఇంట్లోనుంచి పనిమనిషి బయటకు వచ్చి ' మీ నాన్న చనిపోయాడు' అని చెప్పింది. అప్పటివరకూ నాకు ఒక మనిషి చనిపోవడం అంటే ఏంటో తెలియదు. నేను, చిన్నక్క ఇంట్లోకి వెళ్ళాం. నాన్న భౌతికకాయం చుట్టూ జనాలు చేరి బిగ్గరగా ఏడుస్తున్నారు. నేను ఇంట్లోకి వెళ్ళగానే, 'అయ్యో సాయివచ్చాడం'టూ మరింత బిగ్గరగా ఏడ్చారు. బాల్యంలో అదే నా మొదటి జ్ఞాపకం. నా జీవితంలో నాన్న గూర్చి ఎక్కువ ప్రభావితం చూపించిన సంఘటన ఆయన మరణం.

నాన్నగారు ఓ కథ రాసినా తన చుట్టూ ఉన్న ప్రపంచానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉంటాయి. మా కుటుంబంలో ఎవరిదో ఒక పాత్ర అన్వయించబడి ఉంటుంది. అందుకే నాన్నగారి కథలలో ఆటోబయోగ్రాఫికల్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. మా నాన్న సాహిత్యం చదవడం ఆసక్తి కలగటానికి కారణమైన సంఘటన ఒకటుంది. నేను చదివిన మొదటి కథ కన్నకూతురి కథ. అది మా తాత (అమ్మ తండ్రి) మీద రాసింది. ఆ కథ రాశాక మా ఇంట్లో పెద్ద గొడవే జరిగింది. మా తాత అలిగి వెళ్ళిపోయారు. అప్పుడు అసలు ఆ కథలో ఏముందో తెలుసు కోవాలనే ఆసక్తి కలిగింది. ప్రతి కథా ఏదో ఒక సన్నివేశానికి సంబంధించింది. అలాగే ఏదో ఒక రిఫరెన్సుతోనే కథలు చదివేవాడిని. చాల చిన్న వయస్సులోనే నేను నాన్నగారి సాహిత్యాన్ని చదవడం పూర్తిచేశాను. నాన్నగారు కాలం చేశాక నాలుగేళ్ళకు అమ్మ పోయింది. అప్పటి నుండి విజయవాడలో ఉన్న మామయ్య పాతూరి నాగభూషణంగారు (గ్రంధాలయ ఉద్యమ నాయకులు), మరికొంత మంది మిత్రులు కలిసి గోరాగారి పాఠశాలలో చేర్పించారు. అది గాంధేయ పద్ధతిలో నడపబడుతున్న పాఠశాల. అక్కడ నా ఆలోచనావిధానంలో ఎంతో మార్పు జరిగింది. ఆయన సామాజిక దృక్పథం నాకు వచ్చింది. అంతేకాకుండా ఆయన ఆచరించే ప్రతిపనీ నాన్నగారి కథల్లో తారసపడే పాత్రలలాగానే ఉండేవి. అక్కడ ఉన్న పెద్దలు కూడా నాన్నగారి సాహిత్యం గూర్చి ఎక్కువగా చర్చించేవాళ్ళు.

నేను 8వ తరగతి నుండి మెట్రిక్యులేషన్ దాకా అక్కడ చదివాను. ఆ స్కూలులో చేరడం నా జీవితంలో గొప్ప మలుపు. చేసి చెప్పే, చెప్పి చేసే గోరాగారి స్వభావం నాకు నచ్చింది. ఆయన ఏ పని చేసినా దానికి సంబంధించిన రిఫరెన్స్ నాకు నాన్నగారి కథలలో కనిపించేది. నాన్న కథలు కార్యశూరుడు, సరే కానివ్వండి, పేదవాళ్ళంతా ఒక్కటే, చీకటి గదుల్లో, గాంధీరామయ్య పాత్రగానీ - ఇవన్నీ నాకు వారి సాహిత్యంలో కనిపించేవి. గోరాగారి దగ్గర నుండి నేను బెంగుళూరు వెళ్ళినా, సిన్మాలలో పనిచేసినా, గోపీచంద్‌గారి గూర్చి ఎవరో ఒకరు మాట్లాడటం, చర్చ చేయడం మూలాన చదివిన ప్రతిసారీ నాకు కొత్త పాయింట్ కనిపించేది.

ఈ రోజు కూడా నాన్నగారు నా పక్కన ఉన్నట్లు అనిపిస్తుంది. వారి రచనలలో నాకు బాగా నచ్చేది పాత్రలలో వైవిధ్యం చూపిన తీరు. పనిపిల్ల గురించి రాసినా, అరవిందుని గూర్చి రాసినా, కమ్యూనిస్టు కార్యకర్త గురించి రాసినా ఈ వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. అదే విధానం నాకు షేక్స్పియర్‌లోనూ, సత్యజిత్ రేలోను కనిపిస్తుంది.

నేను ' మా భూమి' సినిమా చేస్తున్నప్పుడు అందరూ గోపీచంద్‌గారబ్బాయి చేస్తున్నాడు అని అనేవారు. అతి చిన్న వయసులోనే గౌతం ఘోష్, నర్సింగరావుగారలతో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. జీవితంలో నాకు లభించిన మంచి అవకాశం. నాకు చేతనైనంతగా ఎంతో డెడికేటెడ్‌గా చేశాను. దాదాపు ఆ సినిమా మొదలై విడుదలయ్యే నాటికి రెండు సంవత్సరాలు పట్టింది. ఆ రెండు సంవత్సరాలు ' మా భూమి' తో మమేకమై పనిచేశాను.

తాతగారి హేతువాద దృక్పథంగానీ, నాన్నగారి ఆధ్యాత్మిక ధోరణిగానీ, ఏదైనా, సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని మాత్రమే రాశారు. అప్పటి నుండి నేను కూడా ఏ పని చేసినా దానికో సామాజిక ప్రయోజనం ఉండాలి అని నిర్ణయించుకున్నాను. మా భూమి నుండి అంకురం వరకూ సామాజిక దృష్టితో ఉన్న సినిమాలు మాత్రమే చేశాను. శివ, మంచుపల్లకి మినహాయిస్తే మిగతావన్నీ అలాంటివే. ఆ రోజుల్లో ఆర్.కె.నారాయణ్‌గారి మాల్గుడి డేస్‌ను శంకర్ నాగ్ గారు దూరదర్శన్‌కు చేశారు. అప్పుడు నేను నాన్న సాహిత్యం కూడా ఎంతో వైవిధ్యంతో ఉంది కదాని దూరదర్శన్‌లో మొదటి ప్రయత్నంగా, వారి చివరి నవల పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామాను టెలిసీరియల్‌గా తీశాను. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. నవలకు ఎంత పేరు వచ్చిందో సీరియల్‌కు కూడా అంతే పేరుతో బాటు అవార్డులు కూడా వచ్చాయి. ఆ తర్వాత నాన్నగారి కథలు గోపీచంద్‌కీ అమర్ కహానీ పేరుతో తీశాను. అంతేకాకుండా వారి మీద ఒక డాక్యుమెంటరీ తీశాను. దాన్ని సాహిత్యపరంగా, సినిమా పరంగా తీశాను. దానిలో ఎన్నో అరుదైన ఇంటర్వ్యూలు ఉన్నాయి. ఎల్.వి.ప్రసాద్ గారు ఆ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "గోపీచంద్ గారి దయవల్లనే నేను డైరెక్టర్‌ను అయ్యాను. దర్శకుడు కె.ఎస్.ప్రకాశ్‌గారు తీస్తున్న గృహప్రవేశంకు అసిస్టెంటు డైరెక్టరుగా నన్ను పిలిచారు. దానికి ముందుగా డైరెక్టర్ గోపీచంద్‌గారు అనుకున్నారు. నాతో మాట్లాడిన తర్వాత ఈ సినిమాకి ఎల్.వి.ప్రసాద్‌గారు డైరెక్టరు అయితే బాగుంటుంది అని నిర్మాతను ఒప్పించి మరీ, నాతో సినిమా చేశారు. ఆ విధంగా వారి పుణ్యం వల్లనే నేను డైరెక్టర్‌ను అయ్యాను," అని వినమ్రంగా చెప్పుకున్నారు.

గుమ్మడిగారికి, 'మీరు హీరో కంటే క్యారెక్టర్ యాక్టర్‌గా బాగా రాణిస్తారు', అని చెప్పారు నాన్నగారు. ఆయన ఆ తర్వాత ఎన్నో సినిమాలలో క్యారెక్టర్ యాక్టర్‌గా ప్రతిభావంతంగా పనిచేసిన విషయం తెలిసిందే ఆ సమయంలోనే నేను 'సినిమా సినిమా' అనే డాక్యుమెంటరీ తీశాను. ఎల్.వి.ప్రసాద్; కె.ఎస్.ప్రకాశరావు గారి లాంటివారితో చేసిన ఆ ఇంటర్వ్యూకు ఎంతో గుర్తింపు వచ్చింది. నాకు వృత్తిపరమైన సంతృప్తిని ఇవ్వడంతోపాటు నాన్నగారి సమకాలికులను కలిసే అదృష్టం కలిగింది.

నాకు చిన్నప్పటి నుండీ ప్రముఖ డాక్యుమెంటరీ డైరెక్టర్ సుఖదేవ్ అంటే చాలా ఇష్టం. నాకు సినిమాల్లో సత్యజిత్‌రే అంటే ఎంత ఇష్టమో సుఖదేవ్ అన్నా అంతే ఇష్టం. వారి లాగా సామాజిక దృక్పథం ఉన్న కథాంశంతో డాక్యుమెంటరీలు తీయాలని నిర్ణయించుకున్నాను. అప్పటి నుండి ఇప్పటివరకూ అదే ఒరవడిలో డాక్యుమెంటరీలు తీస్తున్నాను.

మా కుటుంబం గురించి చెప్పాలంటే మా తాత కవిరాజుగారు అప్పటికే ఒక ఉద్యమనేతగా పోరాడిన స్థితి న భూతో న భవిష్యతి. ఎంతో ధైర్యంగా ఒక ప్రత్యామ్నాయ సాంస్కృతిక వారసత్వ పునాది వేసిన మహానుభావుడాయన. నాకు తెలిసి నాన్నగారు తాతగారి భుజాల నెక్కి ప్రపంచాన్ని చూశారు. అందుకే నాన్నగారికి అంత వైవిధ్యమైన దృష్టి, ఒరవడి అలవడ్డాయి.

తాతగారిలో ఎన్నో వైవిధ్యాలు మనం గమనించవచ్చు. వారు హేతువాదులై ఉండీ ఎంతోమంది సనాతనులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. ఆ క్రమంలోనే వారికి ఉన్నవ లక్ష్మీ నారాయణ పంతులుగారితో సాన్నిహిత్యం ఏర్పడింది. వారు ఇంటికి వస్తూపోతూ ఉండేవారు. ఉన్నవగారి పరిచయంతోనే తనలో ఆధ్యాత్మిక ధోరణులు అంకురించాయని నాన్నగారు చెప్పుకునేవారు. అప్పటినుండే నాన్నగారి

సొంత నడక మొదలైంది. ఉన్నవ, ఎం.ఎన్.రాయ్, అరవిందుని ప్రభావం వారిమీద ఉండేవి. ఇప్పటికీ వారిదో అద్భుతమైన ప్రయాణం. ఆ క్రమంలో వారు ఎంతోమందికి చేయూత నిచ్చారు.

నాన్నగారు మా తాతగారిలాగానే నాస్తికులై ఉంటే ఇంక దీంట్లో మాట్లాడటానికి ఏముండేది. తండ్రి నాస్తికుడు కాబట్టి అతడు నాస్తికుడు అయ్యాడు అనుకునేవారు...

వారిలో నాకు బాగా నచ్చింది నిజాయితీ. ఆ క్రమంలో వారు సొంత మనుషుల మీద కూడా రాయడానికి వెనుకాడలేదు. వారి చివరి నవల పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామాలో పాత్రలన్నీ తెనాలిలో తన సన్నిహిత మిత్రుల హిపోక్రసీ మీదనే రాశారు. వారు ఎవరి మెప్పుకోసం రాయలేదు.

హి ఈజ్ ఎ రియల్ థింకర్, రియల్ ఫిలాసపర్.

మా బాబాయి కుల్‌చంద్‌గారు కూడా రాశారు. వారు రాసిన `కరువు రోజుల్లో` అనే నాటకంలో ఎన్టీఆర్, జి. వరలక్ష్మి. నిర్మలమ్మలాంటి హేమాహేమీలు నటించారు. ఆ తర్వాత ఎందుకో వారు రాయలేదు. మా పెద్దన్నయ్య డాక్టర్ రమేష్ కూడా నాటికలు, నాటకాలు రాశారు. వారు మానవత్వం, కుక్కలున్నాయి జాగ్రత్త, శవ కళ్యాణం, మనకికలేరు, దిష్టిబొమ్మలులాంటివి రాశారు. ఆ రోజుల్లో `మానవత్వం` దర్శకులు టి.కృష్ణ, రావుగోపాలరావులాంటివారు బాగా ఇష్టపడ్డ నాటిక. ఆ తర్వాత వారు ఇంగ్లండ్ వెళ్ళారు. రాయడం మానేశారు. మా రెండో అన్నయ్య, చిన్నక్క కూడా కొన్ని కథలు రాశారు. నా కెందుకో రాయడం అబ్బలేదు. ఎప్పుడూ రాయాలని కూడా ప్రయత్నించలేదు.

ఇంతకుముందే చెప్పాను, తాతగారికి ఉన్నవగారికి మంచి సంబంధాలు ఉండేవని. ఉన్నవగారు నడుపుతున్న `శారదా నికేతన్`లో అమ్మ చదువుకున్నారు. ఆ పరిచయమే అమ్మకు, నాన్నకు పెళ్ళి జరిగేందుకు దోహదపడింది. వారు ఏ కథ రాసినా మొదటి శ్రోత, విమర్శకురాలు అమ్మ మాత్రమే. చాలా వరకు నాన్న చెబుతుంటే అమ్మ రాస్తూ ఉండేది. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళల్లో అలానే ఉండిపోయింది. ఆ దృశ్యాన్నే యధాతథంగా నా పరమేశ్వరశాస్త్రి వీలునామా టెలిఫిల్మ్ ప్రారంభ సన్నివేశంగా చిత్రీకరించాను.

నాన్నగారు పోయాక అమ్మ ఎప్పుడూ ఏడుస్తూ ఉండేది. వారు పోయాక తనూ ఎంతోకాలం బ్రతకలేదు. అమ్మా, నాన్న రమేష్ అన్నయ్య నా బాల్యం మీద చెరగని ముద్ర వేశారు.

చివరగా మీతో ఒక మాట చెప్పాలని ఉంది. నాకు జన్మల మీద నమ్మకం లేదు. అయినప్పటికీ, జన్మంటూ ఉంటే మళ్ళీ మళ్ళీ గోపీచంద్‌గారి అబ్బాయిగానే పుట్టాలని కోరుకుంటున్నాను.

✡ ✡ ✡

# ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో నిరంతర చైతన్యదీప్తి డా.ఎమ్.వి.వి.ఎస్.మూర్తి



ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా 650కి పైగా ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. అన్నింటిలోకీ తన ప్రత్యేకతనిలబెట్టుకుంటూ ఎప్పటికప్పుడు కొత్త విభాగాలతో విస్తరిస్తూ 'అందరిలో ఒక్కడు'గా పేరు తెచ్చుకుంటున్న 'గీతమ్'**Gandhi Institute of Technology and Management** పేరు తెలియని తెలుగువారు ఉండరనడంలో అతిశయోక్తిలేదు. ఈ ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థ వెనుకనున్న స్ఫూర్తి డా.మూర్తి గారు. చాలామంది ఈయన్ని చనువుగా 'గోల్డ్‌స్పాట్ మూర్తి' గారు అని కూడా అంటారు. 'గోల్డ్‌స్పాట్' మూర్తి గారి పేరు లేకుండా విశాఖపట్నపు పారిశ్రామిక చిత్రం గురించి మాట్లాడుకోలేము. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి ఎంతగానో దోహదం చేసిన పరిశ్రమల స్థాపనలోనూ, నిర్వహణలోనూ గత నాలుగు దశాబ్దాల పైగా తన ప్రత్యేకతని నిలబెట్టుకుంటున్న డాక్టర్ మతుకుమిల్లి వీర వెంకట సత్యనారాయణ మూర్తి గారే ఆ 'గోల్డ్ స్పాట్' మూర్తిగారు. తెలుగుదేశం పార్టీ తరఫున రెండుసార్లు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన డా.ఎమ్.వి.వి.ఎస్.మూర్తి గారన్నా ఈయనే..! వి.బి.సి గ్రూప్ ఆఫ్ కంపెనీలు ఎన్ని ఉన్నా 'గీతమ్' అంటే మూర్తిగారికి ప్రత్యేకమైన ఆసక్తి , అభిమానం. ఎందుకంటే ఏ దేశ ఆర్థిక ప్రగతి ఐనా ఆ దేశ విద్యా వ్యవస్థ పటిష్ఠత మీదే ఆధారపడి ఉంటుందని నమ్ముతారాయన. విద్య అనేది అందరికీ అందుబాటులో ఉన్నప్పుడు, చదువుకున్న జనాభాశాతం పెరిగినప్పుడు సమాజ పురోగతి శీఘ్రతరమౌతుందని మనసా వాచా నమ్మి దాన్ని అమలులో పెట్టారు, పెడుతున్నారు.

దాదాపు మూడు దశాబ్దాల క్రిందత మొదలైన 'గీతమ్' ఈ రోజు సొంతయూనివర్సిటీ స్థాయికి చేరడమే కాక హైదరాబాదులో 500 ఎకరాల విశాల ప్రాంగణంలో రెండో కాంపస్‌ని నిర్మిస్తోంది. అందరికీ తెలిసిన ఈ కాలేజీ, యూనివర్సిటీనే కాక మూర్తిగారి సహాయ సహకారాలతో రూపుదిద్దుకున్న మరికొన్ని విద్యాసంస్థలు - అమలాపురంలోని మహిళా జూనియర్ కాలేజీ, విశాఖపట్నం , వడ్లపూడి పునరావాస కాలనీలోని డా.అంబేద్కర్ జూనియర్ కాలేజీ, విజయనగరం జిల్లా పుసపాటి రేగలోని శ్రీ సీతారామ డిగ్రీ కాలేజీ, ఆయన స్వగ్రామం మూలపాలంలోని బలహీన వర్గాలకు ప్రత్యేకించిన జూనియర్ కాలేజీ..! ఈ సంస్థలన్నీ ఆర్థికంగా కానీ, సామాజికంగా కానీ వెనుకబడిన వర్గాలకు ప్రత్యేకించినవే కావడం గమనార్హం. ఇవే కాక ఈ రోజుకీ ఎవరైనా చదువుకోసం ఇబ్బందులు పడుతున్నారంటే ఏ సహాయానికైనా ముందుకొచ్చే దాన గుణం మూర్తి గారి ప్రత్యేకత. ఒక పారిశ్రామిక వేత్త, ఒక విద్యావేత్త, ఒక రాజకీయవేత్త, ఒక సంఘసేవా తత్పరుడు..అన్నీ మూర్తీభవించిన వ్యకిత్వం మూర్తిగారిది. విశాఖపట్నాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దిన ఘనత, వుడా పార్కుని విస్తరించిన కృషి, కైలాస గిరిపర్వతాన్ని విహార స్థలంగా తీర్చి దిద్దడానికి పునాదులు వేసిన ప్రత్యేకత, విశాఖపట్నం చుట్టూ

శాటిలైట్ టౌన్ షిప్స్ ఏర్పాటుకి తగిన ప్రణాళికలు..ఇవి కూడా మూర్తి గారి కృషిలో భాగమేనని చాలామందికి తెలియకపోవచ్చు. అనేక స్వచ్ఛంద సేవా సంస్థలతో బాటు, కూచిపూడి కళాక్షేత్రం వెనుక కూడా మూర్తిగారి కృషి ఎంతో ఉంది.


ఒకవైపు పరిశ్రమల విస్తరణలోనూ, మరో వైపు రాజకీయాల్లోనూ తలమునకలుగా ఉంటూ కూడా పట్టుదలతో ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పట్టా సంపాదించిన ఘనతకూడా డా.మూర్తిగారికి దక్కుతుంది.

'గీతమ్' కాలేజీలకి చెందిన పూర్వ విద్యార్థులు, అమెరికాలో స్థిరపడిన వారు, 'గానమ్' **Geetam Alumini of North America** అనే సంస్థని ఏర్పాటు చేసుకుని అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. ఆ పూర్వవిద్యార్థులని కలుసుకోడానికి ప్రతి సంవత్సరం డా.మూర్తిగారు అమెరికాలోని వివిధ ప్రదేశాలని సందర్శించడం ఒక ఆనవాయితీ. అందులో భాగంగానే ఇటీవల సిలికాన్ వేలీకి వచ్చినప్పుడు ఆయన్ని కలుసుకునే అవకాశం 'కౌముది'కి లభించింది. ఎన్నో తీరికలేని కార్యక్రమాల్లో ఉంటూ కూడా రెండు గంటల పాటు వివిధ విషయాల గురించి 'కౌముది' తో ముచ్చటించారు మూర్తిగారు.

ముర్తిగారి విజయగాథ వెనుకనున్న పట్టుదల, నిరంతరశ్రమ.. ఇంకా అనేక విశేషాలని ఈ నెల ప్రత్యేకం గా మీకోసం ఆయన మాటల్లోనే అందిస్తున్నాం.

## కుటుంబనేపథ్యం

మా నాన్నగారి పూర్వీకులు పల్నాడులో ఉండేవారట. వాళ్ళంతా అలనాటి పల్నాటి బ్రహ్మనాయుని సహచరులట. ఐతే కొన్ని శతాబ్దాలక్రిందటే దేశవ్యాప్తంగా వచ్చిన కరువు పరిస్థితుల వల్ల అక్కడనుంచీ గోదావరి తీరానికి వలస వచ్చారట. నాన్నగారి పేరు మతుకుమిల్లి పట్టాభిరామయ్య. అమ్మగారి పేరు మాణిక్యాంబ. మా స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని మూలపాలెం అనే వూరు. బాలయోగి పేరుద్వారా అందరికీ చిరపరిచితమైన ముమ్మిడివరం గ్రామానికి అతి దగ్గరలో ఉంటుంది. నా చిన్నతనంలో శివరాత్రి రోజు బంధువులు మా యింటికి వచ్చి విడిది చేసి, అక్కడనుంచీ ముమ్మడివరం వెళ్ళి బాలయోగిని దర్శించుకుంటూ ఉండేవాళ్ళు. మా వూరు గోదావరికి ఒక వైపున ఉంటే అవతలి వైపున కోటిపల్లి ఉంటుంది. నాన్నగారు మూలపాలంతో పాటు చుట్టుపక్కల వున్నమరో రెండు గ్రామాలకి కూడా మున్సబుగా పనిచేస్తుండేవారు. దానితోబాటే ఒక కో-ఆపరేటివ్ బ్యాంకుకి ప్రెసిడెంట్‌గా కూడా ఉండేవాళ్ళు. ఆయనంటే చుట్టుపక్కల గ్రామాలవాళ్ళందరికీ చాలా గౌరవమూ, వాళ్ళందరకీ ఈయన చాలా సహాయకారిగా ఉండడం జరిగేదట. మా వూరికి దగ్గరలోనే ఉన్న ముక్కామల గ్రామానికి చెందిన అప్పటి ప్రసిద్ధ రాజకీయవేత్త కళా వెంకటరావు గారు నాన్నగారికి ప్రియస్నేహితులట. కళా వెంకటరావు గారు తరచూ మా ఇంటికి వస్తుండేవారట. అమ్మా, నాన్నలకి ఒకరిద్దరు అబ్బాయిలు చనిపోయాక చాలా లేటుగా నేను పుట్టానట. అందుకే నన్ను అతి జాగ్రత్తగా పెంచుకునే వారు. నాకంటే నాలుగేళ్ళు పెద్ద మా అక్కయ్య. నాకు మూడేళ్ళ వయసు ఉండగానే నాన్నగారు తన 36 వయేటనే చనిపోయారు. అంత చిన్నవయసులో అమ్మగారు ఒక్కరే ఏడేళ్ళ అమ్మాయితో, మూడేళ్ళ నాతో స్వంతంగా జీవన సంగ్రామాన్ని మొదలుపెట్టారు. మేము ఆస్థిపరులమే ఐనా నాన్నగారు పోగానే దాయాదులు ఆస్థికోసం కోర్టుల్లో కేసులు వేయడం, నాన్నగారు పనిచేసిన కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో అప్పులు తీసుకున్నవాళ్ళు కట్టకపోతే అవన్నీ అమ్మగారే తీర్చాల్సిరావడం..ఇలాంటి సమస్యలతో నాకు ఊహ వచ్చేటప్పటికి అమ్మగారు ఒంటరి పోరాటం జరుపుతుండేవారు.



## బాల్యం, ప్రాథమికవిద్యాభ్యాసం

నేను ఇంకా చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు మా చిన్న తాతగారు ఇంటిబయట అరుగుమీద నన్ను ఆడిస్తుంటే ఊళ్ళోవాళ్ళు 'ఈ తండ్రిలేని పిల్లవాడు పెద్దయ్యాక ఏమి చేస్తాడు..?' అని అడిగితే 'మా వాడికి ఒక చోట పనిచెయ్యాల్సిన అవసరం లేదు. జీవితాంతం కాలు మీద కాలు వేసుకుని కూర్చున్నా తరగనంత ఆస్థి ఉంది' అని సమాధానం చెప్పేవారట..! ఐతే అమ్మకి మాత్రం నన్ను బాగా చదివించి గొప్ప విద్యావంతుడ్ని చెయ్యాలని ఉండేది. నాకు ఊహ తెల్సిన వద్దనుంచీ అదే చెబుతుండేవారు. కోర్టుకేసుల్లో లాయర్ల చుట్టూ తిరగడం, తాను ఎదుర్కొన్న సమస్యలూ అన్నీ గమనించో ఏమో కానీ 'నువ్వు లాయర్ కోర్సు చదివి పేదవాళ్ళకి ఉచితంగా న్యాయ సహాయం చెయ్యాలి' అని అంటుండేవారు అమ్మగారు.

నేను పుట్టక ముందు నాన్నగారు మావూళ్ళో సొంత స్థలంలో ఒక చిన్న బడి కట్టించారట. ఆయన పోయాక దాన్ని పట్టించుకునే వాళ్ళు లేక అదీ మూతబడిపోయింది. దానితో అంతకుముందు అంతో ఇంతో చదువుకుందామనుకున్నవాళ్ళు కూడా చదువు మానేసిన పరిస్థితి. అమ్మగారు చెప్పిన మాటలూ, ఆమె పరిస్థితిని స్వయంగా పరిశీలించడంతో 'అ..ఆ'లు నేర్చుకునే వయసులోనే చదువంటే నాకు బాగా ఆసక్తి కలిగింది. నాలుగైదేళ్ళ వయసులోనే మా వూరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండుకుదురు అనే వూరికి వెళ్ళేవాడిని. అక్కడ జరిగింది నా ప్రాథమిక విద్యాభ్యాసం. ఎండా, వానా, దుమ్మూ, బురదా..అన్నీ భరిస్తూ రోజూ రెండు కిలోమీటర్లదూరం నడిచివెళ్ళేవాళ్ళం అక్కా, నేనూ. రోజూ నడక వల్ల తరచూ అనారోగ్యంగా ఉండేది. అంత చిన్న వయసులో పుస్తకాల సంచీ మోస్తూ నడవలేను కాబట్టి అక్క నా పుస్తకాలు మోసేది. అలా మొదలైంది నా బాల్యం..!

## హైస్కూలూ, కాలేజీ

ఐదో తరగతి వరకూ అక్కడ చదివాక హైస్కూలు కోసమని అమ్మగారు నన్ను మా మేనమామగారింటికి పంపించారు. అమ్మకి ఆయనొక్కడే తమ్ముడు. వాళ్ళది కపిలేశ్వరపురం దగ్గరలోని మాచర అనే గ్రామం. ఆయన అక్కడ వ్యవసాయం చేస్తుండేవారు. ఎ అక్కడినుంచీ రోజూ బురదకాలువగట్ల వెంబడి నడుచుకుంటూ కపిలేశ్వరపురం హైస్కూలికి వెళ్ళేవాడిని. మా మామయ్యకి పెద్దగా చదువురాదు. నాకు ఇంగ్లీషు అంతగా అర్థమయ్యేది కాదు. స్కూల్లో అందరూ ఎగతాళి చేస్తుండేవాళ్ళు. అప్పుడప్పుడు కాస్త బాధ అనిపించినా మిగతా సబ్జెక్టులన్నీ బాగా కష్టపడి చదివేవాడిని. చివరకు జరిగిందేమిటంటే ఆ బాచ్‌లో ఎస్సెల్సీ పాసయింది నేనొక్కడినే..! ఈ ఫలితం నాలో ఆత్మ విశ్వాసాన్ని నింపింది.

ఇంక పై చదువులకి వెళ్ళాలంటే మాకు దగ్గరలోని అమలాపురంలో అప్పుడే కొత్తగా కాలేజీ పెట్టారు. కానీ అమ్మగారికి నన్ను మంచి కాలేజీలో చదివించాలని ఉండేది. 'కాకినాడ కాలేజీ ఐతే ఎప్పటినుంచో ఉంది. అక్కడ చదువు బావుటుంది' అన్ని అమ్మగారే నిర్ణయం తీసుకుని నన్ను కాకినాడ పి.ఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేర్పించారు. హాస్టల్లో ఉండేవాడిని. మా పొలాల్లో అరటి తోటలు వేసేవాళ్ళు ఆరోజుల్లో. మా కుటుంబానికి మిత్రుడొకాయన ఆ అరటి గెలలని అమ్మడానికి ప్రతి శుక్రవారం కాకినాడ వచ్చేవారు. వచ్చినప్పుడల్లా హాస్టల్‌కి వచ్చి నన్ను చూసి, బాగోగులు కనుక్కునేవాళ్ళు. ఫీజులు వగైరా అన్నీ ఆయనే చెల్లిస్తుండేవాళ్ళు. అలా ఇంటర్మీడియట్ ముగిసింది. అందులో కూడా చాలా తక్కువమందే పాసయ్యారు. తర్వాత డిగ్రీ చెయ్యాలి. అమ్మ గారి మాట ప్రకారం నేను లాయర్ కోర్సు చదవాలి కాబట్టి డిగ్రీలో బి.ఎ కోర్సు తీసుకున్నాను. అన్ని సబ్జెక్టులూ విజయవంతంగా పూర్తిచేసి డిగ్రీ తెచ్చుకునే వాళ్ళు 20 శాతం మించి ఉండేవాళ్ళు కాదు. దాన్ని కూడా విజయవంతంగా సాధించాను. నాకు చిన్నప్పటి నుంచీ స్నేహితులంటే ప్రాణంగా ఉండేది. హైస్కూల్లో కొంతమందీ. ఇంటర్మీడియట్ లో కొంతమందీ ఆగిపోయారు. అలానే డిగ్రీ పూర్తిచెయ్యలేక మరికొంతమంది ఆగిపోయారు. ఐనా పాత మిత్రులు చాలా మందితో పరిచయాలు కొనసాగిస్తూ ఉండేవాడిని.

## 'లా' డిగ్రీ, లాయర్ ప్రాక్టీసు

అమ్మగారి సలహామేరకు 1959లో విశాఖపట్నం ఆంధ్రాయూనివర్సిటీలో అడుగుపెట్టాను. బి.ఎల్ కోర్సు రెండేళ్ళలో 'గోల్డ్ మెడల్'తో పూర్తిచేశాను. ఈ కోర్సు చివరి సంవత్సరంలో ఉండగానే 1961లో పాలకొల్లుకి దగ్గరలోని రాయకుదురు గ్రామానికి చెందిన గన్నమనీడు లక్ష్మయ్య గారి అమ్మాయి సావిత్రీదేవితో పెళ్ళి చేశారు అమ్మగారు. సరే డిగ్రీ అయింది.. చదువుకున్న చదువుకి సార్థకత ఉండాలి అంటే లాయర్ ప్రాక్టీసు మొదలుపెట్టాలి..ఎక్కడ? అమలాపురం, కాకినాడ లాంటి వూళ్ళలో ఐతే చిన్న, చిన్న కోర్టులు..ఫీజులు చెల్లించేవాళ్ళు తక్కువగా ఉంటారు. ఆ వచ్చే కొద్ది మంది కక్షిదారులనే పీడించి ఫీజులు వసూలు చేసుకోవాలి. అది నా స్వభావానికి సరిపడదని నిర్ణయించుకున్నాను. ఇంక మిగిలిన ప్రత్యామ్నాయం హైదరాబాదు వెళ్ళడమే.

నా భార్యని మూలపాలెం లోనే అమ్మగారి వద్దనే ఉంచేసి ఒక్కడినే 1961లో 'లా' ప్రాక్టీసు చెయ్యడానికి హైదరాబాదు బయలుదేరాను.

మా బావగారు (అక్కయ్య భర్త)కి తెలిసిన వాళ్ళ రికమండేషన్‌తో జాస్తి సీతామహలక్ష్మి గారి వద్ద జూనియర్‌గా ప్రాక్టీసు మొదలుపెట్టాను. సీతామహలక్ష్మి గారు అప్పట్లో పేరెన్నికగన్న ఏకైక మహిళా అడ్వకేట్. వారి భర్త జాస్తి సాంబశివరావు గారు అప్పటికే రిటైర్డ్ జిల్లా జడ్జి. ( వీళ్ళ అబ్బాయే రిటైర్డ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వర ప్రసాద్ గారు). సాంబశివరావు గారు ప్రాక్టీసు చెయ్యకపోయినా రోజూ సాయంకాలం వచ్చి మాలాంటి జూనియర్స్‌కి చాలా మెళకువలు చెబుతుండేవారు. ఆయన వద్ద నేను చాలా విలువైన విషయాలు నేర్చుకున్నాను. అక్కడినుంచీ కొన్నాళ్ళు ఆవుల సాంబశివరావు గారి ఆఫీసులో పనిచేశాను.

## ఎన్నాళ్ళిలా..ఎన్నేళ్ళిలా!?

ఈ అభ్యాసంలో నా ఆదాయం అంతంత మాత్రంగానే ఉండేది. ప్రతినెలా ఇంటివద్దనుంచే డబ్బులు తెప్పించుకుంటుండేవాడిని. అందుకే నా భార్యని హైదరాబాదు తీసుకెళ్ళే సాహసం చెయ్యలేదు. ఒక వైపునుంచీ మా మామగారూ, మరో వైపునుంచీ మా అమ్మగారూ 'నీకు ఎంత కావాలంటే ఎంత పంపిస్తాము. హైదరాబాదులో సొంతంగా కాపురం పెట్టు' అనే వాళ్ళు. ఐనా సొంతకాళ్ళమీద నిలబడడమనేది నా జీవిత ధ్యేయం కాబట్టి వాళ్ళ ప్రతిపాదనలకి నేను ఒప్పుకోలేదు. ఒక్కసారి పరిస్థితిని సమీక్షించుకున్నాను. అప్పటికి నాకొచ్చే ఆదాయం ప్రకారం లెక్కలు వేసుకుంటే ఇంకో పదిహేను సంవత్సరాలు పనిచేస్తే కానీ అనుకున్నంత సంపాదించలేను. అప్పటికి నా వయసు 23 సంవత్సరాలు. పెద్దబ్బాయి కూడా పుట్టాడు. ఇట్లాగే కొనసాగడంలో అర్థం లేదనిపించింది. అదే మాట ఆవుల సాంబశివరావు గారికి చెప్పాను. ఆయనేమో 'అంత తొందరగా నిర్ణయం తీసుకోవద్దు. నువ్వు ఈ వృత్తిలో బాగా రాణిస్తావు.. కొన్నాళ్ళు ఇక్కడే వుండిపో..' అని నన్ను ఒప్పించడానికి ప్రయత్నించారు. నేను మాత్రం 'నన్నువదిలెయ్యండి సార్.. ఏదో ఒక వ్యాపారం వైపు వెళ్తాను' అని చెప్పి హైదరాబాదులో మకాం ఎత్తేసి ఇంటికి వచ్చేశాను.

ఏదైనా బిజినెస్ చెయ్యాలనే ఉద్దేశంతో ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఆ సమయంలో కూడా ఖాళీగా కూర్చోకుండా వ్యవసాయంలో కాలుపెట్టాను. రోజూ పొలం వెళ్ళేవాడిని. పొలం దున్నేవాడిని.

## స్టెప్ ఇన్‌టు గోల్డ్‌స్పాట్

**వైజాగ్ బాట్లింగ్ కంపెనీకి శంఖుస్థాపన**

ఆసమయంలోనే , పార్లే బిస్కెట్ కంపెనీవాళ్ళు విశాఖపట్నంలో గోల్డ్‌స్పాట్ బాట్లింగ్ కంపెనీని ఫ్రాంఛైజ్ కి ఇవ్వడానికి సరైన పార్టీకోసం చూస్తున్నారని తెల్సింది. హైదరాబాదులో అప్పటికే అలాంటి బాట్లింగ్ ప్లాంట్ ఉంది. వివరాలకోసమని అక్కడికి వెళ్ళాను. అప్పట్లో ఆనందనగర్ లో ఉండేది ఆ ప్లాంట్. దాని ఇన్-ఛార్జ్ నారాయణ భట్ అనే ఆయన ప్లాంట్ అంతా చూపించి ప్రొజెక్ట్ వివరాలు చెప్పారు. విజయవాడ, విశాఖపట్నం రెండు నగరాల్లోనూ బ్రాంచ్‌లు మొదలుపెట్టడానికి పార్టీలకోసం ఎదురు చూస్తున్నారనీ, రెండూ నన్నే తీసుకోమనీ అన్నారు. అసలు ఒకటే ఎలా చెయ్యాలో తెలీదు, ఇంకా రెండు ఎక్కడ తీసుకోగలను? అనుకుని ఆయనతో ‘ రెండు చోట్ల అవసరం లేదండీ.. విశాఖపట్నం ఒక్కచోట ప్రయత్నిస్తాను‘ అని చెప్పాను. విశాఖపట్నం అంటే నేను చదువుకున్న ఊరు పైగా మా ఊరికి దగ్గరగా ఉంటుంది, అని ఆ నిర్ణయం తీసుకున్నాను.



అప్పుడు తెలిసింది మొత్తం పెట్టుబడి నాలుగు లక్షలు కావాలని! ఒక్కడినే నాలుగు లక్షలు సమకూర్చుకోవడం అసాధ్యం. నాతో చదువుకున్న స్నేహితులతో సంబంధ బాంధవ్యాలు బాగానే ఉండేవని ముందే చెప్పాను కదా. నాతో బాటు ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకున్న కొంతమంది పాత మిత్రుల్ని కలిసి ఈ ప్రాజెక్టుగురించి చెప్పాను. వాళ్ళూ సానుకూలంగా స్పందించారు. అప్పుడు తెలిసింది రెండు లక్షలు మేము పెటుబడి పెడితే చాలనీ, మిగతా రెండు లక్షలూ బ్యాంకు అప్పుగా ఇస్తుందనీ. సరే, నా మిత్రులు నలుగురూ కల్సి లక్షన్నర పెట్టడానికి ఒప్పుకున్నారు. నా వంతు 50 వేలు కావాలు. అమ్మని అడిగితే తన నగలు ఇచ్చి తాకట్టు పెట్టి తెచ్చుకోమని చెప్పింది. అవి తీసుకుని మార్వాడి వద్దకి వెళ్ళాను. నన్ను బాగా తెల్సిన ఆ మార్వాడి పెద్దమనిషి నా ప్రయత్నాల గురించి తెలుసుకుని నగలు లేకుండానే 50 వేలు అప్పు ఇస్తానన్నాడు. ఐనా ఒప్పుకోకుండా, అమ్మ నగలు అతని వద్దే ఉంచి, యాభైవేలు తీసుకున్నాను.

మొత్తానికి 2 లక్షలు సమకూరాయి. అప్పుడు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి వెళితే మిగతా మొత్తానికి కొలాటరల్ సెక్యూరిటీ ఉంటే తప్ప లోన్ ఇవ్వరని చెప్పారు. మళ్ళీ ఇంటికి వచ్చాను. నా వంతుగా లక్షరూపాయల ఆస్థి చూపించాలి. మాకున్న ఆస్థి 50 ఎకరాలకి లక్షరూపాయల విలువ ఉంటుందని సర్టిఫికెట్ కావాలి. మా నాన్నగారి మిత్రుడైన కరణం గారి వద్దకెళ్ళాను. ‘బాబూ.. తాసిల్దారుగారి వద్దనుంచి సర్టిఫికెట్ తెచ్చి పెడతాను. ఐతే ఒక షరతు.. లక్ష రూపాయలకి సర్టిఫికెట్ కావాలంటే 100 రూపాయలు ఖర్చు ఔతుంది, రెండు లక్షలకి కావాలంటే రెండు వందలు ఔతుంది‘ అని చెప్పారు. ఐతే చుట్టుపక్కలవాళ్ళు అన్నారు.. ’నువ్వు ఈ కరణం గారికి ఇచ్చావంటే అది ఆయన వద్దనే ఉండి పోతుంది. ఎందుకు అనవసరమైన ఖర్చు నువ్వే వెళ్ళి తాసిల్దారు గారి ఆఫీసునుంచీ తెచ్చుకో..‘ అని. సరే అనుకుని నా అంతట నేనే అమలాపురం తాసిల్దారు గారి ఆఫీసుకి వెళ్ళాను. వారం, రెండు వారాలు..మూడు వారాలు తిరిగాను. అప్పటికి 300 ఖర్చు అయ్యాయి, పైగా 100 రూపాయలు ముడుపులు సమర్పించాల్సి వచ్చింది. అప్పుడు తెలుసుకున్నాను మొదటి సూత్రం ‘ఎవరితో నైనా పని ఔతుందనుకుంటే వాళ్ళతో చేయించేసుకోవడం మంచిది. అన్ని పనులూ మనమే చేద్దామనుకుంటే ప్రొడక్టివిటీ తగ్గుతుంది..‘ అని!

ఆ విధంగా రెండు లక్షల పెట్టుబడి, సమాన విలువగల కొలాటరల్ స్యూరిటీ పట్టుకుని లోన్ కోసం ఆంధ్రాబ్యాంకుకి వెళ్ళాము. అప్పటి ఛైర్మన్ స్వామినాథ రెడ్డి గారు (తర్వాత మా కంపెనీలో డైరెక్టర్‌గా కూడా పనిచేశారు) మిగతా లోన్ ఇచ్చారు. అన్నీ సమకూరి 1967 లో వి.బి.సి (వైజాగ్ బాట్లింగ్ కంపెనీ) ప్లాంట్‌కి పునాదిరాయి వేశాము. 1968లో ప్రొడక్షన్ మొదలైంది. అప్పట్లో గోల్డ్‌స్పాట్ కి పోటీ లేదు. కోకా-కోలా ఇంకా మనదేశంలోకి రాలేదు. ఒక్క రామచంద్రాపురంలోనే ఎ.ఆర్. రాజు అనే ఆయన ఆల్టాస్ అనే డ్రింక్‌ని అమ్మేవారు. అది పార్లేకి పోటీగా నిలవలేకపోయింది. మొదటి ప్రయత్నమే విజయవంతమైంది. సరిగ్గా రెండేళ్ళలో మేము పెట్టిన నాలుగు లక్షలు మాకు వచ్చేసింది. అలా మొదలైన నా పారిశ్రామిక భాగస్వాములు, నేనూ ఇప్పటికీ కలిసే ఉన్నాము.

## పెద్దన్నయ్య..!

అప్పటికి మేమంతా పాతికేళ్ళకి అటూ ఇటూగా వున్న యువకులమే. అనుభవం తక్కువ. అందుకని మాకంటే 17 ఏళ్ళు పెద్ద ఐన జాస్తి కృష్ణమూర్తి అనే ఆయన్ని వి.బి.సి లోకి తీసుకున్నాం, మాకు పెద్దవారి అండకావాలని. అప్పటికి ఆయన రాజమండ్రిలోని సదరన్ ఏజెన్సీస్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేసేవారు. ఇండస్ట్రీ నడపడంలో ఆయన మాకు చాలా మెళకువలు, సులువు పద్ధతులూ నేర్పారు. మాకు పెద్ద అన్నయ్యలా వుండేవారు. సేల్స్‌టాక్స్‌కీ, ఇన్‌కమ్ టాక్స్‌కి తేడా లాంటి ఫండమెంటల్స్ అన్నీ వారి వద్దనే నేర్చుకున్నాం. వయసులో చిన్నవాడినైన నాకు చాలా గౌరవమిచ్చేవారాయన. నా ఇన్నొవేటివ్ ఐడియాలని బాగా మెచ్చుకునేవారు.

## ముందుకి.....మునుముందుకి..!

1970లో జై ఆంధ్రా ఉద్యమం ఉధృతంగా ఉన్నప్పుడు పార్లే వాళ్ళు మమ్మల్ని పిల్చి 'హైదరాబాదు ప్లాంట్ సరిగ్గా నడవడం లేదు. మాకు ఇబ్బందిగా ఉంది. దాన్ని కూడా మీరే తీసుకోండి' అని అడిగారు. అప్పటికి మాకు కాన్ఫిడెన్స్ వచ్చింది. ఐతే పెట్టుబడికి వచ్చేసరికి పదిలక్షలు కావాలన్నారు. మావద్ద అంత డబ్బు లేదు. అప్పటికి వి.బి.సి మీద వచ్చిన ఆదాయం నాలుగు లక్షలే ఉంది. అదే విషయం, చెప్పాము. వాళ్ళు 'ఫర్వాలేదు. ఆ నాలుగు లక్షలే ఇవ్వండి. మిగతావి వాయిదాలమీద చెల్లించండి' అన్నారు. వాళ్ళు మామీద ఉంచిన నమ్మకానికి మాకు చాలా సంతోషమేసింది. సరే అని దానిలోకి దూకాము. కృష్ణమూర్తి గారిని ఆ బ్రాంచి చూసుకోమని హైదరాబాదు పంపించాము. విశాఖపట్నం ప్లాంట్ అంతా నేను చూసే వాడిని. మిగతా భాగస్వాములు నాకు సహాయంగా ఉండేవారు.

అలా మొదలైన మా పారిశ్రామిక విస్తరణ దిగ్విజయంగా కొనసాగింది. 1980 లోగానే అంటే పదేళ్ళలోపే పాణ్యం సిమెంట్ కర్మాగారాన్ని కొన్నాం. శ్రీకాకుళం దగ్గరలో ఒక కెమికల్ ఫేక్టరీ మొదలు పెట్టాము. విజయవాడ క్వాలిటీ ఐస్ క్రీమ్ కంపెనీని కూడా మొదలుపెట్టాము. 1980 లో ఎ.పి.ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కి ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. విశాఖపట్నంలోని వాల్తేర్ క్లబ్‌కి కూడా రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేశాను.

మేము ఏ పరిశ్రమ మొదలుపెట్టినా సమాంతరంగా సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవాళ్ళం. గోల్డ్‌స్పాట్ కంపెనీ ఉద్యోగస్తులమంతా వారాంతంలో విశాఖచుట్టుపక్కల ఉన్న గ్రామాలకి వెళ్ళి కుటుంబనియంత్రణ ప్రచారం చేస్తుండేవాళ్ళం. వాళ్ళని ఒప్పించడం కోసం ఇంటింటికీ ఒక స్టీలు బిందె, కొత్త బట్టలూ కూడా పంచిపెడుతుండే వాళ్ళం. అప్పట్లో విశాఖపట్నానికి సహాయ కలెక్టర్‌గా జయప్రకాష్ నారాయణ (లోకసత్తా) గారు ఉండేవారు. ఆయన మా కంపెనీ చేసే ఇలాంటి సంఘసేవా కార్యక్రమాలకి తగిన చేయూతనిస్తుండే వాళ్ళు. ఇంకా పెద్ద ప్రోజెక్టులు, సమాజంలో కొద్ది మందికే కాక ఎక్కువ శాతం మందికి ఉపయోగపడే ప్రణాళికలు చేపట్టాలని ఉండేది.

అలాంటి సమయంలోనే ఒక సంఘటన నా పారిశ్రామిక జీవితాన్ని ఒక మలుపు తిప్పింది.

## 'గీతమ్' ఆవిర్భావం-నేపథ్యం




1980 అగస్టు- సెప్టెంబర్ ప్రాంతాల్లో అనుకుంటాను, మా చిన్నబ్బాయి ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఇంజినీరింగ్ లో చేరడానికి సిద్ధమయ్యాడు. తనతో బాటు నా మిత్రులు మరో ఇద్దరు వాళ్ళ పిల్లలకి కూడా ఇంజినీరింగ్ సీట్లకోసం చూస్తున్నారు. అప్పట్లో కొత్తగా మొదలైన విజయవాడ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్‌కి వెళ్ళి సీట్లకోసం అడిగాము. అప్పట్లో డొనేషన్ పాతికవేలో ఎంతో ఉండేది. మూడు సీట్లకీ కలిపి లక్ష రూపాయలైనా ఇస్తానని అన్నాను. కానీ వాళ్ళు ఒక్కసీటు మాత్రమే ఇస్తామన్నారు. వాళ్ళ ఇబ్బందులేవో వాళ్ళకి ఉండి ఉంటాయి. ఐనా ఒక్కసీటుతో మా సమస్య తీరదు. ఏం చెయ్యాలా అని ఆలోచించి చిరకాల మిత్రుడు, అప్పటి అంజయ్య గారి మంత్రివర్గంలో రాష్ట్రమంత్రి ఐన నాదెండ్ల భాస్కరరావు వద్దకి వెళ్ళాను."ఏమయ్యా భాస్కరరావు..ఇదీ పరిస్థితి. నువ్వేమైనా సహాయం చేస్తావా?" అని అడిగాను. "నాదీ అదే పరిస్థితి మూర్తీ..రెండు సీట్లు కావలంటే ఒక్క సీటే ఇచ్చారు. పోనీ ఒక పనిచెయ్యకూడదూ. నువ్వే ఒక ఇంజినీరింగ్ కాలేజీ పెట్టెయ్యరాదూ..?" అన్నాడాయన.

"ఆఁ..ఇంజినీరింగ్ కాలేజీ పెట్టడమంటే అంతతేలికా? ఆ రంగంలో మాకేమీ అనుభవం లేదయ్యే..!?"

"నువ్వు పెట్టిన పరిశ్రమలన్నీ అనుభవం ఉండే పెట్టావేమిటి? ప్రణాళికా బద్ధంగా పనిచేసే నీకు ఏదీ అసాధ్యం కాదు. చెప్పు..నువ్వు ఊఁ..అంటే ఈ రోజే ముఖ్యమంత్రి గారితో పర్మిషన్ లెటర్ మీద సంతకం పెట్టిస్తాను.." అన్నాడు భాస్కరరావు.

నేనూ ఆలోచించాను. వెంటనే సానుకూలంగా నిర్ణయం తీసుకున్నాను. అప్పటికప్పుడు లెటర్‌హెడ్ తెప్పించి విశాఖపట్నంలో కొత్త ఇంజినీరింగ్ కాలేజీ కోసం దరఖాస్తు పెట్టాను. మధ్యాహ్నమే ముఖ్యమంత్రి అంజయ్యగారిని కలవడం, నా లెటర్ మీద సంతకం పెట్టి తదుపరి చర్యకోసం సెక్రటరీ రాఘవేంద్రరావుగారికి పురమాయించడం అన్నీ ఒక్క పూటలో జరిగిపోయాయి. ఎకడమిక్ లైన్‌లో కాస్త పేరున్న వాళ్ళు ప్రెసిడెంట్‌గా ఉంటే బావుంటుందని సలహా ఇచ్చారు కృష్ణమూర్తిగారు. ఆయన మాట ప్రకారమే, 30 సంవత్సరాలు ఐ.ఎఫ్.ఎస్‌లో పనిచేసి అప్పుడే రిటైరైన నూతక్కి వెంకటేశ్వరరావు గారిని ప్రెసిడెంట్‌గా , నేను సెక్రటరీగా అప్లికేషన్‌లో పేర్కొన్నాము.

సరే, రాఘవేంద్రరావు గారు తను చెయ్యాల్సిన పని పూర్తిచేసేసి, తన పై సెక్రటరీకి ఫైల్ పంపించారు. నేనే ఆ ఫైలు తీసుకెళ్ళాను "ఇవ్వాళే కదా ఛీఫ్ మినిస్టర్ గారు సంతకం చేసింది. మీరు వెళ్ళొచ్చు. నేను పరిశీలించి చెబుతాను.." అన్నారాయన. విశాఖపట్నం వెళ్ళిపోయాను. వారం జరిగినా ఏమీ సమాచారం లేకపోయేసరికి నేనే మళ్ళీ హైదరాబాదు వెళ్ళి ఆయన్ని కలిశాను..

"మీరు ఫైలు ఇచ్చి వారం రోజులేగా అయింది. గర్భధారణ జరిగాక తొమ్మిది నెలలకి గాని బిడ్డ పుట్టదు. దేనికి పట్టే టైమ్ దానికి పడుతుంది. తొందరపడితే ఏ పనీ కాదు.." అని నాకు నీతిబోధ చెయ్యడం మొదలు పెట్టారు.

"ఇదేమిటీ..అన్నీ త్వరగా జరిగిపోతుంటే ఈయన ఇలా అంటున్నారు. ఆయన అన్నట్లే తొమ్మిది నెలలు టైమ్ తీసుకుంటారా ఏమిటీ..?" అనుకుంటూ మళ్ళీ రాఘవేంద్రరావు గారి వద్దకెళ్ళి " అయ్యా..అక్కడ పని అయ్యేలా లేదు. మీరు ముఖ్యమంత్రి గారి చెబుతున్నారని అంటే తప్ప త్వరగా కదిలేలా లేదు.." అని వివరించాను. ఆయన కూడా ఒత్తిడి పెట్టాక మొత్తానికి ఫైలు కదిలింది. పర్మిషన్ లాంఛనాలన్నీ పూర్తయ్యాయి. ఇంజినీరింగ్ కాలేజీ అంటే కనీసం 30 ఎకరాలు స్థలం, 50లక్షలు మూలధనం

కావాలి. మళ్ళీ ఆంధ్రాబ్యాంకు స్వామినాథరెడ్డి గారి వద్దకే వెళ్ళి ఆ మేరకు బ్యాంకు గ్యారంటీ తెచ్చాము. అలానే ప్రస్తుతం 'గీతం' యూనివర్సిటీ, కాలేజీ ఉన్న స్థలంలో 50 ఎకరాలు సేకరించాము. సెప్టెంబర్‌లో బీజం వేసుకున్న సంకల్పం డిసెంబర్‌కల్లా కాలేజీ ప్రారంభానికి దారితీసింది. ఈ లోగా మేము ప్రయత్నించిన ముగ్గురికీ విజయవాడ సిద్ధార్థలో సీట్లు ఇచ్చారు. వాళ్ళు అక్కడ చేరిపోయారు. ఐతే మా కాలేజీ మొదలయ్యాక అక్కడ డొనేషన్ వృధా ఐతే అయిందిలే అని, వాళ్ళని కూడా మా కాలేజీకే తీసుకొచ్చేశాం..

అలా 1980 డిసెంబర్‌లో 'గీతమ్' విద్యా సంస్థల ప్రస్థానం మొదలైంది..!

## అక్షరాస్యతే చాలా సమస్యలకి పరిష్కారం

మిగతా పరిశ్రమలు ఎన్ని ఉన్నా, ఈ గీతమ్ విద్యాసంస్థలు నా హృదయానికి బాగా దగ్గరగా ఉంటాయి. భారతదేశాన్ని విజ్ఞాన సమాజం (నాలెడ్జి సొసైటీ)గా మార్చేది విద్యావ్యాప్తి ఒక్కటే అని మా నమ్మకం. విద్యార్జన అనేది అనేక సామజిక రుగ్మతలని రూపుమాపడానికి ప్రతిభావంతమైన పరిష్కారం అని కూడా నేను విశ్వసిస్తాను. మన పెద్దవాళ్ళు చెబుతారు కదా 'రోజూ చేపలకూర పెట్టే బదులు చేపలు ఎలా పట్టాలో నేర్పించు' అని. అలానే కుటుంబ సంక్షేమ పథకాలు, ఆర్థిక సంస్కరణలూ..ఎన్ని ఉన్నా ప్రజల్ని విద్యావంతుల్ని చేస్తే కొన్ని తరాలు బాగుపడతాయని గట్టిగా నమ్ముతాను. దాదాపు 30 సంవత్సరాల క్రిందట మొదలైన గీతమ్ సంస్థని శాఖోపశాఖలుగా విస్తరించాము. విశాఖపట్నంలోని కాంపస్ ప్రారంభంలో మొదలు పెట్టిన ఇంజినీరింగ్ కాలేజీతో బాటు, మిగతా అనేక కాలేజీలని ఏర్పాటు చేశాము. 2007 లో డీమ్డ్ యూనివర్సిటీ స్థాయిని కూడా తెచ్చుకోగలిగాము. ఈ సంవత్సరం(2009)లోనే హైదరాబాదులో పతాన్ చెరువు సమీపంలోని రుద్రారం అనే గ్రామంలో గీతమ్ విశ్వవిద్యాలయం రెండో కాంపస్‌ని మొదలుపెట్టాము. 500 ఎకరాల విశాలప్రాంగణంలో అన్ని వసతులతో దాన్ని విశిష్టమైన విద్యాసంస్థల సముదాయంగా తీర్చి దిద్దాలనేది మా ప్రణాళికలో ముఖ్యమైన అంశం. అలానే రెగ్యులర్‌గా కాలేజీకి వచ్చి చదువుకోలేని వాళ్ళకోసమని దూరవిద్యాబోధనని కూడా ఈ సంవత్సరమే మొదలుపెట్టాము. ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి కోర్సుకి అనుమతి పొందిన మొట్టమొదటి ప్రైవేటు విద్యాసంస్థ మాదే ననుకోవడం వెనుక, మా సంస్థని విజయవంతంగా నడపడంలో అహరహం శ్రమిస్తున్న అనేక మంది ఉన్నత విద్యావంతుల పాత్ర ఎంతైనా ఉంది.

## రాజకీయ జీవితం

1983లో ఎన్టీరామారావు గారు తెలుగుదేశం పార్టీని మొదలుపెట్టినప్పుడు చిరకాల మిత్రుడు నాదెండ్ల భాస్కరరావు నన్ను కలుసుకుని పార్టీకి మా సహాయం కావాలని అడిగాడు. పార్టీ తొలిరోజుల్లో మాకు తోచినంత సహాయం చెయ్యగలిగాము. పార్టీ అధికారం లోకి వచ్చాక మళ్ళీ నా పారిశ్రామిక వ్యవహారాల్లో నేను మునిగిపోయాను. కొన్ని రోజులకి ఎన్టీఆర్‌గారు ఒకసారి విశాఖపట్నం వచ్చినప్పుడు " ఏరీ ..మూర్తిగారు మళ్ళీ కనిపించడం లేదేమిటీ?" అని అడిగారట. ఆయన విడిది చేసిన సర్క్యూట్ హౌస్ మా బంగళాకి ఎదురుగానే ఉంటుంది. రెంటికీ రోడ్డు ఒక్కటే అడ్డం. ఎవరో వచ్చి నాకావిషయాన్ని తెలియచేశారు. వెళ్ళి రామారావు గారిని కలిశాను. 'మూర్తిగారూ..మీలాంటి వారి సేవలు పార్టీకి నిరంతరం కావాలి. పార్టీ క్రియాశీలకరాజకీయాల్లోకి మీరు రావాలి.' అని స్పష్టంగా సందేశమిచ్చారు. అప్పటినుంచీ తెలుగుదేశం పార్టీకార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం మొదలుపెట్టాను. 1987లో నన్ను విశాఖపట్నం అర్బన్ డెవలప్ మెంట్ సొసైటీకి అధ్యక్షుడిని చేశారు. అందులో కొనసాగిన మూడు సంవత్సరాలూ, విశాఖపట్నానికి చేయగలిగినంత సేవచేశాను. తర్వాత రెండు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాను. కొద్ది నెలల క్రిందటి వరకూ తెలుగుదేశం రాష్ట్ర కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా వున్నాను. ఐతే మీద పడుతున్న వయసుదృష్ట్యా కొత్తవారికెవరికైనా ఆ పదవిని ఇవ్వమని నేనే చంద్రబాబు నాయుడు గారికి సూచించాను.

## వర్తమానం

ప్రస్తుతం ఒక విధంగా రిటైర్మెంట్ లైఫ్ నాది. నాలుగు దశాబ్దాలుగా పెరిగిన మా పరిశ్రమలని భాగస్వాములందరమూ సమానంగా పంచుకున్నాం. నా వంతు వచ్చిన పరిశ్రమలని మా అబ్బాయిలిద్దరూ చూసుకుంటున్నారు. వారి శక్త్యానుసారం కొత్త కొత్త ఇండస్ట్రీస్‌ని కూడా వాళ్ళు మొదలుపెట్టారు. ఎప్పుడైనా నా వద్దకి సలహాలకి వస్తుంటారు. వాళ్ళిద్దరూ హైదరాబాదులోనే ఉంటారు. నా నివాసం విశాఖపట్నమే.

## మరపురాని స్ఫూర్తి .. మాతృమూర్తి

నా విజయాలన్నింటికీ పునాది, స్ఫూర్తి మా అమ్మగారే అని చెప్పాలి. 'ఏదోఆస్థి ఉంది కదా..ఊళ్ళోనే పొలం చేసుకుంటూ ఉండిపో..' అనకుండా ఎంతో పట్టుదలతో నన్ను చదివించిన అమ్మగారి స్ఫూ ర్తే నన్ను ఇంతదూరం నడిపించింది, ఇంకా నడిపిస్తోంది. రెండేళ్ళ క్రిందటి వరకూ మా సొంత వూరైన మూలపొలంలోనే నివసించిన అమ్మగారు 2007లో తన 94వ యేట పరమపదించారు. నా విజయాల గురించి విన్నప్పుడు 'చాలా ఇండస్ట్రీలు పెడుతున్నావటగదా..'అనే వారు. 'అవునమ్మా..నీకేమన్న కావాలా?' అంటే 'నాకే మీ వద్దు మన వూళ్ళో ఒక స్కూలు కట్టించు' అనే వారు. తర్వాత 'కాలేజీ కట్టించు' అనేవారు. 2,500 మంది జనాభావున్న మూలపొలం గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చి దిద్దటానికి నావంతు కృషి చేశాను. ప్రభుత్వం వారు కూడా గుర్తించి అవార్డునివ్వడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

## నేర్చుకున్నది


ఇన్నేళ్ళలో ఇన్ని రంగాల్లో ప్రతిరోజూ కొత్తపాఠమే, ప్రతి అనుభవమూ కొత్త సందేశమే. యువతరానికి నేను చెప్పదలచుకున్నది - చదువు యొక్క ప్రాముఖ్యతని ప్రచారం చెయ్యండి. మీకు వీలైనంతలో ఎక్కువమందిని విద్యావంతులని తయారు చేయడానికి కృషిచేయండి. కొత్త దారుల్లో వెళ్ళేప్పుడు ఆటంకాలు సహజం. వాటికి భయపడి వెనుకంజవేస్తే పురోగతి ఆగిపోతుంది. నిరంతర పరిశ్రమ, సత్సంకల్పం మనిషిని లక్ష్యానికి చేరిస్తాయి. చాలా సార్లు ఎంతో కృషి చేస్తున్నా ఆశించిన ఫలితం రాలేదనిపిస్తుంది. - అలాంటప్పుడు మీరు పెట్టిన కృషి సరిపోలేదన్నమాట. మరింత కృషి చేయండి. నేను పాటించిన సూత్రం కూడా ఇదే

అమెరికాలో ఉండి కూడా మీరు ప్రతిఫలాపేక్షలేకుండా 'కౌముది' లాంటి పత్రికని నడుపుతున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. ఈ ఇంటర్వ్యూ ద్వారా 'కౌముది' పాఠకులని కలుసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది.



దాదాపు మూడు, నాలుగు దశాబ్దాల క్రిందట సినిమాలు, పత్రికలు, రేడియో.. ఇవి మాత్రమే వినోద కాలక్షేపాలు. సినిమా థియేటర్లు, పుస్తకాలూ అన్ని ఊళ్ళకీ వెళ్ళకపోయినా 'పంచాయితీ రేడియో' రూపంలో ఆకాశవాణి మాత్రం అన్ని చోట్లా విస్తరించి ఉండేది. ఆకాశవాణిలోని ఎనౌన్సర్లకి ప్రత్యేకమైన క్రేజ్ ఉండేది అప్పట్లో. మిగతావాళ్ళకంటే భిన్నంగా ఆ రోజుల్లోనే సినిమా పాటలతో విభిన్న తరహా కార్యక్రమాలని రూపొందించి ప్రసారం చేసి, శ్రోతలని కూడ అందులో భాగస్వాముల్ని చేసి, అనౌన్సర్లలో స్టార్ ఇమేజ్‌ని సంపాదించుకున్న అలనాటి 'రేడియో రామం' గారి జ్ఞాపకాల సంపుటి ఈ నెల ప్రత్యేకంలో మీకోసం.

**కాగడా** పెట్టి వెతికినా ఒక్క రేడియో కూడా కనిపించని ఊరు మాది! ఎస్.ఎస్.ఎల్.సి వరకూ కరెంటు ఎరుగని పల్లె మాది. మా ఊరు ఖండవిల్లి. తణుకు తాలూకా. పశ్చిమ గోదావరి జిల్లా. పదహారవ ఏడు దాకా కరెంటు లేదు మాకు. కిరోసిన్ దీపం దగ్గరే చదువు. హరికేన్ లాంతరే సాయం. సాయంత్రం అయిందంటే! 1960 తరువాతే కరెంటు వెలుగు ఖండవిల్లిలో ప్రవేశించింది.



సినిమా చూడాలంటే ఏడు మైళ్ళు సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళాలి. ఇంట్లో మా నాన్నగారు కొన్న గ్రామఫోన్ ఉండేది. తణుకులో సినిమా రికార్డులు కొనుక్కుని, గ్రామ్‌ఫోనులో వేసుకుని పాటలు వినేవాళ్ళం. అలాగ పాటలు అలవాటయ్యాయి చిన్నతనంలోనే. టూత్ బ్రష్ కొనాలన్నా, టంగ్ క్లీనర్ కావాలన్నా, ఆఖరికి జ్వరం వస్తే తినే బ్రెడ్ కూడా తణుకే ఆధాతం అవడంతో - తణుకు మాకు 'డ్రీమ్‌లాండ్'లాగ ఉండేది. ఎప్పుడు ఛాన్సు దొరికితే అప్పుడు తణుకు వెళ్ళిపోతూ ఉండేవాళ్ళం. తణుకులో మా పెదనాన్నగారు లాయరు. అంచేత ఎప్పుడు తణుకు వెళ్ళినా, ఎన్నాళ్ళున్నా సమస్యలేదు. ఇప్పటికీ తణుకు తాలూకు అనుభూతులు నన్ను వెంటాడుతూనే ఉంటాయి.

కాలేజీ చదువుకి, కుటుంబ పరిస్థితులవల్ల నెల్లూరు వెళ్ళాల్సివచ్చింది. డిగ్రీ అయాక, మద్రాసుకి మారింది మకాం. అక్కడ అడయారు ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో మూడు సంవత్సరాలు ఫిలిం కోర్సు చదివాను. 1968వ సంవత్సరానికి సౌండ్ బ్రాంచిలో బెస్ట్ స్టూడెంట్ అవార్డు ఇచ్చారు ఏవియమ్ చెట్టియార్! కొంతకాలం షార్టు ఫిలిమ్స్ నిర్మించాం ఏడుగురు మిత్రులం కలిసి. బి.ఎన్.రెడ్డిగారు కూడా మా ఫిలిమ్స్ చూసి మెచ్చుకుని ఆశీస్సులందించారు.

మళ్ళీ పరిస్థితులు మారాయి! 1970 నుంచీ రేడియోలోకంలోకి వచ్చిపడ్డాను. 1970లో వైజాగ్, 1971లో హైదరాబాద్ ఆకాశవాణిలో టెంపరరీ ఉద్యోగం. 1972 నుంచీ విజయవాడ వివిధభారతి స్టేషన్ పర్మినెంట్ ఉద్యోగం. 2002 వరకూ సీనియర్ గ్రేడ్ ఎనౌన్సర్‌గా ఉద్యోగం. అదృష్టవశాత్తూ ఆ టైములోనే ఎన్నో కార్యక్రమాలు చేసే అవకాశం దొరికింది. అలాగే ఎంతో మంది పెద్ద పెద్ద వారితో కలిసి పనిచేసే అదృష్టం కూడా లభించింది.

నాటక శాఖలో శంకరం మంచి సత్యంగారు. సంగీత శాఖలో ఓలేటి వెంకటేశ్వర్లుగారు, తెలుగు ప్రవచన శాఖలో పేరెన్నికగన్న కళాకారులు ఉషశ్రీగారు - పేరు పొందిన ఎనౌన్సర్లు ఏబి.ఆనంద్, లింగరాజు శర్మ కోకా సంజీవరావు, ఎం.వాసుదేవ మూర్తి మొదలైన సిబ్బందితో - ఒకే కుటుంబంగా కాలం గడిచింది. వీరేగాక, శ్రీరంగం గోపాలరత్నం, వింజమూరి లక్ష్మి, విబి కనకదుర్గ, నాగరత్నమ్మ,

సి.రామ్మోహనరావ్ నండూరి సుబ్బారావుగారు - మొదలైన పేరెన్నిక గల gaints తో పనిచేసే అరుదైన అవకాశం కూడా లభించింది ఇంత పెద్ద కుటుంబాన్ని అన్నివేళలా కనిపెట్టుకుని గైడ్ చేసే ఇంటి పెద్ద, స్టేషన్ డైరెక్టర్ బాలాంత్రపు రజనీ కాంతరావుగారు కొండంత అండలా ఉండేవారు. అటు సీనియర్ కళాకారుల దగ్గరనుంచీ - ఇటు నాలాంటి యువజనులవరకూ అందరికీ దిశానిర్దేశం చేసేవారాయన. ఎవరిలో 'టేలంట్' ఉన్నా సరే, అది బయటకి తీసి, పదును పెట్టి గాలిలో (AIR) కి వదిలేవారు ఆయన. ఇప్పటికీ ఆయన హైదరాబాద్‌లో సంపూర్ణ ఆరోగ్యంతో, అందరినీ పలకరించి యాక్టివ్‌గా ఉన్నారంటే అది భగవంతుడి దీవెనే అనుకోవాలి.

నేను 1972 లో విజయవాడ, వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలో చేరిన తరువాత నుంచీ, ఎన్నో సంగీత కార్యక్రమాలకు రూపుదిద్దే అవకాశం లభించింది. రోజూ మూడుపూటలా శ్రోతలు కోరిన సినిమా పాటలు 'జనరంజని' కార్యక్రంలో వినిపించేవాళ్ళం. ఇంతకంటే కూడా - ఫీచర్ టైప్ లో ఏదైనా సీరియల్ ప్రోగ్రామ్స్ చేస్తే క్రియేటివ్‌గానూ ఉంటుంది, ఇంట్రెస్టింగానూ ఉంటుందని నా భావన. రజనిగారి ఆశీస్సులతో అనేక కార్యక్రమాలు చేసేవాడిని. ముందుగా 'సరాగమాల'! పేరులోనే అర్థం ఉన్నట్టు - ఒకే శీర్షికలోకి వచ్చే సినీ పాటల్ని ఏర్చికూర్చి, వాఖ్యానం కలగలిపి ఈ కార్యక్రమం కొన్ని సంవత్సరాలు కొనసాగించాను. శ్రోతలకి బాగానే నచ్చింది ఆ కార్యక్రమం. అప్పుడే స్థిరపడింది ' రేడియో రామం' అనే పేరు నాకు! మరికొన్నాళ్ళకి 'ఇంద్రధనసు' అనే కార్యక్రమం ప్లే చేసా. ఇది కొంచెం విజ్ఞాన ప్రధానమైన కార్యక్రమం. అటు వినోదం, ఇటు సమాచారం - రెండూ కలిగలిపిన ప్రోగ్రాం. ఒక్కోవారం ఒక్కో సంగీత వాద్యాన్ని శ్రోతలకు పరిచయం చేయటం. ఆ వాద్యం వినటానికి అసలు ఈ రూపం ఏమిటో శబ్దమూలకంగా వినియోగించిన సినిమా పాటల్ని ఎన్నుకుని - వరసగా ఒక్కోపాట శ్రోతలకు అందించడం. సంగీతంలో ఏడు స్వరాలు. ఇంద్రధనసులో ఏడురంగులు కనక, ఈ ప్రోగ్రాం పేరు ఇంద్రధనస్సు అని పెట్టాను. మొదట్నించీ పదవఏట నుంచీ రేడియో సిలోన్‌లో సినిమా పాటల కార్యక్రమాలు వినడం అలవాటవడం వల్ల - ఈ కొత్త కార్యక్రమ తయారీకి ఎక్కువ కష్టపడాల్సిన అవసరం రాలేదు. అయితే వారం తిరిగే సరికి ఓ కొత్త వాద్యాన్ని ఎంచుకుని - సినిమా పాటల్లో ఆ వాద్యం ప్రస్ఫుటంగా



వినిపించే రికార్డులు లైబ్రరీ నుంచి సంగ్రహించడం మంచి ఎక్సర్ సైజ్‌గా ఉండేది. ఒక్కో సంగీత దర్శకుడు ఒక్కో వాద్యాన్ని తన Orchestra లో ఎలా వాడాలో సోదాహరణంగా వినిపించేవాడిని. ముందుగా కొత్త సంగీతవాద్యపరిచయం. శాస్త్రీయ సంగీతంలో దాని అసలు రూపం, సినిమాలలో పాటలలో దాని సినిమా రూపం ఆ తర్వాత 5,6 పాటలు ఆ వాద్య ప్రధానంగా వచ్చినవి వినిపించడం ఇలా సాగేది ఆ కార్యక్రమ సరళి. ఇది 25 వారాలు నిరాఘాటంగా కొనసాగింది. శ్రోతల్ని ఎంతగానో ఆకట్టుకున్న కార్యక్రమం. చుట్టుపక్కల ఊళ్ళో నుంచి శ్రోతలు మమ్మల్ని చూట్టానికి వచ్చేవారు ఆ కార్యక్రమ ప్రసార సమయంలో! సినిమా స్టార్స్ అంత లెవెల్లో పాపులారిటీ ఉండేది. అది మరీ ఎంకరేజ్‌మెంట్‌గా ఉండేది మాకు.

ఇదిగాక, 'సంగీత ప్రియ' అనే కార్యక్రమం ఒకదాన్ని కొత్తగా ప్లాన్ చేసా, 3,4 ఏళ్ళపాటు. అదికూడా సినిమా సంగీతం, రేడియో సంగీతం మీద ఆధారపడేది. కేవలం "వినికిడి జ్ఞానం"తో సహజ సిద్ధంగా సినిమా పాటలూ, లలిత గీతాలు పాడే శ్రోతలు ఎందరో ఉండేవారు. అలాంటి వారందరినీ ఈ సంగీతప్రియద్వారా పరిచయంచేసా. సంగీత వాద్యాలు వాయించేవారిని కూడా పరిచయం

చేసేవాడిని. శ్రోతలతో ఇంట్రాక్షన్ ఉండటం వల్ల - ఇలాంటి ప్రోగ్రామ్స్‌కి మంచి డిమాండ్ ఉండేది. చాలా మటుకు అలాంటి ప్రోగ్రామ్స్ రికార్డు చేసి, ఆడియో కేసెట్స్ రూపంలో భద్రపరిచా. ఇన్నేళ్ళు అయ్యాక అవి మళ్ళీ వింటుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. అలాంటి మంచి శ్రోతలు, అభిరుచిగల కళాకారులు ఉండటం వల్లనే నా ప్రోగ్రాంలు పేరు తెచ్చుకున్నాయి

వివిధ బారతి వాణిజ్య విభాగంలో ఇలాంటి కార్యక్రమాలు ఎన్ని చేసినా - ఇంకా అసంతృప్తిగానే ఉండేది. నాలో కళాభిరుచిని శాటిస్ఫై చేయడానికి - విజయవాడ 'A' సర్వీస్‌లో కూడా కొన్ని రూపకాలు చేయాలనిపించేది. 1980, 2000 మధ్య దాదాపు 20 సంవత్సరాలలో పదిహేనుకు పైగా ప్రత్యేక కార్యక్రమాలకు రూపు దిద్ది సమర్పించడం జరిగింది. వాటిని ఆకాశవాణి వార్షిక పోటీలకు పంపడం కూడా ఒక ప్రత్యేకమైన అనుభూతి. ఆశ్రమ ఊరికే పోలేదు. 1980 మొదలు పది వార్షిక బహుమతులు, జాతీయ స్థాయిలో నాకు లభించాయి. అదొక రికార్డ్. నాకు బహుమతులు వచ్చాయి అని చెప్పుకోవడం కంటే, జాతీయ స్థాయిలో వందకి పైగా రేడియో స్టేషన్‌లు పాల్గొనే పోటీలో, మన తెలుగు ప్రోగ్రామ్స్‌కి అన్ని బహుమతులు రావడం నాకు ఎంతో ఆనందం కలిగేది.




ఇప్పటికీ 'రామం గారూ' అని పలకరించే సోదర సోదరీమణులు ఉన్నారంటే - గుండె ఆనందంతో నిండిపోతుంది! సినిమా ఫీల్డ్ నుంచి రేడియోలోకంలోకి ప్రవేశించినా సరే - ఇంత ఆదరణ లభించడం భగవంతుడి వరంగా భావిస్తాను. నన్ను ఇప్పటికీ ఆదరించే ప్రియాతి ప్రియమైన శ్రోతలకు, శబ్దమిత్రులకూ ఎప్పటికీ ఋణపడిఉంటాను.

*ఈ నెలలోనే ఆకాశవాణి, విజయవాడ కేంద్రం తన 60 వ పుట్టిన రోజుని జరుపుకుంటోంది.*

# ఆకురాలు కాలానికి వసంతం - ఇదొక వైవిధ్య చిత్రకళా రూపం

ఎవరూ పట్టించుకోని ఎండుటాకులకు వసంతం ఉంటుందనీ, వీటికి ఓ అందమైన ఆకృతి కల్పించవచ్చనీ అంటున్నారు పేరులోనే 'వసంతాన్ని' నింపుకున్న ముక్తవరం వసంత కుమారి గారు. చూసే కనులకు మనసుంటే ఎటుచూసినా అందమే అన్నట్లు వసంత కుమారి గారికి ప్రతి ఆకులో ఒక విభిన్న రూపం కనిపిస్తుంది. వివిధ చెట్ల ఆకులలో ఉన్న వర్ణ వైవిధ్యం, రూప వైవిధ్యమే ఆమె కళకి పునాది.

ఆకుల్లో భిన్న రూపాలని ఊహించి, ఆకుల అమరికతో రూపాలు సృష్టించడం వసంతకుమారి గారి సృజనాత్మకత. ఆకులని కత్తిరించి ఏ రూపాన్నైనా చెయ్యొచ్చు కానీ కత్తిరించకుండా, ఎటువంటి రంగులూ అద్దకుండా సహజరూపంలోనే కళాఖండాల్ని చిత్రిస్తారు వసంత కుమారి గారు. అందం కంటే సహజత్వానికి ప్రాముఖ్యత నిచ్చే ఈ చిత్రకారిణి.. పక్షులు, లతలు, జంతువుల బొమ్మలే కాకుండా, భావ చిత్రాలు, సామాజిక అంశాలని కూడా తన వైవిధ్యమైన కళాకృతుల్లో పొందుపరచడం మరో ప్రత్యేకత.



ప్రత్యేకంగా ఎవరి వద్దా నేర్చుకోకుడా, ఎలాంటి శిక్షణా లేకుండా తనంత తాన వసంతకుమారి గారు ఇంతవరకూ 200 పైగా చిత్రాలు వేసారు. మొట్టమొదటి బొమ్మ 'స 16 న ఆంధ్రప్రభ వారపత్రిక ముఖ చిత్రంగా వచ్చింది. మొదటి బొమ్మకే లభించిన అరుదైన ఆకులను సేకరించి చిత్రాలను వేసి ప్రముఖ పత్రిలలన్నింటికీ పంపించారు. విపుల మాసపత్రి చిత్రాలు ఈమె చిత్రించిన ఎండుటాకుల చిత్రాలే. ఇంకా చతుర, భూమిక వగైరా ప వచ్చాయి. వసంత కుమారి గారి ఈ విలక్షణ చిత్రకళ గురించి టి.వి. లలోనూ, అ పరిచయాలు, వ్యాసాలు వచ్చాయి. అంతర్జాతీయ చిత్రకళా పోటీలలో కూడా పాల్గొన్న ఈ లోని లైబ్రరీలో ప్రదర్శన కూడా ఏర్పాటు చేసారు. పద్మశ్రీ ఎస్.వి.రామారావు గారు, ఛాయాదేవి, శీలావీర్రాజు..లాంటి ప్రముఖుల ప్రశంసలనందుకున్నారు .

..సొంత రాష్ట్రంలోనూ, దేశ వ్యాప్తంగానూ అనేక పురస్కారాలనందుకున్న వస ప్రావీణ్యత సంపాదించడం వెనుకనున్న తన అనుభవాలని 'కౌముది' తో ఇలా పంచుకుంటు...

నా బాల్యమంతా నల్లగొండ జిల్లాలోని భువనగిరిలో గడిచింది. విశేషమేమంటే శ్రీవారిది, నాది, పుట్టిన వూరు భువనగిరే. ఇంటర్ పరీక్షలముందే పెళ్ళయిపోయింది. అప్పటికే 'ఆంధ్రప్రభ' ఉగాది నవలల పోటీలో మొదటి బహుమతి గెలుచుకున్న ('రంగులవల')


TIMES CITY
THE TIMES OF INDIA, HYDERABAD
MONDAY, AUGUST 20, 2007
MEMORABILIA OF LEAVES
IT'S ORGANIC ART: A visitor admires exhibits at the Dried Leaf Art Exhibition held at State Art Gallery in Madhapur on Sunday. The exhibition is on till August 26

రచయితతో పెళ్ళి. చదువు పూర్తిచేసిన అమ్మాయిని కాకుండా చదువుతున్న అమ్మాయిని కావాలని పెళ్ళిచేసుకున్నారు. విరసం రచయితలు వరవరరావు, శ్రీపతి, చంద్ర.. మొదలైన రచయితలంతా పెళ్ళికి వచ్చారు.

1971 లో హైదరాబాదు వచ్చాక రెడ్డి కాలేజీలో డిగ్రీలో చేరాను. కానీ డిగ్రీ పూర్తి కాకుండానే ఇద్దరు పిల్లలకి తల్లినయ్యాను. దానితో సహజంగానే చదువు సాగలేదు. పసిపిల్లల ఆటపాటలు, బుడి బుడి నడకలే ప్రపంచమనుకునేదాన్ని. ఇంకో లోకం ఉంటుందా అనిపించేది. శ్రీవారు ఉద్యోగ రీత్యా ఊళ్ళు తిరగాల్సి వుండేది. ఇంట్లో ఉన్న సాహిత్యమంతా చదవడం మొదలు పెట్టాను. కుటుంబరావు, చలం, రాచకొండ, శ్రీశ్రీ, వసుంధరా దేవి మొదలైన రచయితల పుస్తకాలు చదివిన ప్రభావంతో, పిల్లలు కాస్త పెద్దయ్యాక ఎం.ఏ తెలుగు చేసాను. అప్పటి నుంచీ కథలు వ్రాయాలనిపించి 3, 4 కథలు రాసాను, 1995 లో ఆంధ్రప్రభ, మహతి, భూమిక పత్రికల్లో కొన్ని వ్యాసాలు కూడా రాసాను.

ఆకులని అతికించి తయారు చేసే ఈ కళాకృతులు ఎక్కువకాలం పాడైపోకుండా ఉండేందుకు వసంతకుమారిగారు చాలా శ్రద్ధ తీసుకుంటారు. మొదట్లో అమెరికా నుంచీ తీసుకెళ్ళిన మల్టీపర్పస్ గ్లూ తో అతికించే వారు. తర్వాత ఫెవికోల్ వాడడం మొదలు పెట్టారు. వెబ్ సైట్లలో మరికొంత సమాచారాన్ని సేకరించాక సిలికాజెల్‌ని ఉపయోగించడం మొదలు పెట్టారు. ఎలా గంటే - ఒక ట్రేలో అంగుళం ఎత్తున సిలికా జెల్‌ని పోసి దానిమీద కావల్సిన ఆకుల్ని పరుస్తారు. దాని మీద మళ్ళీ అంగుళం ఎత్తున సిలికా జెల్ పోస్తారు. ఈ అమరికని ఒక రోజు, ఆకుల సున్నితత్వాన్ని బట్టి రెండు మూడు రోజులు కూడా ఉంచుతారు. ఈ సిలికా జెల్‌ని మళ్ళీ మళ్ళీ వాడొచ్చు... ఐతే మొదట్లో బాగా తేమ వున్న ఆకులకి ఉపయోగిస్తే పోను పోనూ కాస్త పొడిగా ఉన్న ఆకులకి ఉపయోగిస్తారీ జెల్‌ని.

మా ఇంటికి రచయితలు, సాహితీ వేత్తలు వచ్చేవారు. వరవర రావు, వేణు, శ్రీపతి, చంద్ర, డి.వెంకటరామయ్య, టంకసాల అశోక్, చలసాని ప్రసాదరావు, అబ్బూరి ఛాయాదేవి.. మొదలైన వారితో మా ఇల్లు ఒక సాహితీ నందనంలా ఉండేది. కాళీపట్నం గారి నిర్వహణలో కథా రచయితల సమావేశం కూడా జరిగింది మా ఇంట్లో. చంద్ర గారు ఆ సమావేశానికి వచ్చినపుడు, మా చిన్నబ్బాయి కోసమని ఒక బొమ్మ వేసి ఇచ్చారు.. ఆ బొమ్మ ఆకారానికి చీపురు పుల్లలు రకరకాల షేడ్స్ వచ్చేలా అతికించి ఒక సరికొత్త కళాకృతిని తయారు చేసి ఫ్రేమ్ కట్టించాను. అప్పుడే అనిపించింది కేవలం కుంచెలు, రంగులతోనే కాకుండా ఇలా వేరే వాటితో కళాకృతుల్ని చేస్తే ఎలా ఉంటుందీ అని..

చిన్నప్పటినుంచీ కాస్త ఈస్తటిక్ సెన్స్ వుండడం అప్పటికే గ్రీటింగ్ కార్డులు తయారీలో అనుభవం ఉండడంతో అందరూ పనికిరావనుకునే వస్తువుల్లో కొత్త కొత్త రూపాలు ఊహించుకునే దాన్ని. ఏదైనా విలక్షణంగా ఉండాలనుకునే కోరిక కూడా దీనికి మరికొంత బలం చేకూర్చింది.

పిల్లల దగ్గరికి 2002 లో అమెరికా రావడం జరిగింది. ఫాల్ కలర్స్ చూడ్డం కోసం షికాగో, కనెక్టికట్ వెళ్ళాం. ఆకులు ఇండియాలో ఉండవని కాదు కానీ అమెరికాలో మైళ్ళకు మైళ్ళు వర్ణ వైవిధ్యంతో, రూప వైవిధ్యాన్ని కలిగి ఉన్న ఆకుల్ని చూసి ముగ్ధురాలినయ్యాను. పరవశించడం అందరూ చేస్తారు, కానీ ప్రకృతిని ఒడిసి పట్టుకోవాలన్న తపన నాకే మొదలైందేమో ననిపించింది. ఆకులు సేకరించడం అలవాటుగా మారింది. కూరలకు వెళ్ళినా, ఎక్కడికి వెళ్ళినా నా కళ్ళు ఆకుల మీదే మొట్టమొదటిసారి ఆకులతో ఒక బొకేలాగ చేసి ఫ్రేమ్ లో బిగించాను. తర్వాత జంతువులు, మనిషి రూపాల్ని చేయాలన్న ఆలోచన వచ్చింది. మనిషి భాగాలు

మా కుటుంబం గురించి: శ్రీవారు ముక్తవరం పార్థసారథి. ప్రముఖ రచయిత. చిత్రం బాగా లేకపోతే నిర్మొహమాటంగా చెబుతారు. ఆయన అలా అనగానే ఎందుకు బాగోలేదో నిశితంగా పరిశీలించుకుంటాను. నేను ఈ కళలో ముందుకు వెళ్ళగలనని మనో ధైర్యాన్నిచ్చింది మా కుటుంబసభ్యులందరూ. మా కిద్దరు అబ్బాయిలు వికాస్, సందీప్. కోడళ్ళు లావణ్య, స్వప్న. మనవరాళ్ళు లయ, రియా, అన్య. కొడుకులూ, కోడళ్ళూ ప్రొఫెషనల్ రంగాల్లో అమెరికాలో స్థిరపడ్డారు. నా కళకు కావల్సినవన్నీ సమకూరుస్తుంటారు.


చేసేప్పుడు చాలా జాగ్రత్తగా చేయాలి. రంగుల్లో చిత్రాలు వేయడం కంటే ఆకుల్లో రూపం రూపు దిద్దుకోవడంలో పరిధి చాలా తక్కువగా ఉంటుంది. ఉదాహరణకి. చార్లీచాప్లిన్ బొమ్మ తీసుకుంటే ప్యాంట్ లూజ్‌గా ముడుతలున్నట్లు రావాలంటే అటువంటి ఆకునే ఎంచుకోవాలి. అంతే సైజు ఉండాలి. ఆకారమూ రంగూ, సైజూ కూడా చిత్రాలని రూపొందించడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. అలానే ఝాన్సీరాణి, గాంధీ, నేటివ్ అమెరికన్, అజంతా కుడ్యం..ఇలాంటి వన్నీ తయారు చేసేప్పుడు వాటికి సరిపడా ఆకుల కోసం బాగానే శ్రమించాల్సి వచ్చింది.

కొన్ని సార్లు భిన్నాకృతుల్లో వున్న అకులను చూసినప్పుడు ఒక ఊహా చిత్రం మొదలౌతుంది. ఉదా.శూలం లాంటి ఆకుని చూసినప్పుడు దుర్గామాత. కత్తిలాంటి ఆకు చూసినప్పుడు ఝాన్సీరాణి..ఇలా. కొన్ని సార్లేమో..ముందుగా ఒక ఆలోచన మెదులుతుంది. ఉదాహరణకి. తల్లిదండ్రుల ప్రేమ, పండగ సంబరం, కష్టజీవులు, ..మొదలైన అంశాలు తీసుకున్నప్పుడు వందలు , వేలు ఆకులు సేకరించి, వాటిలోంచి కావల్సిన వాటిని సునిశితమైన పరిశీలనతో ఎంచుకుని చిత్రీకరించాల్సి ఉంటుంది.

ఇప్పటికి ఏదో సాధించేసాను అనుకోవడం లేదు. ఇంకా చెయ్యాల్సింది చాలా ఉంది. "పురాణ కాలం నుంచీ నేటి దాకా స్త్రీ ప్రస్థానం " అనే అంశంతో 'ప్రకృతి ప్రపంచాన్ని' చూపించాలని ఉంది. ఈ కళని ప్రోత్సహించాల్సిన అవసరం కూడా ఉందని భావిస్తున్నాను. రాలిపోయే ఆకులకు మళ్ళీ జీవం పోసి పునఃసృష్టి చేయొచ్చన్న విషయాన్ని కళాకారులందరికీ తెలియచేయాలని ఉంది. ..

మీ అందరి ప్రోత్సాహంతో ఈ కళాపథంలో మరిన్ని కొత్త మజిలీలు చేరుకోవాలని ఆశ.. ఆకాంక్ష..

vkmukthavaram@yahoo.com






World Wide Pressed Flower Guild
2008 Conference

CERTIFICATE OF PARTICIPATION

this certificate is awarded to:


Vasantha Mukthavaram

in recognition of

Participating in the competition in the category of
One Dream

Signature

Date



తెలుగులకు చదువనేర్పిన రచయిత

వెయ్యి నవలలు వ్రాసిన తెలుగు రచయిత

అలనాటి పాపులర్ రచయిత - కొవ్వలి

- గొల్లపూడి మారుతీరావు

**ఇవాళ తెలుగిళ్ళలో** తెలుగు పిల్లలకి తెలుగురాదు. తల్లిదండ్రులూ తెలుగు రాదని బాధపడక ఇంగ్లీషు నేర్పించి గర్వపడడం అలవాటు చేసుకున్నారు. భాష 'రుచి' మరిచిపోయి, వృత్తికి భాష దోహదం చేస్తే చాలుననుకుని సరిపెట్టుకుని చాలా దశాబ్దాలయిపోయింది. అప్పుడే తేలికగా నాలుగయిదు తరాల తెలుగువారు 'తెలుగు'ను నష్టపోయారు. భాష పారే సెలయేరులాంటిది. పారకపోతే నీరు మురిగి మురికి కూపం మిగులుతుంది. వాడుక లేని భాష వాడుక అవసరంలేని కారణానే - డినోసార్, టిరనోసార్, ఆర్కియాప్టెరిక్స్, పులిలాగ క్రమంగా చచ్చిపోతుంది. ఆ మధ్య ఐక్యరాజ్యసమితి పరిశీలనల్లో కాలగతిలో మాయమయే భాషల్లో తెలుగు పదకొండవ స్థానంలో ఉందన్నారు. ఈ మాట ఆ మధ్య ఓ అంతర్జాతీయ తెలుగు సభల్లో చెపితే - పెద్దలు భుజాలు తడుపుకున్నారు. మధ్యరకం వారు మన తెలుగుకేం భయంలేదని బోరలు విరిచారు. ఆత్మవంచన కూడా ఒకొక్కప్పుడు జాతికి సుఖంగా ఉంటుంది.

ఇప్పటి తెలుగువారి సమస్య పిల్లలకి 'తెలుగు' తెలిసేలా చేయడం. ఇదొక కొరకరాని సమస్య. కానీ ఏడెనిమిది దశాబ్దాల క్రితం తెలుగు లోగిళ్ళలో - ప్రతివ్యక్తికీ చదవడాన్నీ, విరివిగా ఆలోచించడాన్నీ మప్పి - భాషని వంట గదుల్లోకీ, పడక గదుల్లోకీ, రైలు కంపార్టుమెంటుల్లోకీ తోలుకొచ్చిన ఉద్యమకారుడొకాయన ఉన్నారు. ఈ తరానికి ఇలాంటి ఆలోచనే అబ్బురంగా కనిపించవచ్చు. ఇంతకీ ఆ ఉద్యమం - వ్యక్తి పేరు - **కొవ్వలి. పూర్తి పేరు కొవ్వలి లక్ష్మీనరసింహారావు.**

బొత్తిగా చదువురాని ఒకావిడ - తన బిడ్డ విసర్జనని మహాభారతం పేజీని చించి ఎత్తడం చూశారు. గుండె తరుక్కుపోయింది. (కుక్క కాటుతో ప్రాణాలు పోగుట్టుకునే వాళ్ళని చూసి అలనాడు లూయీ పాశ్చరు ఇలాగే స్పందించి మానవాళి పునరుజ్జీవనానికి 'ఏంటీ రాబీస్'ని కనిపెట్టివుంటాడు.) "నీ చేతిలోవున్న ఆ కాగితంలో ఏం వుందో తెలుసా?" అని ఆవిణ్ణి అడిగారాయన. తల అడ్డంగా తిప్పిందామె. కొవ్వలి ఆ క్షణంలో రెండే లక్ష్యాలను సిద్ధం చేసుకున్నారు. భాషని ఆకాశమార్గం నుంచి నేలమీదకి దింపాలని, చదువుమీదకి

మనసుపోనీ ఏ స్త్రీ అయినా చేత పుస్తకం పట్టుకు చదివేటట్టు చేయాలని. ఇది పెద్ద వైజ్ఞానిక విప్లవం, అప్పటికి ఛందస్సు నడుం విరగ్గొట్టే కవులింకా రాలేదు.

తండ్రి ఆయన్ని కోపరేటివ్ ట్రైనింగులో పెట్టాలనుకున్నారు. కానీ ఆయన రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో మాయమయారు. కొన్ని వందల పుస్తకాల్ని ఆపోశన పట్టారు. క్రమంగా తను చెప్పాలనుకున్న వాక్యానికి ఒక రూపాన్ని తెచ్చుకున్నారు. ఒక శైలి రూపుదిద్దుకుంది. అలా అందరికీ అర్థమయ్యేలాగ రాసిన మొదటి నవల "పల్లెపడుచు". 'మాకొద్దీ తెల్లదొరతనం' అని రవి అస్తమించని బ్రిటిష్ ప్రభుత్వం మీద తిరగబడిన గరిమెళ్ళ సత్యనారాయణగారు ఆ నవలకి పీఠిక రాశారు. అంతేకాదు. 'దాసీపిల్ల' అనే నవలకి చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు ముందుమాట రాశారు. అది కేవలం ప్రారంభం.

ఆ రోజుల్లో రాజమండ్రిలో పెద్ద ప్రచురణ కర్త శ్రీ కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్. (వారి వారసుడు భాస్కరరావుగారు నా తరంలో నా రచనలు చాలావాటిని ప్రచురించారు.) వారికి ఓ నవలని ప్రచురణకి ఇచ్చారు కొవ్వలి. దాన్ని పరిశీలనార్థం శ్రీపాద కృష్ణమూర్తిగారికి పంపారు వెంకయ్యగారు. "భాషా ద్రోహం చేసే ఇటువంటి రచనలు వేస్తే వంశక్షయం అవుతుంది" అని శాస్త్రిగారు హెచ్చరించారు. వెంకయ్యగారు భయపడి ఆ నవలని పక్కన పడేశారు. ఒకరోజు వీరాస్వామి అనే పోస్ట్‌మాన్ ఉత్తరాల బంగీ ఇవ్వడానికి వచ్చి - అక్కడ పడివున్న కొవ్వలి నవలని యధాలాపంగా తీసి మొదటి పేజీలు తిప్పాడు. అంతే. పుస్తకానికి అతుక్కుపోయి, తన ఉద్యోగాన్ని మరిచిపోయి కొన్ని గంటలు - నవల పూర్తయ్యేదాకా అక్కడే ఉండిపోయాడు. వెంకయ్యగారు గుండె దిటవున్న వ్యాపారి. సంప్రదాయపు ఆంక్షని పక్కన పెట్టి, ఓ పామరుడి ఆసక్తికి పట్టం గట్టారు. నవల ప్రచురితమయ్యింది. ఆ నవల పేరు 'ఫ్లవర్ గరల్'. ఆ పుస్తకాన్ని ఇద్దరికే పంపారు వెంకయ్యగారు: అడిగినవారికీ, అడగనివారికీ. అదొక వెల్లువ. మొదట విడత కాపీలు ఖర్చయిపోయాయి. అప్పుడు కొవ్వలిని పిలిపించారు వెంకయ్యగారు. వంద పుస్తకాల ప్రచురణకి ఒప్పందం చేశారు. ప్రతిఫలం ఎంత? పన్నెండున్నర రూపాయలు. ఇది తక్కువ పైకం అనుకునేవారికి - ఆనాడు ఒక నవల వెల రెండణాలు లేదా పావలా. తర్వాత ఆరణాలు (37 పైసలు) అయింది. ఇది చౌక బేరం కాదు. తెలుగు భాష జనజీవంలోకి చొచ్చుకు వచ్చే ఉద్యమానికి ఇది పట్టాభిషేకం.

రచయిత సంఘజీవి. ప్రయత్నించినా నేల విడిచి సాము చెయ్యలేడు. జిజ్ఞాసకి సమాజ శ్రేయస్సు వ్యసనం. వితంతు వివాహాలు, బాల్య వివాహాలు, కులమత వర్ణాంతర వివాహాలు - ఒకటేమిటి? - నా తరంలో నాలాంటి కుర్రకారు విస్తుపోయి పుస్తకాలకు అతుక్కుపోయి చదువుకొనేటంత విరివిగా - పేజీలు నిండాయి. రామోహనరాయ్, వీరేశలింగం వంటి సంస్కర్తలు ఎంచుకున్న విప్లవ ధోరణిని - నేలబారు స్థాయిలో కొవ్వలి పదిమందికీ పంచడం ప్రారంభించాడు. ఆయన రచనలు దావానలంలాగ మూలమూలలనూ చుట్టివేశాయి.



కొవ్వలి నరసింహారావు, భార్య శ్రీలక్ష్మీ దేవి

కొవ్వలి స్ఫురద్రూపి. చక్కగా జర్దా కిళ్ళీ వేసుకుని, ఇస్త్రీ మడత కట్టుకుని, జట్కాలో కులాసాగా విహరించే దశ అది. చదివిన వారందరూ ఆయనకి అభిమానులే. ముఖ్యంగా ఆడవాళ్ళు. ఆరోజుల్లో ఎందరో ఆడవాళ్ళు "హృదయేశ్వరా! మానసచోరా!" అంటూ ప్రేమలేఖలు రాసేవారు. చలంగారు వీరి పాపులారిటీ మీద చమత్కరించిన మాట: "ఆ రోజుల్లో - కొవ్వలి తమ కౌగిలిలో లేని ఆడపిల్లలుండేవారు కాదు". అయితే కొవ్వలికి అదొక్కటే మరిచిపోలేని మహా శుక్రమహాదశ.

ఆయన రచనలకి ప్రచురణ కర్తలు పోటీలు పడ్డారు. రౌత్ బుక్ డిపో, వెంకటేశ్వర పబ్లిషింగ్ హౌస్, పాండురంగా బుక్ డిపో, యస్. ఏ స్వామి అండ్‌కో, సరస్వతీ బుక్ డిపో. అయితే రచయిత వ్యాపారికాదు. నవలల సర్వ హక్కులూ వారికి ఇచ్చేస్తూ వచ్చాడు.

ఎక్కడో పశ్చిమ బెంగాలులో పురూలియాలో ఒకమ్మాయి ఆయన రచనలు చదివింది. ఆమె మనసు ఆయనమీదకి పోయింది. ఆయనకి ఉత్తరం రాసింది. ఆవిడ పేరు లక్ష్మీ దేవి. కొవ్వలికీ ఆమెతో పరిచయం పెరిగింది. ఫలితం. పురూలియాలో వారిద్దరికీ పెళ్ళి జరిగింది.

కొవ్వలి అప్పటి ప్రాచుర్యాన్ని చెప్పడానికి మిత్రులు వి.ఏ.కె రంగారావు మాటలు: కొవ్వలి రెండు తరాలకి చదివే అలవాటుని కలగచేశారు. రాజమండ్రి స్టేషన్లో - 60 ఏళ్ళ క్రితం (2001 లో వ్రాసిన వాక్యాలివి) పుస్తకాలొక యాభై చేత పట్టుకుని ప్రతి కంపార్ట్‌మెంట్‌కి తిరిగి అమ్మిన వ్యక్తి నా కళ్ళకి కట్టినట్టు జ్ఞాపకం. పుస్తకం వెల రూపాయి. పన్నెండణాలు అని బేరమాడితే తగ్గించేవారు. కొన్ని నవలల్లో శృంగారం పాలు ఎక్కువగా ఉంటుందని పెద్దలు మమ్మల్ని చదవనిచ్చేవారు కాదు...

ఆ రోజుల్లో మడికట్టుకున్న పెద్దలకు ఇద్దరిమీదే ఆంక్ష - కొవ్వలి, చలం. జాతికి ఒకరు అలవాటునీ, ఒకరు ఆలోచననీ ప్రసాదించారు. ఇక్కడ ఇక విచిత్రమైన సంఘటన చలంగారి మాటల్లోనే వినాలి: "నేను నూజివీడులో ఉండే రోజుల్లో ఒకబ్బాయి నన్ను పలకరించే ధైర్యం లేక దూరంగా నా వెనుక నడుస్తుండేవాడు. చివరికో రోజు ధైర్యం 'ఏం కావాలి?' అని అడిగాను. అతను అధిక భక్తితో 'నేను బీదవాణ్ణి. మీ పుస్తకం ఒకటిస్తే దాన్ని చదివి తిరిగి మీకు ఇచ్చేస్తాను' అని అడిగాడు. నేను అతణ్ణి ఇంటికి తీసుకెళ్ళి 'చలంగారి కలం' కాపీ ఇచ్చాను.

"నేను అడిగింది చలంగారి కాపీ కాదండీ, మీరు రాసిన పుస్తకం' అన్నాడు. నేను ఆశ్చర్యపడి చూశాను. 'నేనెవరనుకున్నావు?' అన్నాను. 'మీరు కొవ్వలి నరసింహారావు కాదా!. ' 'కాదు. నేను చలంని' అన్నాను. అతని ముఖంలో ఎంత డిస్సప్పాయింట్‌మెంట్! నాకు సాధ్యమయితే కొవ్వలి పుస్తకం ఒకటి కొని ఇచ్చేవాణ్ణి" - అదీ కొవ్వలి!

పుంఖాను పుంఖంగా రచనలు చేస్తున్న కొవ్వలి పేరు మద్రాసు దాకా పాకింది. రాజరాజేశ్వరి ఫిలింస్ అధినేత కడారు నాగభూషణంగారూ, వారి సతీమణి కన్నాంబగారూ ఆయన చేత సినిమా రచన చేయించాలని మద్రాసు పిలిపించారు. ఆ విధంగా కొవ్వలి మొదటి చిత్రం "తల్లిప్రేమ" రాశారు.

ఆయన రచయితగా నిరంకుశుడు. స్వాభిమానం కలవాడు. ఈ రెండూ సినిమా రంగంలో చెల్లని విషయాలు. ఆ బేనర్‌కి రెండో చిత్రం 'దక్షయజ్ఞం'. సంభాషణా రచన పూర్తయ్యాక నాగభూషణంగారితో చర్చకి కూర్చున్నారు ఓ రాత్రి. దక్షప్రజాపతికి కుప్తంగా సంభాషణలు రాశారు. ఆ పాత్రని ఎస్వీ రంగారావుగారు చేస్తున్నారు కనుక మరింత విరివిగా మాటలుండాలన్నారు నిర్మాత. అది పాత్రౌచిత్యం కాదన్నారు రచయిత. మాటా మాటా పెరిగింది. "మేం డబ్బిస్తున్నాం. రాయాలి" అని నిలదీశారు నాగభూషణం. అప్పుడు తెల్లవారు ఝాయున నాలుగయింది. లేచి ఇంటికొచ్చేశారు కొవ్వలి. ఇంటికంటే రాజమండ్రికి.

ఆయనకి పాతికేళ్ళు వచ్చేసరికి 400 నవలలు ప్రచురితమయాయి! ఆయన రచనల వల్ల ప్రచురణ కర్తలు డబ్బు చేసుకున్నారు కానీ రచయితకేమీ మిగల్లేదు. భార్య ఆలోచనపరురాలు. తామే పుస్తకాలను ప్రచురిస్తే? ఆ విధంగా కొవ్వలి బుక్ డిపో పుట్టింది. పుస్తకాల్ని ఎవరు వ్యాపారులకి చేర్చాలి? కొవ్వలే స్వయంగా వెళ్ళాల్సి వచ్చేది - రచయితగా కాదు. తాను కొవ్వలికి ప్రతినిధినని చెప్పుకునేవారు! ఈ సంస్థ నాలుగేళ్ళు నడిచింది. ఆయన వ్యాపారికాడు. తత్కారణంగా వ్యాపారం అప్పుల్లో పడింది. రుణాలు పెరిగాయి. 1950 వ సంవత్సరంలో ఓ రెండు వందల రూపాయలు, ఏడాదిన్నర కొడుకునీ ఎత్తుకునీ మద్రాసుకు చేరారు.

సెంట్రల్ స్టేషనుకి ఎదురుగా రామస్వామి సత్రంలో కుటుంబాన్ని దింపి - మద్రాసులో పరిచయం ఉన్న ఒకే వ్యక్తి దగ్గరకి బయలుదేరారు. ఆయన రాజరాజేశ్వరి ఫిలిమ్స్‌లో పనిచేసేనాటికి అక్కడ ప్రొడక్షన్ మేనేజరు. పేరు డి.ఎల్ నారాయణ. అప్పటికి డి.ఎల్

'దేవదాసు' తీసే ప్రయత్నంలో పురిటి నొప్పులు పడుతున్నారు. కొవ్వలిగారిని చూసి కథ ఇస్తే అదే యూనిట్‌తో మొదలెడతానన్నారు. కథలు కొవ్వలికి కొట్టిన పిండి. అప్పుడే రాసిన 'మెత్తని దొంగ' నవలని ఇచ్చారు. అదే యూనిట్ - అంటే దర్శకుడు వేదాంతం రాఘవయ్య, సంగీతం సుబ్బరామన్ ఇత్యాదులతో నిర్మాణం. దేవదాసులో ప్రముఖపాత్ర నటించవలసిన సావిత్రి ఇందులో గోవిందరాజులవారి పెళ్ళాంగా చిన్న వేషం వేసింది. సినీమా - 'శాంతి'. ఆ సినిమాకి 1500 ఇచ్చారు. కొవ్వలి భార్య పట్టుదలతో భర్త చేత స్థలం కొనిపించింది - డబ్బు లేకపోయినా పరువుగా బతకడానికి తమదంటూ ఓ నిలువ నీడ ఉండాలని. ఆ ఇల్లాలిది ఎంత సంకల్పబలమో - జీవితాంతం ఆ కుటుంబం ఆ పనే చేసింది. అక్కడే బతికింది. వెస్ట్ మాంబళంలో లక్ష్మీనారాయణ వీధిలో ఆ స్థలంలో ఓ పాక వేసుకున్నారు.

'శాంతి' చూసి బి.ఎస్, రంగా విక్రం ప్రొడక్షన్స్ సంస్థని ప్రారంభించి కొవ్వలి రచనతో 'మా గోపి' తీశారు. తరువాత కాశీనాధ్ ప్రొడక్షన్స్ వారి 'రామాంజనేయ యుద్ధం' (అమరనాధ్, శ్రీరంజని). నిజానికి ఈ కథ రామాయణంలో లేదు. కల్పితం. తాండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రి వీధినాటకం ఆధారంగా సినిమా కథని రూపొందించారు. వారి సినిమాల్లో తొలిసారిగా వెండితెరకి పరిచయమైనవారు - సావిత్రి, కైకాల సత్యనారాయణ, పేకేటి శివరాం, చిన్నపిల్లగా చంద్రకళ.

ఒక పక్క సంతానం పెరుగుతోంది. 9 మంది పిల్లలు పుట్టారు. అందులో 5గురు పోయారు. అవసరానికి ఆదాయం పెంచుకునే ఆలోచనలేని వ్యక్తి కొవ్వలి. నవలలు మౌలికమయిన కృషిగా కాక ఉపాధికి అవసరమయాయి. ఓసారి ఆంధ్రపత్రికలో ఓ సీరియల్ 14 వారాలు వచ్చింది. ఆ నవలని డి ఎల్. చదివి వెంటనే చిత్రాన్ని ప్రారంభించారు. ఆ సినిమా పేరు 'సిపాయి కూతురు'. కైకాల సత్యనారాయణ అనే కొత్త నటుడు ఆ సినిమాలో హీరోగా పరిచయమయాడు. ఆ సినిమాకి ఇచ్చిన పైకంతో కొన్న స్థలంలో రెండు గదులు వేసుకున్నారు. ఆ ఇల్లే ఆ కుటుంబానికి ఆద్యంతమూ 'పరువు'ని కాపాడే ముసుగయింది. ఇప్పటికీ జ్ఞాపకాల తోరణంగా మిగిలింది.



కొవ్వలి కట్టుకున్న ఇల్లు, ఇంటి ముందు వారి పెద్దబ్బాయి

ఆదాయానికి మించి అవసరాలు పెరిగిపోయాయి. సంసారం భారమయింది. ఎవరిముందూ చెయ్యిజాచే అలవాటు లేని కొవ్వలికి గడ్డురోజులు ప్రారంభమయ్యాయి. ఎవరినీ సినిమా ఛాన్సు అడిగే పాపాన పోలేదు. పిలిస్తే తప్ప ఏ సంస్థ గడపా తొక్కలేదు. తను రాసే రచనల మీదే పూర్తిగా ఆధారపడవలసి వచ్చింది.

ఈ దశలోనే - 1953 డిసెంబరులో కొవ్వలి తండ్రి పోయారు. శవాన్ని తీయడానికి చేతిలో పైకం లేదు. రూపాయి వడ్డీకి వెయ్యి రూపాయలు అప్పు చేసి జరిపించారు. ఆ అప్పు తీరటానికి ఆయనకి పదిహేను సంవత్సరాలు పట్టింది.

జీవితం మరొక మలుపు తిరిగింది. ఇది మలుపు కాదు. పెద్ద అగడ్త. దాటలేనంత లోతయినదీ, దాటక తప్పనిదీను. పాత మద్రాసులో ఎం.వి.యస్ సంస్థ పుస్తకాలను ప్రచురించేది. ఉద్యమంగా ప్రారంభమయిన రచన ఇప్పుడు ఉపాధి అయింది. అంతే కాదు. పెరిగిన సంసారానికి ఇది బొత్తిగా చాలని ఆదాయమయింది. పుస్తకం రాశాక ప్రచురణకర్త డబ్బు ఇస్తేనే ఇంటికి వెచ్చాలు వచ్చేవి. అవీ చాలీచాలనంత. కళని అవసరానికి కుదించి నప్పుడు ఎంతో కొంత రాజీ సహజం. కానీ ఆ రోజుల్లో ఆయన రాసిన చారిత్రక, అపరాధ పరిశోధక రచనలు ఈనాటి హారీపోటర్‌కి ఏ మాత్రం తీసిపోనివి. రచయితని ఓ ఇంటి అవసరం ఏమాత్రం ఓడించని దశ అది.

ఇంటిల్లిపాదీ నవల పూర్తికావడానికి ఆతృతతో - ఆ మాట సరికాదు - ఆకలితో ఎదురుచూసేవారు. నవల పూర్తికాగానే డబ్బు



సరుకులూ వచ్చేవి. కానీ సమృద్ధిగా కాదు. పుస్తకానికీ పుస్తకానికీ మధ్య - ఇంటిల్లిపాదీ కడుపులూ నకనకలాడిపోయేవి. అప్పుడు దారేది? ప్రతీ రచనకీ పన్నెండు కాంప్లిమెంటరీ కాపీలు ఇచ్చేవారు. పుస్తకం మార్కెట్ ధర రూపాయి పావలా. కానీ ఆ పన్నెండు పుస్తకాలని పెద్ద కొడుకు పానగల్ పార్క్. రాజకుమారి థియేటర్ పేవ్‌మెంట్ మీద నిలబడి అమ్మేవాడు. ఎంతకి? ఒక్కొక్కటి 30 పైసలు. పన్నెండు పుస్తకాలకీ 3 రూపాయల 60 పైసలు వచ్చేది. దారిన పోయే పాఠకులు కరుణిస్తే 4 రూపాయలు దక్కేది. ఆ డబ్బుతో 'పడి' బియ్యం, తండ్రికి పొగాకు, లవంగాలు, కొత్త నవల రచనకు స్కైర్ (24) తెల్లకాగితాలు తెచ్చేవాడు. మరో రెండు మూడు రోజులు గడిచేవి. ఇవి కొనగా ఒక రూపాయి మిగిలేది. ఆ రూపాయితో కుటుంబమంతా మరో నవల తయారయేవరకూ బతకాలి. ఎలాగ? పిండి మరల్లో బియ్యం, అపరాలు ఆడేవారు. తెచ్చిన గిన్నెలకు ఎత్తుగా చుట్టూ కొంత పిండి చేరేది. ఇది రకరకాల పప్పులు, ఇతర దినుసులు కలగా పులగం. దీన్ని 'వేస్ట్ మాస్' అనేవారు. సాయంకాలానికి ఆ పిండిని ఎంతో కొంత ధరకు అమ్మేవారు. అది ఇంటి మనుషులకని చెప్పడానికి మనసు ఒప్పేది కాదు. 'ఇంట్లో పశువుకని చెప్పు' అని పరువుకి 'అబద్ధం' తెరని కప్పేది తల్లి. ఆ పిండిని తెచ్చాక - జల్లించి, కడిగి, చెత్తని ఏరి, అల్లం, పచ్చిమిరపకాయలు, జీలకర్ర, ఉల్లిపాయముక్కలూ కలిపి, పల్చని నీళ్ళ మజ్జిగతో దోసెలు పోసి అందరికీ పెట్టేది ఇల్లాలు. వచ్చిన అతిథులెవరయినా ఉంటే - పరువుని కాపాడుకోడానికి ఆ కాస్త ఆహారంలోనే వారికి వాటా! అయితే - ఇంట్లో ముగ్గురు పసికందులు. వాళ్ళకి ఈ ఆహారం పడేది కాదు. మరి మార్గాంతరం? కొవ్వలి రెండూ మూడు కిరాణా దుకాణాలకి వెళ్ళి బియ్యం నాణ్యాన్ని చూస్తున్నట్టుగా బేరం ఆడి - శాంపిలుగా చిన్న చిన్న పొట్లాలు కట్టించుకుని తెచ్చేవారు. అలా తెచ్చిన నాలుగయిదు పిడికిళ్ళ బియ్యాన్ని ఉడికించి పసికందుల కడుపు నింపేదా తల్లి. ఏనాడూ ఇది కావాలని, ఇది లేదని అడగడం తెలియని లక్ష్మీదేవి ఆమె. మళ్ళీ కొత్త నవల తయారు - మరో నాలుగు రోజులు - పండగ భోజనం.

కొవ్వలి జీవితంలో రెండో దశ రచనలు పేదరికాన్నీ, ఆత్మాభిమానాన్నీ కలనేతగా, పడుగు పేకలుగా అల్లిన 'జీవుని వేదన'కి పుట్టిన బిడ్డలు. కానీ ఆనాడు "భయంకర్' అనే కలం పేరుతో రాసిన 'చాటు మనిషి'లాంటి అద్భుతమైన సీరియల్స్, 'విషకన్య' వంటి జానపదాలు, ఇరవై అయిదు భాగాల 'జగజ్జాణ' - ఈ పేదరికం తెరపరచుకోకుండా కళ్ళు తెరిచిన సుస్నిగ్ధ మందారాలు.

ఎప్పుడయినా - మరీ అరుదుగా - తప్పని సరయినప్పుడు - నోరు విడిచి ఇద్దరినే అప్పు అడిగిన సందర్భాలున్నాయి. వారిద్దరూ - ముదిగొండ లింగమూర్తి, బోళ్ళ సుబ్బారావు. ఎంత అప్పు? ఒకటి రెండు రూపాయలు. ఆ డబ్బుతో ఎన్ని దోసెలు! అతిథులకి ఎన్ని సత్కారాలు! సమతుల్యంగా మరొక పక్క ఎంత సాహితీ వ్యవసాయం!

అప్పుడూ తన సెన్సాఫ్ హ్యూమర్ కోల్పోలేదాయన. తూట్లు పడిన, మాసికలు వేసిన పంచెల్ని కట్టుకుని "నేను ఏక వస్త్రధారుడినే!' అనేవారు భార్యతో!. ఆ ఇల్లాలు గుండె ఆ సమయంలో ఎంతగా ఛిన్నమయేదో - కొద్దికాలానికే బయటపడింది. ఆయన సినిమా పరిచయాల్ని పురస్కరించుకుని ప్రీవ్యూలకీ, ఇతర సభలకీ ఆహ్వానాలు వచ్చేవి. కానీ పరువయిన బట్టలు లేని కారణానే ఇల్లు దాటేవారు కాదు కొవ్వలి.

తలకు మించిన వేదనల కడిలిలో తలమునకలై, బిడ్డలకి కడుపారా అన్నమైనా పెట్టుకోలేని తల్లి ఏమౌతుందో మనకు చరిత్ర సాక్ష్యముంది. చార్లీ చాప్లిన్ తల్లి. అదే లక్ష్మీ దేవి విషయంలోనూ జరిగింది. పిల్లల్ని సరిగ్గా పోషించలేని నిర్వీర్యతా, రేపు మీద బొత్తిగా ఆశలు లేని జీవితం..ఆమె మనస్థిమితాన్ని ఫణంగా తీసుకున్నాయి. ఆమెకి మతి తప్పింది. ఆఖరి రోజుల్లో - ఆమె 45 వ ఏటికే - చెప్పరాని అపస్మారంలోకి వెళ్ళిపోయింది. **వాస్తవం నుంచీ మనస్సు తీసుకునే భయంకరమైన 'పరారి' మతి చలనం. కూతుళ్ళు రాజ్యలక్ష్మి, రత్నలత తల్లికి తల్లియై సాకారు. జడ వేసి అన్నం తినిపించారు. బట్ట కట్టారు. ఇలాంటి కథలకి ఒక్కచోటే ఆటవిడుపు - మృత్యువు. మరో రెండేళ్ళకి ఆ ఇల్లాలు - తన 48 వ ఏట కన్నుమూసింది.**

**కొవ్వలి? కలం కథలు చెప్పేది. కానీ చుట్టూ ఉన్న జీవితం క్రమంగా తన కలల్ని మట్టుబెట్టేది. అన్ని వేలమంది హృదయాలను ఆర్ద్రం చేయగలిగిన రచయిత హృదయం నిశ్శబ్దంగా విచ్ఛిన్నం కావడం ప్రారంభించింది.** ఆ దుఃఖానికి తన ఆత్మాభిమానం బలమైన తెర వేసి తనకే మిగిల్చింది. కొవ్వలి సహధర్మచారిణి లేని జీవితం - కేవలం రెండేళ్ళే సాగింది. ఆయన రాసిన 1001 నవల పేరు "కవి భీమన్న", (అవును, ఆయన వెయ్యి నవలలు రాశారు!) వేములవాడ భీమకవి జీవితం ఆధారంగా రచించిన చారిత్రిక నవల అది. చివరి రోజున ద్రాక్షారామ భీమేశ్వరుడిని దర్శించుకున్నారు. మరునాడు (1975 జూన్ 8) వేకువ జామునే జీవితం నుంచీ శలవు తీసుకున్నారు.

మద్రాసు, ఉస్మానియా, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలు ఆయన కృషికి యోగ్యతా పత్రాలిచ్చాయి. కానీ తన కూతురు పెళ్ళికి పదివేలు కావాలని ఆయన - నోరు విడిచి - భారత విద్యా శాఖకి పెట్టుకున్న అర్జీకి సమాధానంగా నెలకి 50 రూపాయలిచ్చారు! (ఆయన చేతులతో రాసుకున్న అర్జీని చూడండి)

తెలుగునే మరిచిపోయే దశలో తెలుగువారికి - ముఖ్యంగా మాములు పాఠక జనానికి చదువు 'రుచి'ని పెంచి ఒక డిగ్నిటీనీ, అవగాహననీ కల్పించిన ఉద్యమకారుడు - తన పేదరికాన్ని హాలాహలంగా దిగమింగి - ఉద్యమాన్ని ఉపాధికోసం దిగజార్చకుండా వెయ్యి రచనలు చేసిన యోధుడు - ఈ మాటలు నావి కావు - ఆనాటి ప్రముఖుల అభిప్రాయాలకి కేవలం ప్రతిధ్వనులు. చూడండి:

నలభై ఏళ్ళ క్రితం తెలుగుదేశంలో మొట్టమొదటగా జనబాహుళ్యం కోసం, అందులోనూ మధ్యతరగతి స్త్రీలకు ఆమోదకరంగా ఉండే విధంగా రచనలు చేసినవారు కొవ్వలి.... **చక్రపాణి**

నా చిన్ననాడు (1940 ప్రాంతంలో) నేను చిన్న తరగతుల్లో చదువుకుంటున్నప్పుడు మా ఊళ్ళో ప్రతివాడి చేతిలో కొవ్వలి నవల కనపడింది...............**దాశరథి**

తెలుగులో పఠనాశక్తిని పెంపొందించడానికి కృషి చేసినవారిలో ఆయన ప్రధముడు. ఆ కృషి ఫలితాన్ని ఈనాడు అనేక పత్రికలు, రచయితలు అనుభవించుతూ ఉండడం మనం చూస్తున్నాం......**కొడవటిగంటి కుటుంబరావు**


...నా మట్టుకు నేను వారి నవలలన్నీ చదివి, అందలి కల్పనా ప్రతిభకు, రచనా విధానానికి ముగ్ధుడనైనాను...... **చిత్తూరు నాగయ్య.**

రైళ్ళలోనూ, బస్సుల్లోనూ వారి నవలలు చదువుతూ ప్రయాణం చేసేవారు. దిగాల్సిన స్టేషన్ మరచిపోయేవారు. నవల పూర్తికావడం నాలుగయిదు స్టేషన్లు దాటి వచ్చేశాం అని గుర్తురావడం ఒకేసారి జరిగేది................. **భానుమతీ రామకృష్ణ**

ఆ సమయంలో ఆంధ్రదేశంలో పుస్తక ప్రపంచంలో, నవలా సాహిత్యంలో ఒక గొప్ప సంచలనం కలిగింది - ప్రతీ బస్సుస్టాండులోనూ, రైలు స్టేషనులోనూ నవయువ్వన యువతీయువకుల చేతుల్లో ఆ నవలలే ఉండేవి... అన్ని రకాల ప్రజలనూ ఆకర్షించిన ఈ నవలలెవరివి? - ఆంధ్ర దేశమంతటా ఏ నోట విన్నా ఆ పేరే జపించే రచయిత ఎవ్వరు? - కొవ్వలి......**మిక్కిలినేని రాధా కృష్ణమూర్తి**

తెలుగు చదవడాన్ని కొన్ని తరాలకు కొట్టిన పిండిగా మార్చడం ఎంతటి ఘనతరమయిన విప్లవమో - తెలుగు అక్షరాలు కూడా పిల్లల చేత చదివించలేని దుస్థితిలో ఉన్న మనకి బాగా అర్ధమవుతుంది. చచ్చినవారి సమాధుల మీద పువ్వులు వేయడం కేవలం సెంటిమెంటల్ రొటీను. మహాత్మాగాంధీకే ఆ తద్దినం తప్పలేదు. అయితే వంశక్షయమని ఈసడించే ఛాందసులనుంచీ - తిండీ గుడ్డా

పెట్టని ఈ చదువెందుకని తుంగలో తొక్కే దశకి తెలుగు వైభవం ప్రయాణం చేసిన నేపథ్యంలో ఇలాంటి రచయిత జ్ఞాపకం – తెలుగింటి పిల్లలకి రెండు తెలుగు అక్షరాలు నేర్పాలనే ఉత్సాహాన్ని కలిగిస్తే – కొవ్వలి ఆత్మ ఎక్కడ ఉన్నా శాంతిస్తుంది.



From –
Kovvali Lakshminarasimha Rao
8 Lakshminarayana St:
West Mambalam,
Madras. 33

To
The Ministory of Education,
Government of India,
New Delhi

Respected Sir,

I am a man of letters distinguished by the Government, and receiving a grant of Rs 150 per month from 1964 till now, for which act of kindness I am ever greatfull. But in noway it is sufficent.

It is admitted by the universities and also by the Sahitya Accadamies that with 40 years & my service for the letreture, I could produce 1000, (one thousand) works to improve the Litteracy, and adult education. With all of that my service, I am today struggleing for living, simply because I cared only to create reading habit among the people but not for money making. My books were wildly spread because of the cheapest Price – and that was my motive.

Recently, Justice of the High court, Madras, Mr. V. Ramaswamy in a meeting of, all men of letters, and elite of Madras certifying all the above facts, honoured me with a title of "Sahitya Sarvabhowma" for which nobel act, while thanking him, I request the Ministry of Education and



# ఉషశ్రీ అమరవాణి

డా.గాయత్రీ దేవి




**ఉషశ్రీగారి 80 వ జయంతి సందర్భంగా వారి కుమార్తె వ్రాసిన ప్రత్యేక వ్యాసం**

1974 నుండీ దాదాపు ఒక దశాబ్దం పాటు అశేష ఆంధ్ర శ్రోతలనీ ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి కట్టిపడేసిన కార్యక్రమం "ధర్మ సందేహాలు" (వ్యాసపీఠం), ఆ కార్యక్రమం అంత ఆసక్తికరం కావడానికి కారణం శ్రీ ఉషశ్రీ - ఉషశ్రీ గంభీర గళం, అనితర సాధ్యమయిన కథన శైలి. ఆ రోజుల్లో ఆదివారం మధ్యాహ్నం, ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ఈ కార్యక్రమం ప్రసారమయ్యే సమయంలో ఏ పూటకాపూట సంపాదించుకుంటే కానీ రోజు గడవని రిక్షా వాళ్ళు కూడా బేరం దొరికినా రిక్షా కట్టేవారు కాదు, కార్యక్రమం పూర్తి అయ్యేవరకూ. ఏ కిళ్ళీ కొట్టు దగ్గరో చేరి భక్తి శ్రద్ధలతో వినేవారు ఆ తరువాతే బేరం చూసుకునేవారు. పామరులనీ, పండితులనీ సమంగా ఆకర్షించింది ఆ కార్యక్రమం. ఆ ఆకర్షణ ఎంతటే దాదాపు మూడు దశాబ్దాలు గడిచిన తరువాత ఈ రోజుకి కూడా ఉషశ్రీ అంటే రామాయణ భారతాల ప్రవచనాలని గుర్తుచేసుకుంటున్నారు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆంధ్రులు.

ఉషశ్రీ వాణి ఆకాశవాణి ద్వారా నేటికీ తెలుగువారి స్మృతులలో అమరవాణిగా నిలిచిపోవడానికి వెనుక ఉన్న, నాకు తెలిసిన కథ -

*శ్రీకారం*

1952లో మొట్టమొదట నాన్న గొంతు ఆకాశవాణిలో వినబడిందని మా అత్త చెప్పింది. అది శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి చెలియలి కట్టమీద ప్రసంగమట. అప్పట్లో ట్రాన్సిస్టర్ రేడియో ఊరికి ఒకరికో ఇద్దరికో ఉండేదట. అప్పుడు మా తాతగారూ (పురాణవాచస్పతి, ఉపన్యాస సార్వభౌమ పురాణపండ రామ్మూర్తిగారు) వాళ్ళు తూర్పు గోదావరి జిల్లా అలమూరులో ఉండేవారు. ఆ ఊరి ప్రెసిడెంటు గారింట్లోనూ, వారికి సంబంధించిన మరొకరి ఇంట్లోనూ మాత్రమే రేడియోలు ఉన్నాయిట. అప్పట్లో రేడియో అంటే ఓ అద్భుతం. ఆ అద్భుతమయిన రేడియోలో తన పెద్ద కొడుకు మాట్లాడుతున్నాడూ అంటే మరీ అద్భుతం, తను ఆ కార్యక్రమాన్ని ఎలాగయినా వినాలని మా తాతగారు ప్రెసిడెంట్ గారింటికి వెళ్ళారట. తాతగారు వెళ్ళాక తాము కూడా తమ అన్నగారి గొంతు రేడియోలో వినాలని మా మేనత్తలు ప్రెసిడెంట్ గారి చుట్టం ఇంటికి వెళ్ళారుట. సరిగ్గా కార్యక్రమం మొదలయ్యే సమయానికి ప్రెసిడెంట్ గారి ట్రాన్సిస్టరులో బాటరీలు అయిపోయాయని, ఆ చుట్టం ఇంట్లో ఉన్న బాటరీలని పట్టుకెళ్ళిపోయారట! ఆ రోజు ఆ కార్యక్రమాన్ని వినలేక పోయినందుకు చాలా నిరాశపడ్డామనీ, మా అన్నయ్య గొంతు నిత్యం రేడియోలో వచ్చే రోజులు వస్తాయనీ, మేమే కాదు వాడి గొంతు వినాలని కొన్ని కోట్ల తెలుగు వారు కోరుకునే రోజు వస్తుందనీ ఆ రోజు మాకు తెలియదు కదా అంది మా అత్త. అవును... అదే కదా పరమేశ్వర లీల!

తన మొదటి ప్రసంగం తరువాత అప్పుడప్పుడూ తనని ప్రసంగాలకీ, కథలకీ రేడియోవారు పిలుస్తూండేవారని నాన్న చెబుతుండేవారు.

హైదరాబాదు

రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో ట్యూటర్‌గా కొన్నాళ్ళు పని చేసి, హైదరాబాదు చేరి అక్కడ ఆంధ్రభూమి, ఆంధ్రజనత, ప్రజాప్రభ దినపత్రికలలో సబ్‌ఎడిటర్‌గా పనిచేశారట. ఎక్కడా ఆరుమాసాలకి మించి పని చెయ్యలేదట.

ఆ సమయంలో ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో ప్రాంతీయ వార్తలు చదివే నళినీకాంతరావుగారు సెలవుపెడితే వార్తలు చదవడానికి నాన్నగారికి అవకాశం వచ్చింది. అప్పుడు "ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం, ప్రాంతీయ వార్తలు చదువుతున్నది పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు"(నాన్నగారి అసలు పేరు) అని వార్తలు చదివేవారట. ఆ సమయంలోనే స్క్రిప్ట్ రైటర్ పోస్ట్ ఒకటి ఖాళీ అయ్యిందట. అప్పటికే నాన్న ప్రతిభని గుర్తించిన నాటి హైదరాబాద్ స్టేషన్ డైరక్టర్ కృష్ణమూర్తిగారు, నాన్న చేత ఆ పోస్ట్‌కి అప్లై చేయించమని రజనీకాంతరావుగారికి చెప్పి, అప్లై చేయించి రేడియోలోకి ఉద్యోగిగా తీసుకున్నారట. అలా 1965లో ఆకాశవాణిలో ఉద్యోగిగా ప్రవేసించారు నాన్న.... ఈ ఉద్యోగం ఎన్నాళ్ళు వెలగబెడతాడో అని నాన్నని తెలిసిన వాళ్ళే కాదు నాన్న కూడా అనుకున్నారట. రేడియో ఆయన ప్రవృత్తికి సరయిన ఉద్యోగం కావడంతో రెండు దశాబ్దాలు రేడియోలోనే ఉన్నారు, రేడియో ఉషశ్రీగా ఈనాటికీ ప్రజల మనసుల్లో చిరంజీవిగానూ ఉన్నారు.


1970 ప్రాంతంలో శ్రీమ

1965లో పాకిస్తాన్ మనదేశం మీద దుర్ాక్రమణ చేసిన సమయంలో అప్పటి మన ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి యుద్ధ నిధి కోసం హైదరాబాదు వచ్చారట. ఆయన కార్యక్రమానికి ఆకాశవాణి నుండీ ప్రత్యక్ష వ్యాఖ్యానం ఏర్పాటు చెయ్యాలి - వ్యాఖ్యానానికి ఎవరిని పంపాలి అని ఆలోచించి, అప్పటికి ఇంకా ఉద్యోగంలో చేరి పది పదకొండు నెలలు కూడా కాకపోయినా, వ్యాఖ్యానంలో అనుభవం లేకపోయినా ఇతనికిచ్చి చూద్దామని అయ్యగారి వీరభద్రరావు గారు, ఆ బాధ్యతని నాన్నకి అప్పచెప్పారట. ఆ కార్యాన్ని నాన్న విజయవంతంగా నిర్వహించారట. 1948లో మహాత్మాగాంధీ మరణించినపుడు రేడియోలో గంభీర గళంతో డిమెల్లో చెప్పిన వ్యాఖ్యానం విన్నపుడు 'నాకు రేడియో ఉద్యోగం వస్తే ప్రత్యక్ష వ్యాఖ్యానం ఇలా చెప్పాలి' అనుకున్నారట నాన్న. ఆ కోరిక దాదాపు రెండు దశాబ్దాల తరువాత మొదటిసారి తీరింది. నాన్నగారు తరువాత తరువాత ఎన్నెన్నో కార్యక్రమాలకి ప్రత్యక్షవ్యాఖ్యానాలు చెప్పారు. అవి ఆయనకి పేరు ప్రఖ్యాతులు తెచ్చాయి.

రేడియోలో చెయ్యవలసిన ఉద్యోగం స్క్రిప్ట్ రైటర్ - అంటే కాయితం మీద కార్యక్రమాలకి అవసరమయిన విషయాలు రాసి ఇవ్వాలి - అయితే ఒక్కనాడు కూడా నాన్న కాయితం మీద కలం పెట్టలేదట - కార్యక్రమానికి ఏది అవసరమో అది అప్పటికప్పుడు ఆశువుగా చెప్పేవారట. అది ఆయనకి భగవంతుడు ఇచ్చిన వరం. ఈ సందర్భంగా ఒక మాట చెప్పాలి. మా నాన్నగారి చిన్నపుడు శ్రీధర వెంకయ్య గారు అనే జ్యోతిశ్శాస్త్ర పండితులు మా తాతగారితో "అబ్బాయ్, మీవాడు నోరు పెట్టుకుని బతుకుతాడు" అని భవిష్యత్తు చెప్పారట! ఆయన వాక్కు ఫలించింది అని నాన్న చెప్పేవారు.

హైదరాబాదు రేడియోలో కొంతకాలం మల్లేశు అనే పేరుతో, కొంత కాలం పెద్దబాబు అనే పేరుతో నాన్నగారు, రవణక్క అనేపేరుతో రతన్ ప్రసాద్‌గారు, ఏకాంబరం పేరుతో సత్యనారాయణగారు-- ముగ్గురూ కలిసి కార్మికుల కార్యక్రమాన్ని కార్మికులకి


ఆసక్తిదాయకంగా చెయ్యడమే కాదు సర్వజనరంజకంగా తయారు చేశారు. ఆ కార్యక్రమంలో ఒక రోజు వీళ్ళు కాకరకాయ బజ్జీల గురించి మాట్లాడారట. అది విన్న శ్రోత ఒకావిడ కాకరకాయతో బజ్జీలు చేసి రేడియో స్టేషనుకి తీసుకు వచ్చి వీళ్ళకి పెట్టిందట.

నాన్నగారు కొంతకాలం హైదరాబాదు రేడియోలో ఫామిలీప్లానింగ్ శాఖలో పనిచేశారు. ఆ కార్యక్రమాలని కూడా ఎంతో సరదాగా వినాలనిపించేలా తయారు చేసేవారు. ఒక నాటి కార్యక్రమంలో రతన్‌ప్రసాద్‌గారు నాన్న భార్యా భర్తల్లా మాట్లాడుతూ లైవ్ ప్రోగ్రాం చేస్తున్నారట. వీళ్ళు ఎంత సహజంగా మాట్లాడుతున్నారంటే, వీళ్ళు కేవలం మాటలేనా, యాక్షన్ కూడా చేసేస్తున్నారా అని అప్పుడు హైదరాబాదు రేడియోలో ఉన్న రజనీకాంతరావు గారు కంగారుగా వెంటనే స్టూడియోలోకి వెళ్ళి చూశారట. వీళ్ళిద్దరూ మైకు ముందు 'కూర్చుని' మాట్లాడ్డం చూశాక ఊపిరి పీల్చుకున్నారట!! రేడియో ప్రత్యేకతే అది – మనిషి కదలకుండా కేవలం గొంతులో నుండే అన్ని భావాలూ కలిగేలా మాట్లాడాలి!

*విజయవాడ*

రేడియోలో నాకు తెలిసినంత వరకూ ప్రమోషన్స్ చాలా తక్కువ. స్క్రిప్ట్ రైటర్‌గా చేరిన వారు అదే పోస్ట్‌లో, అనౌన్సర్‌గా చేరినవారు ఆ పోస్ట్‌లో రిటైర్ అవుతుంటారు. తన రెండు దశాబ్దాల రేడియో సర్వీసులో నాన్నగారికి మూడు ప్రమోషన్‌లు వచ్చాయి. ఏదో మాటవరసకి చెప్పుకోవడమే కానీ నిజానికి ఇప్పటికి మూడున్నర దశాబ్దాలుగా తెలుగువారి మనసుల్లో ఉషశ్రీ పేరు నిలిచిపోవడానికి కారణం ఆయన కథాకథన శైలీ, వాక్శుద్ధి తప్ప ఈ ప్రమోషన్‌లు కావు.

1969లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారు మరణించడంతో ఒక ఖాళీ ఏర్పడింది. హైదరాబాదు వదిలి రావడం నాన్నకి కానీ, మాకెవ్వరికీ కానీ (అప్పటికి నేను 4వ తరగతి) ఇష్టం లేదు. కానీ నాన్న శ్రేయోభిలాషులు ఇది నీ మంచి కోసమే వెళ్ళు, అని ఆ పోస్ట్‌కి అప్లై చేయించి నాన్నని ఇంటర్వ్యూకి పంపారు. విజయవాడలో ఇంటర్వ్యూ. వ్యవసాయశాఖలో ఉద్యోగం కనక అక్కడ వ్యవసాయ శాఖాధికారులు నాన్నని తత్సంబంధమయిన ప్రశ్నల వర్షం కురిపించడం మొదలుపెట్టారట. అప్పుడు నాన్న, 'అయ్యా, మీకెందుకీ శ్రమా, నాకు ఈ విషయాలలో పరిజ్ఞానం శూన్యం, అయినా రేడియో పనిచేసే వారికి ఆ విషయాలు తెలియనవసరం లేదు. తమవంటి శాస్త్రవేత్తలు ఇంగ్లీషులో ఆ విషయాలని మాకు రాసి పంపుతారు, అవి ఎలా చెబితే సామాన్యుడికి అందుతుందో నాకు తెలుసు, తెలుసును కనకనే వైద్యరంగంలో ఓనమాలు తెలియక పోయినా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించడంలో నన్ను మించినవాడూ లేడనిపించుకునేలా చేశాను.' అన్నారట. (అసలు ఆ ఇంటర్వ్యూని చెడగొట్టి హైదరాబాదులో ఉండిపోవాలని నాన్న కోరిక) అప్పటి స్టేషన్ డైరక్టర్ వెంటనే ఆ పోస్ట్‌కి నాన్నని సెలక్ట్ చేసేశారు, అప్పటి నుండీ మేము విజయవాడవారమయ్యాము. ఒక సంవత్సరంలో తిరిగి హైదరాబాదు వెళ్ళిపోవచ్చు అనుకుంటూ విజయవాడ చేరాం. 69 ఏప్రిల్‌లో విజయవాడ ప్రవేశం చేసే సమయానికి ఊరంతా శ్రీరామనవమి ఉత్సవాలు అయ్యి సగం సగం తీసిన పందిళ్ళతో చెత్తా చెదారంతో రోడ్లన్నీ భయంకరంగా ఉన్నాయి. వాటికి తోడు పందులూ, మురికి కాలువలూ, మనుషులు వచ్చి శుభ్రం చెయ్యవలసిన లెట్రిన్లూ వగైరా చూసి, 'నాన్నా నాకీ ఊరు బాలేదు మనం మళ్ళీ హైదరాబాదు వెళ్ళిపోదాం' అని సతాయించేదాన్ని నేను, 'వెళ్ళిపోదాం నాన్నా' అని నన్ను ఓదార్చేవారు నాన్న – అటువంటిది ఈ రోజు ఎవరయినా మీదే ఊరు అంటే విజయవాడ అని చెబుతాను. ఆనాటి నుండీ మాకు


షష్టిపూర్తి సమయంలో


నలుగురు కూతుళ్ళు

విజయవాడే స్వంత ఊరు అయిపోయింది. అమ్మా నాన్నలు లేకపోయినా మాకు పుట్టినిల్లు! నాన్న అక్కడే ఇంకా ఉన్నట్లుంటుంది మనసుకి.

వ్యవసాయ కార్యక్రమాలలో పంట సీమలు, పసిడి పంటలు అనే కార్యక్రమాలు ఉండేవి - అందులో నాన్న చిన్నబాబు అనే పేరుతో మాట్లాడుతుండేవారు. ఆ కార్యక్రమాలన్నీ కూడా ఈ వ్యవసాయంతో సంబంధం లేకపోయినా నేను కూడా ఇష్టంగా వినేదాన్ని. ఈ కార్యక్రమం వినే ఎందరో నాన్నకి అభిమానులయ్యారు. ఆఫీసు పని మీద పల్లెటూళ్ళకి వెళ్ళినపుడు నాన్నని కలవడానికి అక్కడి ప్రజలు చుట్టూ చేరుతుండేవారు. అదీ ఇదీ అని లేదు ఏ కార్యక్రమమయినా దానిని రక్తి కట్టేలా చేసే శక్తి ఆయనకి ఉంది. వ్యవసాయ విభాగాన్ని చూసే గుమ్మలూరి సత్యనారాయణగారు, అప్పటికప్పుడు ఏదయినా కార్యక్రమాన్ని చెయ్యవలసి వస్తే నాన్నని స్టూడియోలోకి పంపేవారు - వెంటనే లైవ్‌ప్రోగ్రాం అయ్యేది.

*మలుపు*

1973లో బాలాంత్రపు రజనీకాంతరావుగారు స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో నాన్న తెలుగు ప్రసంగ విభాగానికి అధిపతి అయ్యారు - రామాయణ భారత ఉపన్యాసకులు, వ్యాఖ్యాత అని తెలుగు వారి మనసులు దోచుకున్న ఉషశ్రీకి అదే మలుపు తిప్పిన సమయం. ఆ సమయంలో రజనీకాంతరావుగారి ప్రోత్సాహంతో ప్రతి శనివారం మధ్యాహ్నం 1.30కి ధర్మ సందేహాలు పేరిట ఒక పది నిమిషాల కార్యక్రమాన్ని ప్రారంభించారు నాన్న. అందులో రామాయణ, భారత, పురాణాల గురించే కాకుండా రాజకీయాలు, క్రీడలు.. ఇంకా ఎన్నెన్నో అంశాల గురించి శ్రోతలు పంపిన ధర్మ సందేహాలకి నాన్న తనదయిన ప్రత్యేక శైలిలో వ్యంగ్యమూ, చురకలూ చేర్చి జవాబులు చెప్పేవారు. "ఆ కార్యక్రమం ఎంత ఆదరణ పొందిందంటే కార్యక్రమం నిడివిని అరగంటకి పెంచక తప్పలేదు. ఆ తరువాత శ్రోతల కోరిక మేరకు ఆ కార్యక్రమాన్ని ఆదివారం మధ్యాహ్నం 12 గంటకి మార్చక తప్పలేదు." -- అన్నారు ఆ మధ్య ఒకసారి బాలాంత్రపు రజనీ కాంతరావు గారితో మాట్లాడుతుంటే, ఆ సంఘటనలన్నీ నాకు కూడా గుర్తున్నాయి. ఆ సమయానికి వివిధభారతిలో సంక్షిప్తశబ్ద చిత్రం పేరుతో సినిమా వేసేవారు రేడియోలో. సాధారణంగా సినిమా కార్యక్రమాలకి ఎక్కువ ఆదరణ ఉంటుంది. అయితే నాన్న కార్యక్రమం వచ్చే సమయంలో ప్రజలు సినిమా కార్యక్రమం మానేసి ఇదేవినడం మొదలుపెట్టారు. అప్పుడే దానికి వ్యాసపీఠం అని పేరు పెట్టారు. ఆ కార్యక్రమంలో నాన్న ధారావాహికంగా భారతం, రామాయణం, భాగవతం చెప్పారు. ఈ కార్యక్రమం నాన్నకీ, విజయవాడ రేడియో కేంద్రానికీ కూడా పేరు తెచ్చిపెట్టింది.


1988లో కూతుళ్ళు,పెద్దల్లుడితో

ఆంధ్రదేశాన్ని ప్రతి ఆదివారం అరగంట సేపు నైమిశ తపోవనంగా మార్చేశారు ఉషశ్రీ అన్నారు ప్రముఖులు. పండిత పామరులని సమంగా ఆకర్షించిందీ కార్యక్రమం. పుట్టపర్తి నారాయణాచార్యుల వంటి పండితులూ, పెద్దల నుండీ సామాన్య గృహిణులూ, రిక్షా తొక్కి కాయ కష్టం చేసుకునే వారూ, ఆఖరికి ముష్టివారు సహితం ఎక్కడో ఒకచోట రేడియో దగ్గర చేరి రామాయణ భారతాలని "శ్రీ

గురుభ్యోనమః" నుండి (కార్యక్రమం ఆరంభం) నుండి "స్వస్తి" (ముగింపు) వరకూ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వినేవారు. రేడియో ముందు దీపం పెట్టి, కార్యక్రమం అవ్వగానే కొబ్బరికాయ కొట్టి హారతులు ఇచ్చేవారు చాలామంది శ్రోతలు (మా మామ్మతో సహా). రేడియో ఒక పవిత్ర వస్తువయ్యింది ధర్మసందేహాలు శ్రోతలకి. (ఆయన రాసిన రామాయణ భారతాది గ్రంథాల ముద్రణా, అవి లక్షల కొద్దీ కాపీలు ఈ నాటికీ ఇంకా అమ్ముడవుతూండడం... అదంతా మరో కథ)

ఇదంతా ఒక రోజులో జరిగినది కాదు - పదం పలకడం నేర్పిననాటినుండీ మా మామ్మగారు నేర్పిన భాగవత పద్యాలు, తాతగారి దగ్గర పారాయణం చేసిన భారత రామాయాణాలు, నండూరి కృష్ణమాచార్యులుగారు, దిగుమర్తి సీతారామస్వామిగారు, వెంపరాల సూర్యనారాయణగారల వంటి పండితులయిన గురువు - దగ్గర చేసిన అధ్యయనం, సాహితీ ప్రక్రియలలో చేసిన రచనానుభవమూ, ప్రముఖులతో నిర్వహించిన పలు సాహితీ సమావేశాలూ..... ఇవన్నీ నలభయ్యో ఏట నుండీ సాగించడానికి తలపెట్టిన తపోదీక్షకి పూర్వరంగం. పాంచభౌతికంగా ఇహలోకాన్ని వదిలిన పద్దెనిమిది సంవత్సరాల తరువాత నేటికీ ఆయన కలానికీ, గళానికీ ప్రపంచమంతటా అభిమానులున్నారంటే అది ఆ తపస్సు ఫలితమే!

*ఇంకా...*

రేడియోలో ఎన్నెన్నో విశిష్టమయిన కార్యక్రమాలు నిర్వహించారు నాన్న. భక్తిరంజినిలో భగవద్గీత, కథామందారం పేరుతో ప్రముఖుల కథలు, నవలా స్రవంతి పేరుతో మంచి నవలలు, ఉత్తమ స్థాయి కవిసమ్మేళనాలూ, అష్టావధానాలూ, భువన విజయలూ, అహూతుల సమక్షంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలని రూపొందించేటప్పుడు నాన్నగారిది ఒకటే సిద్ధాంతం - కార్యక్రమాలలో పాల్గొనడానికి అవకాశం ఇవ్వమని తన వెంటపడేవారికి కాదు, తను వెంటపడి పిలిచి తీసుకురావలసిన వారినే పిలవాలి అని. విద్వత్తులేని వారికి కార్యక్రమం ఇచ్చేవారు కాదు. ప్రతిభ ఉన్న వారికి ఎలాగయినా అవకాశం ఇచ్చేవారు. అయినవారికే అవకాశాలు ఇవ్వడం అన్నది ఏనాడూ లేదు.

*ప్రత్యక్ష వ్యాఖ్యానాలు*

నాన్న నిర్వహించిన కార్యక్రమాలలో ఆయనకి చాలా ఇష్టమయినది - ప్రత్యక్షవ్యాఖ్యానం - భద్రాచలంలో సీతారామకళ్యాణానికి నాన్నగారు అనేక సంవత్సరాలపాటు ప్రత్యక్షవ్యాఖ్యానం చెప్పారు. ఈ నాటికీ శ్రీరామనవమి, సీతారామ కళ్యాణం అనుకోగానే నాన్నపేరుని గుర్తుచేసుకుంటారు తెలుగువారు. ఆయన చెబుతూంటే శ్రోతలకి భద్రాచలంలో కళ్యాణం కళ్ళకి కట్టినట్లు ఉండేది. దువ్వూరి వెంకట రమణశాస్త్రిగారు నాన్నని కలిసినపుడు 'నువ్వేనా భద్రాచలంలో జానకమ్మ కళ్యాణం కన్నులారా చూసి మా కందరికీ చెవులతో చూపిస్తున్నావు, చాలా సంతోషం' అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అప్పట్లో నాన్నగారు చెప్పిన సీతాకళ్యాణం కాసెట్‌ని రెండు సంవత్సరాల క్రితం మా వెబ్‌సైట్ www.ushasri.org లో పెట్టినపుడు, దేశం నలుమూలలనుండే కాక అమెరికా నుండీ కూడా తెలుగువారు ఆ నాడు తాము ఉషశ్రీ గారి ప్రత్యక్ష వ్యాఖ్యానంతోనే సీతారామకళ్యాణం చేసుకున్నామనీ, ఆ అనుభూతి తమకు చాలా ఆనందంగా ఉన్నదని ఫోనులూ మెయిల్స్ ద్వారా తెలియజేశారు. అది మాకు చాలా ఆనందాన్నిచ్చింది. గోదావరి నది మీద కొవ్వూరు నుండీ రాజమండ్రి వరకూ వేసిన రోడ్డు రైలు బ్రిడ్జిని నాటి రాష్ట్రపతి ఫక్రుద్దిన్ ఆలీ అహ్మద్ గారు ప్రారంభించినపుడు నాన్నగారు చెప్పిన ప్రత్యక్ష వాఖ్యానం మరువలేనిది. ఆనాడు ఆయన చెప్పిన వ్యాఖ్యానం విన్న స్టేషన్ డైరక్టర్ వెంటనే ఆనందంగా ఫోన్ చేసి అభినందించారు. జై ఆంధ్రా ఉద్యమ సమయంలో కాకాని వెంకటరత్నం గారు మరణించారు. ఆయన అంతిమ యాత్రని కళ్ళారా చూస్తూ చెబుతున్నట్లు వ్యాఖ్యానం చేసి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. కృష్ణాపుష్కరాలకి కూడా ఆయన ప్రత్యక్షవ్యాఖ్యానం చేశారు.

ఇలా చెబుతూ పోతే ఎన్నో విశేషాలు ఉన్నాయి....

19986 లో నాన్న ఆకాశవాణి ఉద్యోగం నుండీ రిటైర్ అయ్యారు. (రామాయణ భారతాల ప్రవచన దీక్ష నుండీ ఆయనకి రిటైర్మెంట్ లేదు).

*ప్రసార భారతి - ఆర్కైవ్స్*


1990 జులై నాటికి నాన్న ఆరోగ్యం బాలేదు. కూర్చుంటే వెన్నంతా మంట, భరించలేని నొప్పితో నిరంతరం పడుకునే ఉండవలసి వచ్చింది. ఆ సమయంలో ఆకాశవాణి విజయవాడ వారు ఆర్కైవ్స్ కోసం నాన్నచేత పదమూడు ఎపిసోడ్స్ కృష్ణలీలలు చెప్పించి రికార్డ్ చేస్తాం అన్నారు. రోజుకి ఒక్క భాగమయినా చెయ్యగలనో లేదో అనుకుంటూ ఆకాశవాణి స్టూడియోకి వెళ్ళారు నాన్న - ఏకబిగిన ఆరేసి ఎపిసోడ్స్ చొప్పున రెండు రోజుల్లో రికార్డింగ్ పూర్తిచేసేశారు - ఆ రెండు రోజులు నాన్న ఎంత ఉత్సాహంగా ఉన్నారో, అసలు నాకు అనారోగ్యమే రేడియోకి వెళ్ళకపోవడమేమో, ఇవాళ నాకు అసలు ఏ బాధాలేనట్లు ఉంది - అన్నారు ఆనందంగా. రేడియో అంటే అంత ప్రాణం నాన్నకి... పద్దెనిమిది సంవత్సరాల క్రితం నాన్న చేసిన ఆ కార్యక్రమాన్ని ఇప్పటికయినా సిడిలు చేసి తెలుగు శ్రోతలకి ప్రసార - భారతి వారు అందిస్తే -- నాన్న అనారోగ్యాన్ని కూడా లెక్క చెయ్యకుండా ఆర్కైవ్స్ కోసం స్టూడియోకి వెళ్ళిన శ్రమకీ, కృష్ణలీలలు అందించడానికి ఆయన చేసిన కృషికీ ఫలితం ఉంటుంది.

*స్వస్తి.*

ఆయనకి రేడియో ఉద్యోగం సద్యోగం. ఎందుకంటే తన అవకాశాన్ని మరో విషయానికీ మరో మిమర్శకీ వాడుకోక భారతీయులకి హృదయస్పందన నేర్పిన సద్గ్రంథ వ్యాప్తికి అంకితం చేసినందుకు. కొన్నేళ్ళపాటు నిరంతర దీక్షతో ఆ గ్రంథాలను ఆయన ప్రవచిస్తూంటే తెలుగుజాతి వెర్రెత్తిపోయింది. ఇలా కావడానికి ఆయన పాండిత్యంతో పాటూ శ్రావ్యము, గంభీరము పరిష్కృతము సరళము స్పష్టము అన్నిటికీ మించి భావస్ఫోరకమూ అయిన వాక్కు........ **ధారా రామనాథ శాస్త్రి**

ఉషశ్రీ చెప్పదలచిన దాన్ని స్పష్టంగా ముందు దర్శించి, రుచికరంగా మనకు బొమ్మకట్టి చూపించి, సముజ్వలంగా వ్యాఖ్యానిస్తారు. ఆయన భావుకతలోని దృశ్యధర్మాన్నీ, కథనంలోని చిత్రమయిన ఒడుపునూ, సుఖశ్రావ్యమయిన వారి కంఠస్వరాన్నీ గుర్తించలేకపోవటం సాధ్యం కాదు. శైలి అంటే పద గతి మాత్రమే కాదు భావగతి కూడా...............**ఎస్.వి.భుజంగరాయ శర్మ.**

మహానది నుండి పంటకాల్వ తీసి, నీరు ప్రవహింపజేయడం అవసరం. దేశ కాలానుగుణంగా మీరు తలపెట్టిన ఈ మీ వ్యవసాయం ఫలవంతమవుతుంది. సంస్కృతులకు అది వ్యాస భారతం. తెలుగు వాళ్ళకు ఇది సమాసభారతం................................ **మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి**





**డాక్టర్ గాయత్రీదేవి గారికి ఆయుర్వేదంలో రెండు దశాబ్దాల అనుభవం, పత్రికలు, రేడియో, టీవీ మాధ్యమాల ద్వారా అందరికి ఆరోగ్యాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నారు. తండ్రి ఉషశ్రీ అసంపూర్ణ గ్రంథం "రామాయణంలో హనుమంతుడు" పూర్తి చేశారు. "why of Herbs", An Institute Of Ayurveda","పుట్టబోయే బుజ్జాయి కోసం" రచనలకి జాతీయ బహుమతులు పొందారు. 2007 లో భరతముని ఆర్ట్స్ అకాడమీ వారి - "ఆదర్శ వనితా పురస్కారం" అందుకున్నారు**

# "నా కన్నీటి బొట్లు - నా రచనలు"

## – ఆచార్య కొలకలూరి ఇనాక్



*గుంటూరు జిల్లా వేజెండ్లలో జన్మించిన ఆచార్య ఇనాక్ గారు ఆంధ్రా యూనివర్సిటీ నుంచీ పట్టభద్రులయ్యారు. అక్కడే డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 1959 నుంచీ 1999 వరకూ 40 సంవత్సరాలపాటు వివిధ హోదాల్లో వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేసి 1998 నుంచీ 2001 వరకూ శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్సలర్ గా పనిచేశారు. మొత్తం 46 పుస్తకాలు రాసిన శ్రీ ఇనాక్ గారు 10 నవలలూ, 8 కథా సంపుటాలు, 4 కవితాసంపుటులూ..అనేక ఇతరగ్రంధాలు ప్రచురించారు. కేంద్ర సాహిత్య ఎకాడమీ సలహా సంఘ సభ్యులుగా పనిచేశారు. ఈ వ్యాసంలో ఆయన జీవనపయనాన్ని అనితరసాధ్యమైన శైలిలో అందించారు. 'ఈ భూమి' వారపత్రికనుంచీ ఈ వ్యాసాన్ని పునర్ముద్రించడానికి అనుమతినిచ్చిన పత్రికా సంపాదకులు శ్రీ కేతు విశ్వనాథ రెడ్డి గారికీ, రచయిత శ్రీ ఇనాక్ గారికీ కౌముది కృతజ్ఞతలు తెలియచేస్తోంది.*

నా ప్రేమకు శబ్దం లేదు...
నా వేదనకు నిశ్శబ్దం లేదు..
నా నోరెత్తని ప్రేమ, నా
హోరెత్తే వేదనను
ఆశీర్వదించనీ - వేదన
పెరగాలా? తరగాలా?
అస్పష్టతే అందగించనీ.
కరళ్ళెత్తే నవ్వు
ఇంద్రధనస్సుల్ని మార్పిడి చేయటానికి,
ఎడారుల్లోనైనా నా తల్లివేళ్ళను నా కన్నీళ్ళు నాటనీ.
ఇదే నా ప్రార్ధన. ఇదే నా అభ్యర్ధన.

నా కన్నీళ్ళే నా వారసత్వం. నాదాయ భాగం. ఆదాయ భాగం. నేను ఏడిస్తే ఏకాకిని. నవ్వితే నలుగురుని. ఏడుపును గుండెలో ఖైదీ చేసి, నవ్వును ముఖం మీదకి విడుదల చేస్తాను. నా ఏడుపు నా సొంతం. నా హక్కు... నా ఆస్తి. నా ఏడుపు ఇతరులకు చెందదు. ఏడ్చి ఏడ్చి గుండె కడుక్కుని తేట ముఖం, తేరు కళ్ళు లోకానికి చూపించేవాణ్ణి.

చిన్నతనంలో చేయరాని పనులు చేసేవాణ్ణి. దెబ్బలు తినేవాణ్ణి. ఏడవ్వేమిరా అని కొట్టేది తల్లి. 'నువ్వే కన్నావు. పెంచావు. చంపు' అని నవ్వేవాణ్ణి. పిచ్చి పట్టి ఏడ్చేది. కదుపులకు వెన్నరాస్తూ ఏడ్చేది. కన్నీళ్ళు రాస్తూ ఏడ్చేది. నా గుండెలో ఏడుపు సముద్రాలు తుపానులై ఎగిసిపడటం నాకు తెలుసు. తీరం దాటిరాదు. నన్నెవరూ ఏడిపించలేదు. వాళ్ళు ప్రయత్నిస్తే నేను పారిపోయేవాణ్ణి. వాళ్ళు మొండిగా అడ్డం పడితే నవ్వేవాణ్ణి. ఆ నవ్వు వెనుక భూమి దద్దరిల్లే నయాగరా జలపాతాల ఏడుపు హోరు ఉండేది. వేదన అగ్నిపర్వతాలు బద్దలయే సెగ

ఉండేది. నేనేడవకపోతే వాళ్ళు ఏడ్చేవాళ్ళు. నా హిమాలయం మంచై కరిగిపోయేది. నాకు శత్రువులు లేరు. మేమున్నామని ఎవరైనా అనుకుంటే అది వాళ్ళ అదృష్టం. ఎవరిమీదా నా కోపం పడగెత్తదు. ద్వేషం నిప్పులు కక్కదు.

పసిగుడ్డును, మానాన్నను, నేలతల్లికిచ్చి తన తల్లి వెళ్ళిపోయింది. మా నాన్న తండ్రి మరో మనువాడాడు. సవత్తల్లి సర్దిపంచలేక పోయింది. మేనమామ చేరదీసి పనిపాటలు నేర్పాడు. వేటపాలెం మొక్కను అంగలకుదురులో నాటారు. మొక్క నిలదొక్కుకుంది. కొమ్మలు రెమ్మలు మీసాలయ్యాయి. ఇంట్లో ఈడు పిల్ల లేదు. విశ్రాంతమ్మను మనువాడి వేజండ్ల ఇల్లరికం పోతావా అని రామయ్యను అడిగారు. తల ఊపాడు అమ్మ మెడలో తాళి ఊగింది. ఈ పెరిగిన చెట్టును మళ్ళీ పెరికారు. వేజెండ్లలో నాటారు. అమ్మ కడగొట్టుది. తోడబుట్టిన వాళ్ళు పధ్నాలుగు మంది. ప్రేమతో కలిసిన పేదరికం ఉంది. అది పీడన. అది అలుసు. తాను అలగావాడు. మొక్క బాగా నాటుకోలేదు. మౌనంబెట్టెక్కింది. మొక్కకు నేలసారం అందటం లేదు. వడలి, కుమిలి, కమిలి కునారిల్లింది. కూలీనాలీ జీవనం. ముగ్గురు పిల్లలు. ముత్యాలు, రత్నాలు, వైఢూర్యాలు. ముప్పై మూడేళ్ళకు, ముప్పై మూడు కోట్ల దేవతలు పిలిస్తే, త్రిమూర్తులు సాక్షిగా తండ్రి స్వర్గం చేరాడు. అమ్మ దేవత. త్రిదశ. ముప్పై ఏళ్ళు నిండలేదు. పుస్తె తెగింది. ఆమె ప్రేమ అద్దూపొద్దూ లేని, దరీదాపూలేని వరద, భరించటం కష్టం. ఆమె పెట్టినా, తిట్టినా, కొట్టినా అంతే! ఆమె పాలు తాగలేక అలిసిపోయి, బలిసిపోయిన ఒళ్ళు ఎన్ని తుఫానులులైనా తట్టుకుంది. ఎన్ని ఎడారులైనా నడిచింది. ఎంత వానయియినా భరించింది. ఎంత ఎండయినా తలదాల్చింది.

మా అమ్మ కాళ్ళు పట్టుకుని నిలబడటం నేర్చుకున్న నేను ఆ కాళ్ళకు ఎప్పుడూ నమస్కరించ లేదు. ఏ కాళ్ళకూ ఎప్పుడూ నమస్కరించరాదు.. మొక్కరాదు. కాళ్ళు పట్టుకునే పని చేయరాదు. కాళ్ళు తాకరాదు. తల వంచరాదు. గురువు, దేవుడు ఎవడైనా సరే! ఈ పొగరు మా జన్మహక్కు మా వారసత్వం మా బలం. మా బలహీనత, కూట్లో దుమ్ము పణ్ణీ, కొంప కూలనీ, చావురానీ, సర్వం మట్టి గొట్టుకుపోనీ, తలవంచకు! వంచలేదు. ఈ పొగరు ఏడుపు తెస్తుందా? తేనీ! ఊబిలోకి లాగుతుందా? లాగనీ! నట్టేట ముంచుతుందా? ముంచనీ! ఏమీ లేని వాడికి ఏం పోతుంది? గోచిగుడ్డ!

ముప్ఫై ఏళ్ళు నిండని అమ్మ. అందమైన ఆరోగ్యం ఉన్న అమ్మ, మారు మనువు పోతే ఏమయ్యేవాళ్ళం? నాకు పదకొండు. చెల్లికి ఏడు, తమ్ముడికి మూడు ఏళ్ళు. ఆమె త్యాగం వెనక కన్నీటి ఉప్పెనలు. వేదనాగ్ని పర్వతాలు, కీకారణ్యాలు జడల దెయ్యాల్లాగా నిలబడేవి. ఆమె అన్నం తిని కాదు, ఆశలు తిని బతికింది. బతికించింది. గాలిమేడలు కట్టింది. అవి కూలరాదు. నిలబడాలి. నిలబెట్టాలి. వాటిల్లో పాయ్‌లు పెట్టాలి. నా పుస్తకాల సంచిలో అమ్మ ఆశలు దాచిపెట్టింది. అన్నీ నేర్పింది. నేర్చుకోకపోతే తన్నేది. ఇల్లు ఊడ్చటం, బట్టలుతకటం, వంట చేయటం అన్నీ నేర్పింది. నా తల్లివేరు పాకి మా పల్లె నేల తల్లి మాకు బువ్వ పెట్టింది. తల్లిది రెక్కల కష్టం. ఆస్తిపాస్తులు లేవు. ముగ్గుర్ని పోషించాలి. బలమైన గుండె ఆ గుండె కొండల్ని పిండి కొట్టగలదు.

ఇవి నా చుట్టుపక్కలు. ఇవీ నా చుట్టాలు పక్కాలు. ఈణ్ణుంచే నా బతుకు బాట, చూపు, నడక మొదలు. నా పొట్ట, నా ఒళ్ళు మీదనుంచే నా జీవన దృక్పథం. నా ప్రాపంచిక దృష్టి పెరిగి వేళ్ళూని మొక్కలై చెట్టై, పూలిచ్చి పరిమళం పంచి, పళ్ళిచ్చి ఆకలి తీర్చాయి. నా ఆకలి, నా అంటరానితనం నుంచే నా ఆలోచనలు నా నడక నా నడత రూపొందాయి. నేను నడవ లేదు. పరుగులు తీశాను. కోళ్ళను పట్టాలన్నా, కుక్కల్ని తరమాలన్నా నేనుండాల్సిందే అమ్మ కొట్టబోయినా, బావలు తన్నబోయినా దొరికేవాణ్ణి కాదు. ఉరికేవాణ్ణి. అందుకే స్కూల్లో, కాలేజీలలో, యూనివర్శిటీలో పరుగుపందేల ప్రైజులు నావే! చిన్ననాటి పరుగు నేటికీ ఆగలేదు. మూడో తరగతి మానేశాను. ఏడో ఏట జీతగాణ్ణి గొడ్లు కాసేవాణ్ణి. బర్రె సింహాసనం ఎక్కేవాణ్ణి. అదృష్టం కలిసొచ్చింది. తొమ్మిదో ఏట ఫస్టు ఫారంలో చేరాను. 14వ ఏట స్కూలు ఫైనల్. 15 ఇంటర్, 17 ఆనర్స్. ఇరవై నిండకముందే కాలేజీలో పాఠాలు చెప్పటం. పరుగు ఆగలేదు.

స్కూల్‌లో ఉన్నప్పుడు గేమ్స్ ప్యూను, తాలుకా ఆఫీసులో పంకా పుల్లరు, స్కూలు ఫైనల్లో క్లర్కు, ఇంటర్‌లో లెక్చరరు అయితే బాగుణ్ణనుకున్నాను. ఆనర్సులో చేరాను.

ఆ రోజుల్లో స్కూలు పని దినాలు 186 ఉండేవి. 140 రోజులు హాజరైనా పైతరగతికి పాసైపోవచ్చు. నేనెప్పుడూ పాస్ కాలేదు. ఎప్పుడూ ప్రమోట్ అయ్యాను. ఏడాదికి 200 రోజులు కూలికి పోవచ్చు. మా అమ్మ కూలి అర్ధరూపాయి, నాకు పావలా.. కలుపు తీయటం, పొగాకు నారు మోయటం, మిరపనారు అందీయటం, వేరుశెనక్కాయ పీకటం, సజ్జకంకులు విరవటం, బుడమొడ్లు మోయటం, మిరపకాయలు కోయటం, ఆరబెట్టటం, కుప్పచేయటం, కల్లం చేయటం, తూర్పారబట్టటం, చేటలందీయటం, పొలిగట్టితో ఊడవటం. దీని దుంపదెగ ఎన్నిపనులు! అమ్మకు తోడు. అమ్మకు రూపాయి, నాకు అర్ధ, అమ్మకు రూపాయి, నాకూ రూపాయి. ఇంటర్ తర్వాత కూలిపనికి పోలేదు. పొలం పనులు చేస్తుంటే చదువు సంకనాకిందా అని అడిగేవాళ్ళు. ప్రతి ఏడూ ప్రమోట్ అయ్యాను.

ఆకలికి కూడు, కూటికి డబ్బు, డబ్బుకు పని, పనికి ఒళ్ళు. ఒళ్ళు వంచాను. పొట్ట నిండింది. పొలం పస్తుల్లేనప్పుడు గోలీలాట, అది ఆటా, సంపాదన. గెలిచిన పిండి గోలీలు సీసం గోలీలు, అమ్మటం అణా అర్ధణా సంపాదన. బచ్చాలాటలకు ఓకులు. అంటే ఖాళీ సిగరెట్టు పెట్టెలు, ఏరుకురావటం, పొత్తులు కట్టటం, ఆడటం, గెలవటం, అమ్మటం, అణా సంపాదన. చెట్లెక్కి కోతి కొమ్మచ్చి ఆడినట్లే వేపపుల్లలిరవటం, సైజులు నరకటం, కట్టటం, అమ్మటం, అణా బేడా! అంతా అమ్మకే, ఆకలికే, పొట్టకే! దీపావళికి దొంగిలించి తెచ్చిన వేరు సెనక్కాయలమ్మి కొన్ని టపాకాయలు కాలిస్తే కనుక్కున్న తల్లి, దిక్కుమాలినన్ని తన్నులు తన్ని, ఏడ్చి, ఏడుస్తూ, నీది దమ్మిడీ పోరాదు. నీది కాంది దమ్మిడీ రారాదు. దొంగ తిండి కాదు. అది పెంట అని అమ్మ జీవన సూత్రం అందించింది.

*అప్పుడు అన్నం లేదు*
*ఆకలి ఉంది*
*ఇప్పుడు ఆకలి లేదు*
*అన్నం ఉంది..!*

లేమి తెచ్చే పీడ వదిలించుకోను పిచ్చి తిప్పలు పడేవాణ్ణి. స్కూలూ ఉండేది. పొలం పనీ ఉండేది. తండ్రి ఉన్నన్నాళ్ళూ వద్దన్నా వడ్డించేది. తినకపోతే నోట్లో ముద్దలు కుక్కేది, ఫోర్త్, ఫిఫ్త్ ఫారాలు గడ్డురోజులు. తండ్రిలేడు. తిండి లేదు. ఆకలి మండిపోయేది. ఒళ్ళు దాచుకోలేదు. స్కూలు ఫైనల్లో హరిజన హాస్టల్లో చేరాను. అన్నం పెడతారని చెల్లినీ, తమ్ముణ్ణీ హాస్టల్లో చేర్చాను. హాస్టల్లో ఉండాలంటే స్కూళ్ళలో చేరాలి. అప్పుడు అమ్మకు కాలూ, చేయి ఆడింది.

ఇంటర్‌లో ఉండగా కథకు రెండు రూపాయలు మొదటి చెల్లింపు. రెండిడ్లీ, కాఫీ మూడణాలు. నా సంపాదనంతా అమ్మకే! చెల్లికే! తమ్ముడికే! ఆనర్స్‌లో ఉండగా కథకు పది, పదిహేను, ఆకాశవాణి నాటికకు రూ.20, 40, 60. 60 అంటే రెండు నెలలు మెస్ బిల్లు స్కాలర్ షిప్పు డబ్బు ఏడాదికీ సరిపోయేది. ఆనర్సులో దృష్టికి బహుమతి రూ. 250/- చాలా పెద్ద మొత్తం. అనాథ బహుమతి సొమ్ము, రెండు నెలల లెక్చరరు జీతంతో సమానం.

అనంతపురంలో లెక్చరరు జీతం. యున్సెసి ఆఫీసరు జీతం, రచనల సొమ్ము, రివ్యూల సొమ్మూ వచ్చేవి. ఇన్ని చేస్తూ పాక్షిక పరిశోధన. అందరూ ఏ పనికీ సమయం చాలటం లేదనే వాళ్ళు. నేను నాకింకా సమయం వృథాగా మిగిలిపోతుందనేవాణ్ణి. నేను కోరేవాళ్ళను కాక, నన్ను కోరే భాగీరథి గారిని పెళ్ళాడాను. కులం, మతం, వయస్సు డబ్బు నిమిత్తం లేని పెళ్ళి. ఆమె నాకు భార్య మాత్రమే కాదు. తల్లి, తండ్రి, గురువు, దైవం, అమ్మ తర్వాత అమ్మంత. ఆమె ఉధృత మహాప్రవాహం. ఈమె గంభీర సముద్రం. మానవీయ మూర్తి. మానవతాజీవి. అంతటి అద్భుతమూర్తికి భర్తనయిన అదృష్టం నాది.

పెళ్ళినాళ్ళలో నా జీతం రూ. 184/-. ఆమెది రూ.262/-. రెండేళ్ళు ఈ మొత్తం సొమ్ము నా ఇష్టం. దిక్కూ దివాణం లేదు. జీతం చేతబెట్టి మర్చిపోయేది. పిల్లలు పుట్టసాగారు. పిల్లలకు పూర్తికాలం తల్లి కావాలి. సెలవు పెట్టమంటే మారు మాట లేదు. ఎనిమిదేళ్ళు. నాలుగోవాడికి నాలుగేళ్ళు. మళ్ళీ ఉద్యోగంలో చేరింది. ఇప్పుడామె జీతం మిగిలి పోతూ వచ్చింది. పొదుపు మొదలైతే దాని పిల్లలు తామరతంపర. బతుకలేని బడిపంతులు జీతం బాగా పెరిగింది. రిటైరయ్యే నాటికి ఆమె జీతం పదివేలు. నా జీతం నలభైవేలు. పొదుపు

చేసిన వేలు లక్షలయ్యాయి. ఇప్పుడు పేదరికం లేదు. ఆకలి లేదు. తినే తొందరా లేదు. అప్పుడు అన్నం లేదు, ఆకలి ఉంది. ఇప్పుడు ఆకలి లేదు, అన్నం ఉంది. ఈ సంపద ఎంత తిన్నా తరగదు. ఇప్పుడు ఏం తిన్నా అరగదు. ఆకలిని చంపుకోవాలన్న నాడు చావని ఆకలి ఇప్పుడు చచ్చిపోయింది. నలుగురూ బాగా చదువుకున్నారు. మంచి జంటలు. అందరివీ మంచి ఉద్యోగాలు. మంచి జీతాలు మంచి జీవితాలు.

నా పొట్ట నన్ను జయించినా, నేను దాన్ని జయించినా పేదరికం ముంగిలి దాటి దూకినా నా కన్నీరాగదే! నన్ను నాడు బహిరంగంగా తాకని, నేడు అంతరంగంగా తాకని జనం నన్ను ఏడిపించబోవటం, నేను నవ్వటం కన్నీరు గుండెలో సుడిగుండం కావటం తప్పటం లేదే! నాడు ఊరు పల్లెను దూరంగా ఉంచింది. పల్లెలు పరస్పరం వెలివేసుకొన్నాయి. పల్లెల్లో అలగా వాళ్ళవి అగచాట్లే! రైలు స్టేషనులో బెంచీ మీద కూర్చోనీరు. రైలు పెట్టెలో కూర్చోరాదు.

స్కూల్లో వెనక బెంచీలో కూర్చోవాలి. ఏం అంటే కొట్లాట. అవమానం. స్కూలు బావిలో నీళ్ళు అందరూ వెళ్ళేక తోడు తాగాలి. అప్పటికే బెల్ కొడతారు. నీళ్ళు తాక్కుండాక్లాసుకు పోవాలి. నాడు గుంటూరులో నీటి ఎద్దడి. బావుల్లో పాతాళంలో నీళ్ళు. కొండవీటి చాంతాళ్ళు కావాలి. అయినా బురద నీళ్ళు. గాంధీ పార్కు చెట్ల నీళ్ళ తొట్టిలోవి తాగవచ్చు. ట్రావెలర్స్ బంగళా తాత దోసిట్లో నీళ్ళు పోసేవాడు. పార్కు తొట్టిలో చేపపిల్లలు తిరిగేవి. చెట్లమీద పిట్టలుండేవి. పిట్టలకు గూళ్ళు చేప పిల్లలకు నీళ్ళు న్యాయమే! నాకు? అన్యాయమే! నీళ్ళు లేవు. గూళ్ళు లేవు. స్కూలుకు రాకపోకలు ఆటకాదు. కూలికి పోయినట్లే! ఉదయం ఆరింటికి రైలు. రాత్రి ఎనిమిదింటికి ఇల్లు. స్కూలు వరండా ఫ్లాట్‌ఫారం, రైలు - చదువు చోట్లు.

గుళ్ళోకి పోనీరు, పోను. భజనకు రానీరు, రాను. పక్కన కూర్చోనీరు, కూర్చోను. వెంట ఉండనివ్వరు. ఉండను. తోడురారు. పోనీ, వెంట ఉండరు. పోనీ పిలవరు, తలవరు కానీ, పెట్టకపోయారు, కానీ ఒంటరిని. ఏకాకిని. వేలల్లో ఒంటరిని. సమూహంలో ఏకాకిని. ఎవరూ రానీలేదు. ఎవరి దగ్గరకూ పోలేదు. ఎందులోనూ చేరలేదు. అక్కడా అంటరానివాణ్ణి కావటం ఇష్టం లేదు. చులకనగా చూస్తే ఏడవకూడదు. నవ్వితే ఇష్టడి వెంట ఉండనిస్తారని ఆశ. ఎవరి సంరక్షా లేదు. అందరివాణ్ణి అందరికీ కావలసిన వాణ్ణి. నాకు నేనుగా నేను!

డాక్టరేటు చేశాను. వింతే. ప్రొఫెసరునయ్యాను. కొత్తే. డైరక్టర్ను, సెక్రటరీని, డీన్‌ను, ప్రిన్సిపాల్‌ను, వైస్ ఛాన్సలర్‌ను. కొత్తే! వీటికి వేటికీ యస్.సి రిజర్వేషన్ లేదు. మావాళ్ళు అప్పటిలో ఎవరూ అవేవీ కాలేదు. 20 ఏళ్ళ నుంచీ 62 ఏళ్ళదాకా పనిచేశాను. అయినా అంటరానితనం నన్ను అంటుకుంటూనే ఉంది. కవితలు, కథానికలు, నవలలు, నాటికలు, నాటకాలు, వ్యాసాలు, విమర్శలు, పరిశోధనలు బోలెడు రాశాను. 46 పుస్తకాలు వచ్చాయి. రావలసినవి చాలా ఉన్నాయి. బహుమతులు వచ్చాయి. అవార్డులు వచ్చాయి. జనం హర్షించారు. నా సాహిత్యాన్ని గుర్తించారు. గ్రహించారు. ప్రోత్సహించారు. నేను తప్పించుకొని పారిపోదామన్నా నా అంటరానితనం నన్నంటుకుంటూ వెంటబడుతూ ఉంది. నన్ను అరసం, విరసం, స్త్రీవాద, దళితవాద, బహుజనవాద, మానవతా వాద రచయిత అంటున్నారు. అనండి. మీ ఇష్టం. నేను కాదనగలనా? మీరు ఊరుకుంటారా? నన్ను రచయిత అంటే చాలదూ. ఇన్ని లేబుళ్ళు అవసరమా? పేదరికం చాలామందికి ఆస్తి. దళితులకు అంతరానితనం అదనపు సంపద, కులం వల్ల కుమలని, కులకని మనిషి లేడు. కులం ఒకడికి వరం, మరొకడికి శాపం. జనం వరాలు వదలరు, శాపాలు వదిలించుకోలేరు. కులం లేని భారతం పుడుతుందా? పెరుగుతుందా? చితుకుతుందా? బంగారం లాంటి కల. కల నిజమైతే ఎంత అద్భుతం. కల కన్నీటికి తల్లి! నా కన్నీటి బొట్లు నా రచనలు.

ధనం లేక, తిండిలేక నాడు పీడితుణ్ణి. కులం తక్కువనే జనం చేత నాడూ, నేను పీడితుణ్ణి. ప్రేమకోసం కొంగు పట్టిన బిచ్చగాణ్ణి నిరాదరణ మోసానికి కుంగిపోక నవ్వే పసివాణ్ణి. నా కోసం నవ్వకుండా, మీ కోసం ఏడ్చే రోజుకోసం అర్రులు చాచే అపర శాంతిని.

'మావాడు' అని భుజం మీదే చెయ్యేస్తే కరిగిపోయే హిమాలయాన్ని. 'బాగున్నావా?' అంటే పొంగిపోయే సముద్రాన్ని. వీపు తడితే మేరువెత్తు పెరిగే పళ్ళచెట్టును. చల్లగా పిలిస్తే పరవశించి వర్షించే నల్లమబ్బును. ఆదరిస్తే పులకాంకురాలతో మొలకెత్తే పంటభూమిని. అనురాగంకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని నిరీక్షించే బూతులేని మహేంద్రుణ్ణి.

మావాడు ఈ మూలనుంచీ ఆ మూలకు ఈదుతాడంటే దిగాను, ఈదాను. చెరువు మధ్యలో చేతులెత్తేశాను. బర్రెతల్లి తోక ఇయ్యకపోతే? మీరు బర్రె తల్లిలా ఎందుకు ఆదుకోలేదు?

ఆ తల్లి 'బావిలో కడవపడింది తీయరా' అంటే దిగాను. కడవ తీశాను. బావిలో దిగటమే కానీ ఎక్కటం తెలియని అభిమన్యుణ్ణి. తాత రాకపోతే నా బ్రతుకు ఏమయ్యేది.

వీడు మా ఊరి మొనగాడు. ఈ రైల్లోంచీ ఎక్కడైనా దిగ్గలడు. ఎక్కగలడు అని దించితే కదా దిగింది, తల పగిలింది. నన్ను అంటుకోకుండా మీరు ఆదరించినందుకే కదా, వళ్ళూ పై తెలియకుండా, కిందా మీద చూడకుండా ప్రాణాల మీదకి తెచ్చుకున్నాను. మీ ప్రేమకోసం నా ప్రాణం తపిస్తుంది కదా! మీ ప్రేమకోసమే కదా నా ఆరాటం, పోరాటం, సాహిత్యం.


ఈ పని చేయటానికి ఈ అర్హతలుండాలి అని మీరంటే ఈ అర్హతలు నాకు ఉన్నాయి. నాకు మీరు ఈ అవకాశం ఇచ్చి తీరాలని కొట్లాడి అన్ని ఉద్యోగాలు పొందాను. అందరితో సమానుణ్ణని అందరితో పోటీపడి నెగ్గాను. ఉద్యోగమైనా, సాహిత్యమైనా నేను పోటీలో నెగ్గటం, దళితేతరుడిలాగా నిలవటం, గెలవటంమీకు తెలుసు. మీరు ప్రేమతో నాకు గుర్తింపు ఇవ్వవలసినప్పుడు నేను దళితుణ్ణే ఎందుకవుతున్నాను? పోటీ చేసి ప్రేమకోసం నేను మీతో పోటీ చేస్తూనే ఉంటాను. ఏదో రోజున మీరు నన్ను ప్రేమిస్తారు. కొందరికి కులం బలం, కొందరికి దుర్బలం. దుర్బలం శాపం. నేను శాపగ్రస్తుణ్ణి! ఈ నా ఆరాటం, నా పోరాటం మీ ప్రేమకోసం. నా కోసమే కాదు, దుర్భరుల కోసం. శాపగ్రస్తుల కోసం. నా పోరాటం నా అక్షరాలు. కలముంది గళముంది. నా శక్తులు రాత, మాట. అందుకోసం నడక. ద్వేషం లేదు. హింస రాదు. కత్తి వద్దు. తుపాకి రాదు. ప్రేమిస్తాను. ప్రేమకోసం ఆరాధిస్తాను. ఆరాటిస్తాను. పోరాటిస్తాను. మీ ప్రేమకోసం ఇది నా తపస్సు. పరమేశ్వరులై ప్రత్యక్షం కండి. లోపలి ఆకలిని పై అంటుని రూపు మాపండి. కులం ధనం లేని సమృద్ధ సమసమాజాన్ని ప్రతిష్ఠించండి.

నవ్వితే నలుగురివాడనని, జనవంతుణ్ణని బలవంతుణ్ణని అనుకునే నాకు వరాలిచ్చిన మీరు నేను ఏడ్చినా కన్నీరు తుడుస్తారు. ఏడ్చే నా ముఖం స్వచ్ఛ సౌందర్యం చూస్తారు. నా నవ్వు వర్తమానం. నా కన్నీళ్ళు నా భవితవ్యం. నా కన్నీళ్ళు నా సాహిత్యం. వారూ, వీరూ, మీరూ, నేనూ మనమయ్యే రోజుకోసం నా నేత్రాలు కన్నీరు కురుస్తూ ఉంటాయి.

(ఈ భూమి సౌజన్యంతో..)

# నేను,నా రచనా జీవితం


## డి.కామేశ్వరి



పుట్టిన పాతికేళ్ళ వరకు రచయిత్రినవుతానని నేను ఏ రోజు అనుకోలేదు. 22-8-1935న కాకినాడలో పుట్టి, రామచంద్రపురంలో మూడొంతులు పెరిగి, హైస్కూలు చదువు అక్కడే జరిగి, పెళ్ళీ అక్కడే అయింది. నాన్నగారు సివిల్ ఇంజినీరు. తరచు చిన్న ఊర్లకి బదిలీలు అవుతుంటే సరి అయిన స్కూల్స్ లేక రామచంద్రపురంలో కుటుంబం ఉంచారు. మాతామహులు కాకినాడలో ఉండడంతో కాకినాడ రామచంద్రపురం మధ్యే చిన్నతనం అంతా గడిచింది. 1952లో పెళ్ళి అయాక శ్రీవారి ఉద్యోగ రీత్యా ఒరిస్సాలో 35 సంవత్సరాలు గడిపాక శ్రీవారు చీఫ్ ఇంజినీర్ (ఎంట్రిసిటీ)గా రిటైరయ్యాక 1984 నుంచీ హైదరాబాదులో నివాసం. ముగ్గురు పిల్లలు జీవితంలో స్థిరపడ్డారు. అప్ప చెల్లెళ్ళు, అన్నదమ్ములు, మరుదులు, ఆడపడుచులు, ఆనాటి పెద్ద కుటుంబాల వాతావరణంలో పెరగడంతో ఈనాటికీ బంధువుల రాకపోకలు, ఆ ఆత్మీయులు ఇంకా మా తరం వరకు నిలిచే ఉన్నాయని సంతోషంగా చెప్పగలను.

పుట్టిన తరువాత పాతికేళ్ళకి హఠాత్తుగా రచయిత్రి నవడం నిజంగా అనుకోని సంఘటనే. కాస్త చదవనూ, వ్రాయనూ వచ్చినదగ్గర్నుంచీ కనిపించిన పుస్తకం, పత్రికలు వదలకుండా చదివే అలవాటు ఉండేది. ఊర్లో ఉన్న లైబ్రరీ నుంచీ ఆనాటి రచనలు కొవ్వలి, జంపన, చలం, శరత్‌బాబు, విశ్వనాథ, డిటెక్టివ్ నవలలు అన్నీ చిన్నప్పుడు చదివాను. ఆనాడు వచ్చే ఆంధ్రపత్రిక, భారతితో పత్రికలు మొదలు పెట్టి ఏదీ వదలకుండా చదవడం కాస్త ఇంగ్లీషు పరిజ్ఞానం వచ్చాక పెర్రీ మాసన్ నవలలు, అగాథ క్రిస్టీ, కానన్ డయల్ అపరాధపరిశోధన నవలలతో మొదలు పెట్టీ సోమర్ సెట్ మామ్‌కు మొదలు వచ్చిన ప్రతీ నవల చదివేదాన్ని. ఎక్కువగా చదవడం వల్ల రాయాలన్న కోరిక పుట్టిందా అంటే దానికి జవాబు నాకు తెలియదు.

ఆ రోజుల్లో ఆంధ్రవారపత్రికలో వనితలకోసం ఓ పేజీ కేటాయించి వంటలు, కుట్లు, వ్యాసాలు ప్రచురించేవారు. ఓ రోజు సరదాగా 'వనితలు - వస్త్రాలు' అంటూ చిన్న వ్యాసం పుస్తకం నుంచీ ఓ కాగితం మీద రాసి పోస్ట్ చేశాను. వనితలు ఎలాంటి సందర్భాలలో ఎలాంటి చీరలు కట్టుకుంటే బాగుంటుంది, ఏ శరీరాకృతికి ఎలాంటి చీరలు నప్పుతాయి లాటి విషయాలు రాసిన చిన్న వ్యాసం పదిహేను రోజులలో ప్రచురించారు. ఆ రోజు అచ్చులో మొదటిసారి పేరు చూసుకున్న ఆనందం ఈనాటికీ ఇన్ని వందల కథలు రాసినా అదే ఆనందం, అదే అనుభూతినిస్తుందనే నమ్మాలి. ఆ చిన్న వ్యాసానికి 8రూపాయలు ఎమ్.ఓ వచ్చింది. ఆ ఎనిమిది రూపాయల సంపాదన ఎంతటి గర్వాన్నిచ్చిందో. ఈనాడు ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసి వేలు సంపాదిస్తున్నారు. ఓ ఏభై, అరవైఏళ్ళ క్రితం మధ్యతరగతి ఇల్లాళ్ళు భర్త సంపాదన మీదే ఆధారపడి బతికే వారికి తను ఓ పది రూపాయలు సంపాదించిందినందుకు అనుభవించిన ఆనందం అనుభవించిన వారికే అర్థమౌతుంది.




వ్యాసం అచ్చయ్యాక ఆ ప్రోత్సాహంతో ఈసారి కథ ఎందుకు రాయకూడదు అనిపించింది. కానీ ఏం రాయాలి, ఎలా రాయాలి, దేనిగురించి రాయాలి అన్న ఆలోచన మధ్య, ఓ రోజు కూరకు ఆకాకరకాయ తరుగుతుంటే ఈ ఆకాకరకాయ మీదే ఎందుకు రాయకూడదు అనిపించింది. నాలుగు రోజులు ఆలోచించి ఓ కథ రాశాను. ఆకాకరకాయలు అపురూపంగా దొరికే కూర. హీరోకి ఆ కూర అంటే మహా ఇష్టం - కొత్త పెళ్ళాం చేత ఆ కూర వండించుకు తినాలన్న కోరిక - ఆ భార్య ఆ కూర ఎలా తయారు చేసి కూరని పచ్చడిగా ముద్దలా చేసిపెట్టడం - ఓ హాస్యకథగా మలిచాను. కథ చాలా బాగా వచ్చిందనిపించి ఆంధ్రపత్రికకి పంపాను. ఆశ్చర్యంగా ఇరవైరోజులలో ఆ కథ ప్రచురించబడింది. మంచి హాస్యకథగా అందరూ మెచ్చిన అలాంటి హాస్యకథలు మళ్ళీ రాయలేకపోయాను. అచ్చులో పేరు చూసుకున్న ఆ అనుభూతి మాటల కందనిది. ఆ కథకి అందుకున్నది ఇరవైరూపాయలు.

ఆ కథ ఇచ్చిన ప్రోత్సాహంతో వెంటనే రెండు మూడు కథలు రాసి వివిధ పత్రికలలో ప్రచురించబడి రచయిత్రిగా స్థిరపడ్డాను. రాయడం మొదలు పెట్టాక ఐదారేళ్ళ కథలు వ్రాశాను. 68లో నా మొదటి నవల 'కొత్తనీరు' ఎమెస్కో పాకెట్ బుక్స్‌లో ప్రచురించబడింది. తరువాత నవలలు రాసినా నా మొదటి ప్రిఫరెన్స్ కథే రాయడమే కాదు చదవడమూ కథంటేనే ఎక్కువ ఇష్టం ఈనాటికీ. తొమ్మది కథా సంపుటాలు వచ్చాయి. 21 నవలలు, ఒక ట్రావెలోగ్ ఇప్పటి వరకూ మొత్తం ఇప్పటివరకు 31 పుస్తకాలు ప్రచురితాలు.


నవలలు - 1)కొత్తమలుపు, 2) విధివంచితులు 3) అరుణ 4) వివాహసంబంధాలు 5) కోరికలే గుర్రాలైతే 6) వివాహ బంధాలు 7) పరాజితులు 8) శిక్ష 9) శుభోదయం 10) మరో ప్రేమ కథ 11) చీకటి పొద్దున వెలుగురేఖ 12) ఇంటింటి కథ 13)తీరం 14) తిరిగిన దొరికిన జీవితం 15) అగ్నిపరీక్ష 16) ఎండమావులు 17) మనసున మనసై 19) జీవితం చేజారనీయకు 20) జన్మభూమి 21) ఉషోదయం.

కథా సంపుటాలు - 1) వానచినుకలు 2) తల్లి మనసు 3) కన్నీటికి విలువెంత 4) అతకని బతుకలు 5) చీకటి తొలిగిన రాత్రి 6) ఇది జీవితం 7) నయనతార 8) కాదేది కథకనర్హం 9) కాలాన్ని వెనక్కి తిప్పకు

ట్రావెలాగ్ - నా విదేశ యాత్రానుభవాలు

సుమారు 8 కథలు వివిధ పత్రికలలో పోటీలో బహుమతి గెల్చుకున్నాయి. చాలా కథలు కన్నడంలోకి ఆ రోజుల్లోనే అనువదించబడ్డాయి, తమిళంలో ఒక కథా సంపుటి వచ్చింది. హిందీ, ఇంగ్లీషులలో కథా సంపుటాలు వచ్చాయి. కొన్ని కథలు సాహిత్య అకాడమీ పత్రికలో చాలా కథలు రేడియో నాటికలాగా మలచబడ్డాయి.

నవలల్లో అరుణ, కొత్తమలుపు, అగ్నిపరీక్ష, ఎండమావులు, జీవితం చేజారనీయకు లాంటి కొన్ని నవలలకి బహుమతులు వచ్చాయి. 'కొత్తమలుపు' నవల 'న్యాయం కావాలి' సినిమాగావచ్చింది. హిందీ, తెలుగు, తమిళం, కన్నడ భాషలో నిర్మింపబడి అఖండ విజయం సాధించింది. ఆ సంవత్సరం ఉత్తమ సినిమా కథగా సితార, సినీహెరాల్డ్, వంశీ బర్కిలీ, కళాసాగర్, ఆంధ్రభూమి నుంచీ బహుమతులు వచ్చాయి. 'అరుణ' 'మమత'గా టి.వి. సీరియల్‌గా వచ్చింది.




కోరికలే గుర్రాలైతే నవల సినిమాగా వచ్చింది.

ఎండమావులు నవల, మనసున మనసై నవలలు షార్ట్ ఫిల్ములుగా టీవీ కోసం తీసుకోబడ్డాయి.

జీవితం చేజారనీయకు, మనసున మనసై నవలలు తమిళంలోకి అనువదించబడ్డాయి.

పది నవలలపైన రేడియో నాటకాలుగా వచ్చాయి.

నా ట్రావెలాగ్ వనిత మాసపత్రికలో సీరియల్‌గా వచ్చింది.

చాలా కథాసంకలనాలలో, సాహిత్య అకాడమీ సంకలనాలలో నా కథలు చోటుచేసుకున్నాయి.

1962లో మొదలు పెట్టి ఈనాటికీ ఆపకుండా రచనలు చేస్తూ ఏడాదికి కనీసం 4,5 కథలన్నా రాస్తుంటాను.

1970 - గృహలక్ష్మి స్వర్ణకంకణం

1981 - న్యాయం కావాలి సినిమాకు ఉత్తమ కథా రచయిత్రిగా 5 అవార్డులు

1983 - మాదిరెడ్డి సులోచన అభినందన సభ

1990 - ఉత్తమ రచయిత్రిగా తెలుగు యూనివర్శిటీ (తెలుగు సాహిత్య అకాడమీ) నుంచీ ఎండోమెంట్ అవార్డు

1991 - మద్రాసు తెలుగు అకాడమీ నుంచీ ఉత్తమ రచయిత్రి అవార్డు

1994 - ఉత్తమ రచయిత్రిగా తెలుగు యూనివర్శిటీ అవార్డు

1999- ఉత్తమ నవల ఎండమావులకి తెలుగు యూనివర్శిటీ అవార్డు.

అనేక సభలలో సన్మానం పొందాను. భువనేశ్వర్, బరంపురం ఆంధ్ర సంఘాలసన్మానం, సిటీ సెంట్రల్ లైబ్రరీ, దక్షిణ మధ్య రైల్వే ఆంధ్ర సంఘం సన్మానం, జోత్స్న కళాపీఠం లాంటివి సన్మానాలు జరిగాయి.

## నా రచనల ఉద్దేశ్యం

రచనకి ఓ సామాజిక ప్రయోజనం ఉండాలన్నది నా ధ్యేయం. ఆనాటి నుంచీ నేటి వరకు సమాజంలో ఏదీ ఒక సమస్య ఆధారంగా ఒక కథ గానీ, నవల రాయాలని తాపత్రయపడతాను. నేను స్త్రీని కనక సమాజంలో స్త్రీ లెదుర్కొంటున్న అనేక సమస్యలని పాఠకుల ముందుంచడానికి తాపత్రయపడతాను. సాహిత్యం సమకాలీన సమాజానికి దర్పణం పడుతుంది కనక ఈనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతుల గురించి రాసిన ఈనాటి సాహిత్యం ముందు తరాలవారు చదివితే మనం ఈనాడు ఎదుర్కొన్న సమస్యలు అర్థం అయితే వారు ఏమాత్రం పురోగమించారో, తిరోగమించారు అన్నది అర్థం అవుతుందన్నది నా భావన. మనం ఆనాటి కన్యాశుల్కం చదివి శ్రోత్రీయ బ్రాహ్మణ కుటుంబంలో ఆచార వ్యవహారాలు, మాలపిల్ల చదివి అట్టడుగు వర్గాల జీవితం, శరత్ సాహిత్యం చదివి బెంగాలీల జీవన విధానాలు, చలం రచనల పట్ల ఆనాటి స్త్రీ ఎంత అజ్ఞానంలో ఉండేదో అర్థం చేసుకోగలుగుతున్నట్టే ఈనాటి రచనలు చదివితే మన ఈనాటి సామాజిక స్థితిగతులు ముందు తరాలవారికి అర్థం కావాలి. రచనలతో సామాజిక స్పృహ, సమాజంలో విప్లవాలు తేగలమా అంటే నా జవాబు ఒకటే. పాడగా పాడగా రాగంలా రాయగా రాయగా ఓ విషయం పాఠకుల మనసులో చోటూ చేరుకుంటుందని నమ్ముతాను. సాహిత్యం అంటే సా'హితం' మంచి హితవుగా చెప్పేదిగా ఉండాలి ఒక సమస్యకి రచనలో పరిష్కారం చూపగలిగితే మంచిదే లేని పక్షంలో కనీసం సమస్య ఇదీ అని పాఠక దృష్టికి తేవాలి అన్నది రచయిత బాధ్యత అంటాను. నా 'న్యాయం


కావాలి' 80ల్లోనే ఓ అమ్మాయి తనకి జరిగిన అన్యాయానికి పోరాడడం, డాక్టర్లు పల్లెటూళ్ళలో ప్రాక్టీసు పెట్టాలని 'అరుణ' నవల ద్వారా, శుభోదయం నవలలో మానభంగం అనొద్దు అత్యాచారం అనండి, అదీ శరీరంలో మిగతా భాగాలకి దెబ్బతగిలితే ఎలా విద్యం చేయించుకుంటామో అలాగే భావించాలి అని. మనసున మనసై అన్నది వివాహ బంధంలో సర్దుబాటు రెండు వైపులా ఉంటేనే కాపురాలు నిలబడతాయని ఇలాగే ప్రతీ రచనలో అనేక స్త్రీల సమస్యల చుట్టూ నా కథలు నడిపించాను. కథలతో విప్లవాలు సృష్టించలేకపోయినా పాఠకులని ఆలోచింపచేస్తేచాలన్న సిద్ధాంతానికి కట్టుబడి రచనలు చేస్తూ పాఠకుల, విమర్శకుల దృష్టిలో మంచి రచయిత్రిగా నిలబడగలిగానని గర్వంగా చెప్పగలను. ఆ స్థానం సంపాదించుకోవడం నా అదృష్టంగా భావిస్తాను.

# కొడవటిగంటి కుటుంబరావు

*తెలుగు సాహిత్యంలో మైలురాళ్ళు అనదగిన అనేక రచనల్ని అందించిన స్వర్గీయ కొడవటిగంటి కుటుంబరావు గారి 99 వ జయంతి సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం. 1908 అక్టోబర్ 28 వతేదీన తెనాలి లోని ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శ్రీ కొడవటిగంటి(కొకు ) 11 సంవత్సరాల వయసులోనే తల్లి దండ్రులని కోల్పోయారు. మేనమామల ఇంట పెరిగి పెద్దవారైన 'కొకు' చిన్నప్పటినుంచే తెలుగు భాష పట్ల, తెలుగు సాహిత్యం పట్లా మక్కువ పెంచుకున్నారు. పాశ్చాత్య సాహిత్యాన్ని కూడా అతి చిన్నతనంలోనే చదివారు. 13 ఏళ్ళ వయసులోనే సస్పెన్స్ థ్రిల్లర్ నవల రాయాలని ప్రయత్నించారు. గుంటూరు ఎ.సి.కాలేజీలో ఇంటర్మీడియట్(1925-27), తరువాత విజయనగరం మహారాజా కాలేజీలో బి.ఎస్సీ ఫిజిక్స్ చదివారు. ఆ సమయంలోనే ఆయనలో నాస్తిక భావాలు పెంపొందాయి. బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదవడానికి వెళ్ళారు కానీ అనివార్య పరిస్థితుల్లో రెండో సంవత్సర మధ్యలోనే వదిలెయ్యాల్సి వచ్చింది. తరువాత క్లర్కుగా, టీచర్‌గా, ఫ్యాక్టరీ ఫోర్మన్ గా సిమ్లా, బొంబాయి, మద్రాసుల్లో పనిచేశాక జర్నలిజం లోకి అడుగుపెట్టారు. వివిధ పత్రికల్లో కొద్ది కాలం పనిచేశాక 1952 లో 'చందమామ' పత్రికలో ప్రవేశించి దివంగతులయ్యే వరకూ 1980 దాకా అక్కడే కొనసాగారు. ఆయన రచించిన కథలూ, నవలలూ, వ్యాసాలూ, శాస్త్రీయ గ్రంధాలో అన్నీ కలిపితే వెయ్యి పైగా నే ఉంటాయి. విప్లవ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 'కొకు' గారి అంతరంగ తరంగాల గురించి రావి కొండలరావు గారు, బాలాంత్రపు రజనీకాంత రావు గారి మాటల్లో చదవండి..*

# నిగర్వి

## - రావి కొండలరావు



ఇద్దరు సవతులకు పడదంటారు - అందులో అబద్ధం కనిపించదు. మరి ఎందుకంటారోగానీ, ఇద్దరు కవులకు కూడా పడదంటారు. ఇందులో కొంత నిజం ఉన్నట్టనిపిస్తుంది. అలాగే కథకులకీ, రచయితలకీ కూడా పడదంటారు. ఈ విషయంలో ఎవరి మనసుల్లో ఏముంటాయో గానీ, కుటుంబరావుకు మాత్రం ఎవరితోనూ 'పడకపోవడం' అన్నది ఎవరూ ఎరగనిమాట.

ఆయన గొప్ప కథకుడు. అంతటి కథకుడు ఇతర రచయితలను ఇట్టే తిట్టవచ్చు. విమర్శించవచ్చు తూలనాడవచ్చు. కానీ ఆయన దగ్గర అలాంటిదేమీ మచ్చుకు కూడా కనిపించదు. వాక్యాలు కూడా సరిగా రాయడం చేతకాని 'బడా' రచయితలు కొందరు, తక్కినవాళ్ళని 'ఏడిశాడు' అన్నట్లు మాట్లాడుతూ ఉంటే, కుటుంబరావు అంతటివాడు - అంటే ఏం? - అనలేదెప్పుడేమీ.

ఎవరినైనా ప్రోత్సహించడమేగాని, నిరుత్సాహపరచి ఎరుగరు. తాను సంపాదకుడిగా కొన్ని పత్రికలకు పనిచేసినప్పుడు ఎంతటి చిన్న - కొత్త రచయితయినా సరే, ఆ రచన ఏమాత్రం బాగున్నా సరే - ప్రోత్సహించేవారు. ఆయన ప్రోత్సహించడమేగాని, నిరుత్సాహపరచి ఎరగరు. ఆయన ప్రోత్సాహంతో వెలుగులోకి వచ్చిన వాళ్ళెంతమందో...

తనవల్ల అయితే, ఏ సహాయమైనా చేసేవారు. లేకపోతే 'లేదు' అనేవారు. చేస్తాను - రేపు రా; ఎల్లుండి కనిపించు అన్న మాటలు ఎన్నడూ వినవచ్చేవి కావు.

తన స్థాయికి ఉండవలసిన కనీసపు అహంకారం కూడా లేని మనిషి ఆయన. ఉదాహరణ చెబుతాను. నేను కొడవటిగంటికి ఏకలవ్యుడిలాంటి శిష్యుణ్ణి. నేను రచన చెయ్యటం ఆరంభించిన తొలిరోజుల్లో ఆయనే ఆరాధ్య రచయిత. ఆయన ప్రతి రచనా చదవటం, ఆ ధోరణిలో రాయాలని ప్రయత్నించడం చేసేవాడిని. 'ఆంధ్ర పత్రిక' వీక్లీలో ఆయన ఉన్న రోజుల్లో, ఆయనతో పరిచయం చేసుకున్నాను - ఒక కథ ఇవ్వడం ద్వారా. అప్పటి కప్పుడే చూసేసి - 'అంతబాగులేదండీ' అని తిప్పి ఇచ్చేశారు; నేనేం బాధపడలేదు. నేను బాధపడతానేమో అనికూడా ఆయన అనుకోలేదు. అంతా ముక్కుసూటి వ్యవహారం. లౌక్యాలూ, దాపరికాలూ బొత్తిగా తెలియని మనిషి. ఆయనతో బాగా పరిచయం పెరిగిన తర్వాత, ఆయన రచనల్లో నేనూ వేలు పెట్టి - ఆయనతో రాయగలిగే అవకాశాలు కూడా వచ్చాయి. ఎంత భయం! 'ఎలా ఉందో ఏమిటో చూడండి' అని ఇస్తే, 'అద్భుతంగా ఉంది. దీనికేం' అనేవారు. అలా ఆయనతో మూడు నాలుగు రచనలు 'జ్యోతి'కి చేశా(ను)ము.

'విజయచిత్ర' పత్రిక ఆరంభం కాబోతున్న రోజుల్లో, నేను 'ఆంధ్రజ్యోతి'కి సినిమా కాలం రాస్తూ ఉండేవాడిని. "మా వాళ్ళు సినిమా పత్రిక ఆరంభిస్తున్నారు మీరేమైనా రాస్తారా?" అని అడిగారు ఒకసారి. "తప్పకుండా" అన్నాను. ఆయనే నన్ను తీసుకువెళ్ళి ప్రొప్రయిటర్లకి పరిచయం చేసి, చెప్పారు.

నేను 'చందమామ పబ్లికేషన్స్'లోకి రావడానికి ఆ విధంగా ఆయన కారకులైనారు. పదిహేను సంవత్సరాలపాటు, పక్కపక్కగా ఉన్న ఆఫీసులద్వారా మా పరిచయాలు, స్నేహాలు మరింత పెరిగాయి. 'చందమామ' ప్రధాన సంపాదకుడిగా ఆయనకున్న స్థాయి, గౌరవం ఎనలేనివి. అందరికీ ఆయనంటే గౌరవం, భక్తి. 'తన స్థాయికి ఉండవలసిన కనీసపు అహంకారం లేని మనిషి' అన్నానే ముందు- దానికి

ఈ ఉపకరణాలు. సినిమా మీద ఏదైనా వ్యాసం తడితే రాసుకొచ్చి నాకిస్తూ, "ఏమండీ, మీ పత్రికలో వేసుకుంటారా, చూడండి" అనేవారు - నాకు దిమ్మ తిరిగేలా. ఆయన దగ్గరకి కథలు పట్టుకుని వెళ్ళినవాడిని; ఆయన ద్వారానే ఇక్కడికి వచ్చిన వాడిని; ఎన్నో అడిగి తెలుసుకుంటున్న వాడిని, 'ఒకసారి కొండలరావును రమ్మను' అని కబురు చేసి, ఆ వ్యాసం నాకు ఇచ్చి, 'మీ పత్రికలో వెయ్యండి' అని చెప్పగల హక్కు, అధికారం ఉన్న మనిషి ఆయన. రమ్మంటే వెళ్ళమూ! వెయ్యమంటే వెయ్యమూ!

కాని -

ఏమాత్రం అహంకారం ఎరగని వ్యక్తి చేసేది - నేరుగా వచ్చి, 'వేసుకుంటారేమో చూడండి' అనడం: అలా అనగల వ్యక్తి కుటుంబరావు ఒక్కరే.

ఆయనకేదైనా 'గొప్పదనం' అని చెబితే, 'ఆc' అని చప్పరించేసేవారు "మీరు రాసిన సీరియల్ కథ ఎంతో బావుందండీ" అంటే, "అదా! ఒక ఆదివారం కూచుని రాసింది అంత బావుందీ?" అనడం కొడవటిగంటికే చేతనవును.

ప్రతి కొత్త పత్రికలోనూ ఆయన కథో, గల్పికో, వ్యాసమో ఏదో ఒకటి ఉండేది. పత్రిక ఆరంభిస్తున్న ప్రతివారూ ఆరంభ సంచికకు కథకోసం ఆయనకు రాసేవారు. ఈ పత్రిక వస్తుందా, చస్తుందా? అసలు ఎంత ఇస్తాడు? అని పెద్దవాళ్ళ (?)లాగా ఆక్షేపించకుండా, ఆలోచించకుండా - పోనీ పాపం అన్నట్టు ఏదో ఒకటి రాసి పంపేవారు. అడిగిన వాళ్ళ ఆనందానికి హద్దులుండేవి కాదు.

ఎప్పుడో ఎన్నేళ్ళ క్రితమో చూసిన ఇంగ్లీషు సినిమాలూ, అంతకు ముందు మూకీలూ ఆయనకు జ్ఞాపకం గాని, తన కథల సంగతి జ్ఞాపకం ఉండేది కాదు. పత్రిక పోస్టులో వచ్చి, అందులో తన రచన ఉన్నప్పుడు - 'ఎప్పుడు పంపానా' అని ఆలోచించేవారు. ఏదైనా పారితోషికం వస్తే - 'ఈ పత్రికకు ఏం రాశాను చెప్మా' అని ఆలోచించేవారు.

ఆయన దేనికీ పొంగిపోలేదు. దేనికీ కుంగిపోలేదు. పెద్దవాళ్ళూ, చిన్నవాళ్ళూ అందరూ ఒకటే. అందరితోనూ ఒకేరీతి సంభాషణ. కోపం వచ్చి కేకలు వేసిన క్షణాలు ఎవరూ ఎరగరు. కంపోజింగ్‌కు కథ పంపితే, 'ఎంత వెతికినా కనిపించలేదు' అన్న మాట విన్నప్పుడుకూడా ఆయనకి కోపం రాలేదు.'పోన్లెండి, మళ్ళా రాస్తాను' అని ఎవరికీ 'ప్రమాదం' కలగనిచ్చేవారు కాదు.

ఆయన గొప్ప కథకుడు, విమర్శకుడు, పత్రికా రచయిత, వ్యాసకర్త, హేతువాది, మేధావి, ఎందరికో మార్గదర్శి. వీటిల్లో ఎంత గొప్పవాడో వ్యక్తిగా కూడా అంతటి గొప్పవాడాయన. ఆ వ్యక్తిత్వం చాలా అరుదైన వ్యక్తిత్వం. ముఖ్యంగా ఆ స్థాయి వ్యక్తుల్లో మరీ అరుదైనది.

✡✡✡✡

## ఇంద్రకళాధనస్సు

- బాలాంత్రపు రజనీకాంతరావు

రొమాంటిక్ కవుల మిత్రబృందంలో నక్షత్రాల మధ్య చంద్రుడిలా మసులుకుంటూ హఠాత్తుగా రొమాంటిక్‌గానే మనిషి ఏమయ్యాడో తెలియకుండా మాయమైపోయిన కొడవటిగంటి వెంకట సుబ్బయ్య తమ్ముడే కుటుంబరావు. అయినా అతిశయోక్తులతో, ఉత్ప్రేక్షలతో, ఉపమలతో దట్టించిన కవిత్వం కుటుంబరావుకి వ్యసనం కాలేదు. మార్క్సిజము, మానవతా ఆయనకి మతం. తర్కం లేదా హేతువాదం ఆయనకి మంచినీళ్ళ ప్రాయం. ఆ నీళ్ళూ, టీనీళ్ళూ తాగి కథలు చెప్పడం, రాయడంలో ఆయన మనసూ, నోరూ, కలమూ బాగా సానదేరాయి. వాటిలో ఆయన చేసిన ప్రయోగాలు ఇన్నీ అన్నీ కాదు. కథానికలనబడే చిన్న కథలు, సీరియల్ కాదగ్గ పెద్ద

కథలూగాక, ఆయన తొలి నలభయిల్లో ఆంధ్రపత్రికలో పని చేసేటప్పుడు కార్డు కథలు, గల్పికలు రాసి, మార్గదర్శకుడయి, అనేకమంది చేత రాయించేవాడు. ఒక పోస్టుకార్డులో పట్టేంతటి కథకి కార్డుకథ లేక గల్పిక అనే పేరు ఆయనే పెట్టాడు.

1941 - 42 లో నిడుమోలు జగన్నాథ్ అనే యువక ఫిలిం డైరెక్టర్ - ప్రొడ్యూసర్, అంతకు ముందే బళ్ళారి రాఘవ, పద్మావతీ దేవిలతో ద్రౌపదీ మానసంరక్షణ సినిమా తీసినాయనే, తారుమారు, బలే పెళ్ళి అనే రెండు పొట్టి హాస్యచిత్రాలను అప్రసిద్ధులైన తారలతో తీసాడు. వాటిలో తారుమారు చిత్రానికి సంభాషలు కుటుంబరావే రాశాడు. ఆ రెండు చిత్రాలు నా సంగీత దర్శకత్వానుభవానికి నాందీ ప్రస్తావన. అవి ఎక్కువగా డబ్బు సంపాదించకపోయినా సినీమా పరిణామ చరిత్ర తొలిదశలో ఆఫ్ ది బీట్ విశిష్ట ప్రయోగాలు. ఆ రోజుల్లోనే నాకు తొలి పరిచయం కొడవటిగంటితో.

ఆయన ఇంతకీ సినిమా రచయితగా పేరు సంపాదించడానికి ఇష్టపడినట్లు తోచదు. వాహినీ, విజయావారికి అత్యంత సన్నిహితుడుగాను, చందమామ, యువ సంపాదక వర్గంలో నాగిరెడ్డి, చక్రపాణిలతో సగౌరవంగా ఉంటూ ఉండి కూడా ఆయన సినిమాలకు రాసినదాని కన్నా ఆ పత్రికలకు, ఇంకా భారతి వంటి ఇతర పత్రికలకు కూడా ఎన్నో కథలు రాసాడు. తన పేరుతోను, మారుపేర్లతోను రాసినా, కొడవటిగంటి తర్కబద్ధమైన వాక్యరచన, కథాకథన పద్ధతి, కొన్ని రకాల పాత్రల ముసపోతా - ఇది కొడవటిగంటి రచనే అని తెలిసిపోయేటంతటి వ్యక్తిగత శైలి ఆయనది. ఆయన మార్క్సిస్టు దృక్పథంతో రాసిన మానవ సమాజ పరిణామ చరిత్ర చాలా హేతుబద్ధంగాను, కాదనడానికి వీలు లేనట్టుగాను ఉంటుంది.

నేను మద్రాసు రేడియో కార్యక్రం నిర్వాహకుడుగా పనిచేస్తూ ఉన్నప్పుడు శరత్‌చంద్ర చటర్జీ రాసిన రెండు మూడు నవలలను రేడియోకు దీర్ఘనాటికలుగా కుటుంబరావు చేత రాయించుకుని ప్రసారం చేశాను. వాటిలో దేవదాసు నాటకానికి సంభాషణలు ఆయనవీ, పాటలు నావీను. అప్పటికి దేవదాసు తెలుగు సినీమా రాలేదు. కామమ్మ మొగుడు, లేచిపోయిన మనిషి వంటి ఆయన పెద్ద కథలను కూడా రేడియో నాటకాలుగా ప్రసారం చేయించాము. హాస్యవల్లరి అనే ఆదివారం ఉదయం చౌచౌ హాస్య కార్యక్రమాన్ని కూడా ఆయన ఒకటి రెండుసార్లు రాసి, ప్రసార నిర్వహణలో సహాయం చేసాడు. ఏ వ్యక్తికీ సూటిగా తగలని పద్ధతిలో నేటి సాంఘిక, రాజకీయ పరిస్థితులను సమాజంలోని కొందరు వ్యక్తుల క్యారికేచర్ స్వరూపాలను వ్యంగ్యంగా ప్రదర్శించి, ఆహ్లాదం కలిగించగల కొద్దిమంది తెలుగు హాస్య వ్యంగ్య రచయితలలోను చెప్పుకోదగినవాడు కొడవటిగంటి.

1963 -64లలో అనుకుంటాను. కేరళలో ఆల్వాయ్ వద్ద ఉద్యోగమండల్ అనే చోట జరిగిన అఖిలభారత రచయితల సభలకు వెళ్ళినపుడు నేనూ కుటుంబరావూ పక్కపక్కనే బస. ఒకే బస్సులో దగ్గరగా కూర్చుని సంగీతం, సాహిత్యం, చరిత్ర, మానవజాతి పరిణామం, ఖగోళశాస్త్రం, విజ్ఞానశాస్త్ర పరిశోధనలు, ఇత్యాదిగా ఎన్ని విషయాలనో చర్చించుకుంటూ, మధ్య మధ్య ఆయన నాచేత హిందూస్తానీ, కర్ణాటక రాగాలను, సంగీతానికీ, ప్రకృతికీ ఉండే సాన్నిహిత్య సారూప్యాలను నిరూపించే విధంగా పాడిస్తుంటే, భరత ఖండపు దక్షిణాగ్రంలో ఉన్న కన్యాకుమారి చేరుకున్నాము. వివిధ విషయాలలో కొడవటిగంటి ఆసక్తి, ప్రవేశమూ అంతటివి.

✡✡✡✡

# డా.మేడసాని మోహన్



*బాల్యం*

మాది చిత్తూరు జిల్లా నడిమి పల్లి అనే చిన్న గ్రామం. ఆ గ్రామంలో మా నాన్నగారు వ్యవసాయం చేసేవారు. మా తాతల నుండీ కూడా వ్యవసాయదారులే. నేను 1957 ఆగస్టు 25న పుట్టాను. మా అమ్మగారి పేరు మేడసాని లక్ష్మమ్మ, మా నాన్నగారి పేరు మేడసాని అయ్యన్ననాయుడు. మేము నలుగురం పిల్లలం. ఇద్దరు అక్కలు, ఒక అన్న, నేను.

మా చిన్నతనంలో మా వూళ్ళో ఏకోపాధ్యాయ పాఠశాల ఉండేది. ఆ పాఠశాలలో ఉన్నటువంటి ఉపాధ్యాయుడు , శ్రీరాముల నాయుడుగారు , చాలా మంచి వ్యక్తి, పేరుకు తగ్గట్టే రామభక్తుడు. రామభక్తుడు కాబట్టి ఆయన ఉదయం లేస్తూనే దాశరథి కరుణాపయోనిధి పద్యాలు చెపుతుండేవారు. ఆ పద్యాలు శ్రావ్యంగా ఆయన చెపుతుంటే మాక్కూడా నేర్చుకోవాలనిపించి ఆయన దగ్గర నేర్చుకునేవాళ్ళం. ఆవిధంగా నా చిన్నప్పుడే తెలుగు పద్యాలు, శ్లోకాల పట్ల మంచి ఆసక్తి కలిగించారాయన.. మాతో దాశరథీశతకం పద్యాలు, సుమతీశతకం పద్యాలు పదేపదే చదివించడం, ధారణ చేయించడం, చేసేవారు. చిన్నప్పుడు పద్యాలు బాగా చెపుతుంటే ఉపాధ్యాయులు పుట్టిన తేదీని మార్చి తొందరగా స్కూలులో చేర్చుకున్నారు. మిగిలిన విధ్యార్థుల కంటే నేను బాగా వెంట వెంటనే కంఠస్థంచేసి చెప్పటం వల్ల ఒక ప్రీతి పాత్రమైనటువంటి శిష్యుడిగా ఒక గుర్తింపు ఉండేది. అలా నాకు ఈ శ్రద్ధ ఆసక్తి సాహిత్యంపై ప్రారంభమయింది.

*గురుదేవులపరిచయం*

నాకు చిన్నప్పుడు ఆరోగ్యం సరిగా ఉండేదికాదు. కానీ చదువులో మాత్రం ప్రతిసంవత్సరం ఉత్తీర్ణుడవుతూ ఉండేవాడిని. మాటిమాటికి కడుపు నొప్పి, జ్వరం వచ్చేది. ఏదైనా వైద్యం తీసుకుంటే పది రోజులు బాగుండి మరల తిరగబెట్టేది. ఒకసారి నాకు ఎక్కువగా ఆరోగ్యం బాధ పెడుతుంటే తమిళనాడులోని తిరువళం అనే వూరిలో శివానంద మౌన గురుదేవులని ఒక అవధూత, గొప్ప మహనీయుడు ఉన్నారని, ఆయన ఆశీర్వాదం చేస్తే బావుంటుందని విని మా తల్లిదండ్రులు ఆయన వద్దకు తీసుకుని వెళ్ళారు. ఆ గురుదేవుని వద్దకు వెళ్ళడంతో ఆయన ధ్యానం నేర్పించారు. ఆయన నిజంగా గొప్ప అవధూత సిద్ధయోగి. పతంజలి సూత్రాల ననుసరించి ఎలా ధ్యానయోగం అవలంభించాలో బాగా చెప్పేవారాయన. చిన్నప్పుడే నాకు అది నేర్పించటంతో తెలుగు పద్యాలు, సంస్కృత

శ్లోకాలు కంఠస్తం చేసే ఆసక్తి, ఆధ్యానయోగం రెండూ కలిసి జ్ఞాపకశక్తిపై మంచి ప్రభావం చూపించింది. నాకు అప్పటికి పదకొండు, పన్నెండు ఏళ్ళవయసు ఉండేది. గురువుగారి దగ్గరికి వెళ్ళినపుడు ఎక్కువ రోజులేమీ ఉండేవాడిని కాదు. 2,3 రోజులుంటే అన్నీ నేర్పించేవారాయన. కొన్నిసార్లు మా పెద్దలు వెళ్ళిపోయినా నన్నక్కడే ఉండమనేవారాయన. స్కూలుకి సెలవలిచ్చినప్పుడు ఒక్కోసారి 4, 5 రోజులుండటం చేసేవాడిని.

## *హైస్కూలులో పద్యరచన, అవధాన ప్రక్రియ పరిచయం*

చంద్రగిరి ఉన్నత పాఠశాలలో చదువుకునే రోజుల్లో మాకు మంచి తెలుగు ఉపాధ్యాయులుండేవారు. అది కూడా మా అదృష్టం. గురుస్వామి వర్మ, నారాయణశర్మ గారు, యతిరాజు నాయుడుగారు చాలా మంచి ఉపాధ్యాయులు. నేను చెప్పే పద్యాలవి చూసి వాళ్ళు నా మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. మనసు స్పదించి ఉన్న పళంగా అప్పటికప్పుడు నేను చెప్పిన పద్యాలు తేటగీతిగానో, కంద పద్యంగానో ఉండేవి. అవన్నీ కొంత మంది రాసుకునేవారు, మా ఉపాధ్యాయులతో సహా. 'ఏదో అంతర్నిగూఢంగా నీలో ప్రతిభ ఉంది' అని తిరుపతి వేంకటకవుల గ్రంధాలనీ, మరికొన్ని సంబంధిత గ్రంధాలన్నీ తెప్పించారు నాకోసం. శతావధాన సారము, నానారాజ సందర్శనము, కొప్పరపు కవులు ఆశుపద్యాలు చెప్పిన గ్రంధాలన్నీ ఇచ్చి 'ఇవి చదువు నీకు ఒక అవగాహన వస్తుంది. అష్టావధానం అనే ప్రక్రియ ఒకటుంది. నువ్వు ప్రయత్నిస్తే చెయ్యగలవు' అని వాళ్ళు నన్ను ప్రోత్సహించారు. అవి చదివిన తరువాత నాకు కూడా ప్రయత్నం చేద్దామనే కోరిక మనసులో ఉబలాటంగా ఉండి అవధానప్రక్రియని ప్రయత్నించాను. అప్పటికి పదవ తరగతి చదువుతున్నాను. ఉపాధ్యాయులను చూస్తే కొంచెం భయం కదా బాల్యంలో.. అందుకని వాళ్ళు ప్రశ్నలు రాసి విద్యార్థులందరినీ కూర్చోబెట్టి వాళ్ళతో అడిగించేవారు. అలా సాధన ప్రారంభమయింది. దీనికి ప్రోత్సాహం యతిరాజు నాయుడుగారు, నారాయణ శర్మగారు, గురుస్వామి వర్మగారు, ప్రధానోపాధ్యాయుడు వై.వి.యన్. ఆచార్యులు గారు. తెలుగే కాకుండా మిగతా అంశాలు బోధించే ఉపాధ్యాయులకు కూడా నేను ప్రియ శిష్యుణ్ణే. లక్ష్మణరెడ్డి గారు (సాంఘిక శాస్త్రం), చెంగల్ రెడ్డిగారని వీళ్ళు కూడా నన్ను ముందుకు నడిపించిన వారిలో ప్రముఖులు.

## *అవధానప్రస్థానం*

1971 వ సంవత్సరంలో పణవాకం జిల్లా పరిషత్తు హైస్కూలులో మొదటి సారి అవధానం చేసినపుడు ముందు రాత్రి కొంచెం ఆందోళనగా ఉండేది మనసు. కానీ ప్రారంభించాక చెపుతుంటే మాత్రం ఇంతే కదా అనిపించింది. ఆ రోజు దిగ్విజయంగా చెయ్యడంతో బాగా ఆత్మ విశ్వాసం వచ్చింది. అప్పటికి నాకు పదిహేనేళ్ళ వయసు. అంతకు ముందు ప్రాక్టీసు అవధానాలు చేసేవాడిని అవన్నీ సభలో కాదు. పుస్తకాలు చదివేవాడిని. నేను అప్పటికే మనుచరిత్ర, శ్రీకాళహస్త మహత్యం, పారిజాతాపహరణ ఇవన్నీ చదివాను. భాస్కర రామాయణం పద్యాలు నోటికి వచ్చేవి.

లింగంశెట్టి వేణు గోపాల్, ఆవుల వెంకట రత్నం, రజనీకాంత్ అనే మంచి మిత్రులు ఉండేవారు. వాళ్ళు పదవ తరగతి పూర్తయ్యాక తిరుపతిలో విద్వాన్ కోసం పాఠ్య కళాశాలలో చేరారు. నేను కూడా పదవ తరగతి పూర్తి చేసి ఇంటర్ తిరుపతిలో జాయిన్ అయాను. వాళ్ళు నాకంటే వయసులో పెద్దవాళ్ళు కానీ నాపై చాలా ఆసక్తి వాళ్ళకి. వాళ్ళు పని గట్టుకుని వాళ్ళకు తెలిసిన లెక్చరర్లకు చెప్పటం, అక్కడక్కడా హైస్కూల్సులో చెప్పి అష్టావధానాలు చేయించడం చేసేవారు. అప్పుడు నేను కొన్ని జిల్లా పరిషత్ పాఠశాలలకి, జూనియర్ కళాశాలలకి వెళ్ళి అవధానం చేస్తుండటంతో అవధాన ప్రక్రియ బాగా అలవాటయ్యింది.

ఇంటర్ విద్యార్థిగా, బి.ఏ విద్యార్థిగా, ఎం.ఏ విద్యార్థిగా నేను చాలా దేశాటనం చేశాను. కాలేజీల్లో కూడా మాకు మంచి తెలుగు లెక్చరర్స్ ఉండి బాగా ప్రోత్సహించి అవధానాలు అప్పుడప్పుడూ పెట్టించేవారు. యూనివర్శిటీకి వెళ్ళాక ఇతర యూనివర్శిటీ వాళ్ళు తెలుసుకుని (విద్యార్థిగా ఉండి అవధానం చేస్తున్నాడని తెలిసి) చాలా మంది ప్రోత్సహించేవారు. అలా ప్రారంభమైనటు వంటి అవధాన ప్రస్తానం తరువాత రోజుల్లో ఒక్కో మెట్టూ ఎదిగింది. నానారాజ సందర్శనములో తిరుపతి వేంకట కవులు వెంకటగిరి సంస్థానంలో అష్టావధానాలు, శతావధానాలు, చతుర్గుణ అష్టావధానం చేశారని చదివాను. అలా మనం కూడా ఎందుకు చేయకూడదని ప్రయత్నం చేశాను.

*అష్టావధానాన్ని మించి..*

1984లో విజయవాడలో కరుణశ్రీగారు తెలిసినవాళ్ళకి చెప్పి చతుర్గుణ అష్టావధానం ఏర్పాటు చేశారు. చతుర్గుణ అంటే (నాలుగు అష్టావధానాలు ఏక కాలంలో చెయ్యటం.) 32 మంది ఉంటారు. ఎనిమిది మంది ఎనిమిది మంది బృందంగా ఉంటారు. నిషిద్ధాక్షరి అంటే నలుగురుంటారు. ఆ నలుగురుకి మొదటి పాదాలు చెప్పడం, దత్తపది నలుగురుంటారు. వాళ్ళకి మొదటి పాదాలు, అలా నాలుగావృత్తాల్లో జరుగుతుంది. అన్నీ అయ్యాక చివరలో ధారణ చెయ్యడం.. అటువంటి ప్రక్రియ చేశాను. ఆ రోజు ధారణ చేసే సమయంలో అప్పుడే అయిపోయిందే ఇంకా కొన్ని పద్యాలు చెప్పుంటే చెప్పేవాడినే అనే ఒక భావన కలిగింది.

తరువాత తెలంగాణాలోని సిద్ధిపేటలో షడ్గుణితం (ఆరు) చేశాను. అది కూడా బాగా జరిగింది. తరువాత తిరుపతిలో మా సాహితీ మిత్రులంతా కలసి 1985 జనవరిలో సంక్రాంతికి దశగుణితాష్టావధానం నిర్వహించారు. ఆ కార్యక్రమం ఆ రోజుల్లో ఒక జగజ్జేయమానంగా జరిగిన ప్రక్రియ. ఆంధ్రదేశం నాలుగు మూలల నుండీ పృచ్ఛకులుగా పండితులు వచ్చారు. ఉదయం నుండీ సాయంకాలం వరకూ జరిగింది. రెండు సమావేశాల్లో చివర పది అవధానాలకి సంబంధించిన అన్ని పద్యాలు ఏక బిగిన అప్పచెప్పడం గొప్ప అనుభవం, ఆ సభకి పాత్రికేయ సోదరులు కూడా మంచి ప్రోత్సాహమిచ్చారు. 'The week' అని కేరళనుండి ఒక మ్యాగజైన్ వస్తుంది. వాళ్ళు సభని చూడటానికి వచ్చి ఈ ప్రక్రియని చూసి 8th wonder అని రాశారు. 'అవధాన చక్రవర్తి' అని బిరుదు ప్రధానం చేశారారోజు. అది నాలో మంచి ఆత్మ విశ్వాశాన్ని పెంచింది.

ఇన్ని అష్టావధానాలు మనం ఏకకాలంలో చేసినపుడు శతావధానం ఎందుకు చెయ్యకూడదూ అని 1986లో వందమంది పృచ్ఛకులతో శతావధానం చేశాను. అవి వరుసగా తిరుపతి, విజయవాడ, గుంటూరు, విజయనగరం, విశాఖ పట్టణం. నెలా రెండు నెలలు తేడాతో జరిగాయి. ఇవి రెండు లేక మూడు రోజులు జరిగేవి. చివర అన్నీ అప్ప చెప్పడం. గొప్ప సాహితీ వేత్తలైన దివాకర్ల వెంకటావధాని గారు, ప్రొఫెసర్ జోగారావుగారు వీళ్ళంతా మెచ్చుకుని ఆశీర్వదించినవారిలో ఉన్నారు.

*సహస్రావధాన సాహసం*

1989లో మొట్టమొదటిగా హ్యూస్టన్‌లో జరిగిన తానా సభలకి అమెరికా వచ్చాను. అప్పటినుంచీ అడపాదడపా వస్తున్నాను. 1996లో తిరుపతిలోనే నాకు మంచి ఆత్మీయులు, శ్రేయోభిలాషులూ కొంతమంది 'మీరు బాగా చెప్పగలుగుతున్నారు కాబట్టి సహస్రావధానం ఎందుకు చెయ్యకూడదు' అని ప్రోత్సహించారు. 1996 జనవరిలో 18 రోజులు ఆ సాహసం చేశాను. మొదటి పాదం చెప్పడానికే ఆరు రోజులు పట్టింది. ఏడో రోజు అందరికీ రెండో పాదం మొదలెడుతూ వరసగా చెప్పుకుంటూ పోతూవుంటే ఆశ్చర్యపోవడం ప్రేక్షకుల వంతైంది.. అప్పట్నుంచీ హైదరాబాదు స్థాయిలో కొంతమంది ఆత్మీయులు, శ్రేయోభిలాషులూ సహస్రావధానాన్ని మించి ఏమైనా చేయగలిగితే భాగ్యనగరంలో చేయాలి అనే ప్రయత్నం చేస్తుండేవారు. అలా వాళ్ళ ఆలోచనలకి ఒక కార్యరూపం

ధరించింది మొన్న పంచసహస్రావధానం..! 30 రోజులు జరిగింది. 30 రోజులలో ప్రారంభంలో మాత్రం ఉదయం 9.30 నుండీ రాత్రి 9 వరకు అనుకుని మధ్యాహ్నం ఒకటి నుండీ నాలుగు వరకూ విశ్రాంతి. ఒక వారం రోజులు జరిగిన తరువాత డా.సి.నారాయణరెడ్డిగారు అందరూ సమీక్షించారు. కార్యక్రమం 5,6 రోజులు ముందుంది. ఆ లెక్కన చూస్తే 20 రోజుల్లో అయిపోతుంది. కానీ ప్రతిరోజూ సాయంత్రం  రావల్సిన అతిధులు ముందే నిర్ణయమయ్యారు.  అంతా పెద్ద వాళ్ళు.. వాళ్ళకి ఫోనులు చేసి ఇప్పుడు మీరు వద్దంటే బావుండదని ఉదయం పూట తీసేసి మాధ్యాహ్నం మాత్రమే పెట్టారు. అంటే 30 రోజుల్లో 128 గంటలు జరిగిందా కార్యక్రమం. 128 గంటల్లో 28 గంటలు ప్రశ్నలు వేయడం, సమావేశానికి పోతే నూరు గంటలు ఆశు పద్యాలుచెప్పాను. నూరు గంటలలో 5,184 పద్యాలు చెప్పడం జరిగింది. దత్తపదులు, సమస్యలు, వర్ణనలు అనీ వేయి, వేయి పైగా చెప్పాను.

### *కుటుంబసభ్యులస్పందన*

మా ఇంట్లో  ఉన్నత పాఠశాలకి, కాలేజీకి వెళ్ళి చదువుకున్న వ్యక్తిని నేనే. మా వాళ్ళకి అంత తెలిసేది కాదు. మనకెందుకు నాయనా ఇవన్నీ అనేవాళ్ళు. నాన్నగారికి ఏడెకరాల పొలం ఉండేది. ఇద్దరం అన్నదమ్ములం కాబట్టి చెరి మూడున్నరెకరాలు వస్తుంది బాగా చేసుకోండి అని చెపుతుండేవారు. తరువాత తరువాత, పేపర్లో వచ్చే వ్యాసాలు చదివీ, అందరూ ఇంటికొచ్చి ప్రశంసిస్తూ ఉంటే గమనించీ ‘ మనవాడేదో మంచి పని చేస్తున్నాడ‘ నే అభిప్రాయం కలిగింది. అప్పట్నుంచీ (అంతకు ముందేమీ నిరుత్సాహపరచలేదు కాకపోతే కొత్త విషయం కదా) నాకు ప్రోత్సాహమిచ్చారు. నేను చిన్నప్పుడు గురువుగారి వద్దకు వెళ్ళి ఆశ్రమంలో ధ్యానం అవలంబిస్తుండటం వల్ల నాకు ఆ ఆశ్రమ అలవాట్లు వచ్చాయి. పూర్తిగా శాఖాహారిగా ఉండటం, ఉదయం లేస్తూనే స్నానం, ధ్యానం నిష్ఠలో ఉండటం, నాకోసం మాఇంటిలో అందరూ శాఖాహారులైపోయారు. ఎవరూ మాంసాహారం ముట్టరు. అక్కలకి పెళ్ళిళ్ళు అయాక "నాకోసం మీరు మారొద్దు మీరు మామూలుగా ఉండండి" అని చెప్పినా కానీ వచ్చిన బావలు కూడా శాకాహారులుగానే ఉన్నారు అందరికన్నా చిన్నవాడినవ్వటం వల్ల బాగా వాత్సల్యంగా చూసేవారు. మా అమ్మ మొదటి శ్రోత నాకు. ఏ గ్రంధం చదువుకున్నా కానీ  దాంట్లో విషయాలు చెప్పాలంటే ముందు తను ఓపిగ్గా కూర్చుని విని సలహాలు ఇచ్చేది..

### *సాహిత్యవ్యాసంగం*

1983లో శతావధానం చేయాలనే ఆలోచన ఉండేది. అప్పటికి పదివేల పద్యాలు ధారణ చేశాను. దివాకర్ల వెంకటావధానిగారు నాకు ‘సహజావధాని‘ బిరుదు ప్రధానం చేశారు. ‘పోతన ఎలా సహజ పాండిత్యుడో నువ్వు అలా సహజావధాని వయ్యా! నువ్వు చెప్పిన పద్యాలు నువ్వు ధారణ చెయ్యడమే కాకుండా నన్నయాది మహా కవుల గ్రంధాల నుంచీ పద్యధారణ చెయ్యి. తద్వార నీకో శబ్దసంస్కారం పెరుగుతుంది‘ అని ఒక అంశం చెప్పారాయన. అప్పటి నుంచీ ఎక్కువ వాల్మీకీ, వ్యాసాది శ్లోకాలన్నీ కంఠస్థం చేసేవాడిని. ఇప్పుడు నేను కంఠస్తం చేసిన పద్యాలు, శ్లోకాలు సంఖ్య లక్ష దాటి ఉంటుంది. రామాయణ ప్రవచనాలు చేసినా, భాగవత ప్రవచనాలు చేసినా నాకు పుస్తకాపేక్ష లేదు సభల్లో చెపుతూ వుంటాను. ప్రభంధాల గురించైనా అంతే. అంత ధారణ నాకు కలగడానికి  కారణం మా గురుదేవులు ఆ ధ్యాన యోగం ఇచ్చారు. ఈ జన్మలో భగవంతుడిచ్చినటువంటి ప్రతిభతో మనం మంచి పనులు చేయాలని నేను నమ్ముతాను. ఇంకోవిషయమేమిటంటే 50 సంవత్సరాల వరకూ ఇంచుమించు బాగా చదవాలి. ఆ తరువాత వ్రాయడం ప్రారంభించాలి. అందుకని ఇంత వరకూ నేనేమీ రాయలేదు. అప్పుడప్పుడు ‘పురుషోత్తమచక్రవర్తి‘ అనే పద్య కావ్యం రాశాను. గణపతి సచ్చిదానంద స్వామికి అంకితం చేశాను. ఆ కావ్యానికి మంచి పేరు వచ్చింది. తెలుగు విశ్వవిద్యాలయంలో ఆ కావ్యంపై MPhil ల్లో పరిశోధన జరిగింది. తరువాత

నేను చేసిన సహస్రావధాన పద్యాల గురించి కూడా పద్మావతి యూనివర్శిటీలో ఒక పరిశోధన సిద్ధాంత వ్యాసం (PHD) చేశారు. అలా కొంత మంది విద్యార్థులను ఉత్తేజ పరచడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. చాలామంది నా దగ్గరకు వచ్చి నేర్చుకుంటూవుంటారు. ఎన్నో విషయాలు చర్చిస్తూ ఉంటారు. అలా నలుగురికీ, సమాజానికీ ఉపయోగపడటం నాకు ఆనందం కలిగిస్తుంది.

*వేంకటేశునిసన్నిధిలో..*

ఎమ్మే పూర్తి చేసిన తరువాత Phd చెయ్యాలా, ఎక్కడైనా లెక్చరర్ ఉద్యోగానికి పోవాలా అని చూస్తున్న సమయంలో మద్రాస్ యూనివర్శిటీలో నాకు Phd అవకాశం లభించింది. అన్నమాచార్య కీర్తనలమీద పని చెయ్యడానికి తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఫెలోషిప్ కూడా ఇచ్చారు. Phd చేస్తుండగానే మధ్యలో పి.వి.ఆర్.కె ప్రసాద్‌గారు (టి.టి.డి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు), ఇలాగే అష్టావధానం చూసి ఆనందపడి, నాకు అన్నమాచార్య ప్రాజెక్టులో రీసెర్చి అసిస్టెంటుగా ఉద్యోగ మిచ్చారు. 1982 జులైలో రీసెర్చి అసిస్టెంటుగా చేరిన తరువాత పరిశోధనాగ్రంధం సమర్పించాను. తరువాత 1984లో ప్రాజెక్టు ఆఫీసరయ్యాను. 1985లో డైరక్టరయ్యాను. నా సర్వీసంతా టి.టి.డి నే. కాలేజ్ నుంచీ టి.టి.డి.కి వెళ్ళాను టి.టి.డిలోనే ఉన్నాను. నా సెంటిమెంటు కూడా భగవంతుని సన్నిధిలోనే మనముండాలి అని. ప్రస్తుతం అలా ఉద్యోగ బాధ్యతలు భగవంతుని సన్నిధిలో రావడం కూడా నాకీ ప్రజ్ఞ పెంచుకోవడానికి, ఈ ఆధ్యాత్మిక గ్రంధాలు బాగా చదువుకోవడానికి ఉపకరించింది.

*నిరంతర విద్యార్థిగా..*

నేను ఉద్యోగంలో చేరాక ఉపనిషత్తులు అన్నీ చదువుకున్నాను. దేవస్థానంలో ఉంచే గ్రంధాలన్నీ అక్కడ ముద్రణవుతూ వుంటాయి కాబట్టి ఈ వేదానికి సంబంధించిన గ్రంధాలు, తెలుగులో అనువాదం చేసిన గ్రంధాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు అన్నీ చదివాను. ఎల్.సి.వి. నరసింహచార్యులని ఉద్దండ పండితులాయన. రాష్ట్రపతి అవార్డు కూడా ఇచ్చారాయనకు. మహా పండితుడు. ఆయన దగ్గర కొంతకాలం సంస్కృతం చదుకున్నాను. ఆయన మాకు సూర్యశతకం చెప్పేవారు. అప్పుడప్పుడు శ్రీభాష్యం కూడా చెప్పేవారు. మల్లం సర్వేశ్వర శర్మగారి వద్ద శైవాగమనం నేర్చుకున్నాను. అలాగ కొన్ని మహత్తర గ్రంధాలని స్పర్శించి, అందులో ఏముందో చూసి తెలుసుకోవాలనే జిజ్ఞాసతో కొంత పనిచేశాను. పతంజలి యోగ సూత్రాలని ఎక్కువగా అధ్యయనం చేశాను. అంటే మానవుని హృదయంలో అంతరంగంలో ఎంత ఆలోచనా యంత్రాంగముందో ఆ యంత్రాంగాన్ని అనుకూలంగా ఎలా మనం నియంత్రించుకోవాలో మానవుడు పురోగమించాలంటే ఎటువంటి ఆలోచనలకు తావివ్వాలో, దీనికి సంబందించిన మంచి సామాగ్రిని పతంజలి యోగసూత్రాలిస్తుంది. కాబట్టి వాటిని బాగా అధ్యయనం చేసి నా ధ్యానయోగంలో, నా స్వీయ అనుభవాలను మేళవించి ఇప్పుడొక 'ధ్యానభారతి' అనే గ్రంధం రాస్తున్నాను. డిసెంబరుకి పూర్తవుతుందది.

అవధాన ప్రక్రియకు సంబందించి కూడా ఒక గ్రంధం రాయాలని కొంత సమాచారం సేకరించాను. ఎందుకంటే నిషిద్ధాక్షరిలో ఎటువంటి మెలుకువలు పాటించాలి, పృచ్ఛకులు ప్రశ్నించడంలో ఎటువంటి మెలుకువలు, అవధాని పరిష్కరించడంలో ఎలాంటి మెలుకువలు పాటించాలి మొదలైనవిషయాలు.. భవిష్యత్తరాలలో ఎవరైనా అవధానులకి ఉపయోగ పడాలని కూడా కొంత సమాచారాన్ని సేకరించాను. ఈ 'ధ్యానయోగం' అయిన వెంటనే తరువాత దీనిని కూడా రాస్తాను.

*మా కుటుంబం*

1986లో అరుణజ్యోతి తో వివాహమైంది నాకు. వాళ్ళది తిరుపతికి పది కిలోమీటర్ల దూరంలో నున్న తుంగరామన్న పల్లె. ఆవిడ ఉద్యోగం చెయ్యరు కానీ లైబ్రరీ సైన్సులో Phd చేసారు. మాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి హిమబాల పెద్దది. ఎం.బి.బి.యస్. రెండో సంవత్సరం చదువుకుంటుంది. అబ్బాయి ఎం.జి.వి. గురు వెంకట శివతేజ. పదవతరగతి చదువుతున్నాడు. మా నాన్నగారు 1987లోనే పోయారు. అమ్మకి 84 సంవత్సరాలు. నాదగ్గరే ఉంటారు. మా ఊళ్ళో పొలాలు అవీ ఉన్నాయి అవి మా అన్నగారు చూసుకుంటుంటారు. మా ఊరిలో నా తరువాత పాండిత్యం వైపు వచ్చినవారెవరూ లేరు కానీ డాక్టర్లు, ఇంజినీర్లు అయినవారున్నారు.

*అవధానప్రక్రియలో అనుభవాలు*

అవధానంలో నాకెదురైనటువంటి అనుభవాలని బట్టి ఆలోచిస్తే ఇది క్లిష్టమని మాత్రం ఏదీ అనిపించదు. కాకపోతే కొంత ఆలోచింపచేస్తుంది. ఇదేదో కొత్తరకంగా ఉందే దీనికేమిటి పరిష్కారం అంటే .. ఒక సత్యస్ఫురణకు సంబంధించిన సామగ్రి మనస్సులో ఉంది. అక్కడినుంచీ ఏదో ఒక గని నుంచీ వచ్చిన పదార్థంలా వచ్చేస్తుంది. ఎప్పుడా ఊహ ఒక్కసారి తళుక్కుమంటుందో పరిష్కారం వెంటనే దొరుకుతుంది. కాబట్టి మనకు కష్టంగా వుందని ఎప్పుడూ అనిపించదు. దత్తపదులు కానీ, సమస్యలు కానీ ఇటువంటివన్నీ ఇది బాధాకరంగా వుందీ ఎలాగా అని అనిపించలేదు. చమత్కారముంటుంది. విలక్షణంగా ఉంటాయి కొన్ని అంశాలు. అవి పరిష్కరించిన వెంటనే విన్నవాళ్ళకి ఓహో ఇంత చమత్కారంగా చెప్పే అవకాశం ఉందా! అనే భావన కూడా కలుగుతుంది. త్రిష, లయ, శ్రియ, స్రిమాన్ ఈ నాలుగు పదాలతో భగవద్గీత గురించి చెప్పమన్నారు.

హరి శ్రీకృష్ణుడు పల్కె గీతను త్రిషట్కాధ్యాయ పర్యంతమున్.
నరుడాలించె శ్రియః పతీద్య వచనానందైక సందీప్తి, తత్
క్'రు'ణన్ పాండవ దిగ్జయాలయ పటుఖ్యాతుల్ వెలుంగొందె, ను
ద్ధరుడై రాజ్యము వాసి మాన్పడెగదా! దుర్యోధనుండయ్యెడన్

పంచ సహస్రావధానంలో ఇలాంటివెన్నో చేశాను. భాషపైన సాధికారకమైనటువంటి ఒక విన్యాసం, శబ్దజాలం పట్ల ఒక అవగాహన, ఏ శబ్దాన్ని ఎలా విరిచే అవకాశముంది? ఎంతవరకూ విరిచే అవకాశముంది? ఎలా ప్రస్తుతించే అవకాశముంది? వీటన్నిటిపట్ల మనస్సుకు ఒక శక్తి పరిపుష్టంగా ఉంటుంది. అదే అవధానికున్నటువంటి ఆస్తి. కాబట్టి నాకు ఇంతవరకు చేసిన అసంఖ్యాక అవధానాల్లో అలాంటి అనుభవాలు కోకొల్లలు.

*ప్రయోగాలు*

ఇప్పటివరకూ అష్టావధానాలు 600 పైన చేశాను. ద్విగుణిత(రెండు అవధానాలు ఒకేసారి చేయడం) అవధానం 25 సార్లు చేసాను. చతుర్గుణిత అవధానాలు 25 దాటి వుంటుంది. షడ్గుణితం ఒకటి, దశగుణితం ఒకటి, శతావధానాలు 15, సహస్రావధానం ఒకటి, పంచసహస్రావధానం ఒకటి. నేను అవధానంలో చేసిన మరొక ప్రయోగమేమిటంటే మనం అష్టావధానంలో ఆవృత్తిక్రమంలో ఒక్కొక్క ఆవృత్తిలో ఒక పాదం చెపుతూ వెళతాం.. నాలుగావృత్తుల్లో నాలుగు పాదాలు చెప్పి చివరికి ధారణ చేస్తాం. అలా కాకుండా 'ప్రద్యావృత్తి పరిపూర్ణ' అష్టావధానం పేరుతో నేనే కొత్తగా ఒక ప్రయోగంచేశాను.. ప్రతి ఆవృత్తిలో పద్యం పూర్తిగా చెపుతాం, నాలుగావృత్తుల్లో నాలుగు పద్యాలొస్తాయి అందరికీ. చివర ధారణ చేస్తాను. ఇది ఇంతవరకూ ఎవ్వరూ నిర్వహించలేదు. ఇది నేను సగర్వంగా చెప్పడం కాదు ఎవ్వరు ఆ ప్రయత్నం కూడా చెయ్యలేదు.. చాలా కష్టమది. నేను నాలుగు సార్లు చేసాను. అది కూడా చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. మంచి స్పందన లభించింది.

### *మానసిక సంసిద్ధత*

అవధానికి మానసికంగా ప్రశాంతంగా ఉండటమే సంసిద్ధత. పంచ సహస్రావధానం, సహస్రావధానం చేసే సమయాల్లో మనసంతా ఛందస్సు, వ్యాకరణము, శబ్దప్రవాహం, పద్యధార వీటిపైనే ఉంటుంది. నిజానికి జీవితంలో ప్రశాంతమైన రోజులవే. ఇంక మరొక్క అంశమే మనసులోకి రాదు. అదే అవధానికి కావాల్సింది. అప్రస్తుత ప్రసంగం చేసినప్పుడు కవ్వింప పడకూడదు. కవ్వింప చేసేరీతిలోనే ప్రశ్నలు వేస్తారు. కానీ కవ్వింపు పొందకూడదు. అందుకనే ఒక సంయమన స్థితి అలవాటు చేసుకుంటాం. అది ధ్యానంవల్ల అలవాటవుతుంది. ధ్యానం వల్ల సంయమన స్థితి కలిగినప్పుడు వాళ్ళు ఎంత కవ్వించినా ఏదో హాస్యాస్పదంగా మాట్లాడుతున్నారు మనకెందుకు లెద్దూ అన్నట్టే అనిపిస్తుంది. ఒకసారి ఒక ప్రసిద్ధపండితులు అప్రస్తుత ప్రసంగం చేస్తున్నారు. "తెలుగు అజంతా భాషకదా! శబ్దాలన్నీ అజంతంగా వుంటాయి. మీపేరులోనే అజంతం లేదు. హలంతంగా వుంది. మీ పేరే వ్యాకరణ విరుద్ధంగా ఉంది. ఎవడు పెట్టాడు మీకీ పేరు?" అన్నారు. "మా తాతగారు పెట్టారండీ" అన్నాను. "ఎవడు పెట్టాడో నాకు చూపించండి" అన్నారాయన. "ఆయన ప్రస్తుతం స్వర్గంలో వుంటారు. మీరక్కడకు వెళతారా" అన్నాను. పెద్దవారు కదా "నేను తొందరగా స్వర్గానికి పోవాలని కోరుకుంటున్నారా" అని ఆయనకి కోపం వచ్చింది. నాక్కూడా స్వర్గానికి పోయి చూడండి అని అనకూడదేమో అనిపించింది. మళ్ళీ ఆయనే సర్దుకున్నారు. మమ్మల్ని కవ్వించాలని ప్రయత్నం చేస్తే మాకు ఎదుటివాడిని కవ్వించాలని ఉంటుంది. నాకు ప్రారంభంలో అది వుండేది. నా వయస్సు ఇప్పుడు 50 సంవత్సరాలు. ఇప్పుడు నాకు కవ్వించాలనే ప్రయత్నం పోయింది. ఎదుటివాళ్ళు కవ్వించినా ఒక సంయమన స్థితి వచ్చింది.

### *సమకాలీన సమస్యల పట్ల అవగాహన*

అప్రస్తుత ప్రసంగంలో సమకాలీన సమస్యల గురించి, స్థానిక సమస్యల గురించి కూడా అడుగుతుంటారు. ఒకోసారి నాకా సమస్యల పట్ల కొంత అవగాహన ఉంటుంది, ఉండకుండా వుండొచ్చు. కానీ అవధానంలో ఆ సమస్యల గురించి సమగ్రంగా చెప్పాలనేమీ లేదు. కాబట్టి ఆ సమయానికి నాకు తెలిసిన విషయాలను మాత్రం బాగా ఆవిష్కరిస్తాను. ఎందుకంటే ఎంతైనా సమకాలీన సమాజం గురించి తెలుసుకోకుండా ఏమీ చెయ్యలేం. అందులో తిరుపతి వేంకట కవుల కాలానికీ, ఇప్పటి కాలానికీ అవధానంలో, ప్రశ్నల్లో ఎంతో మార్పులొచ్చేసాయి. త్రిష, లయ, శ్రియలాంటి ప్రశ్నలు అప్పటిలో ఉండేవికావు. అప్పుడిచ్చే దత్తపదులన్నీ ప్రాసానుకూలంగా వుండే దత్తపదులు, సన్నివేశానికనుకూలంగా వుండే దత్తపదులు ఇచ్చేవాళ్ళు. ఇప్పుడలా కాదు. సినిమా పేర్లిస్తారు, ఎన్నెన్నో ఇస్తారు. ఉదాహరణకి 'గంగూలి, ద్రావిడ్, సచిన్, ధోని' ఈ నాలుగు పదాలతో గజేంద్రమోక్షం చెప్పమన్నారు ఒకసారి

వేగంగూ'లిచినావు రాక్షసులమున్ విశ్వస్వరూపా! హరీ!
త్యాగాది స్తవనీయ సద్గుణ సముద్రా! విద్దు హొంతః ప్రభా!
యోగప్రాభవహాస! చిన్మహిత! దైన్యున్ హస్తినన్ బ్రోవుమా!
ద్యోగంగాపద! సత్కృపాభరితసింధో! నీవె దిక్కెయ్యెడన్

ఇటువంటివి తిరుపతి వేంకటకవుల కాలంలో లేవు. ఇప్పుడు అధునాతన యుగంలో ప్రశ్నించడంలో కూడా ఒక అధునాతన దృక్పథం వచ్చింది. ఇచ్చే పదాలు ఇప్పటివిచ్చినా దాన్ని ప్రాచీనమైన ఏదైనా అంశంతో సమన్వయించడమన్నమాట. ఈ క్రికెట్టు ఆడేవాళ్ళ పేర్లతో గజేంద్ర మోక్షం చెప్పడమేమిటి? కానీ ఇప్పటివాళ్ళు చెప్పిస్తున్నారు. అవధానులు చెపుతున్నారనటం కన్నా పృచ్ఛకులు చెప్పిస్తున్నారంటే అదే సబబుగా వుంటుంది.

*ప్రస్తుతం..*

ప్రతినెలా ఒకటి రెండు అవధానాలుంటాయి. ఉద్యోగరీత్యా నాకు అంగీకరించే అవకాశముంటే అంగీకరించి అవధానాలు చేస్తుంటాను. నేను శ్రీశ్రీ గ్రంధాలు, ఆధునికంగా వస్తున్న సిద్ధాంతాలు ఇవన్నీ కూడా చదువుతుంటాను. కానీ పుష్కలమైనటువంటి సామగ్రి అంతా కూడా సంప్రదాయ సాహిత్యంలోనే ఉంటాయి. మానవ సమాజానికి ఒక శాశ్వత ప్రాతిపదిక నీ ఒక విజ్ఞాన సామగ్రినీ అందింప కలిగినటువంటి శక్తి ఒక సంప్రదాయ సాహిత్యంలోనే ఉందని నాకనిపిస్తుంది. విశ్వనాధవారి నవలలు చదివాను. ఆధునికంగా యద్దనపూడి గారి నవలలు, పులికంటి కృష్ణారెడ్డిగారు రాసిన రాయలసీమ చిన్నోడు చదివాను. ఆధునికమైన పోకడలు పట్ల కూడా నాక్కొంత ఆరాధ్యభావన ఉంది. లేకపోలేదు. కాకపోతే వీటన్నింటికి ప్రాతిపదిక సాంప్రదాయ సాహిత్యమే. సంప్రదాయ సాహిత్యాన్ని ఇంకా పరిపుష్టం చేయాలి. అందులో ఉన్న అంశాలను మనం ఇంకా బాగా చెప్పగలగాలి అని అనిపిస్తుంది. ఎవరైనా అవధానం నేర్చుకుంటే రాదు. స్వతసిద్ధంగా, జన్మతః, ఒక ప్రతిభవుండాలి. ఆ ప్రతిభ ఒక మూల పదార్థం. ఆ ప్రతిభను, ఆమూల పదార్థాన్ని విశ్లేషణాత్మకమైనటువంటి కృషితో మనం పరిపుష్టం చేసుకోవాలి తప్ప మొత్తం అవధానమంతా కోర్సులాగా నేర్పిస్తే వచ్చేదికాదు.

మా పిల్లలు పద్యాలు, శ్లోకాలు బాగా కంఠస్తం చదవడం చేస్తారు కానీ నాలాగే అవధానం చేసేట్టు కనిపించటంలేదు.

*(ఆగస్ట్ 5 వ తేదీ ఆదివారం సాయంకాలం అవధాని గారితో జరిపిన సంభాషణ రికార్డింగ్ కి అక్షర రూపమిది. వీలైనంత వరకూ సంభాషణా భాషా శైలినే యథాతథంగా వాడడం జరిగింది. పాఠకులు గమనించ గలరు.)*



# కరుణశ్రీ

ఆగస్ట్4వ తేదీ కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి జయంతి సందర్భంగా వారి కుమారుడు చెప్పిన ప్రత్యేక అంతరంగ తరంగం

## కన్నతండ్రితో కాసేపు....

### డా.జంధ్యాల జయకృష్ణ బాపూజీ

*"అచ్చపు జుంటి తేనియల,*
*నైందవ బింబ సుధారసాల, గో*
*ర్వెచ్చని పాల మీగడల,*
*విచ్చెడి కన్నె గులాబి మొగ్గలన్*
*మచ్చరికించు ఈ మధుర*
*మంజుల మోహన ముగ్ధశైలి నీ*
*వెచ్చట నేర్చినావు? సుక*
*వీ! సుకుమార కళా కళానిధీ!"*

అని పోతన మహాకవిని ప్రశ్నించిన నాన్నగారి పద్యంతోనే తిరిగి ఆయన్నే ప్రశ్నించాలనిపిస్తుంది నాకు. ఎందుకంటే ఎంతో మంది తెలుగు సాహితీప్రియులకు ఆయన "అభినవ పోతన". జుంటి తేనెల తీయదనం, మిసిమి వెన్నెల చల్లదనం, పాలమీగడల కమ్మదనం, అరవిరిసిన గులాబీల చక్కదనం పోతనగారి కవిత్వంలో లాగానే కరుణశ్రీగారి కవిత్వంలో కూడా పదిలంగా పరచుకుని ఉంటాయి.

కవిత్వమే జీవితంగా, జీవితమే కవిత్వంగా ప్రవర్తించిన వ్యక్తి ఆయన. తన పద్యాలతో పాఠకులను మురిపించి మైమరపించిన మధుర కవి ఆయన. పిన్నలకు, పెద్దలకు, పామరులకు, పండితులకు అందరికీ అర్థమయేలా కవిత్వాన్ని అందించిన సుకవి చూడామణి ఆయన.

గాజుల బత్తుడి మలారంలోనే కాదు - రిక్షా కార్మికుడి సీటు అరలో కూడా ఆయన గ్రంథాలు సుగంధాలను వెదజల్లాయి. అరవై ఏళ్ళ హరిదాసు కంఠంలోనే కాదు - ఆరేళ్ళ చిన్నారి పాప చిత్తంలో కూడా ఆయన పద్యాలు స్థిరంగా నిలిచిపోయాయి. మెడలో రుద్రాక్షలు వ్రేలాడే మేటి విద్వాంసుడే కాదు - చెప్పులు కుట్టుకునే చినుగు చొక్కా చిన్నవాడు కూడా ఆయన కవితలను చకచక అప్పగిస్తాడు. గుడిలో భారతం చెబుతున్న పౌరాణిక స్వామే కాదు - బడిలో గంట కొడుతున్న బంట్రోతు కూడా ఆయన రచనలను సాభినయంగా చదువుతారు.

ఆయన పద్యాలు ఘంటసాల, సూరిబాబు, పట్నాయక్‌ల గళాలలో మరింత అందగించాయి. వడ్డాది పాపయ్య, వి.కామేశ్వరరావు, బాపు, బాలి వంటి చిత్రకారుల చిత్రాలలో వింత వింత హొయలు సంతరించుకున్నాయి.

అది గుంటూరు జిల్లాలోని పెదనందిపాడు మండలంలోని కొప్పర్రు గ్రామం. పాడిపంటలతో కళకళలాడే ఆ పల్లెటూళ్ళో ఆగస్టు 4, 1912 న ఒక పిల్లవాడు జన్మించాడు. "తమ్ముడేడీ? తమ్ముడేడీ" అంటూ అరలాగూలు పైకి లాక్కుంటూ నలుగురు అబ్బాయిలూ, పరికిణీ కుచ్చిళ్ళు పైకి పట్టుకుంటూ ఒక అమ్మాయీ గబగబా వచ్చి తల్లి పొత్తిళ్ళలోని పసిబిడ్డణ్ణి ఆసక్తిగా, ఆనందంగా తిలకించారు. పదకొండవ రోజున ఎర్రగా బొద్దుగా ముద్దుగా ముచ్చటగా ఉన్న ఆపిల్లవాడికి "పాపయ్య శాస్త్రి" అని పేరు పెట్టారు.



పాపయ్య శాస్త్రి తల్లి మహాలక్ష్మమ్మ. తండ్రి పరదేశయ్య. అన్నలు వేంకట సుబ్బయ్య, వేంకట రామయ్య, రామయ్య, మల్లయ్య, అక్క రామలక్ష్మమ్మ.

పైవరుస: : వెంకటరమణ (రెండవ కుమారుడు), చింతపల్లి నాగేశ్వర రావు (అల్లుడు), చింతపల్లి విజయలక్ష్మి (కుమార్తె), డా.కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు, అనసూయ (భార్య), జయకృష్ణబాపూజీ (మొదటి కుమారుడు), సుభాషిణి(కోడలు, బాపూజీ గారి భార్య)
క్రింద వరుస: చింతపల్లి వంశీ కృష్ణ(మనుమడు), చింతపల్లి ఉదయకుమార్(మనుమడు), శ్రీనాథ్(మనుమడు), కళ్యాణ భారతి(మనుమరాలు), ప్రశాంతి(మనుమరాలు)

కొప్పర్రుకు దగ్గరలోని కొమ్మూరు గ్రామంలో అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలోని స్వామివారిని సేవించుకుంటూ మహాలక్ష్మమ్మ పరదేశయ్య దంపతులు సంతానంతో స్వగృహంలో కాలం గడపుతుండేవారు. సోదరీ సోదరుల మధ్య ఆటపాటలతో పాపయ్య శాస్త్రి బాల్యం సంతోషంగా సాగిపోయింది. ప్రాథమిక మాధ్యమిక విద్యాభ్యాసం ముగించిన పాపయ్యశాస్త్రికి సంస్కృత భాషపైన మక్కువ ఎక్కువయింది. ఆయన భమిడిపాటి సుబ్రహ్మణ్య శర్మ వద్ద రఘువంశ - కుమార సంభవ కావ్యాలను, కుప్పా శ్రీ ఆంజనేయశాస్త్రి వద్ద కిరాతార్జునీయ - శిశుపాల వధ - నైషధ - కాదంబరి - కౌముది - ప్రతాపరుద్రీయాలను చదువుకున్నారు. రాష్ట్రభాషా విశారద, ఉభయ భాషా ప్రవీణ, హిందీ భాషా ప్రవీణ పరీక్షలలో ఉత్తీర్ణులై అమరావతిలోని రామకృష్ణ విద్యాపీఠంలోనూ, గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూలులోనూ, ఆంధ్ర క్రైస్తవ కళాశాలలోనూ అధ్యాపకులుగా పనిచేశారు.

ఆయన సతీమణి అనసూయాదేవి. కుమారులు జయకృష్ణబాపూజీ, వేంకటరమణ, కుమార్తె విజయలక్ష్మి. కోడళ్ళు సుభాషిణి, వరశ్రీ. అల్లుడు నాగేశ్వరరావు. 80 సంవత్సరాలు జీవించిన ఆయన అందులో 60 ఏళ్ళు కవిగా - పండితుడిగా - అధ్యాపకుడిగా - వ్యాఖ్యాతగా - సంపాదకుడిగా సారస్వత సేవ సలిపారు. ఆయనకు నవరసాల్లో కరుణరసం అంటే ఇష్టం. అందుకే "కరుణశ్రీ" అని

కలం పేరు పెట్టుకున్నారు. "ప్రపంచం కరుణలో పుట్టి కరుణలో పెరిగి కరుణలోనే విలీనమవుతుంది" అని విశ్వసించిన ఆయన జూన్ 21, 1992 న అస్తమించారు.

క్రౌంచపక్షుల వియోగాన్ని చూచి విచలితుడైన వాల్మీకి మహర్షి శోకం శ్లోకంగా మారినట్లు పాయిఖానాలు పరిశుభ్రం చేసే పాకీ పిల్లను చూచి పదహారేళ్ళ పాపయ్య శాస్త్రి నోట వెలువడిన పలుకులు పద్యంగా మారాయి.

*ఒక్కరోజీవు వీధుల నూడ్వకున్న*
*తేలిపోవును మా పట్టణాల సొగసు;*
*బయట పడునమ్మ! బాబుల బ్రతుకు లెల్ల*
*ఒక క్షణమ్మీవు గంప క్రిందకును దింప.*
*(పాకీ పిల్ల - ఉదయశ్రీ ప్రథమ భాగం)*

"సామాజిక స్పృహ కవిత్వంలో ఉండి తీరా"లని గొంతు చించుకునే విమర్శకులకు ఆనాడే తన తొలిపద్యం ద్వారా సమాధాన మిచ్చారు ఆయన.

*"పాకీదానిగ నాడిపోసికొను ఈ పాపిష్టి లోకమ్ము నీ*
*బాకీ తీర్చుకొనంగ లేదు జగదంబా! జన్మజన్మాలకున్"*

అని పాకీ పిల్లను "జగదంబా" అని సంబోధించటం ఆయనకే చెల్లింది. అంతే కాదు -

"పాకీదే కద మాకు మా జనని బాల్యమ్మందు సంజీవనీ!" అని ప్రతి తల్లీ మా చిన్నప్పుడు నీవు చేసిన పనే చేసిందని ఆ పవిత్రమూర్తికి నమస్సులర్పిస్తారు పన్నెండు పద్యాలలో.

ఆనాటి నుండీ జీవితాంతం వరకు సమాజంలో ఏ చిన్న సంఘటన తనను కదలించినా కరగించినా దానిని కవితాశిల్పంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. అలా శతాధికమైన అంశాలపై తాను వ్రాసిన కవితలను ఐదు భాగాల ఉదయశ్రీ కావ్యంగా రూపొందించారు.

ఆయన దృష్టిలో "కవిత్వం ఒక కమ్మని అనుభూతి. మానవత్వంలో నవత్వం చూపించే అందాల ఆశాజ్యోతి. అది జీవిత విపంచి మేళవించి మ్రోగించిన కళ్యాణ గాంధర్వగీతి. అది ఎదలో మెదులుతుంది. పదంలో కదులుతుంది. ఉదయాన్ని సృజిస్తుంది. అభ్యుదయాన్ని అందిస్తుంది. అది సత్యసనాతనం. నిత్యవినూతనం."

ఆయన సమత, మమత, దయ, సానుభూతి, సంస్కృతి, జాతీయత, దైవభక్తి, దేశభక్తి వంటి ఆదర్శగుణాలను అక్షరాల్లో రంగరించి ఆ కవితామృతాన్ని ఆంధ్రులకు అందించి ఆబాలగోపాలాన్నీ ఆనందింపజేసిన నిజమైన ప్రజాకవి. ఆయన కరుణా సింధువైన గౌతమ బుద్ధుణ్ణి "కరుణశ్రీ" గా భావించారు, అదే తన కలం పేరుగా గ్రహించారు. ఎందరెందరో "నామాంత శ్రీమంతులకు" మార్గదర్శకులైనారు.

ఆయన రచించిన గ్రంధాలు చిన్నవీ పెద్దవీ మొత్తం 76. వాటిలో అత్యంత ప్రధానమైనవి మూడు. అవి ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ. "ఈ కావ్యత్రయంలో మీకిష్టమైన కావ్యం ఏది?" అన్న పాఠకుల ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం - "ఉదయశ్రీ నాహృదయం, విజయశ్రీ నాశిరస్సు, కరుణశ్రీ నా జీవితం." అని.

నాన్నగారి కవిత్వం ఎంత ఉత్తమమైనదో ఆయన వ్యక్తిత్వం అంత ఉన్నతమైనది. ఆరవతరగతి చదివే పిల్లవాడు అరసవిల్లి (శ్రీకాకుళం జిల్లా) నుంచీ ఒక కార్డు వ్రాశాడు - "నీ పద్యాలు నాకు చాలా ఇష్టం. మా అయ్యవారు చెపుతున్నారు. మా ఊళ్ళో నీవు వ్రాసిన పుస్తకాలు మాత్రం లేవు. " అని అందులోని విషయం. ఆ పిల్లవాడి ఉత్తరానికి స్పందించిన నాన్నగారు వెంటనే వాణ్ణి ఆశీర్వదిస్తూ

ఉత్తరం వ్రాసి "తెలుగుబాల" శతకం ప్రతిని కవర్లో పెట్టి పంపించారు. ఇది ఆయనకు పిల్లలపైన ఉన్న వాత్సల్యాన్నీ, నిరాడంబరత్వాన్నీ తెలియజేస్తుంది.

మా గుంటూరులోని వేంకటేశ్వర బాలకుటీర్ మంచి విద్యాలయంగా పేరుపొందింది. ఆ స్కూల్లో తొమ్మిదవ తరగతి చదివే శ్రీ కల్యాణి అనే అమ్మాయి "తొలిపొద్దు" అనే చిన్న గేయ సంపుటి వ్రాసి నాన్నగారి ఆశీస్సుల నర్థించింది. "ఆడపిల్లలే, చిన్నపిల్లలే, ఈ అమ్మాయి పుస్తకానికి నేను అభిప్రాయం వ్రాయాలా? " అని అనుకోకుండా నాన్నగారు ప్రోత్సాహ పూరితమైన అభిప్రాయం వ్రాసి ఇవ్వటమే కాకుండా, ఆ పుస్తకావిష్కరణ సభలో పాల్గొని ప్రసంగించటం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

అలాగే ఎక్కడో రాయలసీమ గ్రామాల్లో టీచరుగా పనిచేస్తున్న చంద్రశ్రీ అనే వర్ధమాన రచయితనూ, నెల్లూరు జిల్లా కవిటి గ్రామంలో ఏకోపాధ్యాయుడుగా పనిచేస్తున్న షేక్ మహబూబ్ బాషా అనే రచయితనూ వారి వారి రచనలు సరిదిద్ది ఆశీర్వదించిన ఉదాత్త మనస్వి ఆయన.

బ్రాడీపేటలో రిక్షాలో వస్తూ దారిలో ఒక దృశ్యం చూచారాయన. ఒక పూలతోట మధ్యలో సున్నపురాతి మేడ, మేడపైన ఒకే ఒక గది. ఆ గదిలో నుంచీ ఒక చంటి పిల్లాడిని ఎత్తుకుని క్రిందకు దిగుతున్న కన్నతల్లి. ఇంకేముంది "అది రమణీయ పుష్పవన; మావన మందొక మేడ; మేడపై నది యొక మారుమూల గది; ఆ గది తల్పులు తీసి మెల్లగా పదునయిదేండ్ల ఈడుగల బాలిక; పోలిక రాచపిల్ల; జంకొదవెడు కాళ్ళ తోడ దిగుచున్నది క్రిందకి మెట్లమీదుగన్" అన్న పద్యం ఆయన మనస్సులో నుండీ పెల్లుబికి వచ్చింది. అదే "కుంతీకుమారి" కవితా ఖండికలో మొట్టమొదటి పద్యంగా రూపొందింది.

ఒకసారి మా ఇంటికి (మేమెవ్వరమూ అప్పటికి పుట్టలేదు) ఒక మిత్రుడు వచ్చాడట. నాన్నగారు అతణ్ణి కూర్చోమని చెప్పి లోపలికి వెళ్ళారట కాఫీ తెద్దామని. ఆరోజుల్లో మా ఇంట్లో పెద్ద బుష్ రేడియో ఉండేది. దానిమీద రెండు గులాబీ పూవులు పెట్టి ఉన్నాయి. జంట గులాబీ అన్నమాట. నాన్నగారు రెండు కప్పులతో కాఫీ తీసుకుని వచ్చేటప్పటికి రేడియో మీది గులాబీలు రెండూ అదృశ్యమైనాయట. తొడిమలు మాత్రమే ఉన్నాయట. ఇటు చూస్తే వచ్చిన మిత్రుడు కసకసమని ఆ గులాబీ రేకుల్ని నెమరువేస్తున్నాడట. నాన్నగారు నిశ్చేష్టులైనారు. సుకుమారమైన అందాల గులాబీలను తొడిమలను మాత్రమే మిగిల్చి ఉన్నపళంగా అమాంతం కొరికి నమిలి తింటున్న ఆ మిత్రుడి చర్య పాశవికంగా ప్రవర్తించే, మనుషుల తత్వాన్ని ఆయనకు బోధపరచింది. సజ్జనులపై దుర్జనులు, బలహీనులపై బలవంతులు, అమాయకులపై అహంకారులు, అబలలపై కామాంధులు, దళితులపై అగ్రవర్ణులు, శ్రమ జీవులపై పెత్తందారులు చెలాయించే అధికారమదాన్ని దృష్టిలో పెట్టుకుని "పుష్పవిలాపం" పద్యాలు రచించారాయన. ఆ కవితాఖండిక "సరస సంగీత చక్రవర్తి" ఘంటసాల వారి కంఠంలో కమనీయంగా వెలువడి శ్రోతృ ప్రపంచాన్ని ఆనంద తన్మయుల్ని కావించింది. ఆ రోజుల్లో ప్రతి ఇంటా ప్రతి గంటా ఆ పద్యాలు గ్రామఫోను రికార్డుల ద్వారా మార్మ్రోగేవి. అవి ఎంతగా తమ ప్రభావాన్ని చూపాయంటే ఎందరెందరో స్త్రీలు పూలు పెట్టుకోవటం మానివేశారు. "మా పల్లెలో గోపాలుడు" "పోస్ట్‌మాన్" చిత్రాలలో ఆ పద్యాలను ఉపయోగించుకున్నారు. మొదటి చిత్రంలో అర్జున్, రెండవ చిత్రంలో మోహన్‌బాబు నాయకులుగా నటించారు. అంతే కాదు, "పుష్పవిలాపం" మార్గంలో "గోఘోష","వృక్షవిలాపం" "బ్లేడు విలాపం", "జంతు విలాపం" మొదలైన వెన్నో రచనలు వచ్చాయి. పుష్పవిలాపం పద్యాలు సంస్కృతంలోకి, హిందీలోకి, ఇంగ్లీషులోకి అనువదింపబడటం విశేషం.

ఒకసారి ఆంధ్ర క్రైస్తవ కళాశాలలోని స్పెషల్ తెలుగు బి.ఏ విద్యార్థినులు కొంతమంది ఇంటికి వచ్చారు. అప్పుడప్పుడు అలా వచ్చి తమకు వచ్చిన సందేహాలను అడిగి నివృత్తి చేసుకోవటం వారి అలవాటు. వచ్చిన అమ్మాయిలను కుర్చీలలో కూర్చుండమన్నారు నాన్నగారు. ఎండలో వచ్చారేమో! వారందరికీ చల్లని మంచినీరు కూడా అందించారు. వారి వారి సందేహాలను తెలుసుకుని తగిన సమాధానాలు చెప్పారు. అందరూ సంతృప్తి పడ్డారు. ఇంతలో ఒక అమ్మాయి తన కుర్చీ ముందుకు లాక్కుని "మాస్టారూ! మీ కవులు అన్నీ అబద్ధాలు

వ్రాస్తారండీ!" అన్నది. నాన్నగారు కొంచెం ఆశ్చర్యపడి "ఎందుకమ్మా! అలా అంటున్నావు? కవులు ఎప్పుడూ అబద్ధాలు వ్రాయరే!" అన్నారు. ఆ అమ్మాయి వెంటనే మీ ఇంట్లో కుర్చీలు లేవని వ్రాశారు కదా! మరి మీ ఇంట్లో ఇన్ని కుర్చీలు కనిపిస్తున్నాయి!" అన్నది జంకుగొంకులు లేకుండా. నాన్నగారు ఒక్క క్షణం ఆగి చిరునవ్వు నవ్వుతూ "అమ్మా! అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన ఆ భగవంతుడు నా ఇంటికి వస్తే ఆయనకూర్చోవటానికి తగిన కుర్చీలు లేవన్నాను కానీ ఆంధ్రక్రైస్తవ కళాశాల ఆడపిల్లలు వస్తే కూర్చోవటానికి కుర్చీలు లేవనలేదు పూర్తిగా ఆ పద్యం చదువు" అన్నారు. ఆ అమ్మాయి ఇలా చదివింది –

*కూర్చుండ మా ఇంట కుర్చీలు లేవు; నా*
*ప్రణయాంకమే సిద్ధపరచనుంటి;*
*పాద్యమ్మునిడ మాకు పన్నీరు లేదు; నా*
*కన్నీళ్ళతో కాళ్ళు కడుగనుంటి;*
*పూజకై మా వీట పుష్పాలు లేవు: నా*
*ప్రేమాంజలులె సమర్పింపనుంటి;*
*నైవేద్యమిడ మాకు నారికేళము లేదు;*
*హృదయమే చేతి కందీయనుంటి;*
*లోటు రానీయ నున్నంతలోన నీకు;*
*రమ్ము; దయచేయు మాత్మపీఠమ్ము పైకి*
*అమృతఝరి చిందు నీ పదాంకముల యందు*
*కోటి స్వర్గాలు మొలిపించుకొనుచు తండ్రి!*

ఇంక ఆ అమ్మాయి మారు మాట్లాడలేదు. సందేహం తీరిందిగా. ఇది నాన్న గారి సద్యఃస్ఫూర్తికి నిదర్శనం.

ఇంకొకసారి క్లాసులోనే ఒక కుర్రవాడు నాన్నగారు పోతనగారిని గురించి వ్రాసిన –

*ముద్దులుగార భాగవతమున్ రచియించుచు పంచదారలో*
*నద్దితివేమొ గంటము మహా కవి శేఖర! మధ్య మధ్య అ*
*ట్లద్దక వట్టి గంటమున నట్టిటు గీచిన తాటియాకులో*
*పద్దెములందు నీ మధురభావము లెక్కడ నుండి వచ్చురా!*

అనే పద్యాన్ని చదివి "సార్! ఇందులో మీకు తెలియకుండా ఒక పొరపాటు వచ్చిందండీ!" అన్నాడు. నాన్నగారికేమీ అర్థం కాలేదు "ఏమిట్రా బాబూ! ఆ పొరపాటు?" అని ప్రశ్నించారు. " ఏమండీ! గంటం నున్నగా ఉంటుంది కదా! పొడిగా ఉంటుంది కదా! మరి పంచదార గంటానికి ఎట్లా అతుక్కుంటుందండీ! అతుక్కుంటేనే కదా ఆ తీపి పోతనగారి పద్యాల్లోకి వచ్చేది!" అన్నాడు సాలోచనగా కుర్రవాడు. కొంచెం ఆలోచించిన నాన్నగారు "సరే! నీవు చెప్పినట్లు గంటం నున్నగా ఉన్నా పొడిగా ఉన్నా పంచదార అతుక్కోదు. ఒకవేళ గంటం తడిగా ఉంటేనో!" అన్నారు. కుర్రవాడు "అతుక్కుంటుందండీ!" అన్నాడు ఠక్కున. నాన్నగారు నవ్వుతూ "పోతన్న గారి గంటం తడిదేరా అబ్బాయ్" అన్నారు. "ఎలాగండీ!" అడిగాడు కుర్రవాడు."పద్యం సరిగా మరొకమాటు చదువు. "ముద్దులు గార భాగవతమున్ రచియించుచు" అని కదా! నేను వ్రాశాను. గంటం వెంట ముద్దులు కారిపోతున్నాయి, ఇప్పుడు చెప్పు. గంటం పొడిదా? తడిదా?" అన్నారు నాన్నగారు." తడిదేనండీ! ముద్దులు కారుతున్నాయిగా మరి" అన్నాడు కుర్రవాడు అమాయకంగా. "ఇంకేం తడిగంటం కాబట్టి పంచదార అతుక్కుంది. ఆ గంటంతో వ్రాయటం వల్ల ఆ తీపి పద్యాల్లోకి వచ్చేసింది అనుమానం పోయిందా?" అన్నారు నాన్నగారు.

మొక్కలకు పాదులు తీసి బావిలో నుంచీ నీళ్ళు తోడి పోయటమంటే నాన్నగారికి ఎంతో ఇష్టం. అలా చేయటంవల్ల ఆ మొక్కలన్నీ తమ కొమ్మలనే చేతులతో, రెమ్మలనే వ్రేళ్ళతో మనలను ఆప్యాయంగా స్పృశించి అభినందిస్తాయని మాకు ఆయన చెప్పేవారు.

ఆయన రచించిన "ఉదయశ్రీ" ప్రథమ భాగం 50 సార్లు ముద్రితమై స్వర్ణోత్సవం జరుపుకుంది. "విజయశ్రీ" "కరుణశ్రీ" కావ్యాలు 25 సార్లు ముద్రింపబడి రజతోత్సవం జరుపుకున్నాయి. ఈ మూడు పుస్తకాలను 1986 సంవత్సరములో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆనాటి ముఖ్యమంత్రి పద్మశ్రీ నందమూరి తారకరామారావు గారు ఒకే మాటు ఆవిష్కరించారు. భారతీయ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డిగారు సభాధ్యక్షులుగా వ్యవహరించారు.

ఇంతగా ప్రజాదరణ పొందిన నాన్నగారికి పద్మశ్రీ, పద్మ భూషణ్, కళాప్రపూర్ణ వంటి బిరుదులు రాలేదే అని నేను చింతిస్తుంటే "ఎందుకురా నాన్నా! బాధపడతావు. నా పద్యాలు మన రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రజలూ అభిమానంగా చదువుకుంటున్నారు. ఆంధ్రపాఠకులే నాకు పద్మశ్రీలు, తెలంగాణా పాఠకులే నాకు పద్మభూషణలు, రాయలసీమ పాఠకులే నాకు కళాప్రపూర్ణలు. ఇంతకంటే నాకింకేం కావాలి?" అనేవారాయన.

అమరావతిలో మ్యూజియంలో భద్రపరచబడిన అపురూపమైన బౌద్ధశిల్పాలు, మహాచైత్యం, ఆయక స్తంభాలు మొదలైనవి తిలకించినప్పుడు అంతరంగంలో అలలై సాగిన ఆలోచనా పరంపరలే కరుణరస ప్రధానమైన గౌతమ బుద్ధుని జీవితాన్ని తెలిపే కరుణశ్రీ కావ్యానికి ప్రాతిపదిక అయిందని ఆయన చెప్పేవారు. అమరావతి లోని రామకృష్ణ విద్యాపీఠంలో ఉపాధ్యాయుడిగా పని చేసిన నాలుగేళ్ళలో ఆయన రెండు సార్లు నటుడిగా వేదిక మీద పాల్గొన్నారు. ఒకసారి ఇద్దరు చెలికత్తెల మధ్య రాధగా అభినయించారు. మరొకసారి "చంద్రగుప్త" చరిత్రాత్మక నాటకంలో చంద్రగుప్తుడిగా నటించారు. తరువాత శతాధికంగా భువన విజయం మహాసభల్లో ముక్కు తిమ్మన కవీంద్రుడిగా పాల్గొన్నా వేషం మాత్రం వేసుకోలేదు. అలాగే "ఇంద్ర సభ" సాహితీరూపకంలో అడివి బాపిరాజుగా, "నవరస తరంగిణి" సాహితీరూపకంలో కరుణ రస ప్రతినిధిగా, "సాహిత్య ధర్మాసనం" రూపకంలో బమ్మెర పోతన్నగా సహృదయులను ఆకట్టుకున్నారు.

ఆంధ్రా యూనివర్శిటీలో భువన విజయ మహా సభలో ముక్కు తిమ్మనగా పాల్గొన్నప్పుడు ఆయనకు –

"నీవును నీవునున్ మరియు నీవును నీవును నీవు నీవునున్" అని సమస్య ఇచ్చారు. అప్పటి కప్పుడు ఆ సమస్యను ఆయన ఇలా పూరించారు.

*"నీవు గజాస్య చంకదిగనీయవు, నన్నసలెత్తుకోవు; నీ*
*కా వెనకయ్య ముద్దుకొడుకయ్యెను లె"మ్మని ఏడ్చు షణ్ముఖున్*
*దేవి భవాని కౌగిట గదించి మొగమ్ములు ముద్దు గొంచనెన్*
*"నీవును నీవునున్ మరి యు నీవును నీవును నీవు నీవునున్."*

ఎంత మనోహరమైన భావన! తనను ఎత్తుకోకుండా బాలవినాయకుణ్ణే ఎక్కువగా ఎత్తుకుంటున్నదన్న ఉక్రోషంతో కుమార స్వామి పార్వతీ దేవితో పైవిధంగా పలికాడట. అలా పలికి ఏడుస్తున్న ఆరుముఖాలు గల బాలకుమారుణ్ణి ఎత్తుకుని ఒక్కొక్క ముఖం మీద ముద్దు పెట్టుకుంటూ పార్వతీ దేవి "వాడే కాదు నీవు కూడా" అంటూ ఆరుసార్లు అన్నదట. అసలు సమస్యలో ఆరు నీవులు ఉన్నాయి, ఇక్కడ కుమారస్వామికి ఆరుముఖాలు ఉన్నాయి. ఆయన్ని "షణ్ముఖున్" అని సార్థకమైన నామంతో పేర్కొనటం నాన్నగారి ప్రతిభకు తార్కాణం. ఔచిత్యవంతమైన పూరణ.

తనకు అత్యంత ప్రీతి పాత్రుడైన గాంధీ మహాత్ముడి చేతి మీదుగా "రాష్ట్రభాషా విశారద" సర్టిఫికెట్ తీసుకోవటం, దేవదాసు పాటలు, పుష్పవిలాపం పద్యాలు కలిపి అచ్చువేసిన పుస్తకాన్ని ఒక వ్యాపారి తనకే అమ్మబోవటం, ఢిల్లీలో రిపబ్లిక్ దినోత్సవంనాడు అఖిలభారత కవిసమ్మేళనంలో తెలుగు కవితా ప్రతినిధిగా పాల్గొనటం, తన పద్యాలను ప్రశాంతినిలయంలో భగవాన్ సత్యసాయిబాబా

చదివినప్పుడు పరవశించడం, విజయవాడలో కనకాభిషేక సువర్ణఘంటా కంకణ సత్కారాలను అందుకోవటం, రాష్ట్రపతి జ్ఞానిజైల్ సింగ్ నుండి పురస్కారాన్ని గ్రహించటం, విశ్వయోగి విశ్వంజీ ఆలింగనంలో ఆనందించటం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో తనను గురించి పరిశోధన చేసి పి.హెచ్.డి పట్టం అందుకున్న డి.ఎస్.వి సుబ్రహ్మణ్యంగారిని అభినందించటం, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి గౌరవ డి.లిట్ పట్టాని అందుకోవటం నాన్నగారి జీవితంలో స్మరణీయమైన కొన్ని సన్నివేశాలు.

జీవించినంత కాలం కవిత్వం వ్రాసి, కవిత్వం వ్రాసినంతకాలమే జీవించిన మహాకవి ఆయన. తన కవిత్వాన్ని ప్రజల నాల్కలపై నాట్యం చేయించిన ప్రజా హృదయాస్థానకవి ఆయన.



కరుణశ్రీ గారి ప్రథమ పుత్రులైన జయకృష్ణ బాపూజీ గారు 5.5.1948 న అమరావతిలో జన్మించారు. కవిత్వం, పరిశోధనం అభిరుచులుగా ఎదిగిన వీరు ప్రొఫెసర్ ఎస్వీ. జోగారావు గారి శిష్యులు. వీరి రచనలలో ముఖ్యమైనవి శ్రీనాథుని సాహిత్య ప్రస్థానం(సిద్ధాంత గ్రంథం), మానిక్ బందోపాధ్యాయ(కేంద్ర సాహిత్య ఎకాడమీ ప్రచురణ), దైవం మానుష రూపేణ(అనువాదం), విశ్వతారావళి, సుమాంజలి(నూరు కవితలు), నృత్యాంజలి(ఇరవై నృత్యరూపకాలు), ఎనభై సాహిత్య వ్యాసాలు.

వీరు గుంటూరు పి.జి.సెంటర్ నుంచీ మొదటి బాచ్ లో ఎం.ఎ పట్టా అందుకున్నారు. అలానే అక్కడ (1969-72) మొదటి డాక్టరేట్ తీసుకున్నది కూడా వీరే. 1992 లో ఆదర్శ అధ్యాపక పురస్కారం అందుకున్నారు. అనేక సాహితీ సంస్థలచే సన్మానాలందుకున్న బాపూజీ గారు గుంటూరు హిందూ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ గా రిటైరయ్యారు.

# జయదేవ్

ప్రముఖ కార్టూనిస్ట్ జయదేవ్ గారి కార్టూన్లతో పరిచయం లేని తెలుగు వారు చాలా అరుదు. ముఖ్యంగా స్వాతి సపరివారపత్రిక చదివే వారికి జయదేవ్‌గారి నవ్వించే కారెక్టర్లూ, వారి ఇంగ్లీషు సంతకమూ చిరపరిచితమే.. 33 సంవత్సరాల పాటు జూవాలజీ లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డా.జయదేవ్ బాబు గారు, పదవీవిరమణ అనంతరం హైదరాబాదులోని హార్ట్‌యేనిమేషన్ స్టూడియో ప్రిన్సిపాల్‌గా, 'కలర్ చిప్స్' కంపెనీలో యేనిమేషన్ డైరెక్టర్‌గా పనిచేసి అనేకమంది వర్ధమాన చిత్రకారులకి యేనిమేషన్‌లో మెళకువలు నేర్పారు. కొన్ని సినిమాలకి పబ్లిసిటీ విభాగంలో కూడా పనిచేసిన జయదేవ్ గారి, చిన్ననాటి జ్ఞాపకాలు, అంతరంగ తరంగాలు ఈ నెల 'కౌముది' పాఠకులకోసం ప్రత్యేకం..!





పూనూరులో అక్షరాభ్యాసం చేయించిన మా గురువుగారి పేరు గుర్తులేదుగానీ, ఆయనగారి ఆకారం నా మస్తిష్కంలో చెరగలేదు. బక్కమనిషి, పొడుగూ కాదు, పొట్టీకాదు. తెల్లటిగడ్డం. పెద్దపిలక. మా ఇంటి వెనక పొలం. ఆ పొలం దాటితే గురువుగారిల్లు. సగం పెంకులు, సగం పాక.. ఇంటిముందు గుమ్మడి పాదు, అరుగుమీద జింక చర్మం మీద కూచుని భుజం మీద కండువాతో మోచేతిని తుడుచుకుంటూ కనిపించేవారు. ఆయనగారి మొహంలో చిరునవ్వు చూసెరగను. సాయంత్రం పూట మా జవాను చెయ్యి పట్టుకుని గురువుగారింటికి వెళ్ళేవాడిని. చీకటి పడ్డాక జవాను లాంతరు పట్టుకుని వచ్చేవాడు. ఆలోగా పెద్దబాలశిక్ష సగం చదివేసేవాడిని. గురువుగారికి నమస్కారం పెట్టి బయల్దేరేవాడిని. దారిలో, లాంతరు వెలుతురులో కాలినడక, కాళ్ళనీడల కదలికలు నాకెంతో సరదాగా ఉండేవి. వర్షాకాలంలో మా జవాను నన్నెత్తుకుని నడిచేవాడు. నా పలక పుస్తకాలని నడుము చుట్టూదోపుకుని, నన్నో చేతిలో ఎత్తుకుని, మరోచేత గొడుగుపట్టుకుని మా ఇంటికీ, మా గురువుగారింటికీ ఎన్ని నడకలు నడిచాడో చెప్పలేను. ఒకటి, రెండు, మూడవ తరగతుల విద్య పూనూరులో సాగిపోయింది. మా గురువుగారు, నా నోటు పుస్తకంలో పెన్సిలుతో, రూళ్ళకర్రతో నాలుగు గీతలు గీసి, వాటి మీద వాక్యాలు రాసే పద్ధతి నేర్పించారు. తలకట్టు, అక్షరం, ఒత్తులు, ఒకేవరసలో ఏ విధంగా, గీత దాటకుండా జాగ్రత్తపడాలో తర్వాత చెప్పేవారు. నాచేతివ్రాతకి ఆ పద్ధతి

ఎంతగా తోడ్పడిందో నాకు స్కూల్లో, కాలేజీలో అర్థమైంది. తక్కినవాళ్ళకన్నా నాకు ఒకటి రెండు మార్కులు ఎక్కువ వచ్చేలా చేసిన మా గురువుగార్ని మరిచిపోవాలంటే కష్టమే.

నాలుగోతరగతి మద్రాసు పాతచాకలిపేట త్యాగరాయ స్కూలులో చేరాను. మా నాన్నగారికి ట్రాన్స్‌ఫర్లు, క్యాంపులు ఎక్కువ ఉండేవి. మా తాతగారింట్లో, మా నాయనమ్మ, మా అత్త, మా బాబాయిగార్లతో నా చదువుకు ఒక కొత్త మలుపు లభించింది. మా స్కూలు హెడ్‌మాస్టరుగారి పేరు రంగస్వామి అయంగారు. తెల్లటి తలపాగా, కోటూ బూటుతో, గంభీరంగా కనిపించారు. భయమేసింది. నన్ను స్కూల్లో చేర్పడానికి వచ్చిన మా పెద్ద మావయ్యగారి చేతిని గట్టిగా పట్టుకున్నాను. హెడ్‌మాస్టరుగారి ఆఫీసురూములోకి (ఇదే రూము ప్రస్తుతం సర్‌త్యాగరాయి కాలేజీ సూపర్నెంటుగారి రూముగా మారింది) అడుగు పెట్టాను. హెడ్‌మాస్టరుగారు తమ పని ముగించి రూములోకి ప్రవేశించారు "కూర్చో వెంకటరామయ్యా! కుర్రాడెవడు?" అని తమిళంలో అడిగారు. "మా చెల్లెలి మొదటి పిల్లాడు. నాలుగో తరగతిలో చేర్పించడానికి తీసుకొచ్చాను" సమాధానంతో పాటు తమకోరిక కూడా తెలియజేశారు మా మావయ్యగారు. హెడ్‌మాస్టరుగారు జాలిగా చూశారు. "కుర్రాడు వేలెడెంతున్నాడు. నాలుగో తరగతే?" హెడ్‌మాస్టరుగారు నా భుజం పట్టి తమ కుర్చీవైపుకి లాక్కున్నారు. "ఏరా - నీ పుట్టినతేదీ చెప్పు" అని అడిగారు. నేను తడుముకోకుండా "సెప్టెంబరు పదమూడు పందొమ్మిదివందల నలభై" అన్నాను. అది మా అమ్మగారు, నవనీతమ్మ, నాకు చెప్పిన నా పుట్టిన తేది. "కాదురా బాబూ, అక్టోబరు తొమ్మిది పందొమ్మిదివందల నలభై! నువ్వు పుట్టింది కడపలో. నీకిపుడు ఎనిమిదేళ్ళు" అన్నారు మావయ్యగారు. ఆయనగారి మాటకి అడ్డుపలకలేదు. 9-10-1940 నా పుట్టిన తేదీగా రికార్డుపుస్తకాల్లో నమోదయింది.

నాలుగూ, ఐదూ తరగతులు అలా చూస్తూండగానే దొర్లిపోయాయి. మధ్యలో శలవుల్లో మా తండ్రిగారు నన్ను తమ ఊరుకు తీసుకువెళ్ళేవారు. ప్రతి రైలు ప్రయాణం, ఇంజను పొగ, నిప్పురవ్వలు, వంతెన శబ్దాలు, నాకు చాలావింతగా ఉండేవి. ఉప్పుగుండూరు,



వినుకొండ, ఇనకొల్లు - ఊళ్ళలో మా తండ్రిగారు ఉద్యోగం చేశారు. నేను ఊరికి వెళ్ళినపుడల్లా నాకు మా నాన్నగారు, నా వెనుక పుట్టినవాళ్ళని పరిచయం చేసేవారు. వినుకొండలో నా ఇద్దరు తమ్ముళ్ళతో ఆడుకునేవాడిని. నాన్నగారి సైకిలు తొక్కడం నేర్చుకున్నదక్కడే. సీటు మీద కూర్చుంటే కాళ్ళు, సైకిలు పెడలుకందేవి కావు. అంచేత సైకిలు ఫ్రేముకి మధ్య పెడలు మీద కాళ్ళుపెట్టి తొక్కేవాడిని. రెండో తమ్ముడ్ని ముందు, మూడోవాడ్ని వెనక ఎక్కించి సైకిలు తొక్కి, రోడ్డుప్రక్కన కాలువలో పడినప్పుడు మా నాన్నగారి కోపం ఎలాంటిదో మొదటిసారి చవిచూశాను.

వినుకొండలోని కొండ పెద్ద రాతి బండ. ఆ బండ రెండు భాగాలుగా పగిలి ఉంటుంది. ఒక భాగంలో పొడుగాటి గునపం నాటుకు పోయి కనిపిస్తుంది. జటాయు రెక్కలు ఖండించబడి, అవి అక్కడ పడి పెద్ద రాతి బండలగా మారిపోయాయట. రావణాసురుడి ఖడ్గం విరిగి ఒక రెక్కలో నాటుకుపోయి, అది గునపంగా మారిపోయిందట. సీతాన్వేషణలో రామలక్ష్మణులు నేలమీద పడి ఉన్న జటాయు పక్షిని చూసినదిక్కడేనట. జటాయుపక్షి, రావణాసురుడు సీతాపహరణం చేసిన వృత్తాంతాన్ని రామలక్ష్మణులకు వివరించిందట. సీత అపహరించబడిన విషయం, ఇక్కడ రాముడు విన్నాడు గనక అది విన్నకొండగా ప్రసిద్ధిగాంచిందని మా అమ్మగారు చెప్పిన కథ (ఆ నోటా ఈ నోటా విన్న కథ) ఇప్పటికీ వినుకొండలోని జనం, తమ ఊళ్ళో దిగినవాళ్ళకి భక్తిపూర్వకంగా చెబుతుంటారు.

నేను ఆరవతరగతి ప్రవేశించే సమయానికి మా తండ్రిగారికి ప్రమోషను మీద బాపట్లకి ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చింది. మద్రాసుకు మా నాన్నగారు టెలిగ్రామిచ్చారు. నన్ను వెంటనే బాపట్లకు తీసుకురావలసిందిగా మా నాయనమ్మ, మా అత్తయ్య, మాబాబాయి, మాపిన్నమ్మ (అప్పటికి మా బాబాయిగారికి పెళ్ళయిపోయింది. మా పిన్నమ్మ - పుణ్యవతమ్మగారి ఊరు, ఉరవకొండ. గుంతకల్లు

స్టేషనులో దిగి బస్సులో రెండుగంటలు ప్రయాణం చేయాలి. మా పిన్నమ్మ నన్ను తన సొంత కొడుకులాగా చూసుకునేది.) బాపట్లకి బయలుదేరాము. బాపట్ల బోర్డు హైస్కూలులో ఆరు, ఏడు తరగతులు చదివాను. ఆ స్కూల్లో నేను చక్కటి తెలుగు నేర్చుకోగలిగాను, తెలుగు భాష ప్రభావమేమిటో అక్కడే నా కర్థమైంది. బాపట్లలోని అగ్రికల్చరల్ కాలేజీ ఆవరణలోకి ప్రతి శనివారం సాయంత్రం షికారుకి వెళ్ళేవాళ్ళం. ఒక పచ్చటి జువలాజికల్ గార్డన్‌లో తిరిగే అనుభూతి కలిగేది. నాగేశ్వరరావు, అంజలీదేవిల కీలుగుర్రం సినిమా చూసింది బాపట్లలోనే, బాపట్ల బోర్డు హైస్కూలు శతవార్షికోత్సవం జరిగినప్పుడు నాకు ఆహ్వాన పత్రిక వచ్చింది. 1980 చివరిలోనో 1990 ప్రారంభంలోనో గుర్తులేదు. బాపట్లకి, మిత్రుడు కోటేశ్వరరావు (ఇప్పుడు, కుముదం తమిళ పత్రికలోని తెలుగు "భక్తి" పత్రిక ఎడిటరు)తో వెళ్ళాను. కోటేశ్వరావింట్లో బసచేసి, మా స్కూలు శతవార్షికోత్సవంలో పాల్గొన్నాను. నేను ఏడవతరగతి చదివిన బిల్డింగు చెక్కుచెదరకుండా అలాగే ఉంది. పాతజ్ఞాపకాలు బుర్ర నిండా మెదిలాయి. పక్కనే ఉన్న నేరేడు చెట్టు, మరి కొంతదూరంలో ఆంజనేయ స్వామి గుడి. ఆ గుడి ఆవరణలో చెట్టెక్కి కోతికొమ్మచ్చులాడుకుంటుండగా జారిపడి, చేయి విరగడం, ఆ రాత్రికి రాత్రి ఒంగోలుకు పాసింజెరులో వెళ్ళి, అక్కడి నుంచీ హౌరామెయిలెక్కి మద్రాసు చేరుకుని పుత్తూరు డాక్టర్ను కలిసి పుత్తూరు కట్టు కట్టుకున్నప్పుడు కలిగిన విపరీతమైన నొప్పి - అన్నీ ఒక్కసారి కళ్ళముందు కనిపించాయి.



జయదేవ్ గారు స్వయంగా చిత్రించుకున్న కారికేచర్

బాపట్లలో ఏడవతరగతి పూర్తికాగానే మా నాన్నగారికి ట్రాన్స్‌ఫరయింది. నేను మరలా మద్రాసుకు వచ్చేశాను. త్యాగరాయ స్కూల్లో ఎనిమిదవ తరగతిలో చేరాను. తెలుగులో ఫస్టుమార్కులొచ్చాయి."పలికెడి గుహ" అనే గేయకథ "బాలమిత్రలో" పడింది. ఎంతగా సంతోషించానో చెప్పలేను. తర్వాత "అరాన్నెడ" అనే ఒక పేజీ కథ అదే బాలమిత్రలో ప్రచురించబడింది. నా పేరు అచ్చులో చూసుకుని మురిసిపోయాను. మా సైన్సు మాష్టారు హరిశ్చంద్రరావుగారు నన్ను ప్రత్యేకంగా అభిమానించేవారు. మా క్లాసుపిల్లలు మద్రాసు తెలుగు మాట్లాడితే నేను కోస్తా తెలుగు మాట్లాడేవాడిని. హరిశ్చంద్రరావుగారికి నామీద ముచ్చటోసేది. "ఎడ్లబండి కొయ్య చక్రానికి బిగించే ఇనుప చట్రాన్ని కొలిమిలో ఎందుకు కాలుస్తారు?" అనే ప్రశ్నకి రెండింటి పరిధిలు సమానంగా చేయడానికని నేను పలికిన సమాధానానికి మాష్టారుగారు, సీటు నుంచీ లేచి వచ్చి నన్ను కౌగిలించుకున్నారు. ముప్ఫైయేళ్ళ తర్వాత ఆయనగారిని హోసూరు (బెంగుళూరుకు సమీపం) లో కలిసినపుడు, వారి పాదాలకి నమస్కారం చేసుకున్నప్పుడు, నన్ను నేను పరిచయం చేసుకున్నప్పుడు, వారికి క్లాసులో జరిగిన సంఘటన గుర్తు చేసినప్పుడు నేను పొందిన అనుభూతి వర్ణనాతీతం. నేను తొమ్మిదవ తరగతికి మారేసరికి, హరిశ్చంద్రరావుగారు అనకాపల్లికి వెళ్ళిపోయారట, తొమ్మిదవ తరగతికి మమ్మల్ని "సర్‌త్యాగరాయ కాలేజ్‌స్కూలు" కొత్తచోటుకి మార్చారు. మా పాత త్యాగరాయ స్కూలు (నేను, నాలుగు, ఐదు, ఎనిమిదవ తరగతులు చదివిన స్కూలు) "సర్‌త్యాగరాయ కాలేజీ"గా మారింది 1953లో.


నేను తొమ్మిదవ తరగతిలో అడుగుపెట్టింది 1953లోనే. స్కూలు స్థలం మార్చారు గనక, హరిశ్చంద్రరావుగారి గురించి మరిచిపోయాను. 1986లో వారిని కలిసే భాగ్యం లభించగా నేను పొందిన అనుభూతి వర్ణనాతీతం.

పాతచాకలిపేట (మద్రాసులో మా నివాసస్థలం, మాస్కూలు ఉన్న చోటు)కి ఆరువందల సంవత్సరాల చరిత్ర ఉంది. మద్రాసులోని చాలా మంది తెలుగువాళ్ళు స్థిరపడిన స్థలం అది. చేనేత వ్యాపారస్థుల కేంద్రం చీరాల, వేటపాలెం నుండీ వ్యాపారస్థులు,

పాతచాకలిపేటలో, నూలుకొనుక్కుని వెళ్ళేవారు. ఆ పేటలో త్యాగరాయశెట్టిగారిది చాలా పెద్ద పేరు. త్యాగరాయసోదరులు, సీనియర్ త్యాగరాయశెట్టి, సర్‌త్యాగరాయశెట్టి జూనియర్‌లు కోటీశ్వరులు. సర్ త్యాగరాయశెట్టిగారు మద్రాసు మహానగరానికి మొట్టమొదటి మేయరుగా నియమించబడిన వ్యక్తి. మద్రాసు కార్పోరేషను రిపన్ బిల్డింగ్ ఎదుట ఆయన శిలకి ప్రతిఏటా ఏప్రిల్ 27న (ఆయన జయంతి సందర్భంగా) తమిళనాడు ప్రభుత్వం దండలు వేసి తమ గౌరవ మర్యాదలను ప్రదర్శిస్తుంది.

సీనియర్ త్యాగరాయశెట్టిగారు తమ ఆస్తినంతా ఒక విద్యాసంస్థ నెలకొల్పి దానిపేరట ధారపోశారు. త్యాగరాయ ఎలిమెంటరీ స్కూలు, సర్‌త్యాగరాయ కాలేజీ హైయిర్ సెకండరీ స్కూలు, సర్‌త్యాగరాయి కాలేజీ (అన్నీ పాత చాకలి పేటలోనే ఉన్నాయి), త్యాగరాయ విద్యాసంస్థకి చెందినవి.

పాత చాకలిపేటకి మరో ప్రాశస్త్యం ఉంది. సంగీత కళాసరస్వతి త్యాగయ్య, ఆ పేట మార్గంగా, పక్కనే ఉన్న తిరువొత్తీశ్వరుని దర్శించడానికి వచ్చారట. తిరువొత్తీశ్వరుడి కోవెల, తిరువొత్తియూరులో ఉంది. పాతచాకలి పేటకి మూడు కిలోమీటర్ల దూరంలో, అక్కడ కుప్పయ్యశెట్టిగారింట్లో త్యాగయ్య బసచేసారట, త్యాగయ్య తాము సాగించిన ప్రయాణంలో దారిపొడుగంతా గానకచేరీలు చేశారట. పాతచాకలిపేటలో త్యాగయ్య ప్రభావం చాలాఉంది. చాలామందికి ఆయనగారిపేరే, త్యాగు, త్యాగరాయుడు, త్యాగరాజన్ అనే పేర్లు లక్షల సంఖ్యలో ఉంటాయి. తిరువయ్యారులో ప్రతిఏటా వైభవోపేతంగా జరిగే త్యాగరాజు ఆరాధనలో తమిళ సంగీత విద్వాంసులు తొంభైతొమ్మిది శాతం పాల్గొనడం విశేషం. త్యాగయ్య తెలుగు సాహిత్యం తమిళనాడుకే అంతగా ఎందుకు పరిమితమైందో నాకింతవరకూ అంతుపట్టలేదు.




త్యాగరాయస్కూలులో తొమ్మిదవ తరగతి చదువుతుండగా మా ఇంగ్లీషు మాష్టారు రామయ్యగారు క్లాస్ మ్యాగ్‌జైన్ "టాయ్‌హార్స్" మా చేత వ్రాయించి తయారు చేశారు. వర్డ్స్‌వర్త్ ఫిడెలిటీ పద్యాలకి నేను ఆ మ్యాగజైనులో బొమ్మగీశాను. ఇదే నా మొదటి బొమ్మ.

"It was a cove, a huge recess..." అని మొదలవుతుంది. ఆ పద్యాలకి చిత్రకల్పన చేసినందుకు మా రామయ్య మాస్టారుగారే కాదు, పక్కన "ఏ" సెక్షను (నేను "బీ" సెక్షను) క్లాసుటీచర్ నరసింహారావుగారు కూడా నన్ను మెచ్చుకున్నారు. పదవతరగతి పూర్తయే సరికి నాకు పదిహేను సంవత్సరాల వయసు. నేనూ, నాకన్నా ఒక ఏడాది పెద్ద రామమూర్తి, మోహన్‌కృష్ణ, పురుషోత్తం, నలుగురం 1955లో స్కూలు విడిచి కాలేజీలో ప్రవేశించాం. రామమూర్తి ఇంజినీరింగుకు వెళ్ళి పోగా, మిగతా ముగ్గురం సర్‌త్యాగరాయకాలేజీలో బయాలజీ గ్రూపులో ఇంటర్‌మీడియట్ చేశాం. మేం నలుగురం ఇప్పటికీ చెన్నైలో కలుస్తుంటాం. అందరం 67 దాటి 70 వేపు పయనిస్తున్నాం.

1957లో ఇంటరు పూర్తిచేసి, మెడిసిన్ ట్రైచేశాను. సీటు దొరకలేదు. అదే కాలేజీలో B.Sc డిగ్రీ పూర్తిచేశాను. M.Sc పచ్చయ్యప్పాస్ కాలేజీలో 1960లో చేరాను. 1959లో మా తండ్రిగారు ముత్యాలు, విజయవాడలో సెంట్రల్ ఎక్సయిజు డిప్యూటీ సూపర్నెంటుగా ఉద్యోగం చేస్తూ, తమ నలభైవ ఏట పరమపదించారు. జీవితంలో నాకు చాలా పెద్ద దెబ్బ తగిలింది. నేను ఇంటికి పెద్దవాడిని. నావెనుక నలుగురు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ళు. మా బాబాయి, పిన్నమ్మలు మాకు అండగా నిలిచారు. నన్ను M.Sc చెయ్యమని ప్రోత్సహించారు.

1959లో, ఆంధ్ర సచిత్రవారపత్రికలో, కార్టూన్లను ప్రవేశపెట్టారు. అప్పుడే సారధ్యం వహించిన శివలెంక రాధాకృష్ణగారు, ఇండియన్ ఇంకుతో కార్టూన్లు ఎలా వేయాలో పత్రికలో బాపుగారిచేత బొమ్మగీయించి వివరించారు. ఇండియన్ ఇంకుతో డ్రాయింగు పేపరు మీద బొమ్మ గీయడం నాకు అప్పటికే తెలుసు. ఆ విద్య నేర్పింది మా బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మదనమోహన్‌రావుగారు. నేను ఇంటర్ చదువుతున్న రోజుల్లో నా బయాలజీ రికార్డులోని బొమ్మల్ని చూసి మెచ్చుకుని, పెన్సిలు బొమ్మని ఇంకింగ్ ఎలా చెయ్యాలో చెప్పి, నా చేత ఎగ్జిబిషన్ చార్టులు గీయించారు. ఆ శిక్షణ నా కార్టూను ప్రయత్నానికి ఉపయోగపడింది. "పోలీసు - దొంగ" కార్టూను గీసి ఆంధ్రసచిత్రవారపత్రికకు పంపించాను. రెండువారాల తరువాత ఆ కార్టూన్ను పత్రికలో చూసి ఎగిరి గంతేశాను. మరో రెండు వారాల తరువాత నాకు ఐదురూపాయల మనియార్డరు వచ్చింది. నా సంతోషాన్ని వర్ణించలేని స్థాయిలో చూశాను. వెంటనే బాపూగారి బొమ్మల్ని పరిశీలించసాగాను. ఆ బొమ్మల్లోని, తలలూ, చేతులూ, కాళ్ళు అతికించి కొత్తబొమ్మల్ని సృష్టించి కార్టూన్లు గీయడం ప్రారంభించాను. పంపించిన కార్టూనులన్నీ పత్రికలో అచ్చవ్వడం, నాకు పారితోషకం మనియార్డర్లు రావడం, నన్నూ, మా తల్లిగారినీ, మా తమ్ముళ్ళు, చెల్లెళ్ళని సంతోషంతో ముంచివేయసాగాయి. తెలుగులో జయదేవ్ అనే సంతకాన్ని, ఇంగ్లీషులో పెట్టడం ప్రారంభించాను. శివలెంక రాధాకృష్ణగారు నాకు ఉత్తరం రాశారు. ఆంధ్రసచిత్ర వారపత్రిక ఆఫీసుకు వెళ్ళాను. ఐదునిమిషాలు మాట్లాడతానని ప్రారంభించిన రాధాకృష్ణగారు గంటసేపు నన్ను వారి ముందు కూర్చోబెట్టారు. నేను ఎం.ఎస్సీ చదువుతుండటం, నాకుటుంబ నేపథ్యం అర్థం చేసుకుని, నాకు నెలకి 50 రూపాయల పారితోషకం లభించే కార్టూన్లు గీసే పని అప్పజెప్పారు. టిన్‌టిన్ పుస్తకాలని మా ఇంటికి పంపించారు. నా ఎమ్.ఎస్సీ చదువు ఇబ్బందిలేకుండా సాగిపోయింది. పచ్చయప్పాస్ కాలేజీలో జువాలజీలో ఫస్టుక్లాసు తెచ్చుకున్న మొదటి విద్యార్థిని నేనే. ఎం.ఎస్సీ పాసవగానే మా ప్రొఫెసరు మదనమోహనరావుగారు, సర్‌త్యాగరాయ కాలేజీలో డెమాన్స్ట్రేటర్ ఉద్యోగంలో చేరమన్నారు. అప్లికేషను ఆయనే స్వయంగా రాసి, నన్ను సంతకం చెయ్యమన్నారు. మరోగంటలో నాకు అపాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చింది. కాకతాళీయంగా అదే రోజున మా రెండో తమ్ముడు సెంట్రల్ ఎక్సైజు డిపార్టుమెంటులో సబ్‌ఇన్స్‌పెక్టరుగా చేరాడు. అది మా తండ్రిగారి చలవ.


అర్ధాంగి రాజ్యలక్ష్మిగారితో

మా కుటుంబంలో కష్టాలు గట్టెక్కే పరిస్థితి కనబడింది. మా బాబాయి పిన్నమ్మలు ఊపిరి పీల్చుకోగలిగారు. మాకు మధ్యలో ఆర్థికసాయం చేసిన శ్రీరాములుగారు (వారిని ప్రేమగా బాబాయ్ అని పిలుస్తాను) నన్ను మరింతగా అభినందించారు. వెరీగుడ్ అన్నారు.

1964లో నాకు వివాహం జరిగింది. మా ప్రొఫెసర్ డా.మదనమోహన్‌రావుగారు, మా కాలేజీ సెక్రటరీ కరస్పాండెంటుగారమ్మాయి రాజ్యలక్ష్మితో నా వివాహం జరిపించారు. అప్పుడే ఉద్యోగంలో చేరిన నాకు పెళ్ళి గురించి ఆలోచించకముందే, మా ఇంట నా శ్రీమతి అడుగుపెట్టింది. పెద్దింటి అమ్మాయి, ఇంత పెద్ద సంసారాన్ని ఎలా భరిస్తుందో అని భయపడ్డాను. ఆమే నాకు ధైర్యం చెప్పింది. ఆ ధైర్యంలో మా మూడో తమ్ముడ్ని ఇంజినీరింగూ, నాలుగోవాడిని మెడిసిన్ చదివించాము. ఇద్దరు చెల్లెళ్ళకీ పెళ్ళిళ్ళు (మూడో చెల్లి అనారోగ్యంతో కన్ను మూసింది) అందరం కలిసి చేశాము. పదిహేనో నంబరు బుద్ధశెట్టి వీధిలో ఎప్పుడూ నిత్య కళ్యాణం పచ్చ తోరణాలే, మా బాబాయిగారూ, మా నాయనమ్మా స్వర్గస్థులైన తరువాత ఇంట్లో వెలితి కనిపించింది. ఐతే మాకు బోల్డంత మంది పిల్లలు. నాకు నలుగురు పాపలు. మా రెండోవాడికి ముగ్గురు పాపలు, ఒక బాబు. నాలుగోవాడికి ముగ్గురు పాపలు, ఒక బాబు. మూడోవాడికి ఒక బాబు ఒక పాప. ఐదో వాడికి ఇద్దరు బాబులు. ఇల్లంతా పిల్లల సందడి.

ఆ సందడిలో నా కాలేజీ లెక్చెరర్ జీవితం ముందుకు సాగిపోయింది. 1965లో నాకు CSIR రిసెర్చి ఫెలోషిప్ వచ్చింది. మద్రాసు క్రిష్టియను కాలేజీకి వెళ్ళాను. డా.సంజీవరాజుగారు (నంద్యాల వాస్తవ్యులు) నా గైడ్ పులికాట్ సరస్సులోని చేపలకు చెందిన మత్స్యపరాన్న భుక్కుల మీద నా రీసెర్చి 1968 దాకా సాగింది. థీసిస్ రాయడానికి మరో ఏడు సంవత్సరాలు పట్టింది. 1976 లో నాకు డాక్టరేట్ డిగ్రీ వచ్చింది. సర్‌త్యాగరాయ కాలేజీలో మా ప్రొఫెసరు డా. మదనమోహనరావుగారి తర్వాత, డాక్టరేటు డిగ్రీపొందిన లెక్చరరు నేనే. అందరూ నన్నెంతో గౌరవించేవారు. మా కాలేజీలో తెలుగు డిపార్టుమెంటు లెక్చెరర్ గోపాలన్ నన్ను చాలా అభిమానంచేవాడు. బాబాయ్ అని ప్రేమగా పిలిచేవాడు. కాలేజీలో మా ఇద్దరికీ అబ్బాయ్ బాబాయ్‌లనే పేరు స్థిరపడింది. అదే పేరు శీర్షిక (కార్టూన్ స్ట్రిప్) ఆంధ్రజ్యోతిలో నాకు చాలా పెద్ద పేరు తెచ్చిపెట్టింది. పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు నాకు ప్రత్యేకంగా ఉత్తరాలు రాసి ప్రోత్సాహించారు. జ్యోతి మాసపత్రిక ఎడిటరు వేమూరి సత్యనారాయణగారు తరచూ మాఇంటికి వచ్చి జ్యోతిలో కార్టూనులు గీయించారు. కనకాంబరరాజుగారు వచ్చారు. ఆంధ్రభూమిలో నా బొమ్మల కథలు కర్పగవల్లి, డుండర్ క్లంపెన్ బహుళ జనాదరణ పొందాయి. నా పేరు యండమూరి వీరేంద్రనాథ్ గారికి స్ఫూర్తినిచ్చిందట. తులసీదళం హీరోకి జయదేవ్ అనిపేరు పెట్టి ఆంధ్రభూమిని అందలానికి ఎక్కించారు. వేమూరి బలరాం గారు మా ఇంటికి వచ్చారు. నేను స్వాతి కార్టూనిస్టునైపోయాను. అమ్మాయి పెళ్ళి, మిస్టర్‌నో, మిడిల్‌క్లాస్ కార్టూన్ స్ట్రిప్ శీర్షికలు స్వాతి పాఠకులనలరించాయి. జయదేవ్, పరవాలేదు మంచి కార్టూనిస్టే అని పెద్దవాళ్ళు సర్టిఫికెట్ ఇచ్చారు.



1975లో ఖమ్మంలో కార్టూనిస్టుల కాన్ఫరెన్సు జరిగింది. వందమందికి పైగా తెలుగు కార్టూనిస్టులం ఖమ్మంలో కలిశాము. శంకుగారు నిర్వహించిన ఆ కాన్ఫరెన్సులో, తెలుగు కార్టూనిస్టులే, భారతదేశంలో అగ్రశ్రేణి కార్టూనిస్టులని అర్థమైంది. 1976లో కార్టూనిస్టు సత్యమూర్తిగారు మద్రాసుకు వచ్చారు. నేనూ, గోపాల్, సత్యమూర్తి, శ్రీ బాపూగారిని కలిశాము. మద్రాసులోనే ఉంటున్నా ఆ మహాచిత్రకారుడ్ని కలిసే అవకాశం నాకు 1976దాకా కలగలేదు. ఎంతో ఆప్యాయంగా నాతో మాట్లాడారు. అప్పట్నుంచీ ఇప్పటిదాకా బాపూగారితో సాన్నిహిత్యం బాగా ఏర్పడిపోయింది.



బాపుగారితో..

1980లో నేనూ, గోపాలూ సెన్సారు బోర్డు మెంబర్లుగా నియమించబడ్డాము. అప్పుడు ఎల్.వి ప్రసాద్‌గారిని కలిసే అవకాశం లభించింది. అప్పటికి విజయ బాపినీడుగారి విజయ పత్రికలో కార్టూన్లు గీసేవాడిని. వాటిని చూసిన ఎల్.వి.ప్రసాద్‌గారు, నన్ను యానిమేషను నేర్చుకోమని బొంబాయికి పంపించారు. సుప్రసిద్ధ యానిమేటర్ రామ్మోహనగారి వద్ద యానిమేషన్ శిక్షణ పొందివచ్చాను. ఎల్.వి.ప్రసాద్ స్టూడియోలో ఆక్స్‌బెరీ కెమేరాను ఆపరేట్ చేసే విధానం తెలుసుకున్నాను. ఆ శిక్షణ 1984లో నాకు బాగా తోడ్పడింది. బాపూగారు ఎన్టీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన స్కూలు పిల్లలకి సంబంధించిన వీడియో పాఠాల ప్రాజెక్టులో యానిమేషన్ చెయ్యమని నన్ను కోరారు. బాపూగారి చిత్రకల్పన స్టూడియోలో ట్రెడిషనల్ 2డి యానిమేషన్ పద్ధతిలో వీడియో పాఠాలకి సంబంధించిన సైన్సు పాఠాలు, లెక్కలు, పిట్టకథలు ఇలాంటి వాటికి వందలాది యానిమేషను బిట్లు నాచేత తయారు చేయించారు బాపూగారు. రమణగారు, శ్రీరమణగారు, వైవిరావుగారు,గోపాల్, మురళి అందరూ నాకు సాయం అందించగా, బాపూగారి బొమ్మల్ని తెరమీద కదిలించి చూపించాను.

1990లో నేను కాలేజీ వైస్ ప్రిన్సిపల్‌నయ్యాను. కాలేజీ నిర్వహణ బాధ్యత లెక్కువయ్యాయి. మా డిపార్టుమెంటు రీసెర్చి డిపార్ట్‌మెంటయినందువల్ల పి.హె.డి విద్యార్థులకు గైడ్‌గా నియంపబడ్డాను. రీసెర్చి పేపర్లు, సెమినార్లు సింపోసియమ్‌లూ ఒక వైపు సాగిపోయాయి. పిజి క్లాసులో మాలిక్యులర్ బయాలజీ, సెల్ బయాలజీ, జెనిటిక్సు టీచ్ చేసేవాడిని.

మధ్యలో కార్టూనులు మానలేదు. జాతీయ అంతర్జాతీయ కార్టూను పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాను. లక్ష్మణ్, మారియో మిరాండా, సుదీర్ ధార్, రంగ, సుధీర్ తైలాంగ్, లాంటి కార్టూనిస్టుల పరిచయం లభించింది. బెల్జియం నాకిహోస్టు పోటీకి నన్ను జ్యూరీమెంబరుగా ఎంపిక చేయడం జరిగింది. ఆపాటికి ప్రపంచంలో అన్నిదేశాల కార్టూను ప్రదర్శనలలో నా కార్టూనులు చోటు చేసుకున్నాయి. జాతీయస్థాయిలో నాకు ఢిల్లీకి రెండుసార్లు ఆహ్వానాలు లభించాయి. పోటీ బహుమతులు యూనియన్ మినిష్టర్ల చేతులమీదుగా అందుకున్నాను. ఇప్పటికి ఎన్నివేల కార్టూన్లు గీశానో చెప్పలేను. ఏ సబ్జెక్టు వదిలిపెట్టలేదో చెప్పలేను. పేపరు పెన్సిలు చేతపట్టుకుంటే కార్టూన్ అడియా ఎలా తడుతుందో చెప్పలేను.

33 సంవత్సరాల పాటు సాగిన నా లెక్చరర్ / ప్రొఫెసర్ జీవితంలో పిల్లలకి (బి.ఎస్సీ విద్యార్థులకి) ట్యూషన్లు చెప్పాను. కార్టూన్లు గీసాను. ఫిలిమ్ ఎడ్వర్‌టైజ్‌మెంట్లు, వంశీగారికి, ఎస్వీకృష్ణారెడ్డిగారి సిన్మాలకి చేశాను. బాపూగారితో యానిమేషను చేశాను. నా నలుగురి పిల్లలకి పెళ్ళిళ్ళు చేసాను. కాలేజీలో మంచి టీచర్‌గా పేరు సంపాదించాను. స్టూడెంట్సుతో దేశం నలుమూలలకి వెళ్ళివచ్చాను. "ఇదంతా ఎలా సాధ్యం బాబాయ్" అని అడిగిన మిత్రుడు గోపాల్‌కి సమాధానం చెప్పలేకపోయేవాడిని. ఆ సమాధానం తెలుసుకోకుండానే గోపాల్ 1999లో నన్ను విడిచి పైలోకానికి వెళ్ళిపోయాడు.

ఆపాటికి నేను త్యాగరాయ కాలేజీలో రిటైర్‌మెంటు తీసుకుని హైదరాబాదుకి వచ్చేసాను. అక్కినేని నాగేశ్వరరావుగారి హార్ట్‌యానిమేషన్ ఎకాడమీకి ప్రిన్సిపాల్‌గా వృత్తి స్వీకరించాను. జీవితంలో ఇదో చాలా పెద్ద మలుపు. యానిమేషన్ పాఠాలు, మనదేశంలో మొట్ట మొదటిసారిగా, అమెరికా యానిమేటర్ల ఆధ్వర్యంలో రాశాను. చిత్రకారులకు బోధించాను. హైదరాబాదులోని ఇప్పటి యానిమేషన్ ఇండస్ట్రీలో పనిచేసే చాలా మందికి నేను గురువుగా మిగిలిపోయాను. తర్వాత కలర్ చిప్స్ కంపెనీలో క్రియేటివ్ డైరెక్టరుగా చేశాను. ప్రముఖ చిత్రకారుడు బాలీగారితో కలిసి హనుమాన్ చాలీసా దృశ్య యానిమేషన్ చిత్రాన్ని తయారు చేశాను.


2002లో ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ వారు నన్ను సీనియర్ కార్టూనిస్టుగా ఆహ్వానించి పురస్కారం అందించారు. మా గురువుగారు బాపూగారి చేతులనుండీ ట్రోఫీ అందుకుని ఎంతో ఆనందించాను. హైదరాబాదులో ఏడెనిమిది సంవత్సరాలు ఎలా దాటిపోయాయో ఊహించలేను. కార్టూనిస్టులు శంకు, సత్యమూర్తి, బాబు, రామకృష్ణ, చంద్ర, అన్వర్, గోపాలకృష్ణ, రామకృష్ణ పుక్కళ్ళ, సినిమా దర్శకులు వంశీ, ఎస్వీకృష్ణారెడ్డిగార్లూ, నా శిష్యుడు (కాలేజీలో), కృష్ణమోహన్ (హైదరాబాదులో పెద్దలాయరు), ఇలా ఎంతోమంది నన్ను ప్రేమగా చూసుకున్నారు. 2004 లో నా కాంట్రాక్టు పూర్తయింది. మద్రాసుకు వచ్చేశాను.

చెన్నైలో, పాతచాకలిపేటలో, మా పాత ఇల్లు ఇపుడు బాగా మారిపోయింది. ఇప్పుడది మాదికాదు. అన్నదమ్ములం మేం అక్కడక్కడ సొంత ఇళ్ళల్లో స్థిరపడిపోయాం.

నా చిన్నప్పుడు నేను తిరిగిన ఊళ్ళు ఒకసారి వెళ్ళి చూసి రావాలని ఉంది. కాశీ, రామేశ్వరాలు వెళ్ళినంత పుణ్యం అనిపిస్తుంది. ఇంతవరకూ కుదరలేదు. అమెరికాకి మూడుసార్లు వచ్చేసాను. అంతరంగ తరంగాలకి వ్యాసం రాయమన్నారు శ్రీ కిరణ్‌గారు. ఈ అవకాశం లభించినందువల్ల, ఆ చిన్ననాటి నేను తిరిగిన ఊళ్ళకి వెళ్ళివచ్చిన అనుభూతి దక్కింది.

# బాలి

౧౯౬౦ దశకం చివరలో ఆంధ్రజ్యోతి వారపత్రిక మొదలు పెట్టిన కొత్తలో `బాలి` అనబడే ఇలస్ట్రేషన్ - ఆర్టిస్ట్ ఒక ప్రభంజనంలా దూసుకొచ్చాడు. సరికొత్త బ్రష్ స్ట్రోక్స్ తో కథల్నీ, కవితల్నీ కేవలం కొన్ని గీతలలోనే క్లుప్తీకరించిన ఆయన ప్రతిభకి ఆంధ్రదేశ పాఠకులు బ్రహ్మరథం పట్టారు. అలా మొదలైన `బాలి` ( మేడిశెట్టి శంకరరావు ) చిత్ర యాత్ర ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది. బాపు గారితర్వాత నవలలకి ముఖచిత్రాలు అత్యధికంగా చిత్రీకరించింది బాలి గారే. చిత్రకారుడిగా కొనసాగుతూనే నవ్వుల పువ్వులు విరజిమ్మిన వేలాది కార్టూన్లని అందించిన ఘనతకూడా బాలి గారిదే. `కౌముది` కి అత్యంత ఆప్తులైన బాలి గారి అంతరంగతరంగాలు వారి మాటల్లోనే..




నేను అనకాపల్లి దగ్గరున్న ఓ పల్లెటూరిలో పుట్టాను. ప్రస్తుతం ఆ ఊరు వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లోకి మిగిలిన పల్లెల్లాగానే జారి మాయమయిపోతోంది. పెరగడం అంతా అనకాపల్లిలోనే జరిగింది. మా అమ్మ పేరు అన్నపూర్ణ, నాన్నపేరు లక్ష్మణరావు. మా అమ్మ అందంగా ముగ్గులు వేయడం, అల్లికలూ, కుట్లూ చాలా బాగా చేసేది. సంగీతం నేర్చుకోకపోయినా అప్పటి సినిమాల్లోని ఒకటి, రెండు పాటలు చక్కగా పాడేది. మంచి కంఠం. రాత్రిపూట నన్నూ, మా చెల్లినీ జోకొడుతూ ఆంజనేయ దండకం మొత్తం చదివి "ఇక పడుకోండి తెల్లవార్లూ ఆంజనేయుడు మన చుట్టూ తిరుగుతూ మనకి కాపలా ఉంటాడు, దెయ్యం వచ్చినా, దొంగోడొచ్చినా చంపేస్తాడు వాళ్ళని" అని అనేది. మేం హాయిగా నిద్రపోయేవాళ్ళం తెల్లవారి లేస్తూనే మా అమ్మని అడిగే వాణ్ణి "రాత్రి ఆంజనేయుడు వచ్చాడా! ఈసారి రాగానే అతడ్ని నాకు చూపించమని," మా అమ్మ అనేది "ఈ రాత్రి నీకు చూపిస్తాను తప్పక" అని, మళ్ళీ మామూలే! అప్పటికి మా అమ్మ వయసు పదహారు లేక పదిహేడు ఉండవచ్చు. ఆమె కూడా పిరికిదే మా నాన్న మిలటరీలో ఉన్నారు. అవి రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజులు. మాకు ధైర్యం చెబుతూ, తాను ధైర్యంగా ఉండడం అంటే అదే..

మా నాన్నగారు విశాఖపట్నం ఏ.వి.యన్. కాలేజ్ స్టూడెంట్. మిలటరీలో ఉన్న మా నాన్న నుండీ ఉత్తరాలు వచ్చేవి. ఇటలీ, సింగపూర్... మలయా నుండీ... ఆయన ఎక్కడుంటే అక్కడ నుంచీ..

ఉత్తరం చివర్లో నాకూ, మా చెల్లికీ ముద్దులుండేవి. మా అమ్మ మరీ మరీ నాకు ఆ విషయం చదివి వినిపించేది. తెగ ఆనంద పడేది. మళ్ళీ ఉత్తరం వచ్చేవరకూ ఇదే సందడి. మా నాన్నగారు ఇండియా వచ్చి మరో పదిరోజుల్లో ఇంటికి వస్తానని ఉత్తరంలో

వ్రాసారంటే మా అమ్మలో సందడే సందడి. ఇపుడు నాకవన్నీ గుర్తొస్తుంటే చిత్రంగా ఉంటుంది. ఉదయాన్నే నిద్రలేపి "అయ్యో ఇంకా పడుకున్నావా! లేలే ఇంకో నాలుగు రోజుల్లో మీనాన్న వస్తున్నారు. గోడ మీద తేదీ వేశావా" అనేది. అంటే వీధరుగు గోడ మీద వచ్చీరాని అంకెలతో నాతో ప్రతి రోజూ తేదీ వేయించడం, తాను మురిసిపోవడం. పెన్సిల్ ముక్కతో ఎగుడు దిగుడూ అంకెలు ఎలాగో కష్టపడి, రాసేవాడిని. మరో రెండురోజుల్లో మీ నాన్న వస్తున్నారన్న మాట అనేది. అయితే నాకు అంకెలు నేర్పడం, వేయించడం ఇందులో భాగమే.

నిజానికి కొంచెం మా నాన్న మా ఇంటికి రావడం సంతోషంగా ఉన్నా, మరి కొంచెం అయిష్టంగా ఉండేది. ఆయన తెల్లగా అందంగా ఉండేవారు. బోల్డు చాక్లెట్లు, బిస్కెట్లు, బొమ్మలు తెచ్చినా, వచ్చిన దగ్గర్నుంచీ నా చేయి వదలకుండా వెంట తిప్పుతూ కబుర్లు చెప్పినా నాకు సిగ్గు, భయం, ముఖం ప్రక్కకు తిప్పుకోవటం, తప్పించుకుని తిరగటం... ఎందుకో ఆ చిన్నతనంలో అలా జరిగింది. ఇక మా నాన్న ముఖంలో కన్నీళ్ళట. మా అమ్మ ఏదో ఓదార్పు. ఇదంతా ఆ తర్వాత మా అమ్మ చెపుతోంటే తెలిసి ఏదోలా అనిపించేది. ఆ తర్వాత కొన్నాళ్ళకు మా నాన్నగారు మమ్మల్నందర్నీ ఊటీ (నీలగిరి)లో ఆయన పనిచేస్తున్న వెల్లింగ్టన్‌కు తీసుకు వెళ్ళిపోయారు. అక్కడ మరో సంవత్సరంలో ఆయన మరణించారు. మా అమ్మ మమ్మల్ని తీసుకుని మళ్ళీ అనకాపల్లి మా మామయ్య ఇంటికి వచ్చేసింది. నా చదువు సంధ్యలన్నీ అనకాపల్లిలోనే జరిగాయి. ఉడ్‌పేటలో ఉండేవాళ్ళం. మా ఇంటికి దగ్గరలో ఉన్న ఉడ్‌పేట ఎలిమెంటరీ స్కూల్లో చదివాను. డ్రాయింగ్ క్లాస్ అంటే చాలా ఇష్టంగా ఉండేది. అయితే ఆ డ్రాయింగ్ మాష్టారు ఎవరో గుర్తు లేదు కానీ కుండను ఓ పక్క సగం వేసి రెండో పక్క పూర్తి చేయమనేవారు, అది ఎలాగో కష్టపడి పూర్తి చేస్తే... ఆ కుండ కన్నా పెద్ద సున్నా గీసి, అంటే సున్నా మార్కువేసి ఆ డ్రాయింగ్ పుస్తకాన్ని మా ముఖం మీదకు విసిరేవాడు. దాంతో మనసు గిలగిల మనేది.

ఇక హైస్కూల్‌లో అయితే పొట్టి డ్రాయింగు మాష్టారు, బొల్లి డ్రాయింగు మాష్టారు అని ఇద్దరు ఉండేవారు. ఇద్దరూ మంచి వారే. కానీ ఇద్దరూ బొమ్మల మీద నా ఆసక్తిని చంపేసారు. నేను ఏదైనా బొమ్మ వేసి ఉత్సాహంగా చూపిస్తే అది కూడు పెడుతుందా! గుడ్డ పెడుతుందా అని నిరుత్సాహ పరిచారు. ఒక సారి బొల్లి డ్రాయింగ్ మాష్టారుకి కామాక్షమ్మ బొమ్మ వేయమని ఆర్డర్ వచ్చినట్టుంది. అది ఆరంగుళాల పొడవు, వెడల్పులతో వాటర్ కలర్ వేయడానికి ఆయన దాన్ని దాదాపు ఆరునెలలు వేసినట్టు గుర్తు. ఎపుడు చూసినా వేస్తూనే ఉండేవారు. అదేమంటే బొమ్మా! మజాకా! అన్నారు. ఆంధ్రజ్యోతిలో శ్రీ పురాణంగారు "కవర్ డిజైన్ గీయాలి బాలీ! రెండు గంటలే టైముందంటే" గంటన్నరలో గీసి ఇచ్చిన రోజులున్నాయి. తలచుకుంటే తమాషాగా ఉంటుంది. ఇదంతా నా ప్రాక్టీసా! లేక టెక్నిక్స్ పెరిగాయా!! ఏమో తెలీదు..


నాకు ఆర్ట్ మీద ఆసక్తి ఎపుడు పెరిగిందో ఖచ్చితంగా చెప్పలేను. మా అమ్మ ముగ్గులు వేస్తోంటే చాలా ఆసక్తితో చూసేవాడిని. మా అమ్మ చేతిలోని సుద్దముక్క అలవోకగా, ఖచ్చితమైన కొలతలతో చుక్కల చుట్టూ తిరుగుతుంటే నేల మీద మంత్రం వేసి పూలతీగను పరిచినంత ఆనందంగా ఉండేది.

ఇక ఎపుడయినా బొమ్మ వేసి మా అమ్మకు చూపిస్తే, ఎనాటమీలో ఏదో తప్పు ఉందనీ సరిచెయ్యమనీ చెప్పేది. మనిషి బొమ్మ వేస్తే ఒడ్డూ, పొడవూ సరిగ్గా లేకపోవడం, తలకాయ పెద్దదవడం ఇవన్నీ టక్కున చూసి సరిచెయ్యమనేది. మరో విషయం ఏమిటంటే మా నాన్నగారు కూడా బొమ్మలు వేసేవారని తెలుస్తోంది. ఆయన చనిపోయిన తర్వాత, మా అమ్మ దుఃఖంతో, మా నాన్నకు సంబంధించిన రెండు పెద్ద మిలటరీ పెట్టెల్ని ఓ పన్నెండేళ్ళ పాటు తెరవలేదు. చివరకు అవి తెరిచింది నేనే!! దానిలో మిలటరీ ఉన్ని బట్టలు, ఫోటోలు, కాయితాలు, పెన్నూ ఉన్నాయి. ఇవికాక కొంత కరెన్సీ ఉంది.. అంతా జార్జి ముద్రతో.. ఈలోపు మన కరెన్సీ మారిపోయింది. అవి అన్నీ పనికిరాని పాతకరెన్సీ అయ్యింది. పెట్టె అడుగున అరలో చైనా రంగు కేకులు, బ్రష్‌లు ఉన్నాయి. ఆ రోజుల్లో ఆ రంగులు అరగదీసి వేసేవారని విన్నాను. ఇవి కాక నలిగిపోయిన రంగుల సీనరీలు ఉన్నాయి. అవి మా నాన్న వేసినవి. విలువ తెలీక చింపి అవతల పారేశాను. చెట్లు, కొండలూ, అడవులూ, సన్నని బాటలో సైకిల్ తొక్కుతున్న వ్యక్తి ఇవీ అందులో విషయాలు.

ఆ బొమ్మలూ, రంగులూ - ఇవన్నీ నాలో పరోక్షంగా బీజాలు నాటి ఉంటాయి. అలా అనీ నా సమక్షంలో రంగు రంగుల బొమ్మలూ, కథా చిత్రాలూ వేసిన వారెవ్వరూ తారసపడలేదు. అపుడపుడు చిన్న చిన్న బొమ్మలు పెన్సిల్‌తో గీస్తుండేవాడిని. మా వీధి పిల్లలతో వ్రాత ప్రతి పత్రిక తెచ్చాము. అందులో బొమ్మలు నావే. అయితే అదీ ఏవో పెన్ను గీతలు. ఎర్ర రంగు పెన్నుతో రంగులు వెయ్యడం అంతే!

చాలా సంవత్సరాల తర్వాత కస్తూరిరావు అనే నా సీనియర్ స్టూడెంట్‌తో పరిచయం అయ్యింది. తన వల్లే కలం, పాళీ, ఇండియన్ ఇంక్, బ్రష్, సరియైన పేపర్‌పై వేయడం ఇవన్నీ తెలిసాయి. ఇక పుస్తకాలు తిరగెయ్యడం, పత్రికలు చదవడం అలవాటయిన కొద్దీ బుజ్జాయి నవ్వుల బండి, డుంబులతో కనబడ్డాడు. ఆ తరువాత బాల పత్రిక.. అందులో బాపు బొమ్మలు.

చదువు, వయసు పెరగడం, ఉద్యోగ వేట వీటితో నా బొమ్మలు మూలన పడ్డం మొదలు పెట్టాయి. ఆసక్తి ఉన్నా టైములేదు. ఎం.శంకర్రావు, అనకాపల్లి అంటూ ఏవో రేఖా చిత్రాలు పత్రికల్లో నావి వచ్చాయి. కొంత పాకెట్‌మనీ వచ్చేది - అయితే ఆ రేఖా చిత్రాలే నా చిత్రకళా అభ్యాసానికి తర్వాత కాలంలో మూలస్తంభాలవుతాయనీ నాకు ఆ రోజుల్లో తెలియదు. వాటి వల్ల పిక్చర్ డెకరేషన్‌లోగానీ, అనాటమీ గానీ, బాలెన్స్‌లో గానీ ఎంతో పట్టు వచ్చింది.



మనవడు చందుతో..

ఇంతలో ఉద్యోగం వచ్చింది. PWDలో గుమాస్తాగా. అది ఒక విలువలేని గాడిద చాకిరీ... కానీ జీవన భృతికి తప్పదు కదా! అలా చేస్తుండగానే ఆంధ్రజ్యోతి వార పత్రిక విజయవాడ నుండీ వెలువడడం చూసాను. శ్రీపురాణంగారు దానికి ఎడిటర్. వారిని వెళ్ళి కలిసాను. అయితే కలవడానికి ముందు మరో విశేషం జరిగింది. "అమ్మేకావాలి" అనే చిన్న పిల్లల నవల రాసి, దానికి నేనే బొమ్మలు వేసి ఆంధ్రజ్యోతికి పంపాను. వారు దాన్ని సీరియలైజ్ చేసి నాకు శ్రీ భమిడిపాటి రామగోపాలం గారి బంధువుతో కబురు పంపారు తనను కలవమని. పురాణం గారిని కలిసిన తర్వాత నన్ను ఉత్సాహపరుస్తూ కథలూ, నవలలూ ఇవ్వడం, డ్రాయింగ్ పేపర్ల దగ్గర్నుండి... బొమ్మలు వేసే కొలతల వరకూ వివరించారు - అలా నేను ఆంధ్రజ్యోతిలో వేసిన మొదటి కథకు బొమ్మ 'అచ్చమ్మ కాఫీ హోటల్'

చిత్రకళారంగంలో నాకు గురువులంటూ ఎవరూ లేరు - అలాగని ఎవరినీ ఇమిటేషన్ చేయలేదు. తెలుగులో అప్పటికే కథలకు బొమ్మలు వేస్తున్న బాపు దగ్గర్నుండీ తమిళంలో వేస్తున్న గోపులు బొమ్మలు, బెంగాలులో చితిర్ ఛటర్జీ వరకూ అందరి బొమ్మలూ గమనించేవాడిని. సంఘటన తీసుకోవడం దానిని బొమ్మగా మలచుకోవడం నా అనుభవం మీదే ప్రాక్టీస్ చేసాను. అప్పటికప్పుడు కొన్ని వివరాలు, విషయాలు మైండ్‌లోకి రావు - అందుకని కొన్ని జంతువుల, పక్షుల బొమ్మలు, వాటి వ్యవహార తీరుతో కొన్ని పేపర్ కటింగ్స్ మనుషుల (వయసు ననుసరించి) హావభావాల కటింగ్స్, కోటలు, ఇళ్ళు వీటి నమూనాలు ఇవన్నీ కొన్ని పుస్తకాలలో అంటించుకుని.... లేకపోతే అలాంటి పుస్తకాలు కొని చిన్న లైబ్రరీ ఏర్పాటు చేసుకుంటే అవసరమొచ్చినపుడు ఉపయోగించుకోవచ్చు, ఇదే చేశాను. అయితే ఇదంతా నా అనుభవంలో నేర్చుకున్నదే

చిత్ర కళలో నాకు ఎపుడు పేరు వచ్చిందో నాకు తెలియదు. నేను, పత్రికలుండే విజయవాడలోగానీ, మద్రాస్‌లోగానీ ఉండి ఉంటే లేక అపుడపుడు వెళ్ళి వచ్చిఉంటే, అప్పటికే పేరున్న చిత్రకారులతో పరిచయం ఉండి ఉంటే నేనింకా ఈ రంగంలో త్వరగా ఎదిగి ఉండేవాడిననిపిస్తుంది. ఇప్పటికీ అదే ఆలోచన. వాటికన్నీ దూరంగా ఉన్న వైజాగ్‌లో ఉండటం, ఆరోజుల్లో ఆ ఊళ్ళో పత్రికలు లేకపోవడం, నేను పడుతూ, లేస్తూ ప్రాక్టీస్ చేయడం నాకో పరీక్ష.

ముందు 'ఈనాడు'లో రామోజీరావుగారు స్టాఫ్ ఆర్టిస్ట్ (కార్టూనిస్ట్)గా నన్ను తీసుకోవడం పెద్ద మలుపు. వచ్చాను కాబట్టి ఎదగాలని అందులో ఉన్న అన్ని విభాగాలను ప్రాక్టీస్ చేసాను. బ్రష్ గీతలూ, క్రోక్విల్ గీతలూ, కార్టూనింగ్, కేరికేచర్, ఆఖరికి యానిమేషన్నూ తెలుసుకున్నాను. అవసరం వచ్చినపుడు ప్రయోగించాను కూడా. అలా వచ్చిందే హనుమాన్ చాలీసా... నేను యానిమేషన్ చేయగా ఎస్పీబాలసుబ్రహ్మణ్యంగారు పాడారు. అది కలర్ చిప్స్‌యానిమేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో వచ్చింది. కొన్ని వేల బొమ్మలు వేశాను ఇంకా వేయాలని ఉంది. అలసి... ఆగిపోయిన... నాసాటి చిత్రకారులకు అది ఆశలాగ కనపడుతుంది. అలసిపోని తహ తహనాది.




బొమ్మలు వేయడంలో నాకు పరిపూర్ణమైన ఆనందం, విజయం లభించాయి కానీ, ఎవార్డులు, గొప్ప గుర్తింపులూ నాకు ఏమీ రాలేదు. అలాగని నేను నిరాశ చెందనూ లేదు. న్యూజిలాండ్ బైబిల్ సొసైటీవారు నా చేత కొన్ని బొమ్మలు వేయించడం, వారు మెచ్చుకోవడం అలాగే ఫ్రాంక్‌ఫర్ట్(జర్మనీ) పర్యావరణం గురించి జరిపిన సదస్సులో నా బొమ్మలతో కూడిన పుస్తకాన్ని వెలువరించారు, ఇవన్నీ నాకు ఆనందాన్ని కలుగజేసిన విషయాలు. గుంటూరు చిత్రకళాపీఠం వారు సన్మానం చేస్తూ 'చిత్రకళాసామ్రాట్' అనే బిరుదు ఇచ్చారు. ఇక మామూలుగా సన్మానాలు అయితే ఆంధ్రలో చాలా చోట్ల జరిగాయి. అయితే ఇవన్నీ మామూలే! నా సహచిత్రకారులు కొంతమంది నా కృషిని, నా బొమ్మల్లోని స్టయిల్‌ని ఇష్టంగానో, అయిష్టంగానో, తప్పని పరిస్థితులలోనో మెప్పుగా చెబితే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. అవే నాకు రివార్డ్స్....

ఇన్నేళ్ళ నా చిత్ర కళా జీవితంలో అనేక మరచిపోలేని సంఘటనలు ఉన్నాయి. అయితే స్థలాభావం వలన నేను అన్నీ ఇక్కడ చెప్పలేను.. ఒకటి, రెండు వివరిస్తాను. విజయవాడలో నేనున్నపుడు నవలలకు కవర్ డిజైన్ వేసే అవకాశం వస్తుండేది. ఆ రోజుల్లో శ్రీ బాపు తర్వాత నేనే ఎక్కువ వేసి ఉంటాను. ఒక పబ్లిషర్ నన్ను డిజైనుల విషయమై పిలిచారు. తీరా వెళ్ళిన తర్వాత నవలలు ముందుగా బాపూగారికి పంపుతాను. ఆయన కాదంటే మీకిస్తానని బేరం పెట్టారు. (బాపుగారు ఆ రోజుల్లో సిన్మాల్లో చాలా బిజీ). సరేనని షాపు మెట్లు దిగుతూ వెనక్కి తిరిగి చూసాను. "ఎప్పటికయినా ఆ అల్మారాల్లో నా బొమ్మల కవర్ డిజైన్లతో నవలలు ఉండకపోవు" అనుకున్నాను. సరిగ్గా సంవత్సరం ఆరు మాసాల్లో ఆ షాపులో ఆ చివరునుండీ ఈ చివర వరకూ ప్రతి పుస్తకం నా బొమ్మలతో నిండిపోయాయి. మరో రోజున అదే షాపు మెట్లు దిగుతూ ఎంతో నవ్వుకున్నాను. అది గర్వం కాదు, ఆత్మవిశ్వాసం. కృషి, పట్టుదల, టైముకి బొమ్మను పార్టీకి అందించడం ఇవన్నీ అందమైన మెట్లు ఎదగడానికి.

మరోసారి ఏదో మీటింగ్ అవుతోంది. పురాణంగారు వేదిక మీద మాట్లాడుతున్నారు. ఆ క్షణంలో ఆయన మాటల్లో ఉన్నది నేనే. 'ఒక చెట్టు చూపించాను - అది ఆయన నిరంతర కృషితో అధిరోహించాడు, అలా ఉండాలి' అన్నారు. అందరూ నావైపు చూస్తున్నారు. నాకు కొంత మొహమాటంగా అనిపించింది శంకర్రావు అన్న పేరుతో బొమ్మలు వేస్తున్న నన్ను "బాలి" పేరుపెట్టి దీవించింది ఆయనే కదా! మొన్నటికి మొన్న 'వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా' వారు నా బాలి కార్టూన్ల పుస్తకాన్ని అచ్చువేసి, హైదరాబాదులో జరిగిన "మొట్టమొదటి ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభ"లో శ్రీ బాపుగారి చేత ఆవిష్కరింపచేసారు. అంతా అయ్యాక బాపుగారు ఆ

పుస్తకాన్ని అలవోకగా తిరగేస్తుంటే అన్నాను - "సార్! ఓపిగ్గా చదవండి అని... ఆయన అన్నారూ... "బాలీ మీకు తెలియకపోవచ్చు నేను మీ బొమ్మల అభిమానిని. ఇదేకాదు రెడ్డిగారి (కడప) పుస్తకం "కాళిదాస శృంగార తిలకం"కు వేసిన బొమ్మలు అద్భుతమని -" ఆ పుస్తకం ఆయన చూసినట్టున్నారు. అవును ... ఆ బొమ్మలు చాలా బాగా వచ్చాయి. కవి కాళిదాసు శృంగార రసాన్ని ఎంత అద్భుతంగానో ఒలకపోసాడందులో.. ఆ బొమ్మలు వేసేముందు ఎల్లోరాశిల్పాలు గానీ చూసి ఉంటే ఇంకా అందంగా వేసి ఉండేవాణ్ణని నాకు మనసులో చాలాసార్లు అనిపించింది. కానీ ఆ తర్వాత చూశాను నేను ఎల్లోరా శిల్పాలను ఆ నగలూ, ఆ నడుముల వంపులూ ఎంత గొప్పగా ఉన్నాయో -!

నా సీనియర్ చిత్రకారులు అందించిన ఆ బెస్ట్‌కాంప్లిమెంట్ కన్నా నాకింకేకావాలి. ఎవార్డులూ... గుర్తింపులున్నూ...

నాకు ఇంకా గుర్తుందీ -చాలామంది అనేవారు- కార్టూనులు నేను బాగా వెయ్యలేననీ - అసలు ఆస్ట్రోకే నాకు చేతకాదనీ... ఇదంతా మొదట్లో అంటే ఎం.శంకర్రావు, అనకాపల్లి అని నా రేఖాచిత్రాలు పడుతున్న రోజుల్లో నన్నమాట. ఆంధ్రపత్రిక వారు కార్టూన్‌లను ఎంకరేజ్ చేస్తూ పోటీలు పెట్టారు. చిత్రంగా మూడు వారాలు వరుసగా నేనే గెలిచాను. దాంతో ధైర్యం వచ్చింది.

కార్టూన్‌లో గొప్పదనం ఏమిటంటే మంచి ఫన్నీలైన్ ఉండాలి, ఎనాటమీ మీద గ్రిప్ ఉండాలి. ఇక బొమ్మకు తగ్గట్టు కాప్షన్ ... లేక కాప్షన్‌లెస్. కాప్షన్ ఉంటే మంచి కార్టూన్ అనీ... కాప్షన్ లేకపోతేనే మంచి కార్టూన్ అని భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇది వారి వారి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

తెలుగులో నాకు నచ్చిన మంచి కాప్షన్ రాసే ఆర్టిస్ట్ 'శ్రీబాబు' ఆయన ప్రస్తుతం స్వాతిలో వేస్తున్నారు. ఇంతకుముందు చాలా పత్రికలలో వేశారు. ఆయన వాడే భాష ఫ్రీగా నవ్వుకునేటట్టు ఉంటుంది. అయితే ఆయన బొమ్మల్లో వైవిధ్యం లేకపోవడానికి కారణం ఉద్యోగ బాధ్యతలయ్యుంటాయి.

ఇక్కడో చిన్న విషయం నాగురించి చెప్పుకోవాలి. నేను ఏదో బొమ్మ గీయగలుగుతున్నాను కానీ నవ్వించగల ఫన్‌ను మాటల్లో పలికించలేక పోతున్నానని అనిపించేది. నా ప్రాబ్లమ్ నాకు ఎదురుగా తెలుస్తూనే ఉండేది ఒకవైపు. ముందు ఏ విషయం మీద కార్టూన్ వేయదలిచానో నిర్ణయించుకుంటాను. బొమ్మ గీయడం కష్టం కాదు. అందులో యాక్షనూ నాకు కొత్తకాదు. అంతా కాప్షన్‌లోని ఫన్‌ను పేల్చడంలోనే ఉంది, అంటే అక్షరాలను పేర్చడంలో ఉంది అసలు విషయం. కొత్త పదాలు చేర్చడం, అందరూ చదవతగ్గది ఉందా! లేదో అని మరొక్కసారి చూసుకోవడం ఇవన్నీ ఉంటాయి. పరిశీలనతో ఇక అదంతా బొమ్మకు బేలన్స్ చేస్తూ బొమ్మ పక్క ఇంక్‌తో రాసుకుంటాను. అయితే ఇదంతా కొన్ని గంటల పనికాదు. కొన్ని నిమిషాలు మాత్రమే.

ఒకసారి నేను శ్రీశ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వ్రాసిన "అనుభవాలు - జ్ఞాపకాలు" అనేవారి ఆత్మకథ చదవడం జరిగింది. అందులో ఓ రెండూ పేజీల్లో ఆయనో విషయాన్ని తన అనుభవంగా రాశారు. అదేమంటే ఆయన కథలు రాసే ముందో, లేక బాగా చిన్నప్పుడోగానీ, వాళ్ళ అమ్మగారు వారు ఉంటున్న వీధిలోని స్త్రీలంతా చాలా పరిచయంగా ఉండేవారట. ఎపుడన్నా వీలు కుదిరినపుడు కొంతమంది స్త్రీలు వీరి ఇంటి అరుగు మీద చేరి పిచ్చాపాటీ మాటాడుకునేవారట - ఆ సమయంలో శాస్త్రిగారు ఓ చెవి అటుపడవేసేవారట - "వాళ్ళ మాటల్లోని తెలుగుతనపు పలుకుబళ్ళు, చమత్కారాలు మధ్య మధ్య మాటల్లోని విరుపులూ, ఎకసెక్కాలూ అంతలోనే ఆశ్చర్యపోవడాలూ, ఓదార్పులూ, అవహేళనలూ, తిట్లూ, శాపనార్థాలూ, నవ్వుల పువ్వులు విరిసే పొడుపు కథల సొబగులూ ఇవన్నీ తెరలు తెరలు గా నా మనసులో నాటుకునేవి. ఎప్పుడయినా, భాషలోని మాధుర్యం, జీవం, స్త్రీలలోనే నిలుస్తుంది, అని గట్టిగా చెప్తూ ఆ తరువాత అవే నా కథల్లోని వ్యక్తుల చేత పలికించేను - నా కథలు చదివిన పాఠకులు, ఈ విషయమై ప్రత్యేకంగా ప్రస్తావించి "ఎంత మధురం తెలుగుభాష అన్నవాళ్ళున్నారు" అనీ రాసుకున్నారాయన

నాకు ఈ విషయంలో ఏదో తీగ దొరికినట్టయ్యింది. ఇక డొంకలాగడమే తరువాయి.

మీ కార్టూన్‌లోని భాష వ్యంగ్యంగా, విశాఖపట్నం యాసతో (పదాలు) ఉంటాయి అన్నాడొక విశాఖపట్నం కార్టూనిస్ట్ పేరు హరి. బొమ్మా, కాప్షన్ బావుంటాయి అన్నాడు మరో కార్టూనిస్ట్ గుంటూరు నుండీ పేరు జమదగ్ని, ఇలా ఎంతో మంది - అంటే కాప్షన్‌లో, డైలాగుల్లో నేను సక్సెస్ అయినట్టేకదా!

ఇప్పటికి ఆరు కార్టూను సంపుటిలు తెచ్చాను. పోయినవి పోగా దొరికిన కార్టూన్‌లతోనే ఈ పని చేసాను, నా సహచిత్రకారులకీ వారిమీద గౌరవంతో ఒక పుస్తకాన్ని అంకితం ఇచ్చాను.

పబ్లిషర్‌గానీ, సంపాదకుడుగానీ ఇచ్చిన కథలు మొత్తం చదువుతాను. కారెక్టర్ ఆకార వివరాలు మామూలుగానే తెలిసిపోతాయి - అయితే ఆ పబ్లిషర్ ఇచ్చిన టైమూ, పేపర్లోని స్పేసూ దృష్టిలో పెట్టుకుని బొమ్మగీస్తాను - పబ్లిషర్ వింటే - ఈ బొమ్మ పేపర్లో ఎలా పేజ్ మేకప్ చేస్తే బాగుంటుందో చెపుతాను. లేకపోతే లేదు. అయితే చాలా మంది పబ్లిషర్‌లకు చెప్పాల్సిన పనిలేదు. అనుభవం మీద వాళ్ళే పేజ్‌మేకప్‌లో బొమ్మకు న్యాయం చేస్తుంటారు. పేజ్‌మేకప్ అంటే పత్రికల్లోని పేజీలను మేటర్‌తోను, బొమ్మతోనూ అందంగా అలంకరించడం అదో పెద్ద కళ. విదేశాల్లో ప్రతి పత్రికకూ ఈ విషయంలో పెద్ద సెక్షనే ఉంటుంది.


అల్లుడూ, మనవరాలు, అమ్మాయీ, మనవడు..

నాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి పెద్దది పేరు వైశాలి. అబ్బాయి పేరు గోకుల్. ఇద్దరికీ బొమ్మలంటే ఆసక్తి. చిన్న వయసులో పోటీల్లో పాల్గొని బహుమతులు సంపాదించారు. చదువులో పడ్డారు. ఇద్దరూ అమెరికాలో ఉన్నారు. అమ్మాయికి ఇద్దరు పిల్లలు. చరణి, చందు వారి పేర్లు వీళ్ళ పేర్లతో నేను కార్టూన్ స్ట్రిప్‌లు గీసాను. అవి పుస్తక రూపంలో కూడా వచ్చాయి. చందు కార్టూన్ స్ట్రిప్ ఆంధ్రప్రభ, చిన్నారిలో నాలుగు సంవత్సరాలపైనే నడిచింది, వేలాదిమందిని అలరించింది. పిల్లలిద్దరూ న్యూజెర్సీలోని వెస్ట్‌విండ్సర్ ప్లెయిన్స్‌బరో స్కూల్లో చదువుతున్నారు. మనవడు ఈ సంవత్సరం స్టూడెంట్ అంబాసిడర్‌గా వాళ్ళ స్కూలు నుండీ సెలక్ట్ అయ్యాడు. ఐదు దేశాలు ఒక నెల టూర్‌లో చుట్టి వస్తాడట. ప్రస్తుతం నేను సీతాఫల్‌మండీ, హైదరాబాద్‌లో ఉంటున్నాను.


మనవరాలు చరణితో

మా అమ్మాయినీ అల్లుడ్నీ చూద్దామని కిందటి నెలలో అమెరికా వచ్చాను. మరో ఐదునెలలు ఉంటానిక్కడ.

తెలుగు పత్రికారంగంలో మార్పులంటారా! చాలా ఉన్నాయి. ఉంటాయి కూడానూ... అది సహజం... క్రియేషన్ కన్నా నెట్ మీద ఆధారపడుతన్నారు ఇప్పటివారు. సర్క్యులేషన్ పెంచడంలో సంపాదకులు తంటాలు పడుతున్నట్లు కనిపిస్తోంది. ఎక్కడో, ఎపుడో తప్ప మాలాంటి చిత్రకారులు, పేపర్లో కనపడ్డం లేదు - అయితే నేను ఇప్పటికీ హాయిగా బొమ్మలు గీయగలను. అవకాశం ఇచ్చేవారిని కాదనను. చిన్న పిల్లల కోసం నేను గీసిన బొమ్మల పుస్తకం చైనాలో ప్రింటవుతోంది. బొమ్మలు చాలా బాగున్నాయని ఇక్కడి మిత్రుడు మొన్న ఫోన్ చేసి చెప్పారు.

ఇక సంపాదకుల విషయానికి వస్తే నన్ను అందరూ బాగానే ఆదరించారు. పురాణంగారూ, నండూరి రామమోహనరావుగారూ నాకు మొదట్లో చేయూతనిస్తే, ఆ తరువాత శివలెంక రాధాకృష్ణగారు, పొత్తూరి వెంకటేశ్వరరావుగారు, దీక్షితులుగారూ, రచన శాయిగారూ ఇంకా చాలామంది నాకు అవకాశాలు ఇస్తూ నా ఆలోచనల్ని ఇంకా షార్ప్ చేసారు.

ఇక రచయితలూ, రచయిత్రులూ అంటారా! వేలాదిమంది కథలకూ, నవలలకూ బొమ్మలు వేసాను. మొదట్లో ఆ కథలన్నీ చదవడం వల్ల బ్రీఫ్‌గా ఆ కథంతా చెప్పగలిగేవాడిని. ఇప్పుడంతలేదు.


ఇంతలో నా టేస్టూ మారింది. ఆ ఊహాజనిత రచనలనుండీ రాహుల్ సాంకృత్యాయన్, రోమిల్లాథాపర్, ఏటుకూరి బలరాం, అంబేద్కర్, చేరా, ఆర్.కె.ఫణిక్కర్ రచనలవైపు మళ్ళాను. కులాలూ, మతాలు వాటి మూలాలేమిటి? ఎందుకిలా ఓ జాతి ఓ పక్క తొక్కబడింది. భగవంతుని కల్పన అంటూ ఎందుకీ మనుష్యుల్లో బ్రెయిన్ వాష్ చేయబడింది... ఇలా ఆలోచిస్తూ దొరికిన రచనలు చదువుతూ చిన్న లైబ్రరీ ఏర్పాటు చేసాను. మా అమ్మాయిదీ, అబ్బాయిదీ ఆ రకమయిన ఆలోచనే. ఆ పుస్తకాలు చదువుతూ చర్చిస్తుంటారు. నీతులు చెప్పేవాడి నీతిని ప్రశ్నించుకుంటారు. దేవునికి దణ్ణం పెడుతున్నా జిజ్ఞాసలోకి వెళతారు. మూలాలు వెతుకుతారు - "దైవం మానవ రూపేణా" అనే తేలుస్తారు. వారికి చేతనయినంత సహాయం చేస్తారు. ఇంతకన్నా ఏం కావాలి?



ఎమ్.రాజ్యశ్రీ

# ప్రేమరణ రంగ కళికేతురాయి

## శ్రీయం.ఎన్.రావు




*అక్షరమే ఆయన శ్వాసగా, ఎమెస్కో రూపశిల్పిగా*
*అక్షర సుమాలను ఎ.పి.బి.డిలో పొందుపరచి*
*అక్షరాలా ఇంటింటా స్వంత గ్రంధాలు నెలకొల్పి*
*అక్షరలక్షల సాటి ఎమెస్కో పాకెట్ బుక్స్‌కి శ్రీకారం చుట్టి*
*అక్షరమక్షరమూ సరస్వతిని తలపించే సాంప్రదాయసాహితి నొసగి*
*అక్షర రూపేణా ఇష్టదేవతా ప్రార్ధన ప్రాగ్భారతిలో పొందుపరచి*
*అక్షరాభిషేకంలో మురిసిపోతూ అంతిమశ్వాస విడిచి*
*అక్షర సీమలో అజరామృతంగా ఆ చంద్రతారార్కం వెలిగే*
*శ్రీయం.ఎన్.రావు గారికివే అక్షర నివాళులు.*

*'మస్తకాలకు బూజు పట్టేను మనసా*
*పుస్తకాలే వదల గొట్టును చిలకా!'*


అన్న నానుడిని ఆంధ్రదేశమంతటా, ఒక్క ఆంధ్రదేశంలోనే కాదు తెలుగువారు ఉన్న దేశదేశాల్లోనూ వేళ్ళూనేలా చాటి చెప్పించారు స్వామి గ్రంధానంద వారి చేత యం.శేషాచలం అండ్ కంపెనీ వారు. ఆ పుస్తకాలు తాము ప్రచురించినవే అవాలన్న స్వార్ధం లేదు. పబ్లిషర్ వేసినా సరే!

ముప్పాళ రంగనాయకమ్మ 'స్వీట్ హోం', భానుమతి 'అత్తగారు కథలు', యద్దనపూడి సులోచనారాణి 'సెక్రటరీ', ముళ్ళపూడి 'బుడుగు', కోడూరి కౌసల్యాదేవి 'శాంతినికేతన్'. మునిమాణిక్యం 'కాంతం కథలు', అవసరాల రామకృష్ణారావు 'సహజీవన సౌభాగ్యం', మొక్కపాటి 'బారిష్టర్ పార్వతీశం' తెలియని పుస్తకాభిమానులు ఉండరనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

అలాంటి పుస్తకాలు చదవాలని, కొని తెచ్చి చదవాలనీ, కొనిపించి చదివించాలనీ, కొని ఇచ్చి చదివించాలనీ, కొని దాచుకుని మరీ చదవాలన్న భావాలని దేశదేశాలలో కలగ జేసి ప్రతి ఇంటా ఒక సరస్వతీ పీఠం నెలకొల్పిన ఘనత *ఎమెస్కో రూపశిల్పి శ్రీ యం.ఎన్.రావు* గారికే దక్కింది - ఆయన చేపట్టిన ఇంటింటా స్వంత గ్రంథాలయం సాకార స్వప్నం అయిన యజ్ఞం ద్వారా.




యం.శేషాచలం అండ్ కంపెనీని బందరులో వారి తండ్రిగారైన శేషాచలం గారు 1923 లో స్థాపించారు. ఆ రోజుల్లో ఇంగ్లీషు మీడియముని వ్యతిరేకించి, తెలుగు మాధ్యమములో విద్య బోధించాలన్న నినాదం చెలరేగింది. దానికి కావాల్సిన పాఠ్య పుస్తకాలని మామిడి పూడి వెంకట రంగయ్యగారు, వారణాసి శ్రీనివాసరావుగారు, చింతా దీక్షితులు గారు వంటి ప్రముఖుల చేత రాయించి వేయించారు. వీటిలో దీక్షితులు గారు రాసిన 'లీలా వాచకము' పేరు తెలియని వారు లేరు. ఈ పుస్తకాలు వేయటానికి హిందూ ప్రెస్‌ను బందరులో స్థాపించారు.





ఎందరో ప్రముఖులు జన్మించిన బందరులో పుట్టి పెరిగిన యం.ఎన్.రావు, చదువు రీత్యా మద్రాసు తరలి వెళ్ళారు. అప్పటికే తండ్రిగారు యం.శేషాచలం అండ్ కంపెనీ పేరు మీదనే తమిళులకు మంచి బిజినెస్ సెంటర్ అయిన పారిస్ కార్నర్‌లో ఇంకో బ్రాంచీ 1934లో తెరిచి, రెండు బ్రాంచీలు చూసుకుంటూండేవారు. 1946లో యం.ఎన్.రావు మద్రాసు బ్రాంచీ చూసుకుంటే, తండ్రికి చేదోడు వాదోడుగా బందరులో తమ్ముడు యం.వి.సుబ్బారావు 1948 నుంచీ ఉన్నారు. కొన్ని పుస్తకాలు మద్రాసులో అచ్చు వేయించి పంపేవారు.

కాలక్రమేణా అంటే 1961 నాటికి పాఠ్య పుస్తకాల ప్రచురణ గవర్నమెంటు తీసేసుకున్నా, విద్య తెలిసిన వారికి ఆ విద్య తదనుగుణంగా మలచుకోవటం పెద్ద బ్రహ్మ విద్యగాదని, ప్రమాదం ముంచుకు రాకముందే నిరూపించుకున్నారు. మా వ్యాపారానికేం ఢోకా లేదు సుమా అన్న ధైర్యంతో సికిందరాబాద్‌లోని రాష్ట్రపతి రోడ్డులో ఆంధ్ర అవతరణ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ (ఎ.పి.బి.డి) పేరిట ఇంకో బ్రాంచీ 1956లో యం.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో తెరిచారు.

నవలా రత్నాలూ, కథా వైఢ్యూరాలు, నాటక మరకతాలు, ప్రాచీన పగడాలు, బాలల కథల ముత్యాలు, ఆధునిక సాహిత్యపు నీలాలు, కవితా కెంపులు కలబోసి సాహిత్యాభిషేకం చేసేది పబ్లిషర్. అలాటి పబ్లిషర్లకే తలమానిక వంటి వారు యం.ఎన్.రావుగారు. సాహిత్యపు నవరత్నాలని, తోటి పబ్లిషర్ల పుస్తకాల తోరణాలని అందంగా అందరికీ అందుబాటులో ఉండేలా తీర్చి దిద్దారు.. ఎ,పి.బి.డిలో ఎన్నెన్నో పుస్తకాలు ఒక్కచోట దొరకటం ప్రత్యేక సదుపాయం.

అది ప్రారంభించిన కొత్తల్లో వారి గుండెల్లో నిలిచిపోయిన సంఘటన ఒకటుంది. ఒక ఆరేళ్ళ పాపకి పిల్లల పుస్తకాలు కావాలని ఎన్నో షాపులు గాలించి తర్వాత యధాలాపంగా ఎ.పి.బి.డి.కొస్తే లెక్కలేనంత బాల సాహిత్యం కనిపించిందట. 'అయ్యో బాబోయ్ ఇన్ని పుస్తకాలే!' అనుకుని కావాల్సినవి సంతోషంగా కొనుక్కుంటే ఆ సంతోషం, తనుకూడా పంచుకున్న రావుగారు అప్పటికప్పుడు ఆ పాపకి చాక్లెట్ల డబ్బా, బెలూన్లు తెప్పించి, స్వయంగా తనే ఇచ్చారు. ఆ పిల్లకళ్ళల్లోని ఆనందం ఆయన కళ్ళలో ప్రతిబింబించింది. తరువాత మొదలైన హెచ్.ఎల్.పిలో ఆ పాప పేరనే సభ్యత్వం తీసుకున్నారట వాళ్ళ తల్లితండ్రులు.

'బయ్యింగ్ వర్స్‌దాస్ సెల్లింగ్ గర్ల్స్' అన్నటువంటి భావన ఎవరిలోనన్నా ఉన్నా, దాన్ని కూకటి వేళ్ళతో సహా పెకిలించి, పుస్తకాలని కొని తెచ్చి చదవాలి, దాచుకుని మరీ మరీ చదవాలి, నా కంటూ ఒక సొంత గ్రంథాలయం ఉండాలి, మా తరువాత తరాల వారికి నా తరగని ఆస్తితో పాటు ఆణిముత్యాలు ఉన్న నా గ్రంథాలయం ఆస్థి కూడా జాగ్రత్తగా అందజేయాలి అన్న భావన అందరిలో వట వృక్షంలా నాటటానికి అల్లబడిందే ఇంటింటా స్వంత గ్రంధాలయం 1957లో పునాది రాయి పడింది. హోం లైబ్రరీ ప్లాన్ అనీ - హెచ్.ఎల్.పి అని కూడా రానురానూ ప్రజల నోట్లో నానింది. ఇలా మూడు బ్రాంచీల ద్వారానే పబ్లిషర్ల మధ్య ఉన్న సమభావం తెలుస్తుంది. పుస్తకాల కోసం ఎన్ని చోట్లకో వెళ్ళకుండా, ఏ పబ్లిషర్ పుస్తకం కావాలన్నా ఒక కార్డుముక్క రాస్తే వచ్చేలా, పోస్టేజీ మీద డబ్బు వృధా అవకుండా, ఏ పత్రిక తిరగేసినా పుస్తకాల వివరాలు లభిస్తుంటే ఎవరు మాత్రం ఆసక్తి చూపకుండా ఉండరు?




'సరిగ్గా సంవత్సరానికి, సొంతానికి, సంసారపక్షమైన ఒక చిన్న గ్రంథాలయం కూర్చుకోటానికి ఘనమైన ఉపాయం హెచ్.ఎల్.పి - అదే ఇంటింటా స్వంత గ్రథాలయం ప్రణాళిక' అన్న కాప్షన్‌తో మొదలెట్టారు. హెచ్.ఎల్.పి - ముందు కొంత సొమ్ము కట్టి సభ్యత్వం పొందితే చాలు, చేరగానే నాలుగు పుస్తకాలు ఉచితం. ఆ నెలలోనే మానేసినా చందాదారుని కేం నష్టంలేదు. చివరంటా మానకుండా పన్నెండు నెలలూ మొత్తం 90 రూపాయలు కడితే, 136 రూపాయల విలువ గల పుస్తకాలు (వాళ్ళ కోరిక మేరకు), 6 రూపాయల విలువ గల పుస్తక ప్రపంచం, షుమారు 4000 పుస్తకాల పేర్లున్న ఉచిత కేటలాగు, ఖాతా వివరాలు రాసుకునే రికార్డు పుస్తకమూ వస్తాయి. ప్లస్ పోస్టేజీ ఉచితం. అంటే షుమారు సగానికి సగం లాభం అన్నమాట.


అక్కడితో ఆగిపోలేదు. 12 నెలలూ మానకుండా కట్టిన వాళ్ళకి కొన్ని శాశ్వత లాభాలు ఉంటాయి. ఎప్పుడు పుస్తకాలు గానీ, పుస్తక ప్రపంచంగానీ కొన్నా పది శాతం కమీషనూ, కొండకొచో అరువు చేరమన్నా అన్నిటికన్నా ఆసక్తికరమైనది ఇంటింటా స్వంత గ్రంధాలయాలు ఇంట గల వారి పేర్లు ఛాయా చిత్రాలలో సహా, పలువురికి ఉపయోగించగల విధంగా తీర్చి దిద్దిన సువర్ణ గ్రంథంలో వీళ్ళ పేరూ, ఫోటో కూడా చేర్చబడతాయి.

హెచ్.ఎల్.పి. సభ్యులు వాళ్ళు కొనే పుస్తకాల కన్నా వాళ్ళు ఉచితంగా ఎన్నుకునే పుస్తకాల కన్నా, నెల నెలా అదనంగా వచ్చే పుస్తకప్రపంచం అనే మాస పత్రిక కోసం వేయి కళ్ళతో ఎదురుచూసే వాళ్ళనటంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. అందులో సంపాదకీయం నుంచీ, కథల దాకా అన్నీ ఆసక్తిదాయకంగా ఉండేవి. వచ్చే నెల బంగీలో విడుదలయ్యే పుస్తకాల సమీక్ష ఉండేది అందులో. ఆ పుస్తకాలు కోరుకోవటమో, లేదా పాత వాటిల్లోనుంచీ ఏమైనా కోరుకోవటమో చేసేవారు. అవి కోరుకున్నా, కోరుకోకపోయినా ఆ సమీక్షలు చిన్న కథలాగా ఆసక్తికరంగా ఉండేవి. అవి పాఠకులు కూడా రాయొచ్చు. వాళ్ళకి అడపా దడపా పోటీలు పెట్టి బహుమతులు ఇచ్చేవారు. లేదా సగం కథ ఇచ్చి, పూరించమనే వాళ్ళు. అలా సభ్యుల సంఖ్య నానాటికీ పెరిగి లక్షల్లోకి వచ్చింది.

ఇవన్నీ ఒక ఎత్తు. ఆ పుస్తక ప్రపంచంలో వచ్చే బకాయ్ సుర వధ ఇంకో ఎత్తు. మన ఆంధ్రులకి ఆరంభశూరత్వం అన్న అప్రథ ఉండనే ఉంది కదా! అది ఎక్కడి సభ్యులు నిజం చేసేసి, చందా కట్టకుండా బకాయి పెట్టేసి ఆంధ్ర జాతిని కించ పరిచేస్తారేమోనన్న భయం లోంచీ, సభ్యులని జాగరూకులని

*ఏప్రిల్ 1971 నాటి హెచ్.ఎల్.పి సాధించినది*


- ***ఇప్పటి వరకు దాదాపు 29,000 చేరారు***
- ***వారు కోరుకున్న పుస్తకాలు 7,00,000 పైగా అందజేశారు.***
- ***ఇందులో 1,60,000 పుస్తకాలు ఉచితంగా పంపారు.***
- ***ఇవన్నీ 56,000 పైగా బంగీలలో ఖర్చులు భరించి రవాణా చేశారు.***
- ***పుస్తక ప్రియుల మాసపత్రిక పుస్తక ప్రపంచం 11,00,000 ఉచితంగా పంపారు.***




చేయటానికి పుట్టిందే ఈ బకాయ్ సుర వధ. 'వీరే శ్రీ బకాయ్ గారు చూడ్డానికి దొడ్డవారిలా ఉన్నారు గానీ..... బహు చెడ్డవారు' అంటూ పరిచయం చేస్తారు. అంతటితో ఆగకుండా ప్రతీనెలా ఒక కథ రూపేణా వస్తుంది. ఉదాహరణకి చందాదారుడు లొంగిపోబోయే సమయంలో స్వామి గ్రంధానందవారు ప్రత్యక్షమయ్యేవారు 'మస్తకాలకు బూజు పట్టేను మనసా.. అనుకుంటూ!' పెద్ద గడ్డంతో, చేతిలో పుస్తకంతో చూడగానే గౌరవించి, ఆయన మాట శిరసావహించాలి అనే లాగా ఉంటారు. చందాదారుడి చెవిలో ఏదో రహస్యం చెప్పి అంతర్ధానమయ్యేవారు. అతను బకాయి గారిని మాటల్లో పెట్టి ' ఆ బకాయికేం లెద్దురా' అని రివర్స్‌గేర్‌లో బురిడీలు కొట్టించి, చందా కట్టటానికి వెళ్ళిపోయేవాడు. మన బకాయి సురుడు కాలికి బుద్ధి చెప్పేవాడు. బాపూగారి ఆ కార్టూన్ మనస్సుకి హత్తుకునేలా ఉండేది. బకాయి పెట్టే, కాదు పెట్టే ఉద్దేశం ఉన్న పాఠకులకి అతి సున్నితంగా వాళ్ళ మనస్సు నొప్పించకుండా తెలియచేసేవారు.

అసలు పుస్తక ప్రియులు లోకమే వేరు. అది అందమైన కార్టూన్లతో చూపించేవారు. ఎట్టటి ఎండలో అందరూ చెమటలు కారుతుంటే, పుస్తకాభిమాని మాత్రం ఏ.సి.లో కూర్చున్నంత హాయిగా పుస్తకం చదువుతూ ఆస్వాదిస్తూ ఉంటాడు. అలాగే చెవులో మైకులు, హోరెత్తుతున్నా, భార్య చెవిన ఇల్లు కట్టుకుని పోరుతున్నా తన పుస్తక ప్రపంచమే తనది. అలా పుస్తక ప్రపంచం మాస పత్రిక ద్వారా పుస్తకాల ప్రపంచంలో మునిగి తేలే వీర పుస్తకాభిమానులకు జీవితం ఎలా పూలపాన్పులాగా ఉంటుందో, ఎలా నందనవనంలా ఉంటుందో, చెప్పకనే చెపుతుండేవారు.

హెచ్.ఎల్.పి. పాఠకలోకాన్ని ఉర్రూతలూగిస్తే, ఎమెస్కో పాకెట్ బుక్స్ పుస్తకాల ప్రపంచంలో ఒక సంచలనం రేపింది. హెచ్.ఎల్.పి విషయంగా ఎంతో ప్రోత్సాహం, సలహాలు ఇచ్చిన యం.యన్.రావుగారి అనుంగు మిత్రుడు శ్రీ ఐసెస్ బర్గ్‌గారి స్ఫూర్తితో పుట్టింది ఎమెస్కో. 'ఉత్తర భారతదేశంలో హిందీకెంత ప్రాచుత్యం ఉందో, దక్షిణ భారతదేశంలో తెలుగుకి కూడా అంత ప్రాచుర్యం ఉంది. మరి అలాంటప్పుడు హింది పాకెట్ బుక్స్ హిందీలో ఇస్తున్నట్టు, తెలుగులో మీరెందుకు పాకెట్ బుక్స్ ఇవ్వలేరు? మీకు పాఠకులకేమి కొరత, డిస్ట్రిబ్యూటర్ల కేమి కొరత? మీకు గుండె ధైర్యం లేదా? దానికి కావల్సిన పెట్టుబడి పెట్టే సొమ్ము లేదా? మీ తండ్రి, తమ్ముళ్ళు అండదండలు లేవా? ఏమిటి ఆలోచన' అని నిలదీశారు ఒకరోజు. ఆ ఆలోచన యం.ఎన్.రావుగారికి అప్పటికే లేకపోలేదు. రైటర్ పేరు చూడకుండా మిల్స్ అండ్ బూన్స్ అన్న పబ్లిషర్ పేరుంటే చాలు హాట్‌కేక్స్‌లాగా అమ్ముడుబోతాయి ఇంగ్లీషులో. ఎప్పటికైనా అలా మన తెలుగులో కూడా రచయిత పేరు మీద కాకుండా మన కంపెనీ పేరు మీద అలాగే హాట్ కేక్స్ లాగా అమ్ముడు పోవాలి. ఆ కల నిజం కావాలి అనే వాళ్ళు ఎప్పుడూ! ఎప్పుడు చూసినా పుస్తకాలలో మునిగి తేలే తన పెద్ద కూతురు ప్రమీలతో, 'చూస్తూ ఉండు నీకోసమన్నా మన కంపెనీ మీద పుస్తకాలు వేద్దాము. వాటికి ప్రత్యేక బాణీ ఉందని అందరూ అనాలి. అవి చిరస్థాయిలా నిలిచిపోవాలి. దానికోసం ఎంతైనా మేము పాటుపడతాము' అనేవారు.




అలా తన ఆలోచనకి స్ఫూర్తి, తండ్రి ప్రోత్సాహం, తమ్ముని అండదండలు తోడవటమే ఆలశ్యం, ప్రభంజనంలా దూసుకుపోయారు. 'ఏమిటీ నెలకు నాలుగు పుస్తకాలా? అదీ ఒక్కొక్కటి కేవలం రెండురూపాయలకా? నలుగురు రచయితలను ఒక్కత్రాటి మీద నడిపించటం మాటలా? పేరున్న రచయితలెవరన్నా వీళ్ళ నిబంధనలకి కట్టుబడిఉంటారా? రచయితలకి, ప్రెస్సుకి, డిస్ట్రిబ్యూటర్లకి పోను ఇంక వీళ్ళకేం మిగులుతుంది?' ఇలా రకరకాల విమర్శలు, మాటల తూటాలు, ఆప్యాయంతో కూడిన మందలింపులు, భవిష్యత్తుని గోచరింపచేసే సలహాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చింది. మొక్కవోని గాంభీర్యంతో, చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో చెరగని చిరునవ్వుతో ముందంజ వేశారు. లక్ష్మణస్వామి లాంటి తమ్ముడు యం.వి.సుబ్బారావు అడుగడుక్కీ చేదోడు వాదోడుగా ఉంటున్నా కూడా, తెర వెనకే ఉండిపోయారు. అసంఖ్యాకంగా వచ్చిన నవలలన్నీ తీరిగ్గా చదివి, వాటిల్లోంచీ నాలుగు కాలాలు నిలిచిపోవాల్సిన నాలుగు ఆణిముత్యాలని ఏరింది సుబ్బారావుగారే. ఎమెస్కోని చరిత్ర చిరస్థాయిగా నిలబెట్టిన ఆ మొదటివి సెప్టెంబర్ 1967లో ప్రచురించబడి, ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి ఎమెస్కోని చరిత్రలో చిరస్థాయిగా నిలబెట్టిన ఆ మొదటివి

*1.దిండు క్రింద పోక చెక్క - విశ్వనాథ సత్యనారాయణ*

*2. బ్రతికిన కాలేజీ - పాలగుమ్మి పద్మరాజు*


*3. సాక్షి - ముళ్ళపూడి వెంకటరమణ*

*4 గ్రహణం విడిచింది. - ద్వివేదుల విశాలాక్షి*

వీళ్ళందరూ అప్పటికే నవలా లోకంలో పెద్ద పీట వేసుకుని కూర్చున్నవాళ్ళే.

అప్పటికే ఎ.పి.బి.డీ, హె.చ్.ఎల్.పి విజయఢంకాలు మ్రోగిస్తూండటంతో ఆ నాలుగూ విడుదలయిన రోజు, పాఠకమహాశయులతో ఎ.పి.బి.డి ఆఫీసు క్రిక్కిరిసి పోయిందిట. పాఠకులకు తమ మీద ఉన్న అభిమానానికి, వీరికి కళ్ళు చెమర్చాయి.

అలా మొదలైన ఆ నాలుగు, అయ్యో అన్న నోటితోనే ఔరా అని ముక్కు మీద వేలేసుకునేలా చేశాయి. అంతే ఇంక ఎక్కడా వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పని రాలేదు. రెండేసి వాల్యూమ్‌లు, పెద్ద నవలలు రాసి నవలారాణిగా పేరుగాంచిన యద్దనపూడి సులోచనారాణి గారి చేత ఒక చిన్న నవల రాయించగల ఘనత ఆయనకే దక్కింది. ఎమెస్కో పేరు యం.శేషాచలం అండ్‌కో నుంచే పుట్టిందని వివరించారు. ఎం.ఎన్.రావు, ఎం.ఎస్.కోని కొంచెం మార్చితే, అంటే రెండు ఇ లు కలిపితే ఎమెస్కో (EMESCO అయిందన్నారు.




ఎమెస్కో మీది అభిమానం కొద్దీ ఇతర పుస్తకాలు వద్దూ, మీరు వచ్చే నెల ఏ పుస్తకాలు ప్రచురిస్తే మాకు అవే కావాలి, రచయితలు ఎవరన్నా సరే అన్న పాఠకుల అభిమానంలోంచి పుట్టుకొచ్చిందే ఎమెస్కో బుక్ క్లబ్.

ప్రజలలో గ్రంథ పఠనాభిలాషను ఇనుమడింపజేసి, పాఠకులకు తరగని విజ్ఞానాన్ని పంచిన ఎమెస్కో రూపశిల్పి ఎం.ఎన్.రావు పూర్తి పేరు మద్దూరి నరసింహారావు. పేరు లోనే నరసింహారావు ఉన్నాడు కానీ, ఆయన ఉగ్రరూపం దాల్చగా చూసిన వారెవ్వరూ లేరు. చాలా నిరాడంబర జీవి. మొహం మీద చిరునవ్వు ఎప్పుడూ చెదిరేది కాదు. ప్రపంచప్రఖ్యాతి గాంచినా, విదేశాలన్నీ తిరిగి వచ్చినా, ఎదుటి మనిషిని ఆ మనిషి పరంగా అర్థం చేసుకునే వాళ్ళు. రచయితలు / రచయిత్రులు వాళ్ళ వ్రాతపతి ఇవ్వటానికి వచ్చినపుడు అవి ఊరికే ఇచ్చి వెళ్ళిపోయేవాళ్ళు కాదు. వాళ్ళలో చాలామంది, 'ఈ సన్నివేశం బాగా వచ్చింది వినండి రావుగారూ', అంటూ అక్కడక్కడ ఏవో చదివి వినిపించేవాళ్ళు. లేకపోతే ఒక సన్నివేశానికి వాళ్ళు ఎంత తపన పడ్డారో వివరంగా చెప్పేవాళ్ళు. తనకి ఎంత పని ఉన్నా, అవి అన్నీ ఓపిగ్గా, చిరునవ్వుతో వినేవాళ్ళు. 'ప్రతి రచయిత ఒక ప్రసవవేదనలాంటిది పడతాడు. అందులోంచి పుట్టిన తన కథను చూసి మురిసిపోతాడు. అది మనం అర్థం చేసుకోవాలి' అనేవాళ్ళు. ఆయన మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో ఎం.ఏ.ఎకనామిక్స్ చేశారు. ఆ కాలేజీ విద్యార్థులని ఆ రోజుల్లో జెంటిల్మన్ ఆఫ్ క్రిస్టియన్ కాలేజీ అనేవారట. రావుగారు ఎప్పటికీ జంటిల్మనే.

మిల్స్ అంట్ బూన్‌లాగా పాపులర్ అవాలన్న రావుగారు దానికన్నా విలక్షణంగా తీర్చిదిద్దారు ఎమెస్కోని. అందులో ఎన్నో రకాల ప్రక్రియలు చేపట్టారు. ఒక్కో నెలా ఒక్కో కొత్త ప్రయోగం ఉండేది. అన్నీ కవితలు ఒకసారి, అన్నీ నాటకాలు ఒకసారి, అన్నీ అనువాదాలు ఒకసారి, అన్నీ ఒకే రచయిత్రివి ఒకసారి ఉండేవి. ఇంకా చెప్పుకోదగ్గ విశేషం విద్యార్థి సాహితి, కథాంజలి, 1,2,3 మూడు భిన్న యూనివర్సిటీల విద్యార్థులకి కథల పోటీలు పెట్టి, వారికి బహుమతులు ఇచ్చి, వాటిని పై పుస్తకాలలో కథల, సంకలనాలుగా వేశారు. వాటి

న్యాయ నిర్ణేతల్లో విద్వాన్ విశ్వంగారు ఒకరు. అనేక ప్రక్రియలతో కూడిన ఎమెస్కో పుస్తకాలు 800 పై చిలుకే అయ్యాయి.

రచయితలకి వారి పుస్తకం వేసినందుకుగాను రాయల్టీ, వారి పుస్తకాలే ఇచ్చి ఊరుకోకుండా ఆ నెలలో అచ్చయిన మిగతా పుస్తకాలూ, అక్కడ్నుంచీ తరువాత ప్రచురించిన అన్ని పుస్తకాలూ ఉచితంగా ఇచ్చేవారు. అంటే ఇంక వాళ్ళని తమ సభ్యులుగా ఉచితంగా చేర్చుకున్నట్టన్నమాట. అంత రాయల్ ట్రీట్‌మెంట్ ఉండేది కాబట్టే, ఎంత పెద్దవారైనా, 'ఎమెస్కో వారు నా పుస్తకం ప్రచురిస్తామన్నారయ్యా' అని సంతోషంగా చెప్పుకునేవారు. ప్రాచుర్యం పొందిన కొద్దీ ఒత్తిడి ఎక్కువయ్యేది. నాలుగు పుస్తకాలా, బాబోయ్! అన్న రోజుల్నుంచీ నాలుగేనా? అన్న రోజులకి రావటంతో స్థలాభావం వల్ల కొన్ని వెనక్కి తిప్పి పంపాల్సి వచ్చేది. అలా పంపేటప్పుడు కూడా నొప్పింపక, తానొవ్వక పద్ధతిలో పంపేవారు. కొంత మంది కొత్త రచయితలు వచ్చి, నా పేరు ఎమెస్కోలో చూసుకోవాలని ఉంది, మీరు నాకొక్క అవకాశం ఇవ్వండి అని బతిమాలితే లాభనష్టాలు బేరీజు వేసుకోకుండా వెంటనే ప్రచురించన సందర్భాలు ఎన్నో!




ఎమెస్కో వటవృక్షం నీడలో ఎందరో డిస్ట్రిబ్యూటర్లు, ఏజంట్లు, నిరుద్యోగులు సేద దీరారు. ఇంట్లో కూర్చుని డబ్బు సంపాదించే మార్గం రీడర్సు రిపోర్టులు రాయటం ద్వారా ఏర్పరిచారు. ప్రచురించే ప్రతి పుస్తకం, ప్రజల నాడి తెలుసుకోవటం కోసం, ఒకక్రాస్ సెక్షన్ ఆఫ్ సొసైటీ చేత చదివించేవారు. అంటే ఒక గృహిణి, ఒక విద్యార్థి, ఒక నడివయస్కుడు, ఒక వృద్ధుడు, ఒక మధ్య తరగతి కుటుంబీకుడు, ఒక ధనికుడి చేత చదివించేవారు. వీరు కాక పేరెన్నికగన్న నళినీకాంతరావు, సింగరాచార్యలాంటి ఎడిటర్స్ ఉండనే ఉన్నారు.

'మంచి పుస్తకం నీడన మనసెంతో చల్లన' కాప్షన్‌లో ఏ వారపత్రిక తిరగేసినా హెచ్. ఎల్. పి. ఎమెస్కో పేర్లు కనబడేలాగా విరివిగా ఎడ్వర్‌టైజ్మెంట్స్ వచ్చేవి. అవి ఒక్కోసారి బుల్లి కథలుగా కూడా ఉండేవి. ఏదైనా పుస్తకం గురించి దాన్ని విమర్శిస్తున్నారు రావుగారూ అన్నా ఆయన మొహం మీది సహజమైన చిరునవ్వు చెరిగేది కాదు. 'ఖంగారు పడకండి. చెడు పబ్లిసిటీయే. పాఠకుల సంగతి మీకు తెలియదు. అది బాలేదు. చదవద్దు, అంటే ఎందుకు చదవద్దన్నారోనని ప్రత్యేకం చదువుతారు' అనేవారు.

పుస్తకాల విలువ పాఠకులకి తెలియాలంటే ప్రజల వద్దకి పుస్తకాలు తీసుకెళ్ళాలని ఆంధ్రదేశమంతటా మూడేసి రోజులు పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. పబ్లిషర్స్ అందరిలో ఒక సమైక్యభావం కలగజేసి అందరితో కలిసి ఒక పండగలాగా పుస్తక ప్రదర్శనలు పెట్టేవారు. అందులో సాయంకాలాలు కవితా గోష్టులు, కవి సమ్మేళనాలు ఉండేవి. ఒక రోజు ప్రత్యేకించి బాలలకి కేటాయించి వారికి చాక్లెట్లు పంచి పెట్టేవారు. ఇతర రాష్ట్రాల్లో నేషనల్ బుక్ ఫెస్టివల్స్ పెట్టినప్పుడు మన తెలుగు పుస్తకాలు లేకపోవటం అమానుషం అని ఆంధ్ర పబ్లిషర్స్ నందరినీ కలిపి అసోసియేషన్ ఏర్పరచి, అందరిదీ కలిసి ఒక స్టాల్ పెట్టించేవారు. అలా మనదేశంలోనే కాదు ఒక సారి ఫ్రాంక్‌ఫర్ట్‌లో కూడా తెలుగు స్టాల్ పెట్టించారు. అలాగే అన్ని రాష్ట్రాల్లోనూ హిగ్గిన్ బాదమ్స్‌లో తెలుగు పుస్తకాలు దొరికేలా చేశారు.

ఇంటింటా సరస్వతీ పీఠం నెలకొల్పే ఆయన పుస్తకయజ్ఞం అక్కడితో ఆగలేదు. తెలుగు గడ్డకు దూరమైనా, తెలుగుతనం ఉట్టిపడే పుస్తకాలపై మక్కువ ఉన్న ప్రవాసాంధ్రులకి పుస్తకాలు, ఎమెస్కో బుక్ క్లబ్ ఇంటర్నేషనల్ అనీనూ, ఇండియా బుక్ ఎక్స్‌పోర్ట్ పేరిటా అందజేసేవారు.

ప్రవాసాంధ్రుల కోసం వెలువడిన ఒక ఆణిముత్యం బాలల బొమ్మల రామాయణం. యం.ఎన్.రావుగారు, బాపు, రమణగార్లు

కలిస్తే ఎంత ఘనవిజయం సాధించగలరో అనటానికి ఇదొక మచ్చుతునక. పేజీ, పేజీకి బాపుబొమ్మలు, దానికింద కట్టె, కొట్టె, తెచ్చె అన్నంత టూకీగా పేజీకి రెండేసి లైన్ల చొప్పున రమణగారి కథనం! వీటిని సంస్కృతి ఇంటర్నేషల్ పేరిట, ప్రత్యేక కవర్ డిజైన్లతో, ప్రత్యేక పేపర్‌తో ప్రచురించారు. దీన్నే ఫ్రెంచి, స్పానిష్, ఇటాలియన్, ఇంగ్లీషు భాషలలోకి కూడా అనువదించి ప్రచురించారు.

రామాయణమే కాక మన తెలుగులో ఎన్నో పసందైన కావ్యాలున్నాయి. బలవంతంగా పాఠ్యపుస్తకాలలో తప్ప చదవని మనుచరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద మొదలైన అపురూపమైన కావ్యాలన్నీ చదివి తీరాలనిపించేటట్లుగా సులభశైలిలో ఎమెస్కో సంప్రదాయసాహితి పేరున ప్రచురించారు. వాటికి పీఠిక విశ్వనాథ సత్యనారాయణగారు రాశారు.

ఎమెస్కో సాంప్రదాయ సాహితి ఆరంభించేటప్పుడు ఇచ్చిన ప్రకటన ఇది.

*తెలుగు పలుకుల తల్లి వెలియు మీ ఇంట*

*తేనె కయితల వల్లి తులలేని పంట*

*ఇంటింటా సరస్వతీ పీఠం*

*ఎమెస్కో సాంప్రదాయ సాహితి*

*ఉగాదికి శుభారంభం.*

ఎమెస్కో చిల్డ్రన్ బుక్స్ నాలుగు వేశారు 1970లో. అవి కొంగ డాక్టరు, పాయసం తాగిన పిచుక, ఎండ్రకాయయుక్తి, మీ ఆరోగ్యం.

క్రమేణా నాలుగు పాకెట్ బుక్స్ పోయి ఎమెస్కో క్రౌన్ సిరీస్ పేరిట నెలకి ఒక్కటే, సభ్యులకి 10 రూపాయలకి వచ్చేది. అందులో పాకెట్ బుక్స్‌లో వచ్చిన వాసిరెడ్డి సీతాదేవి రచించిన వైతరిణిని మళ్ళీ ప్రచురించారు, దాని కున్న పాపులారిటీ దృష్ట్యా.

ఒక నెల ఒక నవల బాలేదన్నమాట మీద సంపాదకీయంలో ఇలా రాసారు. కొంత మంది బాగుందన్నారు. కొంతమంది చాలా బోరుకొట్టిందన్నారు. లోకోభిన్నరుచి కదా మరి! బాగా లేదన్నవారు బాగా కోప్పడ్డారు. తిట్టారు. అది మరి న్యాయమే! ఎందుకంటే 10 రూపాయిలు పెట్టి కొన్నారు కదా! మరి వారు ఖర్చు పెట్టిన దానికి సరైన విలువ అందకపోతే బాధేయదూ! సభ్యుల అభిరుచి మేరకు నవలను అందించాలంటే వారి వద్దనుండీ కొంత ఫీడ్‌బాక్ ఉండాలి. అప్పుడే పుస్తకాల ఎన్నిక విషయంలో సరైన మార్గం అవలంబించగలమని ఒక ప్రశ్నా పత్రం ప్రచురించారు.

ఇంతవరకూ వెలువడిన ఎమెస్కో క్రేన్ బుక్స్‌లో నాకు నచ్చిన కొన్ని పుస్తకాలు.

కారణాలు

1. ఇతివృత్తం బాగుంది / బాగాలేదు/ పరమచెత్త
2. సన్నివేశాలు బాగున్నాయి / బాగాలేవు
3. కథనం బాగుంది / బాగాలేదు
4. ఏకబిగిన చదివించింది / చదివించలేదు.

సభ్యుని సంతకం

మనిషి మనస్సు అంచెలంచెలుగా ఎదగాలన్నట్టుగా పాఠ్యపుస్తకాల నుంచీ నవలలు, నవల నుంచీ గ్రంథాలు, గ్రంథాల నుంచీ పురాణాల నుంచీ స్తోత్ర రత్నావళికి ప్రజల దృష్టి మళ్ళించారు. జీవిత పంథాలెన్నయినా, గమ్యం ఒక్కటే. దారులెన్నయినా, తీరం ఒక్కటే. అదే దైవ సాన్నిధ్యం. అందుకే ప్రాగ్ భారతి పేరున ఆది - అనాది, గీతామృతం, లలితా సహస్ర నామాల, విష్ణుసహస్రనామం, ఆదిత్య హృదయం ప్రచురించారు. వీటికి వ్యాఖ్యానం ఇలపావులూరి పాండురంగారావుగారు రాసారు.

ఎమెస్కో వచన రామాయణం పదమూడు సంపుటాలలో సులభశైలిలో ప్రచురించి హె.ఎల్.పి సభ్యులకి ఉచితంగా ఇచ్చారు. అదికాక ముళ్ళపూడి వెంకట రమణరాసిన కృష్ణలీలలు వేశారు. కృష్ణుడిని చిలిపి కృష్ణుడిగా, ప్రేమికుడిగా రాజకీయవేత్తగా, తాత్వికుడిగా చిత్రించారు. పుస్తకాల రీత్యా బాపు, రమణలతో ఆయనకు చాలా ఆంతరంగిక స్నేహం ఉండేది. బాపు రమణలు ఆయనకు చేదోడువాదోడుగా నిలిచారు. ప్రతి ఎమెస్కో పుస్తకానికీ కవర్ డిజైను బాపుదే! రెండు రూపాయలు పుస్తకానికి ఎడ్వర్‌టైజ్ మెంట్లు బాపుగారి రెండు గీతలలో, దానికి రమణగారి రెండు మాటలలో మనసుకి హత్తుకు పోయేవిగా ఉండేవి. ఏకాలానికి తగ్గట్టుగా ఆకాలానికి ముచ్చటైనవిగా ఉండేవి. చలికాలంలో ఉన్నికోట్ల కన్నా వెచ్చనైనదీ మండే ఎండల్లో పుస్తకం నీడలో ఏసి కన్నా చల్లనైనదనీ, వర్షాల్లో గొడుగు వంటిదనీ, ఇలాంటి భావాలెన్నో చొప్పించి, ఆ పుస్తకాలు కొనాలన్న ఆలోచన అక్షరాస్యుల హృదయాల్లో నాటేవారు.

బాపు, రమణలు సినిమావాళ్ళు కావటంతో వాళ్ళ చుట్టూ ఎవరో ఒకరు సినిమా ప్రముఖులు ఉంటూనే ఉండేవారు. వాళ్ళని రావుగారికి పరిచయం చేస్తే, ఆహా! అలాగా అని ఊరుకునేవాళ్ళట. ఇంటికొచ్చాక పిల్లలతో చెప్పాక కానీ తెలిసేది కాదు, వాళ్ళు ఎంత ప్రముఖులో, ఆయనకి సినిమా ప్రముఖులయిన నాగేశ్వరరావు, భానుమతి, ఆరుద్రలతో స్నేహం ఉన్నా అది అంతవరకే. సినిమాలు చూసేవారు కాదు. భానుమతి అత్తగారి కథలు, ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం ప్రచురించారు.

అక్కినేని నాగేశ్వరరావుగారి కథానాయకుని కథని ముళ్ళపూడి వెంకటరమణగారు రచించారు. దానికి ప్రీపబ్లికేషన్ ఆఫర్ పెట్టారు. పుస్తకం రిలీజుకి ముందే దాన్ని కొన్నవారికి కొంత రాయితీ ఉంటుంది. ఆ పుస్తకం గత రికార్డులు బద్దలు కొట్టింది. 5,500 కాపీలు అమ్ముడు పోయాయి. దాని బుక్ రిలీజ్ ఫంక్షను హైదరాబాదులో అట్టహాసంగా జరిగింది. ఆ సభని అప్పటి చీఫ్ మినిస్టర్ నీలం సంజీవరెడ్డి ప్రెసైడ్ చేస్తే, చీఫ్ జస్టిస్ రాజమన్నార్ రిలీజ్ చేశారు. పుస్తకాలు ప్రింట్ అవటంలో ఆలశ్యమవటం వల్ల మద్రాసు నుంచీ హైదరాబాదుకు విమానంలో తీసుకురావల్సి వచ్చింది. దాని విజయం తర్వాత ఎన్నో ప్రిపబ్లికేషన్ ఆఫర్లకి, బుక్ రిలీజ్ ఫంక్షన్‌లకి శ్రీకారం చుట్టింది.

తెలుగులో ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం, గేయాలు, కవితలు ఉపనిషత్తులు, పురాణాలు, విజ్ఞాన వీచికలు, పిల్లల కథానికలు, స్త్రీసాహిత్యం రావట్లేదంటూ బాలల కోసమని ఒక ఏడాది బాలల దినోత్సవం సందర్భంలో ఆకతాయి, మణిమాల వంటి పుస్తకాలు అయిదు వేశారు. అలాగే తక్కువ ధరలో డిక్షనరీలు కూడా అందుబాటులోకి తెచ్చారు. ఇందిరాగాంధీ వ్యాసాలు, ప్రసంగాలు ప్రచురించి అప్పటి ప్రధానమంత్రికి కూడా పరిచితులయ్యారు. సుబ్బారావుగారి చేత ఆ పుస్తకం స్వయంగా ఆవిడ చేతికి అందజేశారు.

లౌకిక వృత్తిని అలౌకికంగా మార్చి, బిజినెస్ అంటే ధనార్జన మాత్రమే కాదు, జాతి సంస్కృతిని నిలపాలి, తెలుగు భాషని వృద్ధి చెందించాలి అన్న తపనతో దీక్షతో, నిరంతర శ్రమతో పబ్లిషింగ్ రంగానికే ఒక యుగపురుషునిగా వెలిశారు. ఒక్క తెలుగు పబ్లిషర్స్‌తోనే కాకుండా ఆలిండియా పబ్లిషర్ల ఫెడరేషన్ రెండు విడతలు (పదేళ్ళు) ప్రెసిడెంటుగా చేయటం వల్ల అందరితోనూ సత్సంబంధాలు వెలిశాయి. అలా దక్షణాది నుండి రెండుసార్లు ప్రెసిడెంటుగా చేసిన ఘనత ఆయనకే దక్కింది. ఆ విధంగా ఉత్తర, దక్షిణాది దేశాల మధ్య వారధిలా నిలిచారు. Doyen Of Telugu Publishing House - ప్రచురణ కర్తలలో మాన్యుడుగా సాహితీ ప్రపంచంలో పేరు గాంచారు. ఆయన సేవలు మనదేశానికే పరిమిత మవకుండా ప్రపంచదేశాలెన్నిటికో విస్తరించాయి. విదేశాల్లో ఎన్నో సెమినార్లలో పాల్గొన్నారు. ఆయన రచించిన పుస్తకానికి ప్రశంసలనందుకున్నారు. ఈ అనుభవాలన్నిటినీ జోడించి తనే స్వయంగా ఎన్నో సెమినార్లు నిర్వహించారు.

దక్షిణ భాషా పుస్తక ప్రచురణ సంస్థ చైర్మనుగా కొన్నేళ్ళు పని చేసి దక్షిణ భాషలలో పేరెన్నిక గలిగిన గ్రంధాలను సామాన్యునికి అందుబాటులోకి తెచ్చరు. ఆ పుస్తకాలని కొనాలి, చదవాలన్న జిజ్ఞాస రేపెట్టటానికి మరోకొత్త మార్గం అవలంబించారు. రావుగారి ఆధ్వర్యంలో వాటి మీద బుక్‌రివ్యూ కంటెస్ట్ పెట్టి, అందులో బాగా రాసిన వాళ్ళకి ప్రైజులు ఇస్తామన్నారు. అనూహ్యంగా ఆ పుస్తకాలు ఎప్పటి కన్నా పదిరెట్లు అమ్ముడుపోయాయి. 550 మంది రివ్యూలు రాశారు. అది రాయటానికి సూళ్ళూరి పేట నుంచీ 55 మైళ్ళ

దూరం ప్రయాణం చేసివచ్చి మరీ పుస్తకం కొన్నారు.

యు.ఎన్.రావుగారు చిరస్మరణీయులుగా నిలిచి పోవటానికి కారణం ఆయన పాటించిన విన్ - విన్ ఫిలాసఫీనే. పుస్తక ప్రపంచంలో తనే నిలిచిపోవాలని కానీ, తన కంపెనీయే విజయఢంకా మోగించాలని ఎప్పుడూ అనుకోలేదు. తమ కంపెనీ ద్వారా తక్కిన పబ్లిషర్స్‌కి లాభమే చేకూరింది కాని నష్టం కలగలేదు. తమ విజయ పరంపరల వెనక ఎందరో రచయితల కల్పనాశక్తి, పబ్లిషర్ల కృషి, ఆర్టిస్టుల సృజనాత్మకత, డిస్ట్రిబ్యూటర్ల శ్రమ, ఏజంట్ల సహకారం ఉద్యోగుల అంకితభావం ఉన్నాయి తప్ప కేవలం తన ప్రత్యేకత ఏమీ లేదనే నిగర్వి ఆయన. ముఖ్యంగా తమ మూడూ బ్రాంచీలు ఒక ఫామిలీ ఇనిస్టిట్యూషన్ కాబట్టి, తక్కిన పార్టనర్స్ అయిన కుటుంబ సభ్యులంతా ఒక్క తాటి మీద నడపటం వల్లే విజయం చేకూరింది అంటారు.

ఆయన ప్రశంసలకు పొంగి పోలేదు. విమర్శలకు కృంగిపోలేదు. ఎన్నడూ పల్లెత్తు మాట ఎవర్నీ విమర్శించలేదు. ఎవరైనా ఉద్యోగి తప్పు చేసినా దండించలేదు. ఏ పుస్తకమైనా అమ్ముడు పోకపోయినా ఆ రచయితను తిట్టుకోలేదు. ఎమెస్కో వటవృక్షం నీడన ఎందరో డిస్ట్రిబ్యూటర్లు, ఏజంట్లు సేదదీరారు. ఒకసారి విజయవాడలో రైలు దిగితే ఒక ముసలాయన పరుగెత్తుకుంటూ వచ్చి ఈయన కాళ్ళకి దండం పెట్టారట. ఏమిటి కారణమని అడిగితే, బాబూ, మీ చేతి చలవవల్ల మీ పుస్తకాలు అమ్ముకు బ్రతుకుతున్నాను. కొడుకుల దుర్మార్గానికి బలికాకుండా ఈ వయస్సులో నాకో జీవనోపాధి కలిపించారు అన్నారుట.

పాఠ్య పుస్తకాల కోసం మద్రాసు సమీపాన ఆర్నీలో 1974 లో ఇంకో బ్రాంచీ తెరిచారు. అప్పుడే ఐ.ఐ.టీలో ఎం.ఎస్.సీ ముగించిన తన కుమారుడు శేషాచలం కుమార్‌కి ఆ బ్రాంచీ అప్పగించారు. గవర్నమెంటు వద్ద హోల్ సేల్ రేట్‌కి కొని ఆ ఊర్లో, చుట్టు పక్కల వాళ్ళకి రిటైలు ధరకి అమ్మేవారు. ఆ షాపులో వేసవిలో బాగా రద్దీగా ఉండేది. రాత్రనక పగలనక పని ఉండేది. అబ్బాయి బాగా చేస్తున్నాడని మురిసిపోయేవారు. కానీ అబ్బాయి తిండి తిప్పలు మాని మరీ పనిచేస్తున్నాడని, ఆఖరి అమ్మాయిని అతనికి తోడుగా పంపారు. ఆ అమ్మాయి బియ్యే చదివినా వంటలో ఓనమాలు కూడా రావు. ‘వంట రాని దాన్ని వాడికి తోడుగా పంపుతున్నారు. వాడికేమో వంట వచ్చినా క్షణం తీరిక లేదు. దీన్ని కూడా పస్తులు పెడతాడేమో‘ అన్న భార్య లీలావతి మాటలకు నవ్వి, ‘చెల్లెల్నెలా పస్తుపెడతాడు? దాని కోసమన్నా వండుతాడు. వాడూ తింటాడు. రోజూ అన్న చేస్తుంటే చూస్తూ కూచోలేకపోతే అమ్మాయి అయినా వంట నేర్చుకుంటుంది. ఏదొచ్చినా మన మంచికే‘ అన్నారు. అలా ప్రతిదో ఒక సమస్యలా కాకుండా దానిలోని మంచి చూసేవారు. ఆయన పథకం వృధా కాలేదు. చెల్లెలు వంట నేర్చుకుంది, అన్నాచెల్లెళ్ళ మధ్య అనురాగం మరింత పటిష్టమైంది.

భార్య బి.య్యే మాథ్స్ చదివిందనీ, పిల్లల చదువు సంధ్యలు తనే చూసుకుంటుందనీ, సెన్సారుబోర్డ్ మెంబరనీ గర్వంగా చెప్పుకునేవారు. ఆవిడ వల్లే తనకి కలిసి వచ్చిందని కూడా చెప్పేవారు. ఆయనకు ముగ్గురమ్మాయిలు, ఒకబ్బాయి. నలుగురినీ సమానంగా ఎమ్మేలు చదివించారు. ఆడపిల్లలకి చదువెందుకని ఎవరైనా అంటే, ‘రేపు వాళ్ళకి ఉద్యోగం చేయాలనిపిస్తే మానాన్న నన్ను చదివించలేదని బాధ పడకూడదు‘ అనేవారు. అబ్బాయి ఆర్మీ అనుభవంతో 1975 బిజినెస్‌లో కొస్తానంటే సంతోషంగా రమ్మన్నారు. అంత తెలివైనవాడు అమెరికా వెళ్ళొద్దా. మా అబ్బాయి అయితే కాళ్ళు విరగ్గొట్టి పంపేవాళ్ళం అన్న వాళ్ళు లేకపోలేదు. వాడికి ఇష్టం లేని పని చేయించను అనేవారు. అలాగా బిజినెస్‌లో స్వంత నిర్ణయాలు తీసుకునే అధికారం కూడా ఇచ్చారు. కానీ తను మాత్రం బిజినెస్ నుంచీ తప్పుకోలేదు. తన వంతు సేవ ఆయన చేస్తూనే ఉన్నారు. ఆయన తదనంతరం కొన్నాళ్ళు తమ్ముడు, కొడుకు ఈ సంస్థలని నడిపి, అనివార్యకారణాల వల్ల విజయకుమార్‌గారికి ఇచ్చేసారు.

అక్షరమే ఆయన శ్వాస, పుస్తకాలే ఆయన తరగని ఆస్తి, సంస్థలే ఆయన పిల్లలు, రచయితలే ఆయన ఆప్తమిత్రులు, ఉద్యోగులే ఆయన బంధువులు, తోటి పబ్లిషర్సే ఆయన శ్రేయోభిలాషులు. అలా ఆయన ప్రతి ఆలోచన, మాట చూపు, బాట పుస్తకాలతో ఆయనకున్న అనుబంధం అంత గొప్పది.

ఆయన పుస్తకాల మధ్య తిరుగుతూ, తిరుగుతూ పోవాలనేది ఆయన అంతిమ కోరిక. అజాత శత్రువైన ఆయన కోరిక తీర్చటంలో తప్పులేదనుకున్నాడేమో ఆ భగవంతుడు 1978లో ఢిల్లీలో ఇంటర్నేషనల్ బుక్ ఎగ్జిబిషన్‌కు వెళ్ళినపుడు ఆయన కోరిక తీరింది. అసలు ఆ ముందురోజే, ఆ ఎగ్జిబిషన్‌లోనే, పుస్తకాల మధ్యే ప్రాణం పోవాల్సింది. ఆ రోజు షార్ట్ సర్క్యూట్ అయి పెద్ద ప్రమాదం జరిగింది కానీ, అందరూ క్షేమంగా బయట పడ్డారు. బహుశా ఆయన పుస్తకాలకి పట్టిన ఆ పరిస్థితి చూసి అల్లాడిపోయి అక్కడే చిక్కుబడిపోయిందేమో, మర్నాడు సూర్యోదయాన్ని చూడలేదు. ఆయన శరీరం దీర్ఘ నిద్రలోకి జారుకుంది.

ఏ ఢిల్లీలో అయితే అంతిమ శ్వాస విడిచారో, ఆ ఢిల్లీలోనే ప్రభుత్వం తెలుగు పుస్తక ప్రపంచానికి ఆయన చేసిన ఎనలేని సేవని గుర్తించి అలాంటి సేవలనే ఇతర భాషలలో అందించిన జవహర్‌లాల్ నెహ్రూ, నిరాద్ సి చౌదరి, మున్షీలతో పాటు ఆయన వారసులకు మెమెంటో బహుకరించింది. హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఆయన పేరు పది కాలాల పాటు నిలిచి పోయేలా చేసింది. అక్కడే కాదు ఎక్కడ సాహితీ సదస్సులు జరిగినా, ఎక్కడ సాహితీ గుబాళింపులు కలిగినా, ఎక్కడ అక్షరమాలలు కొత్తవి వెలుగులోకి వచ్చినా, యం.ఎస్.రావుగారు వాటి అక్షరాల్లో చిరస్థాయిగా కనిపిస్తూనే ఉంటారు.

# సినీ పబ్లిసిటీ ఆర్టిస్ట్ ఈశ్వర్

ఏ సినిమా ఐనా విజయవంతం కావడం వెనుక పబ్లిసిటీ పాత్ర ఎంతవుంటుందో అందరికీ తెలిసిందే. ఇప్పుడైతే రకరకాల టి.వి. ఛానెల్సూ, వెబ్ సైట్లతో సినిమా పబ్లిసిటీ కొత్త దారుల్లో పయనిస్తోంది కానీ పాతిక ముప్పై సంవత్సరాల క్రిందటైతే వాల్ పోస్టర్స్ కూడా పబ్లిసిటీలో కీలకమైన పాత్ర వహించేవి. పైగా వాల్ పోస్టర్స్‌ని చిత్రకారులు స్వయంగా వర్ణ చిత్రాలు గీసి, అందమైన అక్షరాలు రాసి డిజైన్ చేసే వాళ్ళు. కేవలం వాల్ పోస్టర్సే కాక, నిలువెత్తు హోర్డింగ్స్, కటౌట్స్ కూడా చేత్తోటే చిత్రించేవాళ్ళు. ఈ కాలంలో ఫోటో షాప్, ఫోటో ఇంపాక్ట్ లాంటి వివిధ సాఫ్ట్‌వేర్లూ, రెడీమేడ్‌గా దొరికే ఫాంట్లూ, వినైల్ ప్రింటింగ్ టెక్నాలజీ..ఇవన్నీ ప్రభంజనంలా చుట్టుముట్టి సినీ పోస్టర్స్ డిజైనింగ్ విధానాన్ని సమూలంగా మార్చివేశాయి. ఇందువల్ల పోస్టర్స్ డిజైనింగ్ లోనూ , హోర్డింగ్స్ లోనూ చిత్రకారుల పాత్ర తగ్గిపోయింది. 30-40 సంవత్సరాల క్రిందట కేతా, ఈశ్వర్, గంగాధర్, ఎస్.వి.రామారావ్..లాంటి చిత్రకారులకి సినిమా హీరోలకున్నంత డిమాండ్ వుండేది. రోజుల్లో దాదాపు 2500 చిత్రాలకు పబ్లిసిటీ ఆర్టిస్ట్‌గా పనిచేసిన ప్రముఖ చిత్రకారుడూ ఈశ్వర్‌గారి జ్ఞాపకాలు ఈ నెల అంతరంగ తరంగాలు శీర్షికలో..

DIGITAL DESIGNERS

K. ESWARA RAO

No. 18 (old No. 34), Srinivasa Reddy Street, T. Nagar, Chennai - 600 017. Ph: 2434 1875 Cell: 98840 46535



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మా స్వగ్రామం. ముత్యమాచార్య, రాజేశ్వరిగార్లకు నాల్గవ సంతానంగా నేను 1938 సంవత్సరం ఫిబ్రవరి 1 వ తారీఖున జన్మించాను.

మేము మొత్తం ఆరుగురు అన్నదమ్ములం, ఒక సోదరి. మా నాన్నగారు ఆ కాలంలో మూడు నాలుగు జిల్లాలకు పేరు పొందిన ఏకైక ఎంగ్రేవర్ పనిలో నిష్ణాతులుగా ఉండేవారు. వెండి, బంగారం అనేక దేవాలయాలకు కవచాలు, మొదలగు పరికరాలు, అలంకరణ సామాగ్రిని తయారు చేసేవారు. మా తాతగారు కూడా అదే పని చెయ్యడం వల్ల మా కుటుంబమంతా ఆనాటి నుంచి నేటి వరకు కళాకారుల కుటుంబంగానే వృద్ధి చెందింది.

నేను చిన్నప్పటి నుంచి బొమ్మలు వెయ్యడం, మట్టితో బొమ్మలు చెయ్యడం అలవాటుగా ఉండేది. ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో కూడా స్కూల్లో అందరి మన్ననలూ పొందేవాణ్ణి. పాలకొల్లు హైస్కూల్లో స్టడీస్ పూర్తి చేసే సమయంలో అనేకసార్లు డ్రాయింగ్ కాంపిటీషన్స్‌లో బహుమతులు పొందాను. అదేసమయంలో స్టడీస్‌లో కూడా మొదటి రేంక్‌లో ఉండేవాణ్ణి. నేను ఫిఫ్తఫారం చదువుతున్నప్పుడే SSLCలో నన్ను వాళ్ళ సెక్షన్‌లో వేసుకోవడానికి క్లాస్ టీచర్స్ పోటీ పడ్డారంటే నేనెలా చదివేవాణ్ణో అర్థం అవుతుంది.


నా 15 సంవత్సరాల వయసు వరకు మా కుటుంబం ఆర్థికంగా చాలా బాగుండేది. ఆ తరవాత నుంచి మా కుటుంబం ఆర్థిక యిబ్బందుల్లో కూరుకుపోయింది. నేను SSLC వరకు చదవడానికి నా పుస్తకాలు నేను కొనుక్కోవలసి వచ్చింది. నా స్కూలు ఫీజు నేను కట్టుకోవలసి వచ్చిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మా వూళ్ళో కలంకారీ పరిశ్రమ విస్తారంగా ఉండేది. దాంతో నేను వాళ్ళకు కావలసిన డిజైన్స్ చేసిచ్చి 5, 10 రూపాయిలు తీసుకుని దాంతో ఫీజు, పుస్తకాలు కొనేవాణ్ణి. ఆ విధంగా SSLC ప్యాసయ్యాను. నాకు మొదటి నుంచి ఇంజినీర్ కావాలనే కోరిక బలంగా ఉండేది. అందుచేత SSLC అవగానే కాకినాడ పోలీటెక్నిక్ కు అప్లై చేశాను. అందులో LEEకి సీటు వచ్చింది. వెంటనే వెళ్ళి జాయిన్ అయ్యాను. మూడు సంవత్సరాల ఆ కోర్సు ఆర్థిక యిబ్బందులను ఎదుర్కొని కొందరి మిత్రుల సహకారంతో పూర్తి చేశాను. కాని చివర్లో నా ఫైనల్ యియర్ ఎగ్జామినేషన్స్ ఒక నెల రోజులుండగా అకస్మాత్తుగా మా అమ్మగారు మా సహోదరి యింట్లో పోయారు. అందరం అక్కడకు చేరుకుని సంస్కారాలు అన్నీ పూర్తి చేసిన తర్వాత చిన్నా భిన్నమైన మా కుటుంబం తిరిగి కోలుకోలేకపోయింది. ఆ సమయంలో నేను తిరిగి నిర్ణీత సమయంలో పరీక్షలురాయడానికి కాకినాడ చేరుకోలేక పోయాను. ఫైనల్ యియర్ మళ్ళీ చేద్దామనే ఉద్దేశంతో దానికి కావలసిన ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికి నా మిత్రులందరితో కలసి నేను రాసిన నాటకాన్ని (నాకు రచనా వ్యాసంగంలో కూడా ప్రవేశం ఉండేది) ప్రదర్శించి కొంత పైకం చేర్చి పెట్టి, సంవత్సరం పూర్తి అయ్యాక తిరిగి ఫైనల్ యియర్‌లో చేరడానికి కాకినాడ వెళ్ళాను. కాని 1960లో ఓల్డ్ రెగ్యులేషన్స్‌లో చదివిన విద్యార్థికి కొత్త రెగ్యులేషన్‌లో (అప్పుడే రెగ్యులేషన్స్ మారాయి) చేర్చుకోవడానికి మా ప్రిన్సిపల్ తిరస్కరించారు. కావాలంటే హైదరాబాద్ వెళ్ళి టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరు నుంచి పర్మిషన్ తెచ్చుకోమన్నారు. దాంతో ఖంగు తిన్న నేను ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

హైదరాబాదు వెళ్ళే స్తోమత నాకు లేదు. చివరిగా ఆలోచించి ఆ రాత్రే మద్రాస్ వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను. తెలిసిన ఒక మిత్రుడు మద్రాస్ వెళుతుంటే ఆయనతో బయలుదేరి 1961 ఫిబ్రవరిలో మద్రాసు చేరుకున్నాను. అతను నన్నొక చోట దించి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత నా కష్టాలు మొదలయ్యాయి. ఎనిమిది మాసాలు అష్టకష్టాలు పడి నా చేతిలో ఉన్న డబ్బు కాస్తా అయిపోయి తిండి లేకపోగా రోడ్డు పక్కన పడుకొనే పరిస్థితి వచ్చింది. ఆ విధంగా రెండు వారాలు గడిచాక అప్పటికి మద్రాస్‌లో పబ్లిసిటీ ఆర్ట్‌లో బాగా వెలుగులో ఉన్న "కేతా"గారు మావూరుకు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న "పోడూరు" గ్రామ వాస్తవ్యులు కావడంతో వారి దగ్గరకు వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. అప్పటికే మా నాన్నగారి పేరు బాగా తెలిసిన కేతాగారు నాకు ఆశ్రయాన్నిచ్చారు. ఆ విధంగా ఆయన స్టూడియోలో నాకు 10 మంది ఆర్టిస్టుల మీద ఎగ్జిక్యూటివ్ గా నియమించారు. ఆప్పటికి నాకు 500 రూ. జీతం నిర్ణయించారు. ఆ విధంగా ఆయన దగ్గర 1966 వరకు పని చేశాను. అప్పుడే నేను నేర్చుకోవలసిన అన్ని మెళుకువలూ నేర్చుకున్నాను. LEE చేసిన తర్వాత AMIE చేసి ఇంజనీర్‌ను కావాలనే కోరిక కలగానే ఉండిపోయింది. సినీ పబ్లిసిటీలోనే స్థిరపడిపోయాను. నాకు 1966 లో దగ్గర బంధువుల



అమ్మాయి వరలక్ష్మితో వివాహం జరిగింది. 1967 నేను స్వంతంగా "ఈశ్వర్" “ESWAR” అనే పబ్లిసిటీ సంస్థను స్థాపించడం, ఆ తర్వాత సుమారు 2500 చిత్రాలకు (తెలుగు, తమిళం, కన్నడం, మళయాళం, ఒరియా, బెంగాలీ, హిందీ) పని చేశాను. బహుశా యిదే ఈ శాఖలో రికార్డు.




నేను స్వతంత్రంగా ప్రారంభించాక ప్రారంభంలో కన్నడ సినిమాలు చేస్తుండేవాణ్ణి. అప్పటికి తెలుగు సినిమాలు చేసే అవకాశం లభించలేదు. 1967 లోనే ప్రఖ్యాత చిత్రకారుడు "బాపు" దర్శకత్వ బాధ్యతలు చేపట్టి "సాక్షి" అనే సినిమాను తీస్తూ దానికి డిజైన్స్ చేసే బాధ్యతను నాకప్పగించారు. ఆయనే నాకు మొదటి తెలుగు చిత్రానికి అవకాశం కల్పించిన వ్యక్తి. దాన్ని పూర్తి చేసిన తర్వాత ఆ పోస్టల్ డిజైన్స్ ప్రింటింగ్ కోసం ప్రసాద్ ప్రోసెస్ (నాగిరెడ్డిగారి ప్రింటింగ్ ప్రెస్)కు వెళ్ళాయి. వారు ఆ డిజైన్స్ చూసి ఎవరు చేశారని తెలుసుకుని నాకు కబురు పంపించారు. వెళ్ళాను. నాకు వారు నిర్మిస్తున్న "రాం అవుర్ శ్యాం" హిందీ చిత్రం పోస్టర్స్ అవకాశం కల్పించారు. అప్పటికే ఆ చిత్రానికి బొంబాయి నుంచి "మెగానీ" అనే ఆర్టిస్ట్ దిలీప్ కుమార్ (ఆ చిత్రంలో హీరో) రికమెండేషన్‌తో వచ్చి అన్నీ పూర్తి చేసి వెళ్ళిపోయారు. కాని అవి నాగిరెడ్డి గార్కి, వారి పుత్రులు శ్రీ వేణుగోపాలరెడ్డి, శ్రీ విశ్వనాథరెడ్డిగార్లకు నచ్చలేదు. అందుకు మళ్ళీ అన్నీ తిరిగి చెయ్యాలని నన్ను చెయ్యమన్నారు. అవి పూర్తి చేశాక వారు శ్రీరామానాయుడు గారితో కలిసి తీసిన "పాప కోసం", "కుళందైక్కాగ", "నాన్హా ఫరిస్తా" (అన్ని ఒకే సబ్జెక్ట్ మూడు భాషల్లో తీశారు) చేసే అవకాశం యిచ్చారు. అవి నాకు మంచి పేరును తెచ్చి పెట్టాయి.




ఆ తర్వాత అప్పట్లో మద్రాస్ లో ఉన్న అన్ని భాషల అగ్ర సంస్థలూ నన్ను పిలిచాయి. ఎవియం, జెమిని, విజయవాహిని, భరణి, పి.ఎ.పి, జగపతి, సురేష్ ప్రొడక్షన్స్, అన్నపూర్ణ, దేవరి ఫిలింస్, చిత్రాలయా, పద్మాలయా, అంజలి పిక్చర్స్, వీనస్, వాసుమీనన్, మొదలగు అనేక కంపెనీలకు పనిచేసే అవకాశం కలిగింది. ఆ విధంగా - దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఈ శాఖలో మొదట నిలిచాను. హిందీ చిత్రాలు (మద్రాస్‌లో నిర్మించినవి) 150 వరకూ చెయ్యడం వల్ల బొంబాయి సినీ పరిశ్రమలో కూడా నా పేరు బాగా తెలిసింది.

1969 లో అప్పటి ఛీఫ్ మినిష్టర్ అన్నాదురై మరణించాక వెంటనే శ్రీ కరుణానిధి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన హయాంలో అన్నాదురై పోర్ట్రెట్ అసెంబ్లీ హాలులో పెట్టాలని ఆ బాధ్యత నాకప్పగించారు. దాన్ని నేను చేస్తుండగా ముఖ్యమంత్రి అయిన కరుణానిధి గారు మంది మార్బలంతో మా యింటికి మూడుసార్లు వచ్చారు. పెయింటింగ్‌ను పరిశీలించి అభివందనలు తెలిపి దాన్ని ప్రధానమంత్రి ఇందిరాగాంధిగారిచే ఓపెన్ చేయించే సమయంలో ఆమె చేతుల మీదుగా నాకు ఘన సన్మానం చేయించారు. 1972 లో విజయవాడలో లక్ష్మీ ఫిలింస్ డిస్ట్రిబ్యూటర్ వారు ఆంధ్ర ప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్స్ సంఘం తరపున అక్కినేని నాగేశ్వరరావు గారి అధ్యక్షతన, చిత్ర పరిశ్రమకు సంబంధించిన అనేక మంది పెద్దల సమక్షంలో ఆంధ్ర దేశానికి సంబంధించిన పంపిణీదార్లు, ప్రజల సమక్షంలో ఘనసన్మానం చేశారు.


with sri.Karunanidhi

ఆంధ్రదేశంలో అనేక చోట్ల అనేక సంస్థలు అనేక సందర్భాలలో సన్మానించారు. అవి నాకు మరువరాని మధురక్షణాలు.

ఆ విధంగా యిప్పటికి మద్రాస్‌లో నా జీవితం 47 వసంతాలు పూర్తి అయ్యాయి. నేను మద్రాస్ చేరేసరికి నా వయసు 22 సంవత్సరాలు. ఇప్పుడు 70 వ సంవత్సరంలో అడుగుపెట్టాను.




నాకు నలుగురు సంతానం. ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరు అబ్బాయిలు. యిపుడు అమ్మాయిలు యిద్దరూ అమెరికాలో ఉంటున్నారు. తర్వాత ఇద్దరు అబ్బాయిలు. పెద్దవాడు "విజయ్" యిపుడు కంప్యూటర్ సిస్టంలో పబ్లిసిటీ డిజైన్స్ చేస్తున్నాడు. నాకు వారసుడుగా ఉన్నాడు.

తరువాత వాడు "శశికుమార్" సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చెన్నైలో ఉన్న "రాం కో సిస్టం" లో పని చేస్తున్నాడు.

అందరికీ పెళ్ళిళ్ళయిపోయాయి.

ఇంజినీరు కావాలని కలలు కన్న నేను కాలేకపోయాను. కానీ మా చిన్నబ్బాయిని ఇంజినీర్‌ను చేశాను. అదొక తృప్తి. ఇపుడు నేను అన్ని విధాలా సంతృప్తిగా ఉన్నాను.

46 సంవత్సరాల నా సినీ జీవితంలో అనేక ఆటు పోట్లు గురి అయి యిపుడు ప్రశాంత జీవనాన్ని గడుపుతున్నాను.

కాని ఒక్క విషయం ముఖ్యంగా చెప్పాలి. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన మా కుటుంబంలో చిన్నపుడు మా భవిష్యత్తుకు గట్టి పునాదులకు మా తండ్రిగారు ప్రయత్నించలేకపోయినా, నా చదువులకు, పై చదువులకు ఆర్థిక ఒనరులు సమకూర్చపెట్టలేకపోయినా, ఆస్తుపాస్తులు ఆర్జించి యివ్వకపోయినా మా తండ్రిగారంటే నాకు ఎనలేని గౌరవం, ప్రేమ. నేను ఆయనకు కుమారుడిగా జన్మించినందుకు చాలా గర్వపడతాను. కారణం ఆయన రక్తం నాలో ప్రవహిస్తుంది. ఆయనలో ఉన్న కళానైపుణ్యం, కళాత్మక హృదయం నాలోనూ ఉన్నాయి. అవే నా ఈ నాటి పరిస్థితికి కారణం అయ్యాయి. పెద్ద చదువులు చదివి పెద్ద ఇంజినీర్ కాలేకపోయినా నా తండ్రి వారసత్వంగా ఈ రంగంలో విజయం సాధించగలిగాను.

నా సోదరి కుటుంబానికి, తమ్ముళ్ళకూ అండగా నిలిచాను. నా తండ్రి ఆయన 83 వ ఏళ్ళ వరకూ నా దగ్గరే ఉండి ప్రశాంతంగా కన్ను మూశారు. ఇది అన్నిటి కంటె నాకు తృప్తి నిచ్చిన విషయం.

యికపోతే నా భవిష్య ప్రణాళికలో భాగంగా భగవంతుడు నాకు ఆరోగ్యాన్ని సమకూరిస్తే మరో రెండు మూడు సంవత్సరాల కాలంలో 30 నుంచి 50 వరకు ఆయిల్ పెయింటింగ్‌లు చేసి అమెరికాలో ఉన్న ఆరగన్ స్టేట్ పోర్ట్‌లేండ్‌లో గాని, లాస్ ఏంజల్సిలో గాని ఆర్ట్ ఎగ్జిబిషన్ పెట్టాలనేది నా ఆశ. (పోర్ట్‌లాండ్‌లో 15 సంవత్సరాలు మా అమ్మాయి అల్లుడు ఉంటున్నారు)

చివరి విషయంగా - అలనాటి డిజైనింగ్‌కూ ప్రస్తుత ప్రక్రియకూ చాలా తేడా వచ్చింది. మేము ఆ రోజుల్లో మాన్యువల్ వర్క్ కావడం వల్ల, ప్రింటింగ్ టెక్నాలజీ యింకా డెవలప్ కాని కారణంగా మేము 12 sheet, 6sheet, 9 sheet, 4 sheet, 2sheet మరియు 30"X40" పోస్టర్ అన్నీ ఒకే సైజుల్లో చెయ్యవలసి వచ్చేది. అందుకోసం ప్రత్యేకంగా ప్లైవుడ్ బోర్డులు తయారు చేయించి దానిపై రోల్ పేపరు అంటించి దానిపై పెయింటింగ్‌లు, స్టిల్స్ కలరింగ్ చేసి డిజైన్స్ చెయ్యవలసి వచ్చేది. అంటే ఒ క్కొక్క బోర్డు ఇంటి గది గోడలంత పెద్దవిగా ఉండేవి. ఈ పనులు చెయ్యడానికి "మాన్ పవర్" అధికంగా కావలసి వచ్చేది. ప్రింటింగ్ టెక్నాలజీ కొంచెం డెవలప్ అయ్యాక పెద్దవి కాకుండా మినియేచర్స్ చేస్తే సరిపోయే కాలం వచ్చింది. అంటే ఎంత పెద్ద సైజు పోస్టరైనా 10'X20" సైజులో గాని అంతకంటే చిన్న సైజులో గాని చేస్తే సరిపోయేవి. అందుకోసం నా దగ్గర 10 నుంచి 14 మంది వరకు పని చేసేవారు. వాళ్ళంతా యిపుడు మంచి

డిజైనర్స్‌గా హైదరాబాద్‌లోనూ, చెన్నైలోనూ సెటిలయ్యారు. మొత్తం నా దగ్గర నుంచి 52 మంది తయారయ్యి, చిత్రసీమ లోనూ, వాళ్ళ సొంత వూళ్ళలోనూ మంచి స్థితిలో ఉన్నారు.



with sri.Sivaji Ganesan

కాని తర్వాత మా క్రాఫ్ట్‌లో కంప్యూటర్ ప్రవేశించింది. అది నాకు అనుభవం లేని కారణంగా నేను తప్పుకొన్నాను. ప్రస్తుతం మా పెద్దబ్బాయి "విజయ్" చేస్తున్నాడు. దీనికి మేన్ పవర్ అక్కర్లేదు. ఒక్కడు చాలు.


కాని దీని వల్ల వచ్చిన లోపం ఏమిటంటే ఎవరికీ ప్రత్యేక గుర్తింపు రావడం లేదు. ఎందరు చేసినా అన్నీ ఒకేలాగుంటునాయి. క్రియేటివిటి తగ్గింది. అన్ని రెడీమేడ్‌గా అక్షరాలతో సహా సిడిలలో దొరకడంతో ప్రత్యేకం ఇది ఫలానా వాడి డిజైన్ అని చెప్పలేక పోతున్నాం.

నిజంగా చెప్పాలంటే కంప్యూటర్‌తో అద్భుతాలు సృష్టించవచ్చు. కాని ఈ తరం వాళ్ళు దానికి ప్రయత్నించడం లేదు. హాలీవుడ్ చిత్రాలకు ఈనాడు కంప్యూటర్స్ ద్వారా అద్భుత పోస్టర్ డిజైన్స్ చేస్తున్నారు.

మన యువ డిజైనర్స్ కూడా అలాంటి అద్భుతాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తారని ఆశిస్తున్నాను.



# కె.వి.రమణాచారి ఐఏఎస్



ఎవరో వేసిన బాటలో నడిచే వారు ఎంతో మంది ఐతే, తామే కొత్త బాట వేసుకుంటూ, ఇతరులకి కూడా ఆదర్శమౌతూ ముందుకి సాగే వారు చాలా కొద్దిమంది. అలాంటి వారినే ప్రజలు గుర్తు పెట్టుకుంటారు, వారే ప్రజల నాలుకపై నిలిచి పోతారు. ముఖ్యంగా ప్రభుత్వోద్యోగుల్లో ఇలాంటి వారు తారసపడడం చాలా అరుదు. అందునా ఐ.ఏ.ఎస్. లాంటి ఎడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో ఇలా ప్రజల మధ్య కలకాలం నిలబడేవాళ్ళని మరింత అరుదుగా చూస్తుంటాం. అటువంటి అరుదైన ఐ.ఏ.ఎస్ ఆఫీసర్స్‌లో ఒక విలక్షణమైన కోవకి చెందిన శ్రీ కె.వి.రమణాచారి ఒకరు. ఒక విధంగా చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ ఐ.ఏ.ఎస్ ఆఫీసర్స్ కేడర్ లో సెలెబ్రిటీ హోదానీ ఒక స్టార్ ఇమేజ్‌ని పొందిన ఒకరిద్దరిలో రమణాచారి గారు ఒకరు.

సాధారణంగా ఐ.ఏ.ఎస్ హోదాలో ఒక సారి నిర్వహించిన పదవిని మరోసారి నిర్వహించడం చాలా అరుదు. అలాంటిది రమణాచారిగారికి వచ్చిన ప్రతి హోదాలోనూ ఇతర ఉద్యోగులకంటే ఎక్కువకాలం పనిచేయడమే గాక ప్రతి చోటా

'ఈయనే మా డిపార్ట్‌మెంట్‌కి కావాలి' అని తోటి ఉద్యోగులూ, అధికారులూ ధర్నాలూ, సమ్మెలూ కూడా చేసిన అరుదైన గౌరవం ఒక్క రమణగారికే దక్కింది. అతి చిన్న వయసులోనే 26-27 సం వత్సరాల వయసులో నారాయణ్‌పేట్‌లో ఆర్.డి.ఒ ( సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్) గా మొట్ట మొదటి ఉద్యోగం చేసినప్పుడు అక్కడి పదవీకాలం ముగియగానే ట్రాన్స్‌ఫర్ అవుతుంటే అక్కడి ప్రజలంతా 'ఈయనే మాకు ఆర్.డి.ఒ గా వుండి తీరాలని బంద్ లు, సమ్మెలూ, హర్తాళ్ళు నిర్వహించారు. బహుశా ఆ మొదటి అనుభవమే ఆ-యనని ప్రజల మనిషిగా తీర్చి దిద్దిందేమో..అలాంటి అనుభవాలే పునరావృతమౌతూ హైదరాబాదు పాతనగరాభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా పనిచేసి ట్రాన్స్‌ఫర్ అవుతుంటే కూడా కాంగ్రెస్,తెలుగు దేశం, ఎం.ఐ.ఎం, భాజాపా ..పార్టీ బేధం లేకుండా అందరూ 'రమణగారే మళ్ళీ మాకు నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా వుండాలని' ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపించి దాదాపు దశాబ్దం పైగా ఆయన్ని పాతనగరానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కూడా దగ్గరగా ఉండేలా చేశారు. అలానే ప్రభుత్వ సాంస్కృతిక శాఖాధికారిగా పనిచేసి వేరే విభాగానికి బదిలీఐనప్పుడు కూడ అక్కినేని నాగేశ్వరరావు, నటరాజ రామకృష్ణ, కె.వి. భాస్కర రావు లాంటి దిగ్గజాలు రవీంద్రభారతి నుంచీ అసెంబ్లీకి ఊరేగింపుగా వెళ్ళి రమణాచారి గారినే మరికొంతకాలం కల్చరల్ డిపార్ట్‌మెంట్ లో వుంచాల్సిందిగా విజ్ఞప్తి చేసి సాధించారు.

తన ప్రవృత్తికి సరిపడిన వృత్తిలోనే పనిచేయడం (కళలపట్ల ఆసక్తి మెండుగా వుండి కల్చరల్ ఎఫైర్స్ లో పనిచేయడం) తన అదృష్టంగా భావించే రమణగారు ఆ పదవిలో వుండగా ఆంధ్రప్రదేశ్ లోని నాటక సమజాలాన్నింటికీ స్వర్ణ యుగంగా చెప్పుకోవచ్చు. ఇంతమంది అభిమానాన్ని సంపాదించుకోడానికి కారణం -ఆయన కలెక్టర్‌గా పనిచేసినా, కమీషనర్ పదవి నిర్వహించినా, అడ్మినిస్ట్రేటర్‌గా ప్రజల ముందుకి వెళ్ళినా, దేవాదాయ శాఖ కి వెళ్ళినా.. ఏ విభాగంలో వున్నా ఆ విభాగానికి సంబంధించిన పరిధిలో ప్రజోపయోగమైన

వినూత్న కార్యక్రమాలని చేపట్టడమే. ఏ విభాగానికి వెళ్ళినా ముందుగా రమణ గారు ఆలోచించేది కొత్త దారి ఏది అని. కొత్తదారి వెదకాలి , అది అందరికీ ఉపయోగపడేలా ఉండాలనేది ఆయన పరిపాలనా శైలిలో ముఖ్యాంశం.

ఇన్ని విజయాలు సాధించాలంటే ఎంతో నిబద్ధత, త్యాగ గుణం అందరికీ చేరువగా ఉండగలిగే నిరాడంబరత్వం, నిగర్విగా జీవించగలగడం, ప్రజాసేవపట్ల అంకితభావం..లాంటి వెన్నో ఉండాలి.

స్ఫూర్తిదాయకమైన అనేక వ్యక్తిత్వ విశేషాల్ని సంతరించుకున్న రమణగారి గురించి వారి మాటల్లోనే వారి అంతరంగ తరంగాల్ని స్పృశించే ప్రయత్నం చేద్దాం..

రమణాచారిగారి గురించి ఆంధ్రదేశంలో ఉండగానే చాలా సార్లు చదవడం ఒక సారి వారి ఉపన్యాసం వినే అవకాశం లభించడం జరిగింది. అనర్గళమైన ఆయన వాగ్ధాటీ, సంగీత, సాహిత్య, సాంస్కృతిక అంశాలపై ఆయనకున్న సాధికారకత ఎంతో ఆకట్టుకుని అప్పటినుంచీ (15 సంవత్సరాలుగా) అయన్ను కలవాలనుకుంటుంటే చివరికి సిలికాన్‌వేలీలో హఠాత్తుగా ఎదురైనప్పుడు ఆయన్ని చూసి ఆశ్చర్యపోవడం మా వంతు ఐంది. హఠాత్తుగా ఈయన ఇక్కడికెలావచ్చారా అని అనుకుంటూ పలకరించగానే చక్కగా రిసీవ్ చేసుకున్నారు. మరో రెండు రోజుల్లోనే తిరుగు ప్రయాణం హడవిడిలో వుండికూడా దాదాపు రెండు గంటలపాటు 'కౌముది' తో ముచ్చటించారు. 'కౌముది' ప్రారంభ సంచికకి వారందించిన అభినందనలు మరచిపోలేనివి.

*బాల్య స్మృతులు*

మెదక్‌లో కె.వి.రాఘవాచార్యులు, పద్మావతి దంపతులకి 1952 ఫిబ్రవరి 8న పుట్టాను. నేను పుట్టగానే జన్మ నక్షత్రం(పునర్వసు) చూసిన నాన్న, కోదండ రాముడి నక్షత్రంలో జన్మించాననుకున్నారంట. ఇంటికి మొదటి సంతానం నేనే. పైగా మగపిల్లవాడి నవడంతో అమ్మా, నాన్నా చాలా సంతోషించారట. నేను పుట్టగానే నాన్నకి ఉద్యోగం రావడం కూడా వారికి శుభసూచకంగా తోచిందట. నాన్న గారు స్కూలు టీచరుగా పనిచేసే వారు. మాది అతి సాధారణ మధ్య తరగతి కుటుంబం. ఆడంబరాలకు, ఆస్తీ అంతస్థులకూ మేమెప్పుడూ దూరంగానే ఉన్నాం. నాన్నగారు ఉభయ వేదాంత ప్రవక్త, బహు భాషా కోవిదులు. తెలుగు, ఇంగ్లీషూ, హిందీ, కన్నడా, తమిళం, సంస్కృతం భాషల్లో ప్రావీణ్యత గలవారు. నాకు ఊహ వచ్చే సరికే
నాన్నగారు రాత్రి పూట ఇంటివద్ద పిల్లలకి ట్యూషన్లు చెప్పేవాళ్ళు. ఇంగ్లీషు, తెలుగు, సోషల్, లెక్కలూ అన్నీ బోధించే వారు. నాన్న గారి భాషా పాండిత్యం ఎలా ఉండేదంటే, కేవలం తన పాండిత్యాన్ని తనకే పరిమితంచేసుకోకుండా, పదిమందికీ పంచే వారు. చాలామంది రాత్రి వేళల్లో బుడ్డి దీపాలు తీసుకుని నాన్న వద్ద సంస్కృతం నేర్చుకునేందుకు వస్తుండేవారు. ఉన్న ఇల్లు చిన్నదే ఐనా,అందులోనే అందరం సర్దుకుంటూ విద్యార్థులై వచ్చిన వారికి కాదనకుండా సంస్కృతం నేర్పే వారు. వారితో బాటే నన్ను కూడా కూర్చోబెట్టి గ్రంధాలన్నీ నేర్పించేవారు. ఆ విధంగా ఎనిమిదేళ్ళకే రఘువంశం,అమరకోశం, మను చరిత్ర..వగైరా అన్నీ కంఠతా వచ్చేసాయి. చిన్నప్పుడే లభించిన ఈ అవకాశమే నాలో సాహిత్యాభిలాషకి పునాది వేసిందని చెప్పగలను..
ఇందుకు ఉదాహరణగా ఒక సంఘటన చెప్తాను.

హైస్కూల్లో స్కూలు ఫైనల్లో ఉన్నప్పుడు 1966 , ఫిబ్రవరిలో అనుకుంటాను, లాల్ బహదూర్ శాస్త్రి చనిపోయినపుడు , ఆయన మొదలుపెట్టిన జై జవాన్ జై కిసాన్ నినాదం ప్రేరణతో ఒక కవిత వ్రాసి ఏదో పత్రిక్కి పంపించడం జరిగింది. ఐతే తరువాత నేను కాలేజీకి వెళ్ళిపోవడం, పత్రికవాళ్ళు నా కవిత ప్రచురించిన పుస్తకాన్ని స్కూలుకి పంపిస్తే వాళ్ళు కాలేజీకి రీడైరెక్ట్ చేయడం, కాలేజీలో చేరిన కొత్తలోనే పుస్తకంలో పేరు అచ్చులో చూసుకోవడం ఒక తీయటి జ్ఞాపకం.

*నిచ్చెన ఎక్కడంలో ఒక విధమైన ఆనందం వుంటుంది. పట్టుదల వుంటుంది. నిచ్చెన ఎక్కాక ఇంక అక్కడ నిలవాలన్న ఆరాటమే ఎక్కువగా వుంటుంది. అందుకే విజయాన్ని సాధించే దిశగా సాగించే అన్వేషణని ఆనందించడం ముఖ్యం.*

## *డాక్టర్ చదివే అవకాశాన్ని దూరం చేసిన డబుల్ ప్రమోషన్*

నాన్న గారు చిన్నప్పటినుంచీ కష్ట జీవి. తన నలుగురు తమ్ముళ్ళూ,అమ్మా, నాన్నా, మేము ఐదుగురు సంతానం..ఇంతమందినీ తనకు వచ్చే 250-300 రూపాయల జీతంతో పోషిస్తూ వచ్చేవారు. వారినా విధంగా రోజూ గమనించడంవల్ల అప్పట్లో నాలో రెండు భావాలు పేరుకుపోయాయి. జీవితంలో అందరితో కలిసి మెలిసి ఉంటూ, అందరి క్షేమ సమాచారాలు చూడడంలో ఉన్న సహజీవన సౌందర్యం జీవితానికి ఒక పరమార్థాన్నిస్తుంది. అలానే చదువు అనేది జీవితంలో చాలా ముఖ్యం..ఈ భావాలతో చదువుకుంటూ ఎదిగిన నేను హైస్కూల్లో, ఎప్పుడూ ఫస్టే ఉంటూ, రెండు సార్లు డబుల్ ప్రమోషన్లు సంపాదించి, 14 వ ఏటనే హైస్కూలు చదువు (ఇంటిగ్రేటెడ్ హైయ్యర్ సెకండరీ) పూర్తిచేశాను. ఎం.బి.బి.ఎస్ చదవాలని నాకు బాగా కోరికగా ఉండేది. ఐతే వయసు తక్కువకావడం వల్ల, సరిపడా మార్కులున్నా, ఎంట్రెన్స్ (స్పెషల్ పర్మిషన్ తో) పాసైనా, మెడిసిన్‌లో మాత్రం చేర్చుకోనన్నారు. ఇంక తప్పని పరిస్థితులో బి.ఎస్సీలో చేరాను సిద్దిపేట కాలేజీలో. నా చదువుకోసమని నాన్న గారుకూడా సిద్దిపేటకే బదిలీ చేయించుకున్నారు.

## *కాలేజీ జ్ఞాపకాలు.*

ఇదీ ప్రపంచం అని తెలుసుకునే సరికే, అతి పిన్న వయసులోనే కాలేజీలో అడుగు పెట్టాను. ఐ.ఎ.ఎస్. చదవాలీ అన్న ఆశయం అప్పట్లో లేదు. అసలు ఐ.ఎ.ఎస్ అంటే ఏమిటో కూడా తెలీని వయసది. చిన్నప్పటినుంచీ తెలిసిందల్లా బాగా చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకోవాలి అని, అంతే.

జీవితంలో సర్దుబాటు అనేది నాన్న నుంచీ నేర్చుకున్నాను.. ఆర్థికపరమైన పరిమితులున్న జీవితం, పోకెట్ మనీ లాంటి లగ్జరీ పదాలకు అర్థం తెలీదు.. తోటి విద్యార్థులు విలాస జీవితం గడుపుతున్నా అటువైపు కనీసం తొంగిచూడనైనాలేని పరిస్థితులు.. అమ్మా, నాన్న ఏది ఇస్తే దానితోటే సర్దుకోవడం.. కానీ, చదువు విషయంలో మాత్రం సర్దుకునే వాడిని కాదు. ఎప్పుడూ క్లాసు ఫస్టూ, కాలేజీ ఫస్టూ ఉండాలని కష్టపడే వాడిని. బి.ఎస్సీ రెండో సంవత్సరంలో ఉండగా అనుకుంటాను ( అప్పటికి నా వయసు 15 సంవత్సరాలు ),హైదరాబాదులో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డెన్ జూబిలీ ఉత్సవాల సందర్భంగా జరిగిన ఇంటర్ కాలేజీ డిబేటింగ్ కాంపిటీషన్స్‌లో ప్రథమ బహుమతి సంపాదించి అప్పటి రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణగారి ద్వారా బహుమతిని అందుకున్నప్పుడు(1968 అక్టోబర్ 8 వ తేదీ) ఫరవాలేదు నేనూ పబ్లిక్‌ని ఆకర్షించేలా మాట్లాడగలను అని ధైర్యం వచ్చింది. అంతకు ముందు ఇలా డిబేటింగ్‌లో బహుమతులు వచ్చినా అవన్నీ చిన్నా, చితకానే. ఈ ఇంటర్ కాలేజీ పోటీల బహుమతి పబ్లిక్ స్పీకింగ్ గురించి నాలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

అతి చిన్నవయసులోనే యూనివర్సిటీకి బి.ఎస్సీ అయ్యాక ఇంక పై చదువులు చదివించలేనన్నారు నాన్నగారు. నిజంగానే ఆయనకి అతి పెద్ద సంసారాన్ని ఈదడం కష్టంగానే ఉండేది. నేనుకూడా ఏదైనా ఉద్యోగం చేస్తే వేన్నీళ్ళకి చన్నీళ్ళలా సాయపడతానని ఆయన ఉద్దేశ్యం. ఐతే నాకు పై చదువులు చదవాలనే ఆశ బలంగా వుండేది. అందునా కాలేజీ ఫస్టు రావడం కూడా అందుకు దోహదపడింది. నాన్న గారికి ఏ మాత్రం ఆర్థిక భారం లేకుండా స్కాలర్ షిప్‌తో చదువుకుంటానని చెప్పి, ఒప్పించి హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీకి బయలుదేరాను. ఉన్నంతలోనే సర్దుకు పోవాల్సిన పరిస్థితులు. కష్టపడి చదవడమొక్కటే కళ్ళముందున్న లక్ష్యం. పుస్తకాలు కొనుక్కునే స్తోమతు లేక రోజూ రాత్రిపూట లైబ్రరీలో లేట్ అవర్స్ కూర్చుని నోట్సులు వ్రాసుకునే వాడిని. ఎప్పుడూ లెక్చరర్లు చెప్పబోయే పాఠాలన్నీ ముందు రోజే చదివేసి, ప్రిపేరై వెళ్ళేవాడిని.

*పర్సనల్ లైఫ్‌లో contentment పబ్లిక్ లైఫ్ లో compassion అనేది మనిషికి చాలా అవసరం. అలా ఉన్నప్పుడే జీవితంలో వేసే ప్రతి అడుగూ, ముందుకే నడిపిస్తుంది. విజయ పథాలకేసి ప్రయాణాన్ని సాగిస్తుంది.*

ఒక సంవత్సరం తెలంగాణా ఉద్యమం చదువుకి అడ్డం కొట్టగా 19 సంవత్సరాలకల్లా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) పూర్తి చేశాను...రిజల్ట్స్ తెలిసిన రోజు నాకింకా గుర్తుంది..పొద్దున్నే .. ఇంకా చీకట్లు తొలగక ముందే ఊరి చివరనున్న బడ్డీ కొట్టు వద్దకెళ్ళి టీ తాగుతూ పేపర్ కోసం ఎదురు చూడడం..పేపర్లో వచ్చిన పరీక్షాఫలితాలు చూశాక ఒక్క క్షణం నన్ను నేనే నమ్మలేక పోయాను..యూనివర్సిటీ ఫస్టు నాదే. పేపర్లో నా పేరూ, వివరాలన్నీ వ్రాశారు...!

## *విద్యార్థి వయసులోనే లెక్చరర్ గా*

ఆ విధంగా 1972లో ఎమ్మెస్సీ అవగానే రీసెర్చి చెయ్యాలని ఉండేది కానీ, ఇంకా ఉద్యోగం చేయకుండా ముందుకి సాగే పరిస్థితులు లేవు కాబట్టి తప్పని సరిగా ఉద్యోగం వెదుక్కోవాల్సిన అవసరం కనిపించింది. నా రాంకుకీ, మార్కులకీ వెంటనే సైదాబాద్ సైన్సుకాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా ఉద్యోగం దొరికింది. ఆ వయసులో నేనూ స్టూడెంట్స్ లో ఒకడిగా నే కనిపించే వాడిని.

అప్పటికీ ఐ.ఏ.ఎస్ అనేది ఒకటి వుంటుందని అస్సలు తెలీదు.. కాలేజీలో పనిచేస్తున్నప్పుడే 1973 లో నా మామకూతురు లతతో వివాహం జరిగింది. అప్పటికే అమ్మ అనారోగ్యంతో ఉండడంతో పెద్దకొడుకునైన నా పెళ్ళి చూడాలనే ఆవిడ కోరిక మీద 21 సంవత్సరాలకే నాకు లతతో పెళ్ళి జరిగింది.

లెక్చరర్‌గా అలా జీవితం గడిచిపోతోంది. ఐతే ఎప్పటికైనా రీసెర్చి చేసి డాక్టరేట్ కావలన్న పట్టుదల మాత్రం నన్ను వదల్లేదు. అందుకోసం ప్రయత్నాలు చేస్తుండగానే, 1975లో తోటి లెక్చరర్లు కొంతమంది స్టేట్ సర్వీస్ కమీషన్ పరీక్షలకి అప్లికేషన్స్ పెడుతూ నన్ను కూడా అప్లై చెయ్యమన్నారు. ఉద్యోగంలో కాస్త కుదుటపడ్డాక రీసెర్చి చెయ్యాల్ని అనుకుంటున్న నన్ను ఈ సర్వీస్ కమీషన్ పరీక్షలు అంతగా ఆకర్షించలేదు..ఐనా నా స్నేహితులు చెప్పారు 'ఇందులో పోయేదేమీ లేదుకదా.. వస్తే మంచిది. లేకపోతే నీ ఉద్యోగం ఎలానూ ఉంటుంది. రీసెర్చి అనేది 48సంవత్సరాలకైనా చెయ్యొచ్చు, ఈ పరీక్షలకైతే 24 సంవత్సరాలు దాటితే అర్హత ఉండదు.." అని ఒప్పించారు. (వాళ్ళన్నట్లే సరిగ్గా 48 సంవత్సరాల వయసులో రీసెర్చి గురించి మళ్ళీ ప్రయత్నాలు మొదలెడతానని అప్పట్లో కలలో కూడా అనుకోలేదు). అదీ సమంజసంగానే అనిపించి, అప్లైచేసి ఆ పరీక్షలకి చదువుకోవడం మొదలుపెట్టాను. అప్పటికే ఒక పాప మాకు.

## *స్టేట్ సర్వీస్ కమీషన్ కి ఎంపికకావడం*

*నిరంతర విద్యార్థి:*

*వివాహం ఐతే చదువు నాశనమైనట్లే అని ఒక పాత నానుడి. అది మాత్రం రమణ గారి విషయంలో ఏమాత్రం నిజం కాదు. రమణగారు ఎప్పుడో కాలేజీలో ఉండగా రీసెర్చి చేద్దామని అనుకుని వీలుకాక లెక్చరర్‌గా చేరి పోయారు. ఐతే 48 సంవత్సరాల వయసులో మళ్ళీ ఎలాగైనా రీసెర్చి చెయ్యాలనిపించి తన ఎమ్మెస్సీ సబ్జెక్ట్ ఐన కెమిస్ట్రీ లోనే అర్హత పరీక్షకోసం దరఖాస్తుచేశారు, 2000 సంవత్సరంలో. ఐతే సరిగ్గా పరీక్ష రోజుల్లోనే అస్సెంబ్లీ ఎన్నికల పరిశీలకునిగా వెళ్ళాల్సి వచ్చి దానికి హాజరు కాలేక పోయారు. మళ్ళీ సంవత్సరం వరకూ పరీక్ష రాసే అవకాశం లేదు. ఆసమయంలో మనసు మార్చుకుని తన కిష్టమైన తెలుగుభాషలోరీసెర్చి చేద్దామని ప్రయత్నాలు మొదలుపెట్టారు. తెలుగులో పి.జి. డిగ్రీ లేదు కాబట్టి ముందుగా ఉస్మానియా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ ద్వారా తెలుగు ఎం.ఎ రెండూ సంవత్సరాల్లో డిస్టింక్షన్‌లో దిగ్విజయంగా పూర్తి చేసి, ప్రస్తుతం 'పద్య కవితా రీతుల్లో వస్తు వైవిధ్యం' అన్న అంశంపై ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారి వద్ద డాక్టరేట్ కోసం పరిశోధన సాగిస్తున్నారు. వారి ప్రయత్నాలు సఫలీకృతమై అతి త్వరలోనే కె.వి.రమణాచారి గారిని డాక్టర్ కె.వి.రమణాచారిగా పలకరించాలని 'కౌముది' మనస్ఫూర్తిగా కోరుకుంటోంది.*

మాపెద్ద పాపని ఉయ్యాల ఊపుతూ, మరో చేత్తో పుస్తకం చదువుతూ పరీక్షలకి ప్రిపేరయ్యాను. ఒక్క కాలేజీ కొలీగ్స్ తప్ప మిగతా అందరూ నన్ను నిరుత్సాహ పరిచారు. 'ఎందుకంత కష్టపడడం. ఆ పరీక్షల్లో పాసవడం అంత తేలికకాదు. ఊరికే టైము వృధా చేసుకోకు.. "అంటూ. ఐనా నా పట్టుదల వదల్లేదు. శ్రమ ఫలించింది. పరీక్షల్లో పాసవడం , ఇంటర్వ్యూలో కూడా సెలక్టవడం ట్రైనీగా పోస్టింగ్ రావడం... అంతా కలిపి రెండు సంవత్సరాలు పట్టింది.

అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ట్రైనీగా పశ్చిమగోదావరి జిల్లాలో ముగించుకున్నాక మొట్ట మొదటి పోస్టింగ్ మహబూబ్ నగర్ జిల్లా నారాయణపేట్ లో ఆర్.డి.ఒ (సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్) వచ్చింది. కొత్త ఉద్యోగం, కొత్త బాధ్యతలూ..ఎలా నిర్వహించాలో అన్నీ నాకై నేను ఒక విధానాన్ని ఏర్పరచుకోవడమే. నా మొదటి ఉద్యోగంలో నేను సక్సెస్ అయ్యాననుకోవడానికి ఋజువు 1979 లో నాకు అక్కడినుంచీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చినపుడు తెల్సింది. నన్ను అక్కడే వుంచాలంటూ పెద్ద ఎత్తున బంద్‌లూ, ధర్నాలూ చేశారు. ఒక ప్రభుత్వోద్యోగి తనే కావాలంటూ జరిగిన సమ్మెలూ హర్తాళ్ళూ గమనించాక ప్రజలతో మమేకమై పనిచేయడంలోని విలువ తెలిసి వచ్చింది. తరువాత 1984 లో నాకు ఐ.ఎ.ఎస్ కన్ఫర్మ్ అయింది.

## పరిపాలనా దక్షత - వినూత్న విజయాలు

నా కెరీర్‌లో ముఖ్యంగా చెప్పుకోతగ్గ కొన్ని ఘట్టా లు..హైదరాబాదు పాతబస్తీ అభివృద్ధి సంస్థ అడ్మినిస్ట్రేటర్‌గా 1985 నుంచీ తొమ్మిది సంవత్సరాల పాటు పనిచేశాను. మధ్యలో మూడు సార్లు ట్రాన్స్ఫర్ వచ్చినా తెలుగుదేశం, మజ్లిస్, కాంగ్రెస్ అన్ని పార్టీల ప్రతినిధులూ నేను అక్కడే కొనసాగాలని పట్టుపట్టడంతో సుదీర్ఘకాలం పాతబస్తీకి సేవచేసే అవకాశం లభించింది. మధ్య మధ్యలో వేరే శాఖలకి వెళ్ళినా , పాతబస్తీ అభివృద్ధి సంస్థ మాత్రం నాకు అదనపు బాధ్యత కింద ఉండేది. పాతబస్తీ ప్రజల సెంటిమెంట్లు ఎంత సున్నితమైనవో వేరుగా చెప్ప నవసరంలేదనుకుంటాను. రోడ్ల విస్తరణ కార్యక్రమానికి వెళ్ళినప్పుడు ఎవరిస్థలాలని స్వాధీనంచేసుకున్నా వారు 'ఎదుటి వర్గం వారివి ఎందుకు ముట్టుకోవడంలేదు?' అని ఎదిరించే పరిస్థితులు. అలాంటప్పుడు కూడా అన్ని వర్గాల వారినీ కలుపుకుని వెళ్తూ

పాతబస్తీ లో గణనీయమైన స్థాయిలో రహదారి విస్తరణా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు పరచగలిగాము. అలానే పాతబస్తీ వాసులకోసం ప్రత్యేక ఐ.టి.ఐ, పోలి టెక్నిక్ కాలేజీ, ఒక క్రీడా మైదానం, ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాల..ఇవన్నీ కూడా అందరి సహాయ

*ముందుగా మనం మనుషులం తరువాతే ఉద్యోగులం. మనం కూర్చునే కుర్చీకి ఒక పవిత్రత ఉంది. ఎంతోమందికి రాని అవకాశం మనకి వచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకుని, ప్రజల నాలుకమీద నిలిచిపోవడమే లక్ష్యంగా పెట్టుకుంటే ఉద్యోగానికి సార్థకత వుంటుంది. ముందు తరాల వారికి ఆదర్శం చూపించిన వాళ్ళమౌతాం.*

సహకారాలతో పూర్తిచేయగలిగాము.

ఈ అభివృద్ధికార్యక్రమాలతో బాటుగా ఎవరూ అంతగా దృష్టి సారించని కులి కుతుబ్ షా సమాధుల్ని , అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారిని ఒప్పించి, ఏడు కోట్ల రూపాయలతో అత్యంత సుందరంగా తీర్చి దిద్ది దాన్నొక అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా రూపొందించ గలిగాము. అసలు ఆగ్రా లోని తాజ్ మహల్ నిర్మాణానికి స్ఫూర్తి ఈ కులీ కుతుబ్ షా సమాధులేనని ఒక నానుడి. షాజహాన్ హైదరాబాదు వచ్చి నప్పుడు వీటి నిర్మాణాన్ని చూశాకే , ముంతాజ్ బేగం స్మృతి చిహ్నంగా తాజ్ మహల్ నిర్మింపచేశాడని అంటారు. అంత విశిష్టత గలిగిన చారిత్రాత్మక కట్టడాల్ని సంరక్షించుకోగలగడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది.

1990 నుంచీ మర్రి చెన్నారెడ్డి, ఎన్.జనార్ధన రెడ్డి, ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు, రాజశేఖర రెడ్డి .. ఇంతమంది ముఖ్యమంత్రుల వద్ద మూడుసార్లు ఇన్ఫర్మేషన్ కమీషనర్గా పనిచేసి అందరితోనూ సఖ్యతగా ఉండగలగడం, అందరి మన్నలనూ పొందగలగడం కూడా నాకు చాలా ఆనందాన్నిచ్చే సంఘటన.

నేను నిర్వహించిన శాఖలన్నీ నన్ను ప్రజలకి దగ్గరగానే వుంచినా, నేను రెండుసార్లు నిర్వహించిన సాంస్కృతికశాఖ ప్రజలతోబాటుగా కళాకారులు అనేక మందిని నాకు ఆప్తుల్ని చేసింది. ఈ శాఖలో ఉండగానే సురభి నాటక సంస్థని అప్పటి ప్రధాన మంత్రి శ్రీ పి.వి. నరసింహా రావుగారి సమక్షానికి తీసుకెళ్ళి ఢిల్లీలో వారి ప్రదర్శన ఏర్పాటు చేయించడం ద్వారా సమాజానికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చింది. అప్పటి ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం అందిచడమే కాకుండా సురభి వారు దేశమంతా పర్యటించి తమ కళని ప్రదర్శించే అవకాశం వచ్చింది. అలానే ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి, ప్రస్తుతం దయనీయమైన స్థితిలో వున్న వృద్ధ, బీద కళాకారులకి పెన్షన్ కార్యక్రమానికి కూడా ప్రభుత్వంతో ఆమోద ముద్ర వేయించి, అమలు పరచగలిగాము.



1991 లో అఖిలాంధ్ర నాటక పోటీలని నిర్వహించినప్పుడు నాటకాలకి కూడా నంది అవార్డులు ఇప్పించాలన్న ఆలోచన వచ్చింది. సినిమాలకీ, టి.వి.నాటికలకీ నంది అవార్డులున్నప్పుడు వాటికి మాతృక ఐన రంగస్థల నాటకాలకి కూడా నందీ బహుమతులు ప్రకటించాలని అప్పటి ముఖ్యమంత్రి జనార్ధనరెడ్డి గారికి ఈ విజ్ఞప్తి చేశాము. మళ్ళీ ఎన్టీరామా రావు గారి హయాములో దాన్ని కదిలించినా ఏవో కారణాల వల్ల ముందుకి సాగలేదు. చివరికి 1999 మే 28 న చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రంగస్థల నాటకాలకి కూడ నందీ బహుమతుల పోటీలు నిర్వహించడం అప్పటినుంచీ అవి నిర్విఘ్నంగా కొనసాగడం మన కళాకారులకి చాలా ప్రోత్సాహకరంగా ఉంటోంది. నిజానికి ఇదుగో మనం మాట్లాడుకుంటున్న ఈ సమయంలో ( జనవరి 23, 2007 ) నిజామాబాదులో నందీ నాటకోత్సవాలు జరుగుతున్నాయి. వీటివల్ల ఎన్నో నాటకసమాజాలకి ప్రోత్సాహం లభించడమే గాక, ముఖ్యంగా పద్య నాటకాలకి మరింత ప్రాచుర్యం లభించిందని చెప్పుకోవచ్చు.

*ప్రజా జీవవనంలో ఉన్న ఏ ఉద్యోగికైనా ఇంటి ఇల్లాలు సహకారం, ప్రోద్బలం తప్పని సరిగా ఉండాలి. విషయంలో నా భార్య లతని నేను అభినందిస్తున్నాను అంటే చాలా చిన్న మాట ఔతుంది. నేనెప్పుడో ఉదయం 7.00 గంటలకి బయటికి వెళ్ళి రాత్రి 11.00 కి ఇంటికివచ్చినా , నాకోసం వేచి చూస్తుండే తన జీవన భాగస్వామ్యం నాకది ఒక వరం. అలానే ఇంట్లో అందరం కలిసి కనీసం రోజుకొక్క సారైనా కలిసి భోజనం చేయడమనేది ఒక సంప్రదాయంగా అలవాటు చేసుకున్నాం.. మాకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. పెద్దమ్మాయి (వీణ), పెద్దల్లుడు (శ్రీనివాస్) పూనాలోనూ, చిన్నమ్మాయి(ప్రవీణ), చిన్నల్లుడు (సాయి శ్రీనివాస్) అమెరికాలోనూ ఉంటున్నారు. అబ్బాయి కిరణ్ హైదరాబాదులోనే బాంకులో ఉన్నతోద్యోగి.*

నేను సాంస్కృతిక శాఖలో పనిచేసినప్పుడే మన సంస్కృతీ , సంప్రదాయలను గుర్తు చేసుకుంటూ ఆంధ్రదేశం నలు మూలలా చాళుక్య, గోల్కొండ, శాతవాహన, విజయనగర, కాకతీయ సాంస్కృతికోత్సవాలని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. బహుశా కళాకారుల కోసం చేసిన ఈ కార్యక్రమాల వల్లనో ఏమో కానీ నేను ఎక్కడ వున్నా, ఏ శాఖలో పనిచేసినా సాంస్కృతిక శాఖాధికారిగానే సంబోధిస్తుంటారంతా..!

రెండుసార్లు క్రీడాభివృద్ధి సంస్థకి ఎం.డి గా పనిచేయడం సమయంలోనే హైదరాబాదులో జాతీయ క్రీడల్ని నిర్వహించడం జరిగింది. రెండు పర్యాయాలు AP Film, TV and Theater Development Corporation సంస్థకి కమీషనర్ గానూ, ఎం.డి గాను పనిచేసినప్పుడు కూడా కళాకారులకి సేవచేసే అవకాశం లభించింది. 2005 లో 14 వ బాలల చిత్రోత్సవాన్ని నిర్వహించడంలో కీలకమైన పాత్ర పోషించాల్సి వచ్చింది.

అలానే హౌసింగ్ బోర్డ్ కమీషనర్‌గా పనిచేసినప్పుడు సింగపూర్ హౌసింగ్ బోర్డ్‌తో సంప్రదింపులు జరిపాము. అప్పటికే వారు వియత్నాం లాంటిఇతరదేశాల్లో భాగస్వామ్య పద్ధతిలో అపార్ట్‌మెంట్ సముదాయలను నిర్మిస్తున్నారు. అదే విధంగా హైదరాబాదులో కూడా పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో అపార్ట్‌మెంట్ సముదాయాలని నిర్మించాల్సిందిగా విజ్ఞప్తి చేసి ఒప్పించగలిగాము. దీని ఫలితమే వేల అపార్ట్‌మెంట్ల సముదాయంగా రూపుదిద్దుకున్న సింగపూర్ టౌన్‌షిప్. మధ్యతరగతి వారికి కూడా అందుబాటులో ఉండేలా, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించబడిన ఈ ప్రోజెక్ట్ ఎంతోమంది ప్రశంసలనందుకుంది. ఇది విజయవంతం అయ్యాక మలేసియా వారు కూడా ఇలానే పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్‌లో టౌన్‌షిప్ నిర్మించడానికి ముందుకి వస్తున్నారు.

ఇంక..దేవాదాయశాఖ కమిషనర్‌గా అతికొద్ది కాలమే పనిచేసినా ఆ భగవంతుడి ఆశీస్సుల వల్ల ఒక మంచి కార్యక్రమాన్ని ఆ శాఖలో ప్రారంభించగలిగాను. ఏదేవాలయమైనా పవిత్రంగా ఉండి అనేక మంది భక్తులని ఆకర్షించాలంటే క్షేత్ర బలం ఉండాలి. క్షేత్ర బలం మంత్ర బలం ద్వారా వస్తుంది.మంత్ర బలం కావాలంటే దేవాలయాల్లో వేద పఠనం నిరంతరం జరుగుతూ ఊండాలి. ఈ ఉద్దేశ్యంతో దాదాపు 1-00 మంది వేదపండితుల్ని వివిధ దేవాలాయల్లో నియమించడం జరిగింది. ఇది నాకు చాలా తృప్తినిచ్చిన అంశం. నేను దేవాదాయ శాఖలో వున్నప్పుడే ఒక అరుదైన అదృష్టం లభించింది. 2004 లో భద్రాద్రి రాముడి కళ్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముత్యాల తలంబ్రాలు తీసుకెళ్ళి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా సీతారాముల కల్యాణం జరిపించే అవకాశం లభించింది. నిజానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వెళ్ళాలి కానీ అప్పటికి అసెంబ్లీ రద్దై ఉండడం వల్ల దేవాదాయ శాఖ కమీషనర్ హోదాలో నేను ఉత్సవాల్లో పాల్గొనడం అదొక మరచిపోలేని మధుర ఘట్టం..

ఇన్ని శాఖల్లో పనిచేస్తూ ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన దైవశక్తికి , నాకు ఈ విధి నిర్వహణాలో సహకరించిన సహోద్యోగులకూ, ముఖ్యమంత్రులకూ, మంత్రులకూ, అనేకానేకమంది మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ నా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. ఈ పదివిలో ఉన్నంతకాలం, ఆ తరువాత కూడా మన రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలన్నదే నా జీవితాశయం.